Damage Book

UNIVERSAL LIBRARY
OU_204368
UNIVERSAL LIBRARY

శ్రీ సావిత్రీ గ్రంథమండలి

ద్వితీయ పరిమాణము

# ల లి త

గ్రంథకర్త

**శ్రీ రాముల సచ్చిదానంద శాస్త్రి**

మొదటికూర్పు : 1000 ప్రతులు

ప్రకాశకులు :

**సావిత్రీ గ్రంథమండలి,**

పూర్ణానందంపేట - బెజవాడ.

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల, బెజవాడ.

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి]

[వెల రు 1—0—0

# హెచ్చరిక

ఈ నాటకము అన్నికాపీరైటు హక్కులుగల నా యనుమతిని గాని, సాహిత్యవిద్యాప్రవీణ చాడ సుబ్రహ్మణ్య చయనులు, ఆగిరిపల్లి పోస్టు, కృష్ణాజిల్లా వారి యనుమతిని గాని లిఖితపూర్వకముగ పొందక సినిమా, నాటక, గ్రామఫోనులవారు ప్రదర్శనాది స్వాతంత్ర్యములగాని భాషాంతరీకరణ, కథా, భాగ, సంగ్రహణ పరివర్తనాదులగాని యవలంబింపఁగూడదు.

మా లిఖితపూర్వక మగు ననుమతిని బడయక యెవరు ఏ భాగము ప్రదర్శించినను, ఇతరవిధముగ నుపయోగించికొనినను నా నష్టమునకు నేఁజేయు సివిలు క్రిమినలు చర్యలకు బాతులగుదు రని తెలిసికొనవలయును.

శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రి

శ్రీ సావిత్రీ గ్రంథమండలి,

హెడ్ ఆఫీసు:—పూర్ణానందంపేట, బెజవాడ.

బ్రాంచి :— ఆగిరిపల్లి, కృష్ణాజిల్లా.

ఓఙ్కారమన్దిరము, బెల్లంకొండ పోస్టు—గుంటూరు జిల్లా.

# కృతిసమర్పణము

శ్రీ కంచికచర్ల గ్రామమున వెంచేసియున్న
శ్రీ మదన్నపూర్ణా సహిత విశ్వేశ్వర స్వామి వారికి

సీ. త్యాగభూషణులు మా ♦ తాతముత్తాతలు
తవిలి నిన్ గొల్చి త్వా ♦ త్పదము గొనిరి
లలితాత్మ శ్రీమహా ♦ లక్ష్మమ్మ మజ్జనయిత్రి
నిన్ భజియించి నీ ♦ నెలవుఁ గనియె
జనకుఁడు రాజయ్య ♦ శాస్త్రి దేవళముల
నెలమి నిర్మించి నీ ♦ కొలువునందె
రథముపైఁ దన మనో ♦ రథముపై నిను నిల్పి
యన్న శివయ్య నీ ♦ న్ననుగమించె
గీ. భ్రాతృపుత్త్రకుఁడైన నా ♦ రాయణుండు
నిన్ను భజియించుచుండె, నా ♦ కున్న యట్టి
కావ్యకన్యక 'లలిత' నీ ♦ కరతలమునఁ
బెట్టినాఁడను విశ్వేశ! ♦ ప్రేమఁగొనుము.

మ. అలరన్ బ్రేయసి యన్నపూర్ణసతి, తో ♦ డై యుండ గోపాలుఁ,డ
వ్వల నమ్మారుతి నిల్వ, నాలయమునన్ ♦ భాసిల్లు నీ కెట్టి సే
వలు నేఁ జేయఁగలేను, నీదు కృపకుం ♦ బాత్రుండ నెట్లౌను, నీ
'లలిత'న్ గైకొని విశ్వనాథ! భవము ♦ ల్బాయన్ ననుం బ్రోవవే.

మ. గుడి కైలాసముగాగ నుండియును నా ♦ కొల్వుం గొనం బోక, నా
కిడి తీ కావ్యకుమారి నీ 'లలిత' నీ ♦ కే యిచ్చి యిక్కన్య, వెం
బడి నే వచ్చెద నీదుసన్నిధికి, నె ♦ వ్వా రాలి వంకన్ గనం
బడినన్ వెల్వడనీరు, ప్రోవుము కృపా ♦ పారీణ! విశ్వేశ్వరా!

చ. 'లలిత'ను నీకు నియ్యెడ న ♦ లంకృతి సేసితి కావ్యరూపమా
'లలిత'కు నాకు భేదము ద ♦ లంపను, నా సుకృతంబు పండి, స
త్ఫలమయి యీ ప్రబంధయుత ♦ బాంధవ మేర్పడె నీకు నాకు, నీ
కలయిక వెండికొండపయి ♦ గాక మఱొక్కెడ నుండ నిచ్చునే!

మ. లలితానామము పెట్టితెచ్చి తని వే ♦ ళాకోళముల్ మాను ని
ర్మలభావంబున ధర్మరక్షణ, విభు ♦ త్రైకపారీణతా
కలనన్, సూరిజనాదరంబునను శ్లా ♦ ఘ్యంబయ్యెడుం గాన, నా
'లలిత' న్నీ లలితం బలెం గనుచు నా ♦ హ్లాదింపు విశ్వేశ్వరా!

పాదసేవకుఁడు, శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రి.

# తొలిపలుకు

ధర్మము సర్వశ్రేయము. అయ్యది యన్నివర్ణముల స్త్రీ పురుషులకు విధివిహితమై యనుష్ఠేయమై మోక్షదాయకమై భారత దేశమునకు ఖండాంతరాసాధారణమైన యౌన్నత్యమును జేకూర్చెను. ప్రజలు, ప్రభువులు, ఋషులు, పరమేశ్వరుఁడు సైత మెన్నియో యిక్కట్టులకోర్చి తమ సర్వశక్తుల వినియోగించి ధర్మోద్ధరణ మొనర్చుట లోకవిదితము. అట్టి మహత్తర ధర్మతేజమును మఱుఁగుపఱుప సంఘసేవావ్యాజమున దుష్ప్రచార మేఘములు నలుఁగడల వ్యాపించినవి. "కంటకేనైవ కంటక"మ్మనునటుల సాంఘిక నాటకమూలముననే సంఘసేవఁ జేయఁదలంచి నే నీ నాటకమును వ్రాయఁగడంగితిని. నా యీ ప్రయత్నమెంతవఱకు ఫలించెనో యెఱుంగుట రసాస్వాదననిపుణు లగు సహృదయుల యధీనమై యున్నది.

ఇందలి పాత్రముల నన్నిఁటిని సమగ్రముగఁ గనఁబఱుపఁ దలఁచుటచే గ్రంథ మొకింత విస్తృతమై ప్రదర్శనమున కెక్కువగఁ దోఁచును.

నటించుటయందు లాఘవస్వాతంత్ర్యములు మిక్కుటమై యోగ్య నటసమావేశ మరుదై రసౌచిత్యాదులఁ బాటింపని యిక్కాలమున నవ్యనాటక ప్రదర్శనము దుర్లభమేమో యని సందియ మందవలసి వచ్చినది.

కళాభిమాను లెవ్వరేని యీ నాటకమును బ్రదర్శింప నెంచిన నిందలి 4, 5, అంకములఁ బూర్తిగ వదలి, తక్కిన యంకములలో నచ్చటచ్చటఁ దగ్గించినఁ బ్రదర్శనమున కనువగునని నాతలంపు. ఉత్తమనటు లెవ్వరేని గ్రంథోద్దేశ్యమును భంగపఱుపక, ప్రదర్శనానుకూలమగు వ్యవస్థ నేర్పఱతురేని అత్యంతాదరమున నంగీకరింతును. 4 వ యంకము ప్రత్యేకముగా గూడఁ బ్రదర్శింపవచ్చును.

బ్ర. శ్రీ శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రులవారి వాత్సల్యమును, శ్రీ వేలూరి శివరామశాస్త్రులవారి కృపయు, శ్రీ సన్నిధానము

విశ్వనాథశాస్త్రిలు, శ్రీ ముదిగొండ వేంకటరామశాస్త్రిలవార్ల యను గ్రహ విశేషమును నీ గ్రంథవిషయమున నన్నుఁ గృతార్థునిగావించి నవి. వారికి నాభక్తి పూర్వక ప్రణామములు.

ఈగ్రంథము నంతను దయతోఁ బరిశీలించి యవతారిక వ్రాసిన సాహిత్యవిశారద, శ్రీ కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిల వారికి, మృచ్ఛకటిక పద్యములఁ గొన్నిఁటి నిందుపయోగింప ననుమతించిన శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిలవారికి, అభిప్రాయముల నొసంగిన విద్వత్సంఘము నకును, నా మనఃపూర్వక వందనములు.

ఈ పొత్తము నచ్చుస కీయకమున్నె శ్రద్ధతో విని నన్నుఁ బ్రోత్సహించిన జగద్గురు శ్రీ కాంచీపుర కామకోటిపీఠాధిపతులగు శ్రీ చంద్రశేఖరయతీన్ద్రసరస్వతీ స్వాములవారికి, కీ. శే. శ్రీ ప్రభల లక్ష్మీనరసింహము పంతులవారికి, నితర పండితకవి మిత్రులకును నా నమస్కృతులు.

ఇందలి కథ కల్పితము. పాత్రములు, వారి యితివృత్తములును సంపూర్ణముగ స్వకపోలకల్పితములే. ఇవి యే వ్యక్తులకును సంబంధించి నవి కావు. కావున కథాలోపములను, భ్రమప్రమాదాదికృత సకల దోషములను మన్నించి దీనిని చిత్తుప్రతిగ నెంచి పండితులు లోపములఁ దెలియఁ జేసిన పునర్ముద్రణమున సవరించికొందును. నా యీ సావిత్రీ గ్రంథమండలీ ప్రయత్నము నాదరించి మహారాజపోషకులుగ, రాజపోషకులుగ, పోషకులుగ, సహాయులుగను జేరి ప్రోత్సహించిన భాషాభిమానులకెల్లరకుఁ గృతజ్ఞుఁడనై ఈ గ్రంథము నర్పించుచున్నాను. కాలహరణమునకు మన్నించి దయతో నంగీకరింతురుగాక యని వేఁడు చున్నాను.

| | |
|---|---|
| బెజవాడ, | ఇట్లు, |
| ప్రమాథి; వైశాఖ శు ౫. | గ్రంథకర్త. |

# అవతారిక

గుణదోష విభాగ చతురమగు మతికే వివేకమని పేరు. అట్టి వివేక సంపన్నమగు తత్త్వమునకే మానవత్వ మని వ్యవహారము. ఈ పుడమి నది నడలిసవాఁడు మానవదేహుఁడగును కాని, విజ్ఞాన నిలయుఁడగు మనుజుఁడు కాఁజాలఁడు. కావున మానవోన్నతికి గుణాగుణ విచక్షణత ముఖ్యసాధనము. అట్టి వివేకోదయమునకు సత్కావ్యపఠన మత్యంతావశ్యకము. మఱియుఁ గావ్యపఠనముచేఁ గేవల వివేక భాగ్యమే కాక, యసమానానంద సంపదకూడ ప్రాప్తమగును. కావుననే "కావ్యము కాంతవలె వివేకమును ఆనందముతోఁ జొనిపి మనోహరముగా నందఁజేయును." అని పెద్దలు తెలిపియున్నారు.

"కాంతేవ చాభిరమయత్యపనీయ ఖేదమ్."

ఇట్లు విజ్ఞానానంద నిలయ మగు కావ్యజాలము శ్రవ్యదృశ్యభేద ములచే ద్వివిధముగా నొప్పుచున్నది. ఈ రెంటను వివేకానందముల నందఁజేయుటలో శ్రవ్యకావ్యముకన్న దృశ్యకావ్యము మిన్నగా నున్న యది. "కావ్యేషు నాటకం రమ్యం" అను పండితోక్తి ఈ విషయమును వ్యక్తము చేయుచున్నది. ఎంతటి దుర్జ్ఞేయ విషయమునైనను నాటక ప్రదర్శనముచే సువిదితముగఁ జేయనగును. కేవల శ్రవణ మాత్రముచే నిట్లనాయాసముగా విషయబోధలు చేయుట సాధ్యపడదు. కావుననే నిసర్గ దుర్బోధ మగు వేదాంతము కృష్ణపండితుఁడను కవివరుఁడు ప్రబోధ చంద్రోదయమను నాటకమును ప్రదర్శింపఁజేసి కర్తివర్మయను భూపతికిఁ గరతలామలకమట్లు బోధించెను.

కాని సలక్షణ రూపక నిర్మాణ నైపుణ్యమెల్లరు కవులకును సాధ్యముకాదు. అది యే కొలదిచతురమతులకో యలవడును. కావుననే "నాటకాంతం కవిత్వం" అను పండితోక్తి వెలువడినది. అనగా సాహిత్య నిర్మాణ నైపుణ్యము నాటకరచనచే విదితమగును అని భావము. ఇట్లు

కావ్యమూర్ధన్యమగు నాటక కవిత్వమున మనోహరములగు సావిత్రీ నాటకాది రూపకముల విరచించి యెన్నికఁగాంచియున్న బ్రహ్మశ్రీ శ్రీరాముల సచ్చిదానందశాస్త్రిమహాశయులచే నూతనముగా విరచింపఁబడిన "లలిత" అను సాంఘిక రూపకమును సాకల్యముగాఁ బఠించి యమితానందము నందితిని.

ఈ నాటకము దశేంద్రియ శోభితమై వివేకానంద సాధకమై తనరారుచున్న మానవదేహమువలె దశాంక సుందరమై విజ్ఞానానందముల నంకఁజేయుచున్నది. ఇందు శ్రీ శాస్త్రిగారు సనాతనాధునాతన నాగరకతాసక్తచిత్తులఁ బాత్రములనుగాఁ జిత్రించి, ప్రాచ్య పాశ్చాత్య సంస్కారభావ తరంగముల రంగములపైఁ జక్కఁగాఁ బ్రదర్శించి, సామాజిక మానసముల నానంద ముప్పొంగునట్లు కథావస్తువును నవరసభరితమునుగాఁ బ్రస్తరీకరించి యున్నారు.

వీరిందు వాడిన బాసయు ద్వివిధరుచుల కనువుగా నమర్పఁబడి యున్నది. వీరి పద్యరచన భావహృద్యమై నిసర్గసుందరమగు లలితశైలితో నలరారుచున్నది. దీనిం బఠించునపుడు పెద్దన శ్రీనాథాదుల పద్యముల పోలికలు మనఃఫలకమునఁ బ్రతిబింబితము లగుచుండును. ఇందలి కథయు నేఁటి లోకస్వభావములతోఁగూడి ముందుముం దెట్టి సుందరరంగములు వచ్చునోయను నాసతోఁ బఠింపనగు మార్గమున నేర్పుగాఁ గూర్పఁబడినది.

ఈ నాటకమును సాంతముగా నవలోకించినవారలకు శ్రీ శాస్త్రిగారు సనాతన ధర్మాభిమానులని విదితమగును. కాని వీరు సనాతన ధర్మాభిమానముచేఁ బరుల దూఱుటగాని, యసభ్య విషయములకు సందిచ్చుటగాని ఇందుఁ జూపట్టవు. ఇట్లు మనోహరముగా నాటకమును సమాప్తిఁజేయుటచే శాస్త్రిగారి రచనాసామర్థ్యము సంస్తవనీయముగా నున్నది.

నేఁటి సంకుల భావోదయ సమయమున నిట్టి నాటకరాజమును విరచించి సాంఘిక మర్యాద లెట్లు తాఱుమాఱగుచున్నవియో సోదరీ

సోదరులకుఁ బ్రత్యక్షము సేయుట దేశగౌరవాభిమానులగు శ్రీశాస్త్రి గారివంటి కవివరేణ్యులకు ముఖ్యకర్తవ్యము. ఈరూపకమునఁ బ్రాచ్య విద్యాసాగరులకును పాశ్చాత్య నాగరకతా సార్వభౌములకును గలుగుచున్న విరుద్ధ సంఘర్షణములు సరసముగా వ్యక్తీకరింపఁబడినవి.

ఈ నాటకమునందలి ప్రతివిషయమును మనోహర సంవిధాన విలసితమైయుండుటచేఁ బ్రత్యేకముగా వీరి రచనాప్రాశస్త్యమును ఎత్తి చూప నగత్యములేనందునఁ గ్రోడీకరింప మానితిని. ఇంతకుమించి యీ నాటకవస్తురమ్యతను నామాటలచేఁ బెంచి వ్రాయుటకంటె పాఠకమహాశయుల గ్రంథమును స్వాంతముగాఁ బఠించి సంతసింపఁగోరుటయే సర్వవిధముల సమంజసము.

శ్రీసచ్చిదానందశాస్త్రిగారింకను నిట్టి యుత్తమాదర్శ కావ్యకల్పతరుల సృష్టించి లలితాంధ్ర సాహితీనదీతటముల నాటి, ఈనాఁటి అనార్య సంస్కారగ్రీష్మాతాపతప్తులై యున్న భారతసోదరుల నా కల్పతరుచ్ఛాయలఁ జేర్చి, సేదదీర్చి గౌరవానందములతో హాయిగా జీవయాత్రల సాగించువారినిగాఁ జేయఁ బాటుపడఁగోరుచున్నాను.

ఓం తత్సత్.

సూర్యారావుపేట,<br>
కాకినాడ.<br>
2—4—1939.

సాహిత్య విశారద,<br>
**కాశీభట్ట సుబ్బయ్య శాస్త్రి.**

శ్రీరస్తు.

# పండితాభిప్రాయములు

బ్రహ్మశ్రీ శ్రీబాలసరస్వతీ, కవికంఠీరవ, ఘటాపంచానన, మహాకవి, కళాప్రపూర్ణ
## శతావధాని చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రులుగారు.

క. లలిత లలితమై, సాక్షా
ల్లలితాంబ కటాక్షములకు లక్ష్యంబై యీ
యిల వెలయుత, నిన్నుగ యశ
మలముత శ్రీరామ సచ్చిదానందకవీ !

శ్రీ. శ్రీ. శ్రీ.

కడియాం, తూ॥ గో॥ డి॥
30-4-39.

ఇట్లు,
శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి.

వేదకావ్యస్మృతితీర్థ, ధర్మాచార్య, విద్యానిధి, విద్యారత్న, వీరశైవ గురుకులాధ్యక్ష, 'విభూతి' పత్రికా సంపాదక,
పండిత చిదిరెమఠము వీరభద్రశర్మగారి

# అ భి మ త ము

'లలిత' యను నాటక రాజమును సాంతముగ బఠించి యమందానందము నందితిని. ధర్మాచారములను సయుక్తికముగను గంభీరముగను సమర్థించు 'ధర్మవిజయ' మనందగు నింతటిరూపకము నిట్టికాలమున భారతీయ భాషలో జూడగలిగినందులకు నుప్పొంగితిని. ఆంధ్రవాణికి నిదియొక నూత్నాలంకారము. నాటకరచనావిశారదు లగు శ్రీ సచ్చిదానంద శాస్త్రిగారు తమ చిరకాలానుభూతిని పురస్కరించుకొని యార్యసంప్రదాయ విజ్ఞానవైభవమును నిర్భయముగ గ్రథన మొనర్చినందులకెంతయు నభినంద్యులు. స్వకర్తవ్యవిషయమై యుదాసీనత నవలంబింప నున్న ద్విజుల కిది యుద్బోధఘంటాఘోష. విదేశీయభావమోహాంధు లగుచున్నవారి కియ్యది దివ్యజ్ఞానాంజనశలాక. జ్ఞానాగ్రజాభిమానము గల ప్రతియాంధ్రునకును, సంస్థయును, హితోపదేశ మనదగు నీ "లలిత" నవశ్యముగ బఠింతురుగాక! నా ప్రకృతికీ నాటక మందలి యుపన్యాస ధోరణి మిక్కిలి రుచించినది. భారతవర్షమునం దంతట నీరూపక మభినయింపబడి యార్యనాగరకతనుగూర్చి ప్రచారము నందుచున్న విపరీత భావము లుపశమించుగాక!

ప్రమాథి, వై. శు. ౧౧
సికింద్రాబాదు.

చి. మ. వీ.

శ్రీమతి, కవితిలక, కవితావిశారద, విద్వాన్,
మేరీ కళాశాల ఆంధ్రోపన్యాసకురాలు,
కాంచనపల్లి కనకాంబగారు

మహాశయా !

మీ స్తోత్రములఁ జదివితిని.

క. లలిత పదభావ మధురము
కలికల్మషహారము దృశ్య కావ్యము శ్రీరా
ములకులతిలకుఁడు సచ్చి
త్కలితానందుండు సెప్పె ఘను లలర మదిన్.

క. నవనవభావ విలసితము
నవీన నాగరక దుర్గుణాహారము సుజన
స్తవనీయ లలితలక్షణ
మవురా ! నీ లలిత ! సచ్చిదానందకవీ.

క. విద్యుద్దీప్తిన్ వెలుఁగుచు
సద్యః ఫలితములఁ జూపు సాంకర్యంబే
హృద్యమను ముగ్ధులకు సం
వేద్యము చూపించు సత్కవికి సముఁడౌరుఁడే.

గీ. పరమపావనచరితలు భరతభూమిఁ
గలుగు సావిత్రి లలితలె కాలమున నఁ
టంచు చూపించె దృశ్యకావ్యద్వయమ్ము
సందు సందమ్ముగాఁ జిదానందశాస్త్రి.

గీ. గంగపాల్సేయ ధర్మముఁ గవిత సెప్ప
వాఁతులెందఱో కలివేళ బలిసియుండ
సంప్రదాయంబు నిలఁబెట్టు సత్ప్రబంధ
రచనకుఁ గడంగు ధీయులఁ బ్రస్తుతింతు.

ఇట్లు,

మద్రాసు. కం. కనకమ్మ.

# పండితాభిప్రాయములు

## బ్రహ్మశ్రీ జటావల్లభుల పురుషోత్తంగారు, ఎం. ఏ.

ప్రిన్సిపాలు ఆంధ్ర గీర్వాణవిద్యాపీఠము - కొవ్వూరు.

నాటకము మిక్కిలి రసవంతముగ నున్నది. భాష పరిశుద్ధముగ నుండుటయే కాక సర్వజన సువేద్యముగ నున్నది. కొన్ని భాగములను తీసివేయుచో ప్రధాన కథాసందర్భమునకు భంగము కలుగకుండ మూడు నాల్గుగంటలలోఁ బ్రదర్శనము పూర్తి కాఁగలదు. పాత్రపోషణ మత్యుత్తమముగ నున్నది. ఆర్ష సంప్రదాయములను, భారతీయ సభ్యతను మీ నాటకము మిక్కిలి దక్షతతో సమర్థించుచున్నది. కావునఁ గళోపాసకులే కాక ధర్మనిరతులుగూడ మీకృతిని నుతింపఁగలరు.

కొవ్వూరు,
28-3-1937.

జటావల్లభుల పురుషోత్తము ఎం. ఏ.

---

## బ్రహ్మశ్రీ జమ్ములమడక మాధవ రామశర్మగారు

సాహిత్యాలంకార భాషాశాస్త్రాధ్యాపకులు, సంస్కృతకళాశాల, తెనాలి.

శ్రీ సచ్చిదానంద శాస్త్రిగారి కృతులలో 'లలిత' రూపకము లలితరూపకము. భాష మధురము. రచన సరళము. ఉద్దేశము మనోహరము. నాటకీయ కథాసూత్రము మధ్యమధ్య ముడుతలు పడియు ధర్మమునకు తగిన యాధారమై చక్కని హారమైనది. స్వరూప సమావేశమే కావ్యప్రయోజనము. అయినను అది పురుషార్థములు ద్వారము గలది కావలయుట సారస్వతేయుల శాసనము. సాధుకావ్య నిషేవణము ధర్మార్థ కామ మోక్షములందు వైచక్షణ్యమును సంపాదించునని యార్యుల సూక్తి.

ప్రకృత కాలపు కవికర్మలు ధర్మ మోక్షములకు దూరమైనవి. అట్టి కవుల విహారమును వాగీశ్వరి క్షమించునా? కావ్యము లోకసంగ్రహ మొనర్ప జాలునది యయిననె జనతాదరమును పొందగల్గును. నేటి విపరీతకాలమునందు ధర్మగ్లాని యధికమైనది. సంకీర్ణమతులకు ధర్మసాంకర్యము కన్పడదు. అట్టివారు ధర్మసంస్కారమును గోరుదురే కాని ధర్మస్థితిని ఏల కోరుకొనరో? లోకము అబోధోపహత మగుచున్నది. అజ్ఞానహత మైనది. అహంతోపహత మగుటవలననే యిట్టి యా

యనర్థవ్రాతము. లోకసంగ్రహ మెట్లు జరుగును? ధర్మతేజః ప్రసార మేరీతి కాగలదు? ప్రభువులు మంత్రులును అంతః కైంకర్య హేతు లైనారని లలిత ప్రమాణకముగా తెలిసికొనగలము. ఈ విషమసమయమున ధర్మ శ్రద్ధ కలిగిన పండితులు, ఉపన్యాసకులు; కవులు, నటులు, ప్రోత్సాహకులు లోకసంగ్రహమున కవసరము. భారతీయహృదయ రక్తములో వెచ్చదన మింకను తగ్గిపోలేదు. అచటి శ్రుతిఘోషలోని ధర్మగీతులు నేటి కిని విన్పడుచున్నవి. వానికి అట్టివానికి స్వాగత మీయలేనివాడు భారతావనిలో లేడు; ఉండరాదు. శ్రీరాములవారు పవిత్రమగు నిట్టి దివ్యాశయముతో శ్రీరామ ఉంచి నారు, ఈవిషయమున లలితవిన్యాస మొనర్చిన సచ్చిదానంద శాస్త్రిగారు శ్రీ గైకొ నుట కర్హులు. ఇట్టికవులు ఇట్టి గ్రంథములను రచించినచో ధర్మగ్లాని యుండదు. తగి నట్లు నటులు ప్రదర్శించిన అందఱము ధన్యులము.

ధర్మదేవత గృహాంగణమున విహరించిన సమయమున సంఘమునందు సంస్కార మవసరము కాలేదు. నేటికాలమున సంఘసంస్కార మవసరము. నానాముఖమున సంఘము ననేకులు కలతపరచినారు. అందుచే, తగిన ధర్మసంస్కార మిచ్చి లలిత రూపకము ధర్మారాధనము చేయుచున్నది

ఈ రూపకమువలన—

మానవునకు ధర్మశ్రద్ధ కలుగును.
దేవాలయాదులందు విపరీత సమన్వయము నశించును.
పాశ్చాత్యవ్యామోహ మడుగంటును.
ఆర్షగ్రంథాభిమాన మతిశయించును.
సంఘమునందు చక్కని సామరస్య ముదయించును.

ఇందు విధానము ప్రభువులకు తదనుయాయులకు దుష్టాధికారులకు వలసిన ప్రబోధమిచ్చును. లోకము లలితముగా లలిత కృతిలో నున్నది. భిన్నభిన్న స్వభావుల చిత్రవిచిత్రభావములు నిరూపింపఁబడినవి. అన్నిటికి నిర్వహణమున ధర్మయుత సమ న్వయ మున్నది. శ్రీరామరాజ్యము రూపకనిర్దిష్టము. ధర్మపాలనమునందలి దివ్య శాంతి సునిరూపితమయినది. వేదసమ్మతము ధర్మయుతము లోకతారకము నయిన యోగోపదేశ మొనరించిన శ్రీ శాస్త్రిగారి ప్రతిభను వేఱుగా జెప్ప నవసరములేదు. వీరు లలితరూపకమున మాఘవశర్మ.

పెదరావూరు,
16—4—39.

సాహిత్య విద్యాప్రవీణ,
జమ్ములమడక మాధవరామశర్మ.

కొల్లాపుర సంస్థాన విద్వాంసులగు

## బ్రహ్మశ్రీ పల్లా చంద్రశేఖర శాస్త్రులవారు

మీరు రచించిన లలితయను నాటకము సత్యాదరబుద్ధితో చూచితిని. మీరు నాతో చెప్పిన విషయములకంటె మిక్కిలి హెచ్చైన విషయములున్నవి. ఆధునిక మనఃప్రవర్తకమగు కథాసంగ్రహాత్మకమగు పోద్ఘాతము మాత్రమే దాని నలంకరించుట యవసరము. హూణాది దురాచార తమఃపటలావృతమగు ఈ ఘోరకలిలో దుర్గ్రాహ్యభేద్యత్రయీగుహాంతస్థిత సనాతన ధర్మతేజఃపుంజమును దృశ్యకావ్యాత్మకముగా వెల్లడించి లోకాజ్ఞానమును పోగొట్టుచున్న మీకు విశేషప్రతిభ నిచ్చి లలితాదేవి పాలించుగాత.

కొల్లాపురము,
3-4-1939.

పల్లా చంద్రశేఖరశాస్త్రి,
ఆస్థానవిద్వాన్-కొల్లాపురము-

---

వ్యాకరణ శిరోమణి

## బ్రహ్మశ్రీ ఖండవల్లి నరసింహశాస్త్రులవారు

శ్లో. లలితే లలితం పాత్రం లలితే లలితా కథా
లలితే లలితం సర్వం లలితేఽలలితం కిము?

ఖండవల్లి నరసింహశాస్త్రి.

---

## బ్రహ్మశ్రీ బ్రహ్మాండం వేంకట లక్ష్మీనారాయణరావుగారు.

శ్రోత్రియందారు, బాపట్ల.

పడుగుపాడు, కోవూరు పోస్టు, నెల్లూరుజిల్లా. 25—4—1939.

'లలిత' అను నాటకము సంపూర్ణముగా చదివినాను. పూర్వకవులు వేదాంతమును ప్రజలకు ప్రబోధ చంద్రోదయము అను నాటకముద్వారా తెలిపినట్లు మీరు స్వధర్మానుష్ఠానమును, యీ లలిత నాటకముద్వారా ప్రజల కెరుకపరచినందునం చాలా సంతోషము. మాధవశర్మవంటి యొకవ్యక్తి అయినా ప్రపంచమున నున్నంత కాలము ధర్మము నశింపు కానేరదు. ప్రస్తుతకాలములో యేది ప్రజలు ఆచరించక చెడిపోవుచున్నారో అట్టివారలకు మీనాటకము మార్గదర్శి కాగలదు. స్వధర్మానుష్ఠానపరులూ కాగలరు. నాస్తికులు, ఆస్తికులూ కాగలరు, పరమేశ్వరుడు మరికొన్ని యిటువంటి సద్గ్రంథములను ప్రజల మేలుకొఱకు రచించే నిమిత్తం మీకు దీర్ఘాయువిస్తూ, బుద్ధిని, శక్తిని, యిచ్చుగాక, యని ప్రార్థించుచున్నాను.

---

# పాత్రములు

## పురుషులు

మాధవశర్మ— రామపురాగ్రహారికుడు, ధర్మనిరతుఁడు, పండితుఁడు.
సుదర్శన ప్రభువు— శ్రీనగరు సంస్థానాధిపతి.
గోపాలరావు— సంస్థాన మంత్రి.
కృష్ణశర్మ— మాధవశర్మ అన్న కొడుకు.
రామచయనులు— మాధవశర్మ వియ్యంకుఁడు.
మురహరిశర్మ (మోహనరావు)— మాధవశర్మ అల్లుఁడు, బారిస్టరు.
సభాపతి— మాధవశర్మకుఁ బ్రతికూలుఁడు.
యజ్ఞం— మురహరిశర్మ మిత్రుఁడు.
విశ్వపతి— మాధవశర్మ శిష్యుఁడు.
సుబ్బయ్య— పూజారి.
సుబ్బయ్యగుప్త— ధనికుఁడగు వర్తకుఁడు.
రామిరెడ్డి, చౌదరి—మున్నగు పౌరులు గ్రామోద్యోగులు
అభినవ కృష్ణానందుఁడు— వంచకుఁడైన కృష్ణవేషధారి.
కపట బ్రాహ్మణులు— కాళికాంబా ప్రేరితులైన యిద్దరతిథులు.
రమణారావు— నాటకసమాజాధ్యక్షుఁడు.
చారుదత్తుఁడు—
విటుఁడు—
విదూషకుఁడు— } అంతర్నాటికలోని పాత్రలు.
వెంకన్న— మాధవశర్మయింటి సేవకుఁడు.
నాగఁడు, బిచ్చంగాడు, దొంగలు: కాళికాంబా ప్రేరితులు.
యువకులు— ఇద్దరు కాముకులు.
రత్నకభటుఁడు— గస్తీతిరుగు పోలీసు; మహమ్మదీయుఁడు.
వీరభద్రరావు— పోలీసు ఇన్‌స్పెక్టరు.
నిరుద్యోగులు— పట్టభద్రులై జీవనాధారము దొరకనివారు.

## స్త్రీలు

రాధ— మాధవశర్మ భార్య.
లలిత— మాధవశర్మ కూఁతురు.
తులసి— కృష్ణశర్మ భార్య; మాధవశర్మ అన్న కోడలు.
కాళికాంబ— మాధవశర్మ అన్న భార్య; ఇలువెడలిన వితంతువు;
కమల—
గిరిజ—
శారద— } అభినవ కృష్ణానందుని యుపచారికలు.
విద్యార్థిని— కళాశాలలో నాంగ్లవిద్య నభ్యసించు కన్య.

శ్రీరస్తు.

# లలిత

## నాంది

శా. శ్రీధమ్మిల్లము చక్కనొత్తుచు భుజాశ్లేషంబు లందించుచున్
సాధర్మ్యంబు గణించుచున్ లలిత వాచాప్రౌఢిమం దేలుచున్
మాధుర్యం బిగురొత్తఁ గృష్ణ తులసీ మాలా లసన్మూర్తులా
రాధా మాధవు లోముచున్ మనకు భద్రంబుల్ ప్రసాదించుతన్.

[నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి పుష్పాంజలిం జల్లి]

సకల కలా విశారదులగు నీ సభ్యుల సంతృప్తిపఱచుట మిగుల దుస్సాధమే. ఈ కార్యభార మెట్లు నిర్వహింపఁ గలుగుదును? [యోజననభినయించి ముందుఁజూచి] మారిషుఁడు వచ్చుచున్నాఁడు, యోజించి కర్తవ్యము నిర్ణయించెద.

మారిషుఁడు—[ప్రవేశించి] బావా! నమస్కారము.

సూత్ర—చిరంజీవివి కమ్ము. ఆలసించితివేల ?

మారి—మీ మనస్సుయొక్క త్వరయేకాని నా యాలస్య మేమియు లేదు.

సూత్ర—ఔను. [అని తలపంకించి] మనమే దేనొక లలితరూపక ప్రదర్శనమునఁ బరిషదారాధనము గావింపవలె. అట్టి నాటక మెద్దియో? యోజించి వచింపుము.

మారి—కంఠమున వ్రేలు మణిహారమును మఱచి కాంత నడిగినట్లు నాటకము పేరు మీరే చెప్పి నన్నుఁ జెప్పుమనుచుంటి రేల?

సూత్ర—అది యెట్లు?

మారి—'లలిత' రూపక మనలేదా?

సూత్ర—[స్మరణమభినయించి సంతసముతో] నిజము మారిషా! నిజము తనమాటను మఱచి లెక్కించుకొని విచారించువానికి "దశమ స్త్వ మసి" అని ప్రబోధించినట్లు నామాటను నాకు స్మరింపఁజేసి మిక్కిలి యుపకృతిఁ గావించితివి. ఆ లలితానాటకమునే ప్రదర్శింతము.

మారి—మఱచితిని, ఆ నాటకమును రచించిన సుకవి యెవ్వరు?

సూత్ర—మనకుఁ జిరపరిచితుఁడును సుప్రసిద్ధులగు శ్రీతిరుపతి వేంక టేశ్వరుల శిష్యుఁడును, సావిత్రీనాటకాద్యనేక గ్రంథకర్తయు నగు శ్రీరాముల సచ్చిదానందశాస్త్రిగారు.

మారి—[సంతసముతో] మనకే గాదు. ఆంధ్రలోకమున కంతటికిని బరిచితుఁడైన యా కవివర్యుని నాటకములుప్రదర్శనార్హములనుటకు సందియము లేదు. కాలహరణ మొనరింపక ప్రదర్శన ప్రయత్న మొనరింతము.

సూత్ర—మంచిది. కాలము సయితము రమణీయమై యెంత మనోహర ముగ నున్నదో చూడుము!

గీ. ద్విజకులాధారశాఖల ♦ వెలయఁజేయ
సకల జనులకు సౌమన♦స్యంబు నెఱప
లలితగుణగణ్యుఁ డానంద ♦ కలితమూర్తి
యల్లదే మాధవస్వామి ♦ యరుగుదెంచె.

మారి—బావా! నీ వర్ణన మెంతయుఁ బ్రశంసనీయము.

సూత్ర—మారిషా! మాధవునిం బోలె స్వభావసౌమ్యుండగు మాధవ శర్మ భావ్యపతన మొనర్చి ప్రియపుత్రికకు లలితకే మోచెప్పఁబోవు చున్నాఁడు. మన మనంతరకరణీయమునకుఁ గడంగుదము రమ్ము.

మారి—అటులనే కావింతము [అని యిరువురు నిష్క్రమింతురు.]

ఇది ప్రస్తావన.

# లలిత

## ప్రథమాంకము

[ మాధవశర్మ గృహము. లలిత తండ్రియగు మాధవశర్మవద్ద గ్రంథమును వినిపించుచుండును. ]

లలిత—నాన్నగారు! ఆహా! ఆదికవి వాల్మీకి యెంతమహానుభావుఁడండి! లోకవాదము ననుసరించి రామాయణకథ కల్పితమౌగాక యథార్థమే యగుఁగాక! యే భాగము చదివినను అమృతరస మొలుకుచు నన్నియుఁ గన్నులఁ గట్టినట్లగపడుచుండును. శ్రీరామచంద్రునిధర్మనిరూఢి సీతాదేవి పాతివ్రత్యము లక్ష్మణునినయవర్తనము, ఒకటేమి? అన్నియు ననుకరింపఁదగినవే?

మాధ—సందేహమేమి తల్లీ! అన్నియు నట్టివియే.

లలిత—నాన్నగారు! రామాయణరత్నమాలలోనికి నేను సంగ్రహించిన ఈ శ్లోక మెంత చక్కని శ్లోక మండీ!

మాధ—[సంతసముతో] ఏది! చదువుము.

లలిత—"శ్లో. నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే
నూపురావేవ జానామి నిత్యం పాదాభివందనాత్"

ఋశ్యమూకమునఁ బైనుండిపడిననగలమూటను సుగ్రీవుఁడు శ్రీరామచంద్రునకుఁ జూప రాఘవుఁడు సీతా స్మరణమునఁ బాష్పపూరితలోచనుఁడై చూడఁజాలక తమ్ముఁడా! చూడు యీనగలు మీ వదినవేమో చెప్పుమన భుజకీర్తుల నెఱుఁగను, కుండలముల నెఱుఁగను,

నిత్యము జానకీదేవి పాదాభివందన మొనరింతునుగాన నూపురముల మాత్రమే యెఱుఁగుదునని లక్ష్మణుఁడు సీతాదేవియందెలనుమాత్రమే గుర్తించెనఁట! ఆహా! నాన్నగారు! లక్ష్మణుఁడు పదునాల్గేండ్లు ఏకాంత సేవకుఁడైనను బుడమిపట్టియడుగుదమ్ములనే కాని యొండు చూడలేదని యీ శ్లోకమువలనఁ దెలియుచున్నది. ఎంతటి పవిత్ర హృదయుఁడో సౌమిత్రి!

మాధ—అమ్మా! ఈ శ్లోకము లక్ష్మణునౌచిత్యమును దెలుపుటయే గాక పురుషవర్తనమునకెంతేయు మార్గదర్శకమై విరాజిల్లుచున్నది. ఇది నీ రామాయణరత్నమాలకు నాయకరత్నమనుటకు సందియము లేదు.

లలిత—నిజమండి. ఆలాగే ఉన్నదండి నాన్నగారు! "తృణ మంతరతః కృత్వా" సీతాదేవి రావణునితో మాటలాడునప్పుడు మధ్య గడ్డిపరకవైచి మాట్లాడినదే! దాని యభిప్రాయ మేమందురు? పరపురుషునితో అందును దుష్టునితో స్త్రీ మోమెత్తి మాటలాడఁదగదని తృణముపై దృష్టి నిల్పెననియా?

మాధ—అంతియే కాదు లలితా! పరస్త్రీలను గోరువాఁడు సాధ్వీమణులకు గడ్డిపరకతో సమానుఁడని గడ్డితినుపశువుతోఁ దుల్యుఁడని చెప్పుటకూడ అర్థమగును. ఇవి జ్ఞాపకముంచుకొనుము. ఇంకను మఱికొన్ని భావములు తరువాతఁ జెప్పెదను.

లలిత—మంచిభావమండి నాన్నగారు! మఱియు నీ ఘట్టమునఁ గ్రూరుఁడగు రావణునకు సీత యెంతనిర్భయముగ బుద్ధి చెప్పినదండి!

మాధ—నిర్భయముగాక పతివ్రతలు పరులకు లోఁబడుదురా తల్లీ!

లలిత—ఆ ఘట్టమంతయు ఆలాగే యున్నదండి. విభీషణాభయప్రదాన సమయమున ఆహా! రామచంద్రుఁ డెంత బాగుగఁ జెప్పినాఁడండి!

"శ్లో. సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదా మ్యేత ద్వ్రతం మమ"

ఎండ మెండుగా నున్నను, గాలి తీవ్రముగా వీచినను, ఏ భూతము కొంచెము ప్రకోపించినను, లోకములు తాఱుమాఱగునే? సప్త

మారుతములు, నవమేఘములు, ద్వాదశాదిత్యులు, అఖండమైన భూమి, అనంతమైన యాకాశము, వీనివలన నే యుపాయము వచ్చి నను ఒక్కమాఱు నమస్కరించి నీవాఁడ నన రక్షించెదనని యన్ని భూతములకొఱ కభయ మిచ్చుటయే నాకు నియమవ్రత మని చెప్పెనే ! రాముఁ డెంతపరాక్రమవంతుఁడో !

మాధ—అమ్మా! రాముఁడు సర్వగుణాభిరాముఁడు. ఆతఁడే పరంధాముఁడు. అతనికడ మనుష్యమాత్రులేల ? అగ్ని కాదు, సూర్యుఁడు కాదు, చంద్రతారకలు కాదు, విద్యుత్తులు సైతము ప్రకాశింప నేరవు. ఆతని వలనిభయమున నే పవనుఁడు వీచును; భానుఁ డుదయించును. ఇంత యేల? యాతనిమూలముననే సర్వము వెలుఁగొందును. ఆతఁడే యన్ని యానందములకు మూలకందము. అట్టి శ్రీరాముఁడు సర్వభూతాభయప్రదాత యనుటకు సందియము లేదు. ఆ శ్రీరామచంద్రుని ధ్యానించుచు నిరంతరము రామాయణసారమును గ్రోలుచుండుము.

లలిత—నాన్నగారు! అందుకనియే రామాయణరత్నమాలను సిద్ధము చేయుచున్నాను.

మాధ—మంచిది. మంచిమంచిశ్లోకముల నన్నిటినిఁ జేర్పుము. వాని కన్నిటికి విశేషార్థములను జెప్పెద.

లలిత—ఆలాగే. మీరు చెప్పుచుండు శాంతిపాఠములలో నొక శ్రుత్యర్థము ననుసరించి యొక పద్యము వ్రాసితిని. దానిని వినఁగోరెద.

మాధ—ఏది? చదువుము.

లలిత—గీ. "మొదట సృజియించు నెవ్వాఁ డంభోజభవుని
వేదము లొసంగు నెవ్వాఁ డవ్విధికిఁ బేర్మి
దేవు నాతని నాత్మబుద్ధిప్రకాశు
నమలమతిఁ గొల్తు మోక్షార్థి నగుచు నేను."

మాధ—[సంతసముతో] అమ్మా! బహుచక్కఁగ వ్రాసితివమ్మా! సద్భావములనే సేకరించుచు ఇట్టి పద్యములనే వ్రాయుచుండుము.

మంచి కవయిత్రివి కాఁగలవు. అన్నయ్య కృష్ణయ్య ప్రయాణము చేయు సమయమైనది, పంపివత్తము పద.

**లలిత**—అటులనే [అని పోఁబోవుచుండఁ బ్రయాణవేషముతో విశ్వపతినిఁగూడి కృష్ణశర్మ ప్రవేశించును]

**కృష్ణ**—[పినతండ్రిని సమీపించి] బాబుగారు! నమస్కారము. [అని పాదములు పట్టుకొనును]

**మాధ**—విద్యాప్రాప్తిరస్తు [అని యాదరమున లేవఁదీయును] కృష్ణా! ప్రయాణసమయ మైనదా?

**కృష్ణ**—ఆఁ అయినది.

**మాధ**—లలితా! మీ యమ్మ యేది?

**లలిత**—[ముందుఁ జూచి] కృష్ణపూజఁ జేసికొని అమ్మయు వదినెయు వచ్చుచున్నారు.

**తులసీ రాధలు**—[ప్రవేశింతురు.]

**కృష్ణ**—పిన్ని! నమస్కారము.

**రాధ**—అభీష్టావాప్తిరస్తు. [కృష్ణుని దగ్గఱకుఁదీసికొని] కృష్ణయ్యా! అప్పుడే ప్రయాణము చేయుచుంటివా?

**కృష్ణ**—అవునమ్మా!

**రాధ**—నాయనా! ఇది భగవానుని ప్రసాదము, గ్రహింపుము. [పుష్పమాల వేసి ఫలముల నిచ్చును]

**కృష్ణ**—నీ యిష్టదైవమగు శ్రీకృష్ణుని ప్రసాద మిప్పట్ల లభించుట నాకెంతయు సుకృతము. ఇంక నేను తప్పక కృతకృత్యుఁడనుగాఁగలను; నా కనుజ్ఞ యిమ్ము; పోయివచ్చెద.

**రాధ**—[శిరము నిమురుచు] కుమారా! కృష్ణయ్యా!

చ. చదివితి వేదమంతయును ♦ శాస్త్రములం జతురుండవైతి కో
విదుఁడవఁటంచుఁ బేర్వడితి ♦ విజ్ఞులు మెచ్చెడియోగ్యవర్తనం
బొదలితి వన్నిభంగులను ♦ బూజ్యపదంబు గడించుమయ్యా! య
భ్యుదయమునందుమయ్యా!స్వకు♦లోన్నతిఁ బెంపఁగదయ్యా! పుత్త్రికా!

కృష్ణు—అమ్మా! నీ యాశీర్వచనమున నేను ధన్యుఁడను గాఁగలను. బాబుగారు! ఇంక నా కనుజ్ఞయిండు పోయివచ్చెద.

మాధ—నాయనా! గురుకులాశ్రమప్రవేశము గురుసేవయన్న నాడలు పులకరించుచు నీతోఁ గూడ వచ్చుట కిచ్చవొడముచున్నది! మానవౌన్నత్యమునకు గురుసేవ విద్యాభ్యాసము ముఖ్యసాధనములు. మనుష్యునకు వచ్చెడి దశలలో విద్యార్థిదశవంటి దశ మఱియేదియును గానేరదు.

చ. గురుకులమే జగంబచటఁ ♦ గూడుకలార్థులె ప్రాణబంధువుల్
గురువె యభీష్టదైవమని ♦ కోరి పఠించుచునుండు విద్యయే
పరమనుచున్ శుభ్రితం బను త♦పంబొనరించెడువారి భాగ్య మె
వ్వరికి లభించు నాసుకృత♦వంతుల కెవ్వరు వంతు పంతునన్.

ఇంకను నీవు శాస్త్రరహస్యములను యోగరహస్యములను దెలిసికొనఁబోవుచున్నందుల కెంతయు సంతసించుచున్నాను. ఆత్మోద్ధరణహేతువులై లోకకల్యాణకారణములగు వేదశాస్త్రములచే నలంకృతుఁడ వగుచున్నందులకు మిక్కిలి సంతోషము. అట్టి నీమూలమున మే మలంకృతులమై వంశ మలంకృతము కాఁగలదు. ఆనందముగఁ బోయిరమ్ము. గురుశుశ్రూషయు విద్యాభ్యాసవిధానమును బూర్తిగ నెఱిఁగిన నీకుఁ జెప్పఁదగిన దెద్దియును లేదు. అయినను గురుదేవుల సేవావిధానమున నప్రమత్తుండవై సంచరించుచుండుము.

కృష్ణు—మీ యాజ్ఞామంత్రం బనుష్ఠించి గురుదేవులకృపకుఁ బాత్రుఁడ నయ్యెద. ఇంక నేఁ బోయివచ్చెద.

లలిత—అన్నయ్యా! భారతము చెప్పెదనని చెప్పి చెప్పకయే పోవుచుంటివా?

కృష్ణు—[లలితను దగ్గఱకుఁదీసికొని శిరము నిమురుచు] అవును లలితా! బాబుగారు చెప్పెదనని చెప్పుటచేఁ బ్రయాణము చేయుచుంటిని. అన్యథా తలంపక నిత్యము పాఠము చదువుచుండుము.

లలిత—మఱి వదినెకు భాగవతమో?

కృష్ణు—ఛిన్నిగారు చెప్పెదరు.

లలిత—ఏమో అన్నయ్యా! నీవు లేకుండిన నెటులనో యుండును. వదినెకు మనస్సు మనస్సులో నుండదు.

కృష్ణు—[గడ్డము పుచ్చుకొని] లలితా! విచారింపకుము. ఇంక నన్ను పంపుము.

రాధ—తులసీ! నీ హృదయేశ్వరునకు నమస్కరించి యాతని యాశీస్సులఁ బడయుము. [తులసిని నమస్కరింపఁజేయును.]

కృష్ణు—పిన్నీ! కోడలికి భాగవతమును బూర్తిఁజేయుచు నే వచ్చువఱకు నీకడనే యుంచుకొని నీ కృష్ణునకు సేవకురాలినిఁజేసి ధన్యను జేయుము. అమ్మాయినిలలితను జదివించుచుండుము. ఇంక నాకాజ్ఞ యిమ్ము.

రాధ—నాయనా! గురుకులము చేరువఱకు పాథేయము నొసంగెద. గ్రహించి పొమ్ము.

కృష్ణు—తల్లిగారి యాజ్ఞకు బద్ధుఁడను.

రాధ—[పళ్ళెములో బియ్యము, రెండు ఫలములు నుంచును]

కృష్ణు—[మూటఁగట్టుకొనును]

మాధ—కుమారా!

గీ. ప్రేమనొసఁగెదు పినతల్లి • శ్రేమతండు
లముల గ్రహియించి నీగురూ • త్తములఁజేరి
శాస్త్రములఁ దేటిరమ్ము నీ • సద్గుణాళి
స్వాంత మలరింపఁ, జేరందు • మయ్య! తనయ!

[ఆలింగనము చేసికొనుచు] కుమారా! నీ వస్త్రములను బుస్తకములను దీసికొంటివా?

కృష్ణు—అన్నిటినిఁ దీసికొంటిని.

మాధ—నాయనా! ఇది నూతనమైనది. దీనినిఁగూడ నీకడ నుంచుకొనుము. [సాలువు కప్పును] ఈ పైకమును ఖర్చునకుఁగా నుంచుకొనుము. [అని కవరునిచ్చును] విశ్వపతీ! నీవు మూటతీసికొని పంపిరమ్ము.

విశ్వా—చిత్తము [అని మాటను గ్రహించును]

కృష్ణు—బాబుగారు! ఇంకనాకు ముదలయిందు. పిన్నీ! నాకాజ్ఞయిమ్ము. లలితా! పోయివచ్చెద.

మాధ—[ముందుఁజూచి] కుమారా! అదిగో! వాయసము తీర్చుచున్నది. దండధారియగు శూద్రుఁడొక్కరుఁడే యిటు వచ్చుచున్నాఁడు. పైన ముత్తైదువలు ఇంకనెవ్వరోపలువురు వచ్చుచున్నారు. ముందు నడువుము.

లలిత—అన్నయ్యా! త్వరగ రమ్ము.

రాధ—కుమారా! క్షేమము తెలుపుచుండుము.

తులసి—[విచార మభినయించును]

కృష్ణు—"శ్లో. యశ్శివో నామరూపాభ్యాం యాదేవీ సర్వమంగళా
తయో స్సంస్మరణాత్పుంసాం, సర్వతో జయమంగళమ్".

[అనుచు నిష్క్రమించును]

అందఱు—[కొంతదూరము నడిచి విచారముతోఁ జూచుచుందురు]

రామచయనులు—[తెరలో] బావగారు! [అని పిలుచును]

మాధ—[వెనుకకుదిరిగి] ఎవరది? రామచయనులుగారా! ఏమి? [మఱలఁ జూచును]

రామ—[ప్రయాణపువేషముతోఁ బ్రవేశించి] అవును బావగారు! అంతా ఒక్కచోటేఉన్నారు. ఏదయినా పురాణగోష్ఠిలోనున్నారా!

మాధ—మా కృష్ణుఁడు ప్రయాణముచేయుచుండ వానినిఁ బంపుచు నిటు వచ్చితిమి.

రామ—అయితే మన కృష్ణుఁడెక్కడికి వెళ్ళాడు?

మాధ—శాస్త్ర రహస్యములు యోగరహస్యములు తెలిసికొనుటకు హరిద్వారముకడనున్న గురుకులమునకు వెళ్ళినాఁడు.

రామ—బావగారి కింకా ఛాందసం పోలే. గురుకులాలు శిష్యకులాలు యోగాలు గీగాలును కూటికా గుడ్డకా యెందుకివి? బావగారు!

మిరియపుగింజలాంటి కుఱ్ఱాడు కృష్ణుణ్ణి పాడుచేయకండి. అబ్బాయితో పాటు ఇంగలండు పంపించండి. కాస్త మానవత్వం నేర్చుకొస్తాడు.

మాధ—చయనులుగారు! మురహరిశర్మను ఇంగ్లండు పంప నిశ్చయించి తిరా ?

రామ—నిశ్చయమేమిటి బావగారు! మీచెల్లెలేమీ నిద్రపోనియ్యలేదు. కుఱ్ఱాడేమీ ఆగేలాగు కనపట్లేదు. మొన్న నిశ్చయించాం. ఇప్పుడే ప్రయాణ ముహూర్తం. నిన్న మనవాడి స్నేహితులు వాళ్లూ కలిసి అబ్బాయికి అదేదో మఱచా [తలఁదడవికొనుచు] ఆఁ టీ పట్టీ చేసి పూలదండలు అవ్వీ వేసి ఊటకలాలు, అవేవేవో ఆఁ దొర టోపీలు అవి యిచ్చారు. మీతోగూడా చెప్పటానికే వస్తూ స్నేహితుణ్ణి చూచిరాపోయినాడు. అదిగో! సామానుబండి. మురహరి కూడా యిప్పుడే వస్తాడు.

మాధ—[చూచుట నభినయించి] చయనులుగారు! అదియంతయు విద్యార్థి సామగ్రియే ?

చయ—ఇంకా వాడిబండిలో లేదూ! మఱే మనుకొన్నారు? మనవాడూరికే పెద్దవాడవుతా డనుకున్నారూ? అమ్మా రాధమ్మా! అల్లుడు ఇంక బారిష్టరవుతాడు. అమ్మాయి చాలా అదృష్టవంతు రాలు. అదృష్టమేమిటే? నీవు చూడవు గనుకనా ?

రాధ—అన్నగారు! మీరు కర్మిష్ఠులుకదా! విదేశయానము పనికి వచ్చునా ?

రామ—పిచ్చిదాన! కర్మయేమిటే! బ్రాహ్మణ్యమనఁగా ఎంత? అనా జంఝాలు, మూఁడు మంత్రాలు. అవి నా చేతిలో ఉన్నయి. అబ్బాయి బారిష్టరు కావాలిగాని వెధవబ్రాహ్మణ్యము, విభూతి రేఖలు, పిల్లజుట్లు, పింజగోచీలు, ఎక్కడికి పోతయమ్మా? రేపు నీ కూతురు అబ్బాయిదగ్గర దొరసానిలాగ! చూడు! ఎంత వైభవం అనుభవిస్తుందో ?

మాధ—చయనులుగారు! విదేశయానమునందు మీరు కృతనిశ్చ యులు. అట్టి మీకు నేనేమియుఁ జెప్పఁజాలను. కాని విదేశవాసము

మన కెంతయు హానికరమని నా యభిప్రాయము. అందును గష్ట సుఖము లెఱుంగక, దార్ఢ్యములేని కోమలహృదయము చిరకాల నివాసమున దుర్వ్యసనావిలము కాకుండుట మిగుల కష్టము.

సీ. ఆహారనియమంబు ♦ లలవడ నేర్చునే
మాంసాశనులయిండ్ల ♦ మసలుచుండ
మానాభిమానముల్ ♦ మాన్యత లుండునే
మద్యప్రియులచెల్మి ♦ మలయుచుండ
శ్రద్ధతో గ్రంథముల్ ♦ చదువంగ సాధ్యమే
క్రొంగ్రొత్తల మనంబు ♦ కొసరుచుండఁ
గలఁతనొంద కొకింత ♦ నిలువంగ వశమానె
యువతీకరస్పర్శ ♦ లొలయుచుండ
గీ. జాతిమతధర్మములమాట ♦ స్మరణకగునె
యన్యజాతులతో విందు ♦ లమరుచుండఁ
దల్లిదండ్రుల నిల్లాలిఁ ♦ దలఁపనగునె
చేత రొక్కంబు సుఖము ముంగిటనుండ.

రామ—బావగారు! విదేశమన్న మీ కింత వితర్క మెందుకండి? విదేశీయులలో యోగ్యులు లేరా? విద్వాంసులు లేరా? మీకు మాత్రి మక్కడి యింగ్లీషు రాదా?

మాధ—విషమునఁ బుట్టిన క్రిమికి విషము, జలజంతువులకు జలము హానిఁజేయఁజాలవు. అటులనే విదేశీయులకు విదేశాచారములు కూడ. సంస్కృతాంధ్రములు చదివి నేను నేర్చిన యాంగ్లము భాషకొఱకుఁగాని బానిసతనమునకుఁ గాదు. నన్నా భాష, భావములు తాఁకుమాఱు చేయనేరవు.

రామ—ఏమోనండి బావగారు! మనవాళ్లంతా "మీరగ్రహారీకులు, మీకుర్రాడు తెలివిగలవాఁడు, పంపండి పంపండి" అన్నారు. మీ చెల్లెలిసర్దా అబ్బాయి ఉత్సాహం నేను తీసివెయ్యలేక టిక్కెట్టు వగయిరాలకు వెయ్యిరూపాయిలు తీగమీద పంపించా? అబ్బాయి తురహారికూడా ఏమేమో దిరుస్సులు అవ్వి యివ్వి కావాలని

యింకా వెయ్యిరూపాయీలు ఖర్చుపెట్టాడు. ఇంకేం అనకండి, అదుగో అబ్బాయి వస్తున్నాడు.

మాధ—చయనులుగారు! కానున్నది కాక మానదు. మీరు కూడ బొంబాయికి వెళ్లివచ్చెదరని తలంచెద.

రామ—[సరాళించుచు] పోనా మఱి? కుఱ్ఱాణ్ణొక్కణ్ణి పంపుతానూ ?

[మురహారిశర్మ పుష్పమాలాలంకృతుఁడై ప్రయాణపు వేష ముతో యజ్ఞంతోఁ గూడి ప్రవేశించును.]

యజ్ఞం—[మురహారిచెయ్యిఁ బట్టుకొని పొఁగఁబిల్చుచు] ఇదిగో నోయ్! ఫారన్ కంట్రీసులో అందులో ఇంగ్లండులో ముఖ్యంగా చూడా ల్సింది డ్రెస్సింగ్, స్మోకింగ్, డాన్సింగ్, ఇవ్వి చాలా అందంగా నాజూగ్గా ఉండాలి, ప్రతివాళ్లతో ప్రతివిషయంలో గూడ చాలా సోషల్గా మూ అవుతూ ఉండాలి, మనీసందర్భంలోఉందే చాలా లిబరల్గా కనబడాలి. ఫాషన్ అంటే మనమే వాళ్లకు నేర్పేలా ఉండాలి, ఒకటిరెండు టీపార్టీలలోనే అందర్ని పట్టీగొట్టించి ఓ యస్, యెక్సలెంటు ఫెలో, వెరిగుడ్ మాన్ అనిపించుకోవాలి, తెలిసిందా? జాగ్రత! [మురహారిచొక్కా సర్దుచు] సరే కాని బొంబాయికి ముస లాడు మీనాన్నెందుకోయ్? ఆటిక్కెట్టు నాకిప్పించు, సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ పోదాం. నేను వచ్చానంటే నిన్ను సగం ఇంగ్లండుమని షిని చేస్తా, చేస్తా ఏమిటీ? చేశానన్నమాటే! [అని చెయ్యి గట్టిగాఁ బట్టుకొనును.]

మురహారి—కానీ చూద్దాం [అనుచు ముందునకు వచ్చును.]

రామచయనులు—[ముందుకు వచ్చి]అబ్బాయీ! మాధవశర్మగారు నీకు మామగారే గాక కావ్యములుచెప్పిన గురువులు కూడా. వారికి నమ స్కరించి వారి ఆజ్ఞతీసుకో. అత్తగారిక్కూడా నమస్కారంచేసి సెలవు తీసుకో.

యజ్ఞం—[సిగరెట్టుఁ ద్రాగుచు, గడియారం చూచుచు] నోటయిమ్ ! ఛాందసం చెయ్యక నీ వైపు (భార్య) క్కూడా ! ఒక్క షేక్హాం డిచ్చి త్వరగా రా.

అందఱు—[ఆశ్చర్యముతోఁ జూతురు.]

మురహరి—మామగారు! నే నింగ్లండునకుఁ బోయెద. నాకు సెలవొసంగుఁడు.

మాధవ—చెప్పఁదగినదంతయు నిదివఱకే చెప్పితిని. ఇంక నీ యుద్యోగ ప్రవాహమాపుట దుర్లభము గాన మీ నాన్నగారి యిష్టాను సారము కానిమ్ము.

మురహరి—[అత్తగారి వంకఁ జూచి] నేను వెళ్లి వస్తానండి.

రాధ—దూరదేశమే ! నే నేమి చెప్పఁగలను?

ముర—తులసమ్మా! వెళ్లివచ్చెద.

తులసి—అన్నగారు ! జాబు వ్రాయుచుండుఁడు.

ముర—[జేబునుండి తీసి] అమ్మాయీ! ఇవి రవ్వలు చెక్కిన క్రొత్త రకపు బంగారపు పూవులు. వీనిని నా ప్రయాణ చిహ్నంగా మీరు ధరించండి. [అని పూవులపొట్లమిచ్చును.]

తులసి—[ఆదరముతో గ్రహించి] చాల బాగున్నయండి, అన్నయ్యా! [లలితను సమీపించి చూపుచు] లలితా! ఈరెంటిలో నేది బాగున్నదో చూడుము ?

లలిత—రెండును.

తులసి—అందులో ఏదో చెప్పుము ?

లలిత—[భర్తననురాగముగఁ జూచుచు] ఇది చాల ముద్దుగానున్నది వదినే!

తులసి—అయిన అదియే నీది. [అని లలితశిరముననుంచి తాను ధరించును.]

ముర—[భార్య ననురాగముగఁ జూచుచుండును.]

యజ్ఞం—మేక్-హేస్టు (makehaste).

మాధ—అయ్యా! మీ మిత్రుఁడు త్వరపడుచున్నాఁడు. ప్రయాణము సాగింపుఁడు.

యజ్ఞం—మాధవశర్మగారు ! మా వాడు చెప్పడానికి సందేహిస్తున్నాడు. మీ అమ్మాయికూడా కాస్త ఆంగ్లభాషాజ్ఞానం కలి

గించండి. కొన్ని ఫాషన్సు గీషన్సు నేర్పించండి. ముగుదలు, ముగుదలు అని మూలమూలల పాఱవేయక నలుగురులోకి పోనిస్తూ, రానిస్తూ ఉండండి. ఆటలు, పాటలు వగయిరా అన్ని హక్కులు ఇవ్వండి. సనాతన్లుకూడా పాతపద్ధతులు మఱచి నవయుగం, స్త్రీ స్వాతంత్ర్యం, స్వతంత్రరాజ్యం అని అనుకుంటూ ఉండండి.

మాధ:—[తీవ్రముగఁ జూచుచు శిరఃకంపము చేయును.]

రామ—అబ్బాయి! ఆదేశంలో స్వేచ్ఛగా తినటం స్వేచ్ఛగా తిరగటం ఎప్పుడు ఆడవాళ్లు మగవాళ్లు కలుస్తుండటం బట్టలుకూడా లేకుండా తిరిగేవారుంఛారష వారితో స్నేహాలుపట్టడం లేకుండా ఉండాలని మామగారి అభిప్రాయం; తెలిసిందా? బాగా చదువుకొని బాగా ప్యాసుకా, ఇంక పోదాంపద. బావగారు! అబ్బాయి జాగ్రత్తగా ఉంటాడు. మీరు విచారం పెట్టుకోకండి. రాధమ్మా! నీవేం సందేహించకమ్మా! అబ్బాయి! పద. బావగారు! సెలవు, ఉండండి. బండి తిప్పవోయ్!

యజ్ఞం—మామగారు! మీరెందుకండి బొంబాయికి? అదో పెద్దపట్నం. మీ స్నానాలు సంధ్యలు మీరు మీఛాందసం అంతా యెంత కష్టమండి! అబ్బబ్బ! పెద్దవాళ్ళకేం తెలియదండి. అందులో యింగ్లండంటే పెద్దపెద్ద దొరలు, లార్డులు, చక్రవర్తులు, అంతాఉండేచోటే. ఆలాంటి చోటికి వెళ్లే మీకుట్టాడిక,కూర్చోటం నిలుచోటం తినటం అబ్బ, మీకు చెప్పరాదెందులకు లెండి? ఆ ట్రాఫిఁగు ఆ డ్రిస్సింగు వగయిరా ఫాషన్లెన్నో చెప్పాలి. ఎంతో దర్జా నేర్వాలి. మీకేం తెలుస్తుందండి? మీసాలు, గడ్డాలు పెంచడం, విభూతి పూయటం, పంచాంగం కట్ట పట్టటం తప్ప. పంపించండి. నన్ను పంపించండి. మీవాడు స్టీమరు దిగేటప్పటికి ఎలా? చచ్చుచేన్లగారి కొడుకులాగనా? సీమదొరగారి కొడుకులాక్కనపడేలాగు తయారుచేస్తా?

మురహరి—నాన్నగారు! మీరెందుకులెండి? యజ్ఞాన్ని పంపించండి, సర్దాగా వెళ్తాం.

రామ—తాచెడ్డ కోతి వనమల్లా చెఱచినట్లు ఎంద తెందఱినో పాడు

చేసి యే చదువులేక యే వుద్యోగంలేక అక్కడా యిక్కడా చాకిరి చేసే వెఱ్ఱి వెంగళాయ; వీడితోడేమిటార్రి నీకు? నోట్లు అవ్వి జాగ్రత్తగా చూచుకోక్కర్లా?

యజ్ఞం—మామగారు! "సేవయా దీయతే కళా" అన్నారు పెద్దలు. ఆమాట వూరికే పోనియ్యకుండా ప్రయత్నంచేస్తున్నా. మీరంతా సెబాస్ అనేటట్టు కొద్దిరోజుల్లో, పెద్దవుద్యోగం సంపాదిస్తా చూడండి. దానికేంగాని నెంబర్లునోటుచేసి యెక్కడ పారేస్తే యేమండి? నోట్లెక్కడికి పోతయండి? నోట్లు ఇలా యిప్పించండి. మీరు సుఖంగా ఇంట్లో కూర్చోండి వెళ్ళండి. [అని జేబులు సర్దుకొనుచు నోటుబుక్కు చూచును.]

ముర—నాన్న! మీరుండండి మేం ఇద్దరం వెళ్తాంలెండి.

రామ—[దైన్యముగ] ప్రయాణమై వచ్చి నే నుండాల్సిందే? మంచి చెడ్డ చెప్పుకోక్కర్లా? కానీ పదండి రైలుదగ్గరకు పదండి చూద్దాం. బండి పోనియ్యవోయ్! [అని ముగ్వురు నిష్క్రమింతురు]

మాధ—[భార్యవంకఁ జూచి] అల్లుని స్థితి తెలిసినది. ఇంక లలిత యదృష్టమునుగూర్చి విచారింపవలసి యున్నది. లలితా! పోదము పద. [అని నిష్క్రమించుచుందురు.]

[తెరలో] అయ్యా, మాధవశర్మగా రెక్కడ?

అందఱు—[నిష్క్రమింతురు]

మాధ—[వెనుకకుఁ దిరిగి] ఎవరది?

భటుఁడు—[ప్రవేశించి] దండా లయ్యగారికి. మంత్రులవారి ఆజ్ఞ; దివాణంకాడికి తమరు దయచెయ్యాలంట.

మాధ—ఏమి పనికై యుండును?

భటు—నాకేం తెలియదండి. అయ్యగారు తొందరగా రావాలంట.

మాధ—మంచిది నడువుము, వచ్చెదను.

భటు—చిత్తం దండాలు. [నిష్క్రమించును]

మాధ—[యోజన నభినయించి] ఎంతకాలము క్రిందటనో యిల్లు విడిచిన కాళికాంబ సభాపతిసహాయమున శ్రీనగరాధీశ్వరులగు సుద

ర్శన ప్రభువుల మంత్రికడ నేదియో అర్జీపెట్టుకొన్నట్టు విందును; దానికొఱకుఁ గాదుకదా? కానిమ్ము, అధికారియాజ్ఞ యనుసరింపక తప్పదు. [నిష్క్రమించును]

[తాణాప్రాంతమునఁ గాళికాంబ సభాపతి సత్యనారాయణ ప్రవేశింతురు.]

కాళికాంబ—[సభాపతిని సమీపించి విచారముతో] సభాపతి బావ గారు! మాధవశర్మ యెంతపని చేశాడండి? తలుచుకుంటే గుండె తరుక్కొ-బోతుందండి ?

సభాపతి—కాళికాంబా! నీ సంగతంతా తెలిసిందే? నీవు వట్టి అమాయికురాలవు, ఏంచెయ్యను ?

కాళి—నా మర్యాదంతా మంటఁగలిపి నా గౌరవం గంగపాలుచేశాడే? నిజంగా ఒక్కతప్పు జరిగిందికాని పరువన్నా మర్యాదన్నా కాళమ్మదే అని అందరిచేత అనిపించుకున్న ముండనే? వంచినతల యెత్తకుండా గొడ్డులాగ చాకిరిచేసేముండనే? నన్ను వీడింత భజీతుచెయ్యాలె? వీణ్ణి పీడశాస్త్రిల్ని తగలెయ్య. [అనిమెటికలు విఱిచి] మరిదిగారూ! తప్పు మన్నించండీ అని కాళ్ళమీదబడి వేడుకుంటే వప్పుకున్నాడా? నా తండ్రియిచ్చిన ఆస్తి యిస్తానంటే అంగీకరించాడా? నీకుదాసినై పోతానంటే సమ్మతించాడా? నాపరువు నా మర్యాదా అంతా పాడుచేసి, నాకూ బంగారంలాంటి నా కొడుకు కృష్ణయ్యకు నా కోడలు తులసికి కాకుండాచేసి నన్ను మాలముండనుజేసి శృంగభంగంచేశాడే? నా యిల్లు నా వాకిలి నా గొడ్డు గోద నా అధికారంఅంతా దగ్ధపటలం చేశాడేవీడు? వీడి పాషాణహృదయం పీడు పాడుగాను. [అని మెటికలువిఱిచి దుఃఖమభినయించును.]

సభాపతి—ఇంతకు నీ తెలివితక్కువే కారణం. కాళికాంబా! ఇంట్లో ఉండి యేం చేస్తే యేం కాకపోయింది. చాటు మాటు లేకుండా పిల్లవాణ్ణి కూడ వదిలి ఇల్లువిడిచిపోవటమేం, దేశ దేశాలు తిరగడమేం, ఇన్నాళ్లదాకా రాకపోవటమేం?

కాళి—[కన్నులద్దుకొనుచు] అదే ఆ వొక్కటే నా తెలివితక్కువ

బావగారు! అయినా పుట్టింటికి పోగూడదా? బంధువులిండ్లకు పోగూడదా? అక్కలిండ్లకు చెల్లెళ్లయిండ్లకు పోగూడదా? తీర్థం సార్థం పోగూడదా? ఇంతకు ఆడదానికర్మం కాలిందండి. కన్ను విప్పరాదు. గడపదాటరాదు. మగవాళ్ళ కెన్నెన్ని పెళ్ళిళ్లైనా యెక్కడెక్కడ తిరిగినా ఏమేంచేసినా అనుకునేవాళ్లు లేరు. వారు పీ రేమిటి మీా మాట చెప్పండి? వైద్యపుసంచి మీారు చిన్న బజారు యింట్లోనేకాదండీ, రాత్రి పగలూ ఉండటం?

సభాపతి—[రిచ్చవడి నోరుతెఱచి] అబ్బ! లోకంజోలి నీ కెందుకు కాళికాంబా? ముందు నీ సంగతి నీవు విచారించు, రామచయను లను రాబట్టాను. మాటలసందులో మంత్రిగారితో నీమాటగట్టిగా చెప్పాను. కాళికాంబను మాధవశర్మగడపయెక్కించి మఱి పోతా నన్నాడు మంత్రిగారు; మంత్రిగార్ని కూడా కాస్త మంచిచేసుకో. సమయందాటితే సామాన్యంగా మాధవశర్మ మనకు చిక్కడు. ఇంక నీ యిష్టం.

కాళి—మాధవశర్మంటే చాలామన్నించే మంత్రిగారు మన మాట వింటాడంటావా?

సభా—అధికార్లమన్నన అరటియాకు. కొనపైని నీటిచుక్కవంటిది. అంతేకాకుండా జాగీరువారు శాస్త్రాల్ని ధర్మాల్ని మార్చి సర్వం ఏకం చెయ్యాలని చూస్తున్నారు.

కాళి—[సంతోషముతో] ఏమిటీ? సర్వము ఏకమే? ఆహా దేముడట్లా వారికి బుద్ధి పుట్టించాలె. లోకం బతకాలె. చెప్పండి బావగారు! పైన చెప్పండి [అని బతిమ లాడును]

సభా—మాధవశర్మను గూడా మంత్రిగారి విషయంలో మందలిస్తారు. ధర్మశాస్త్రాల్ని తల్లకిందు చేయిస్తారు. సర్వం ఏకమయ్యే ప్రయ త్నం సాగిస్తారు?

కాళి—బావగారు! నిజంగా మంత్రిగారింత లోకోపకారం చేస్తా రంటావా? ధర్మశాస్త్రాలనే గొందులు పూడ్చి అందర్నీ స్వేచ్ఛ అనే రాజమార్గంలో నడిపిస్తారంటావా?

సభా—మంత్రిగారిప్పుడు వచ్చిందే అందుకు. సభాపతుల్ని, కర్మిష్ఠుల్ని ఇంకా పెద్దపెద్దల్ని అడిగి అందఱి అభిప్రాయాలు తీసుకుంటారు. తప్పకుండా అందఱ్ని ఏకంచేసే ప్రియత్నంచేసి వెడతారు.

కాళీ—అయితే మాధవశర్మ బండపాషాణం కదా? కరుగుతుందంటావా?

సభా—అక్కడే సందేహం; నూరువిధాల మాధవశర్మ అంగీకరిస్తాడని నాకు తోచదు. అయినా యేమవుతుందో చూడాలి.

[తెరలో] పదండి పదండి మళ్లీవత్తాం పదండి. [అనుచుఁ బోవుచుందురు]

కాళీ—[చూచుట నభినయించి] బావగారు! మళ్లీవత్తాం పదండి అని గుంపులు గుంపులుగా పోతున్నారు వీ రెవ్వరు?

సభా—మన ప్రజల్నెఱగవు? ఏ పలుకుబడిగలవాడో యే మంత్రిగారో యేకొత్త మొఖమో వచ్చిందంటే అంతా తవ్వితలకెత్తుతారనివీళ్లాశ. శిస్తులు తగ్గించమని ఋణాలు తీయించమని భూములిప్పించ మని కోర్టులబాధలు తొలగించమని అవ్వని యివ్వని అడగటానికి పోయినారు.

కాళీ—అయితే యేమయినా వీళ్లకు లాభం కలుగుతున్నదా?

సభా—సర్కారువారికి దండుగలేనివి, ఖజానాకు లోటుగానివి, వారికి, వారిస్వజనమునకు లోపము కలుగనివి ఏమయినా వుంటే అగ్రహారాలు, ఈనాములు, ఋణాలు, పెండ్లిండ్లు, జాతిమతవిషయాలు అడిగినవన్ని ఊఁ ఆఁ అనకుండా మార్పుచెయ్యటానికేమి అభ్యంతరా ల్లేవు. [వినుట నభినయించి] సరేలే! మనగోడవలో మన మున్నాం, మాధవశర్మ, మంత్రిగారు ఏమో మాట్లాడుచునే యున్నారు. నీవటు రా. నే నిటు పోయెద.

కాళీ—బావగారు! ఏది యెలావున్నా నా అర్జీ, వాగ్మూలాలు, మహాజర్లు విచారణకు వచ్చేలాగు చెయ్యండి. ఆడదాన్ని కదా? మీ

కు కావలసినదాన్నికదా. కాస్తపుణ్యంకట్టుకోండి. మీకష్టంకూడా వృథా పోనియ్యను. చెయ్యండి. బాగా ప్రయత్నం చెయ్యండి.

సభా—సరేలే, పోదాంపద. [ఇరువురు నిష్క్రమింతురు.]

[రామపురాగ్రహారము : రాజమంత్రి గోపాలరావుగారి విడిదిగృహము. మాధవశర్మ, గోపాలరావు, సభాపతి సత్యనారాయణ, రామచయనులు మున్నగువారు కూర్చుండియుందురు.]

మాధవశర్మ—మంత్రిశేఖరా ! స్వోదరపోషణమాత్రోపజీవనులగు దుర్బలహృదయులకు బ్రాహ్మణ్యము, బ్రాహ్మణ ధర్మములు దుర్భరములు కావచ్చును. అన్యధర్మ మాశ్రయణీయముకావచ్చును. స్వధర్మరక్షణము సేయఁదలఁచువాఁ డెవ్వఁడేనిఁ గష్టముల కోర్చుకొనకపోఁడు. హృదయదౌర్బల్యమును వదలకపోఁడు. సత్యతపోనియమంబులఁ గాపాడుకొనకపోఁడు. కృతయుగధర్మబీజభూతుఁడగు నట్టివాఁ డొక్కరుఁడును లేకున్నఁ బాదమాత్రావశిష్టమగు ధర్మ మడుగంటి, కలినిర్మూలనసమర్థంబగు కృతయుగారంభము లేకపోవలసియే వచ్చును.

గోపాల—[సహేలముగ] ఏమి కలినిర్మూలనము! కృతయుగారంభమునా! వేదపఠనమును విడిచిన విప్రులు, అగ్నిహోత్రములను వదలిన యజ్వలు, భక్తిలేని హరిదాసులు, నియతిలేని యతులు, అర్థకామాతురులై యంతటఁ బ్రవర్తిల్లుచుండ, సత్యశౌచశమదమాదులఁ బురస్కరించుకొని, కలిమహారాజు నెదిరించు బ్రాహ్మణుల బ్రాహ్మణ్యముసైత మెల్లయెడల నామమాత్రావశిష్టమైయుండ, శూద్రసేవ, కాదు, చండాలసేవసైత మలభ్యమయ్యెనని ద్విజన్ము లల్లాడుచుండ, వారి శిరముల నురములఁ గరముల నెందును బరచిహ్నములు వ్యాపించి కలివిజయపతాక లంతట నెగురుచుండఁ బరుల భాష స్వభాషయై, అన్యధర్మ మాత్మధర్మమై, దాస్యమే మోక్షమై యంతటఁ గనువిం దొనరించుచుండ, కలివిభవమున కేమి వెలితి గలుగును? ఆ కలిమహారాజు స్వేచ్ఛ కేమి

యాటంకము కలుగును? కలినిర్మూలనము, కృతయుగారంభము యింకెట్లు కాఁగలుగును?

మాధవ—గోపాలరావుగారు! తాము చెప్పినదియే గాక కలినివాస స్థానములగు స్త్రీ, హింసా, ద్యూత, పానాదు లెంతయు నభివృద్ధి సెంది యాతని కెల్లయెడల విహారయోగ్యంబులై యలరారుఁగాక. ఆతని యనుచరులగు కామక్రోధాదులు సైతము స్తేయాసత్య వైరాదుల నెల్లదిక్కుల వ్యాపింపఁజేసి విజృంభింతురుగాక. కలి విజయచిహ్నంబులే యెల్లదిశల విరాజిల్లుఁగాక. భారతీయరక్తమున నంటుకొనియున్న ధర్మమునకు మాత్రము హాని కలుగనేరదు. వేదశాస్త్రాభ్యాస మలరక పోదు. విప్రపుంగవులు వెలయకపోరు, ధర్మోద్ధరణదీక్షితు లలరారకపోరు. వారు కలినోడింపకమానరు.

గోపాల—విక్రయమునకు వేదపఠనము, అగ్రపూజలకు యజ్ఞములు, పౌరోహిత్యపుకాసులకు యాజనములు చేయుచు బ్రాహ్మణులే కుక్షింభరులై ప్రవర్తించుచుండ ఇంకను ధర్మతత్పరత్వము, కలినోడించుట యునా? మీ కేల యీ యడియాస?

ఉ. భక్తి నశించి యోగములు ♦ భ్రష్టములై యజనాదిసత్క్రియల్
రిక్తములై తపోనియతి ♦ వీలి యథాయథలై ద్విజత్వ మే
శక్తియులేక యొత్తిగిల ♦ శాస్త్రము వేద మఁటంచు వట్టి యా
సక్తి యిదేల యూషరము ♦ సాగొనరింప ఫలింప నేర్చునే?

శర్మగారు! ఛాందసులు చాదస్తులనియెడునపకీర్తికి భాజనముకాక ధర్మశాస్త్రములయం దవసరములైన మార్పులఁ జేయుటకు మీరు కూడ కృతనిశ్చయులై పండితులు సయితము విశాలహృదయు లను కీర్తి కాకరము కండు.

సభాపతి—మాధవ శర్మగారు! పంతులుగారు ధర్మప్రభువులు. అన్నీ తెలిసినవారు. వారిచిత్తానుసారం పోవుట మనకు చాలాక్షేమము.

మాధ—పంతులుగారు! టంకము కలిసిన బంగారము వన్నెకుఁ దగ్గును గాని యిత్తడి మాత్రము కాఁజాలదు. తాము చెప్పినట్టు రాజాదరణము లేక బ్రాహ్మణు లుదరపోషణకై వేదవిక్రయాదు లొన

రించుచున్నను, అగ్రతాంబూలము లొసంగుచున్నను, సేవాశ్రయ మొనర్చుచున్నను, నిఖిల దేశాగ్రగణ్యమగు నీ యార్యావర్తమున కెల్లఁ బ్రాణభూతములై, యిహపరవిజ్ఞానసాధకములగు వేదశాస్త్రములమఱవక నియమవంతులై ధర్మానుష్ఠానతత్పరులగు కొందఱు ఛాందసులే భారతీయధర్మములకెల్ల బీజప్రాయులగుచుందురని తలంపుఁడు.

గోపా—మాధవశర్మగారు! పండితులు వాక్శూరులు, యుక్తికిఁ దీసిపోనేరరు. చుట్టుప్రక్కలచెట్లసహాయము లేనప్పుడొక్కచెట్టు నిలువనేరదు. "మహాజనో యేన గత స్స పంథాః" బహుజనులు నడచునదియే మార్గము.

సభాపతి—నిజము, పంతులుగారు చెప్పినమాట సత్యము.

రామ—సత్యమేమిటి? సాక్షాత్తు వేదవాక్యమే.

గోపా—ఇంతియకాక నిజము విచారించిన మీ బంధువులలో మీ మిత్రులలో ఖండాంతరగతులు, మద్యమాంసభక్షకులు, స్త్రీపురుష విక్రేతలు ఎందఱోయుండి యుందురు. ఇంకను మీరు కనువిప్పిన మీకుటుంబములోనివారే యెందఱెందఱో పంక్తిబాహ్యులుందురు. ఇట్టిసమ్మర్దకాలమున మీరు మీ నియమంబులఁ గాపాడనేరరు. వాక్శూరత మాత్రము మిగిలి హాస్యాస్పదులు కాకుందురు గాక, యని ప్రార్థించుచున్నాను.

రామ—పంతులుగారు! అంతమాట అనకండి. బావగారు! అధికారుల యనుగ్రహం పోగొట్టుకోకండి.

సభా—శర్మగారు! మీ అల్లుడుకూడా విదేశాలకు పోయినాడుకదా? శాస్త్రాలు, నియమాలు పుస్తకాల్లో ఉంటయి. మనకేం తప్పుతుంది? వినండి పంతులుగారిమాట వినండి. మా మాటకూడా త్రోసివేయకండి.

మాధ--మంత్రివర్యా! శాఖోపశాఖా శోభితంబగు నెడారిమట్టి, ఊడలను పాదములచే దూరదూరము నడుచుచు నన్యుల కుపకరించును గాని యన్యసహాయము కోరనేరదు. తొమ్మిదవ యొక్కమువలె సజ్జన

ప్రకృతి యెన్నఁటికిని మార్పుఁజెంద నేరదు. గడ్డికప్పుకొనియున్న కాలిబాటలువోలెఁ బ్రచ్ఛన్నములుగ నుండును గాని కర్మ, భక్తి, యోగము, తపస్సు మున్నగు మోక్షమార్గము లెన్నటికి నశింప నేరవు. నాకుటుంబము పంక్తిబాహ్యమగుఁగాక! నా బంధుమిత్రులు నన్నుఁ బరిహసింతురుగాక! సుశిక్షితాశ్వములు సారథికివలెనే నాశరీరేంద్రియములు నాకు వశ్యములై యున్నంతవఱకు వేదశాస్త్రములఁ గాదని జ్ఞానతపోయోగసిద్ధులగు ఋషులనాఁటనుండి వచ్చెడు ధర్మమునకు మాత్రము హానిఁజేయఁజాలను. పాపమున కొడిగట్టనేరను.

గోపా—ఎవ్వరికిని నేమియుఁ దెలియక బ్రహ్మాండమంత యిందే యున్నదని చెప్పుకొనుచుఁ బనిపాటలులేని బ్రాహ్మణులు వల్లించిన వేదము లాదరణీయములు, ఆకాలమున నెవ్వరో వ్రాసినదొక శాస్త్రము, దానిననుసరించి చేయునవి ధర్మములు, వానిని మార్చిన మహాపాపమునా? కానిమ్మీ యభిమాన మెంతవఱకుండునో విచారించెద. [అని కోపముతోఁ జూచును.]

రామ—[జనాంతికముగ] బావగారు! మనక్షేమం విచారిస్తు మన ల్నెక్కువగా ఆదరిస్తూవుండే మంత్రిగారికి కోపం రానీయకండి. కాస్త మేంచెప్పినట్టువినండి. పుట్టింటికిపోయి వచ్చానంటుంది. కాస్త కాళమ్మను కరుణించి పంతులుగారిమాట విన్నారంటే, మంత్రులు ప్రభువులుకూడా మిమ్మెక్కువ గౌరవిస్తారు. మీ కవిత్వాన్నికూడా బాగా ఆదరిస్తారు. ప్రత్యేకంకాలువ యిప్పించి మీ అగ్రహారంసగం రేపీపాటికి సాగుచేయిస్తారు. వినండి. నామాట వినండి.

సభాపతి— శర్మగారు! ఇవి మీ మడిమాన్యాలు వస్తువాహనాలు వదలటంకాదు. పంతులుగారి స్వవిషయంగాదు. ధర్మశాస్త్రాలు మార్చటమంటే దేశకల్యాణంకొఱకు చేసేపని. సుదర్శన ప్రభువుల వారికూడా యిష్టమైనపని. అంగీకరించండి, సంతోషంతో అంగీకరించండి.

మాధ—చయనులుగారు! సభాపతిగారు! పంతులుగారు! సామాన్యుఁడగు నొక నరపాలుని యాజ్ఞకుఁ బ్రజలెల్లరు బద్ధులుకావలయునే?

ఒక చక్రవర్తిశాసనమునకు లోకమంతయు వడఁకిపోవలయునే ? సకలచరాచరసృష్టిస్థితి లయకారణభూతుఁడై చతుర్దశభువనములఁ బరిపాలించు పరమేశ్వరుని యాజ్ఞారూపమై, నిఖిల జగదుద్ధరణ హేతువులగు ధర్మములకెల్ల నాధారమై విజ్ఞానవిభవ విరాజితమై మోక్షదాయకమై యెల్లవారికి మాతృస్థాన మనఁదగిన వేదమును దిరస్కరింపఁబూనుట, ఉలూకములు లోకబాంధవుని బంధురారుణ కాంతిపుంజమును నిందించువిధముకాకపోవునా ? ఎన్నఁడేని భరత దేశమున ధర్మము భంగపడనేర్చునా ?

సీ. మాఱిన మాఱనీ ♦ మతములు యుగములు
వేదముల్ మాఱునే ♦ విలయమైనఁ
జెడినను జెడనిమ్ము ♦ శిష్టకులంబులు
ధర్మబీజంబులు ♦ దగ్ధమగునె
వీడిన వీడనీ ♦ విప్రు లాచారంబు
శమదమసంపత్తి ♦ సమయఁగలదె
సోలిన సోలనీ ♦ సుదతులచిత్తముల్
పరమపాతివ్రత్య ♦ పథము చెడునె
గీ. కామముఖ మిత్రులం గూడి ♦ కడలఁ బ్రాఁకి
యల్ల కవిరాజు తా నుల్ల♦సిల్లుఁగాక
నివురు గప్పిన నిప్పు నా ♦ నెగడుచుండి
కడఁగి ధర్మంబు కలివిభుఁ ♦ గాల్పకున్నె.

అయ్యలారా ! ఒక్కయధికారి, ఒక్కపండితుఁడు, ఒక్కబంధువుఁడు, ఒక్కమిత్రుఁడు, అవసరమునుబట్టి యొక్కొక్కఁడొక్కొక్క ధర్మమును వదలు మన్న వదలవలయునా? ఇతరుల కోపతాపములకు వెఱచి యిట్లే సర్వధర్మములను వదలిన సకలదేశప్రశస్తినిఁ గన్న యీ భరతఖండము, ద్వారములు తెఱచిన యిల్లు చందమున నొక్కపెట్టున ధర్మపరిభ్రష్టము కాకపోవునా? ఇయ్యది ప్రాజ్ఞలోక మొప్పుకొననేరదు. నే నంగీకరింపఁ జాలను.

గోపా—మాధవశర్మగారు! ఎవరును ఏనియమములను బాటింపక వేద

ములు శాస్త్రములు విధు లుండవలెనన్న విశ్వసించువా రెవ్వరు నుం డరు. బ్రాహ్మణులు ప్రభుత్వముచేయుకాలమింక రా నేరదు. ఏల కంఠశోషణము? సనాతన ధర్మ మను దురాశవదలి మీరు కూడ అందఱి కనుకూలముగఁ బ్రవర్తింపుఁడు. అదియే మీకు సకలశ్రేయ ములను గూర్చును.

మాధ—గోపాలరావుగారు! ఎవరును విధిమార్గముననుసరించుట లేదని శ్రుతిస్మృతి రూపమగు భగవదాజ్ఞ యంతరించుననియా మీయభి ప్రాయము?

గోపా—ఔను, సందేహమేమి?

మాధ—పైత్యరోగికిఁ బంచదార చేఁదైనట్లు కేవల పరవ్యామోహ దృష్టిగలవారికి స్వజాతి, స్వమతము, స్వధర్మము విపరీతముగఁ గనఁబడుటలో వింత యుండదు. వెనుకటివలె ధర్మతత్పరు లధిక సంఖ్యాకులు లేకున్న లేకుందురుగాక, యల్పసంఖ్యాకులైనఁ గలుగక పోరు. వారలే యార్యవిజ్ఞాన బీజప్రాయులై లోకోద్ధారకులు కాక పోరు.

గోపా—ఆరోగ్యమున్నప్పుడే యడుగిడ లేనివాఁడు, జాడ్యగ్రస్తుఁడై యేమి సాధింపఁగలఁడు? మీయల్పసంఖ్యాకు లేమిచేయఁగలరు?

మాధ—బుద్ధిబలముగల మీబోంట్లమాత్య శేఖరులైనట్లు, ఆర్యవిజ్ఞాన సంపన్నులు, ధర్మబలమున జగదుద్ధరణకార్యధురీణులు కాఁ గలరు. సమర్థులగు సేనాపతులకు సైనికులువోలె ధర్మరక్షణ తత్పరులకు లోకము స్వాధీనము కాకపోదు. ధర్మమువిస్తరిల్లకపోదు. ఇంతియే గాక, ప్రజలకు వైద్యసహాయమునఁ జికిత్సలు చేయించుచున్నట్లు ధర్మబలవిరహితులగు ప్రజలను విజ్ఞానబల సంపన్నులఁ జేయుట దేశ హితాభిలాషులగు రాజమంత్రుల కర్తవ్యము. వారికర్తవ్యమును వారు నెఱవేర్పకున్న ప్రభువులు ప్రభుపదవాచ్యులు, ప్రధానులు ప్రధాన పదవాచ్యులు కారనితలంచి ప్రజలే ప్రజాహిత ధర్మకార్య రక్షణకుఁ గడంగవలసి వచ్చును.

గోపా—[కోపముతో] ఏమి, ప్రభుప్రధానులఁ గాదని ప్రజలే ప్రజాహితకార్యములకుఁ బూనుకొనెదరుగా?

మాధ—ఇందుఁ గ్రొత్తయేమున్నది? ధర్మవిముఖులై భూనాథులు వేనాదుల స్మరింపఁజేయుచున్నప్పుడు, ప్రజలు స్వసామర్థ్యమున ధర్మరక్షణము చేసికొనుట కేల ప్రయత్నింపరు?

గోపా—మాధవశర్మగారు! నామమాత్రబ్రాహ్మణులలోఁ గొంచె మధికుఁడవని యెంచి నిమ్మడుగుచున్నందులకు, మీమాటలు మేర మీఱుచున్నవి. కాళికాంబను గడపదాటించి యజ్ఞుఁడగు కృష్ణశర్మ నదిమిపెట్టి యగ్రహారమంతయు నధీనమందున్న దనియేనా యీయలక్ష్యము? ఈనామములు అగ్రహారములు ఎప్పుడు పుట్టెనో విచారింపుఁడని విచారణయగువఱకు, వాని నాస్థానాధీనములో నుంపుఁడని చేసిన జాగీరుశాసన మెఱుంగరు కాఁబోలును? అధిపతుల యాజ్ఞఁ దిరస్కరించి యగ్రహార మనుభవించుట సుకరముకాదు. అర్థాసక్తి విరహితులై ప్రజాసంబంధవిముఖులై రాజాదరణశూన్యులై నదీనదముల నీరుఁగ్రోలుచు నడవులఁ గొండల నుండఁదలఁచినచో సనాతనులు కావలసినంత వేదశాస్త్రాభిమానమును జూపవచ్చును. ఇష్టము వచ్చినట్లు ధర్మశాస్త్రముల బిగింపవచ్చును. కానియియ్యది రాజముఖము. విచారించి ప్రత్యుత్తర మొసంగుఁడు.

మాధ—గోపాలరావుగారు! మిరియము లెంత పుచ్చినను జొన్నలకు సరిగాక మానవు. ఎట్టిపను లాచరించుచున్నను ద్విజనాముఁ డెవ్వఁడైనను శిఖాయజ్ఞోపవీతములు వదలక యొక్కమాఱు గాయత్రి నుచ్చరించుచున్నను వాని ద్విజత్వము నిర్జీవము కానేరదు; బ్రాహ్మణమాత్రుఁ డెవ్వఁడైనను ధనవిరహితుఁడై నగరములు గ్రామములు వదలి వాని పూర్వావాసములగు నడవులఁ గొండల నుండు పుణ్యమునే పొందిన నాతఁడు పవిత్రచరిత్రుఁడై యపర బ్రహ్మలగు వసిష్ఠాదుల స్మరింపఁ జేయకుండునా? మహారాజులుసైత మెందఱెందఱో రాజ్యవైభవముల వీడి విజ్ఞానసంపన్నులై వనవాసమునఁ గృతార్థులై యుండ ధర్మగౌరవానభిజ్ఞుల యాదరణమే

గాదు సాన్నిధ్యముకూడ లేక నా కావనవాసమే కాదు, నదీతీర ములుఁ గొండలు గుహలు లభించినను నేను విచార మంద నేరను. ఆహా! ఏమి యీయరణ్య వాసఫలము!

సీ. స్వర్గ మేలఁగఁజాలు ♦ జన్నముల్ సలుపుట
పుణ్యానదీతీర♦భూమిఁగాదె!
విబుధనాథుల కేని ♦ వెఱపుఁగొల్పెడు తపో
ధనులాట వనవాస♦మునను గాదె!
భోగముల్ విడి యాత్మ♦యోగంబు గను యోగు
లుండుట గొండల♦దండఁగాదె!
పరుల వేఁడక బ్రహ్మ♦పరత వెల్గుచునుంట
ఫలరసభోజన♦కలనఁగాదె!
గీ. వైభవమడంగ విప్రుండు ♦ వనుల గుహలఁ
గాఁపుర మొనర్చు భాగ్యంబు ♦ గాంచెనేని
భూమినోకఁడేల సురలకై ♦ మోడ్పులంది
హరిహరారాధ్యమౌ పదం ♦ బంద కున్నె?

కావున నా నిశ్చితాభిప్రాయ మాకర్ణింపుఁడు.

చ. కలిమి నశించుఁగాక గిరి♦కందరసీమల నుండుఁగాక నన్
గలఁతురుగాక దుర్మతులు ♦ గల్గెడుఁగాక విపత్పరంపరల్
వెలసెడు ధర్మశాస్త్రముల ♦ వేఱువిధంబుగ మార్పఁజాల నేఁ
బలుకఁగఁజాల నానిగమ♦పంక్తులకున్ వికృతార్థ మెన్నఁడున్.

కావున మీయిష్టానుసారము వేదశాస్త్రముల మార్పఁజాల నందులకుఁ గాళికాంబవిషయమై కరుణకలిగి ప్రవర్తింపనందులకు నన్ను మన్నింపఁ బ్రార్థించుచున్నాను.

గోపాల— శర్మగారు! ఇదియే నిశ్చయమా?

మాధవ—ముమ్మాటికి.

గోపాల—[మాధవశర్మను దీవ్రముగఁజూచి] బ్రాహ్మణోత్తములారా! కర్మశ్రేష్ఠులారా!

అందఱు—అయ్యా! అయ్యా! [అనుచు సమీపింతురు.]

గోపాల—మీరు, మేము కలిసినఁ గాళికాంబనేమి, వేదశాస్త్రముల నేమి, ధర్మమును, దైవమునుగూడ మార్పఁగలము.

మాధ—[ఆశ్చర్యముతోఁ జూచును.]

రామ—చిత్రం, మహామంత్రులు! తమకసాధ్యమేమిటి?

సభా—సర్వసమర్థులు! తమ సంకల్పానికి లోపమేమిటి?

గోపాల—మాధవశర్మగారు! జాగీరులోని పండితు లని ప్రత్యేకించి మిమ్మడిగితిని, కాని యింక రాజకీయముగ నడుగుచున్నాను, ప్రత్యుత్తరము చెప్పవలె.

మాధవ—ఆజ్ఞకు బద్ధుఁడను. [లేచి నిలువఁబడును]

రామ—[నివ్వెఱపడును.]

సభాపతి—[సంతోష మభినయించును.]

గోపాల—మీ యన్నగారిభార్య, కాళికాంబ జాగీరువారికి అర్జీ పెట్టుకొనినది. దానిపైఁ గొంత విచారణమైనది. ఆవిషయమై మిమ్మడుగు చున్నాను.

మాధవ—చిత్తము.

గోపాల—[కాకితములు తీసి చూచుచు, వ్రాయుట నభినయించుచు] మాధవశర్మగారు! కాళికాంబ మీ యన్నగారి భార్యయా?

మాధవ—ఔను.

గోపాల—కృష్ణశర్మ మీయన్నగారి కుమారుఁడేనా?

మాధవ—అవును.

గోపాల—మీ కుటుంబము విభక్తమైనదా?

మాధవ—లేదు.

గోపాల—మీ కుటుంబపు ఆస్తి యంతయు మీ యధీనమందే యున్నదా?

మాధవ—ఆఁ.

గోపాల—కృష్ణశర్మ దేశాటనము చేయుచున్నాఁడా?

మాధ—విద్యాభ్యాసముచేయుచున్నాఁడు.

గోపాల—ఆంగ్లవిద్యయేనా?

మాధ—కాదు; వేదము, తర్క-వ్యాకరణములు చదివి, వేదాంతము మొదలగునవి చదువఁబోయినాఁడు.

గోపా—ఎక్కడకు?

మాధ—'ఋషికుల'మను గురుకులమునకు.

గోపా—అదియెక్కడ?

మాధ—హరిద్వారముకడ.

గోపా—ఆతనిచదువునకు మీరెంతద్రవ్యమును వ్యయముచేసినారు?

మాధ—బాల్యమునుండి యిప్పటివఱకు దాదాపు వందరూప్యములై యుండును.

గోపా—అతిదరిద్రులుకూడ బాలుర కాంగ్లవిద్య చెప్పి[illegible]నుచుండఁ బండితులై ధనికులై యగ్రహారికులైన మీరాతని[illegible]నేఁ చిపుచ్చుటకుఁగాక, వేదశాస్త్రములకేమి విలువగలదని చెప్పించితిరి?

మాధ—అమరులకు సైతమందరాని యాత్మజ్ఞానసంపద నాతఁడనుభవించునని, లోకము ననుభవింపఁజేయు నని, మానవజన్మసాఫల్యమున కివియే ముఖ్యసాధనములని.

గోపా—ఇవి యనుభవమునకు రానిమాటలు. ఇంత పరిశ్రమము బాలకుఁడాంగ్లమునఁజేసిన నెన్నిపరీక్షలలోనో కృతార్థుఁడై యున్నత పదవి కర్హుఁడై యుండెడివాఁడు, వానిజీవితమంతయు వ్యర్థము చేసినారు.

రామ—అయ్యో! చెప్పానండి బావగారికి, చాలా చెప్పానండి, నామాట వినక, పిల్లవాణ్ణి చేతులార చెడగొట్టాడండి.

గోపా—[తీవ్రముగఁజూచి] మీరు తెలివిగలపనిఁజేసినారు? ఋమ్మడు గుట లే దూరకొనుఁడు.

రామ—చిత్తము అలాగేనండి.

మాధ—ఈ విద్యలు కుక్షిసాధనములు. ఈ పదములన్నియు కుపదములు. మానవుఁడు పొందఁదగినది మోక్షము, [illegible]గినది విజ్ఞానము. దానికి వేదశాస్త్రములు, ఆర్షసంప్రదాయములు తప్ప అన్యములు సాధనములు కానేరవు.

గోపా—అయిన నాంగ్లకళాశాల లన్నియు వ్యర్థము లందురా ?

మాధ—ఇవియన్నియు మానవజీవిత పరమార్థము నడంచి మనుజుల నెల్లర నౌకరకపు దాస్యపు బొమ్మలుగ మార్చుయంత్రరాజములు.

గోపా—అయినఁ బనివడి మీరేల యాంగ్లము నభ్యసించితిరి?

మాధవ—జీవికకొఱకుఁగాదు, ఆంగ్లవాసనగల లోకముయొక్క తూనికను దెలిసికొనుటకొఱకు.

గోపా—[శిరఃకంపముచేసి] అటులనా! సరియే! కృష్ణశర్మఆస్తి కృష్ణశర్మ కిచ్చుట కభ్యంతర ముండునా?

మాధవ—కృష్ణశర్మఆస్తియేమి, మాకుటుంబమునంగల స్థిరచరాస్తుల కంతటి కాతఁడే కర్త. అతనిమూలముననే మావంశాభివృద్ధి నభిలషించుచున్నాము.

గోపాల—ఇయ్యదినిక్కమా ?

మాధవ—నా నాలుక యసత్యమున కాశ్రయము కాఁజాలదు.

గోపాల—మంచిది. కాళికాంబ మీ యింట నున్నదా ?

మాధవ—[తలవంచుకొని నిట్టూర్చుచు] లేదు.

గోపాల—ఆమెనింట నుంచుకొనుటకు మీరేల యంగీకరింపరు ?

మాధవ—[శిరమువంచుకొని] కారణమున్నది.

గోపాల—చెప్పుదురా ?

మాధవశర్మ—చెప్పఁజాలను.

గోపాల—మీపక్షమున సాక్ష్యమునిప్పించెదరా?

మాధవ—ఆయత్నమును జేయఁజాలను.

గోపాల—కాళికాంబఅర్జీ వాజ్మూలమేగాక, యామె కలుషవిరహిత యని రామచయనులుగారు మొదలగు మీబంధువు లిచ్చిన కయిఫియతులును, పలువురు పంపినమహాజరులును మాకడకు వచ్చినవి. ఆమెనింట నుంచుకొనుటకు మీరనుమతింతురని నమ్ముచున్నాను.

మాధవశర్మ—కలయిక యసంభవము. వలయునన్న ఆమెకు అన్న వస్త్రముల కిచ్చెద.

గోపాల—కాళికాంబకుఁ బుట్టింటియాస్తికలదఁట. అదికూడ మీకిచ్చి మీమర్యాశ్రయించి యుండునఁట. ఇంకను సుఖముగఁగాలము గడుప వచ్చును. యోజింపుఁడు.

మాధవశర్మ—ఆమెయాశ్రయమువలదు. ఆ స్త్రీయు వలదు.

గోపాల—శర్మగారు! ఇయ్యదిరాజకీయము. [కాకితములఁజూపి] ఇవి మీబంధుమిత్రుల వాజ్మూలములు. ఇవిమహాజరులు. వీనినాస్థాన మూరకతోసివేయ నేరదు. ప్రకృతిసంబంధమునఁ బ్రభువులుకూడ అస్వతంత్రులు.

మాధవ—మంత్రిశేఖరా! ప్రభువు లేమి? పరమేశ్వరుఁడుకూడ ప్రకృతి సంబంధమున నే యస్వతంత్రుఁడు.

గోపా—[శిరఃకంపము చేయుచు] అదియటులుండనిండు. అనాథశరణా లయములు, అబలా స్వాతంత్ర్యకూటములు వెలువడు నీకాలమున నీయింటఁబడిన యొక్క యబల యనాథయై, యగతికయై విలపించు చుండ అనేకులామె నంగీకరింపవచ్చునని చెప్పుచుండ మీ రామె కాశ్రయ మిప్పింపకుండుట యుక్తముకాదు.

మాధవ—ఏమైనం గానిండు, ధర్మభంగము సేయఁజాలను.

గోపాల—శర్మగారు! అన్యధర్మము లాస్థానధర్మము నతిక్రమింపవు. కృష్ణశర్మవచ్చువఱకు మీపక్షమున సంపూర్ణమైన సాక్ష్యము వచ్చు వఱకు సమష్టిగానున్న యగ్రహారద్రవ్యమాస్థానములో నుండవలసి వచ్చును. అగ్రహారపు విచారణకూడ అప్పుడే చేసెదము. ఎప్పుడీ యగ్రహారము పుట్టినది, యెందులకుఁబుట్టినది, సనదులు దుంబాలాలు తీసికొని రావలయును.అన్నమాట లాచరణకు వచ్చునప్పుడు కష్టము కలుగకపోదు. కాలుకదల్పక కాలముగడుపు పండితులు. విచారించి ప్రత్యుత్తర మొసంగుఁడు.

మాధవ—మంత్రివర్యా! అగ్రహార మాస్థాన మాక్రమించునని కుల శీలములఁ గూలఁ ద్రోసికొన నేరను. స్వర్గమునుగూడ జాఱవిడచు బ్రాహ్మణకుల సంజాతుండనై, మడిమాన్యములుపోయిన మనస్తాప మందుదునా? చూచి చూచి ధర్మహానిఁ జేయఁజాలను. ఏమైనను

కాళికాంబతోఁ గలయిక యసంభవము. ఇంక మీ చిత్తానుసార మొనర్పుఁడు.

గోపా—అగ్రహారము పోయినను అంతస్తాపముండదా? కానిండు. శర్మ గారు! మీరు సరియగు సాక్ష్యమును దెచ్చుకొనువఱకు మీ యగ్ర హార మాస్థానాధీనములో నుండును. [జప్తు ఆర్డరు వ్రాయుట నభినయించును.]

మాధ—[నిట్టూర్చి] మంత్రిశేఖరా! అగ్రహారమును జప్తుగావించితిరా?

గోపాల—అవును.

మాధ—అయిన నా సంకెల లూడినట్లగును. నే నింక ధన్యుఁడను గాఁగలను.

గోపా—[ఆశ్చర్యముతో] శర్మగారు! బ్రాహ్మణుఁడు ముట్టిన మన్ను బంగార మగునా? పండితుల చేతిలోఁ బరుసవేది యుండునా? ఏ మా ధన్యత?

మాధ—రాజులిచ్చిన యగ్రహారాదులచే రాజాన్నమునుదిని రాజసులై, యన్యాశ్రయమునఁ దదన్నమును దిని తమఃప్రధానులై యధో గతికిఁ బోవుచున్న బ్రాహ్మణుల బ్రాహ్మణ్యశుద్ధికి ధనహీనతకంటె వేఱొండుత్తమసాధనములేదు. అదియే నాధన్యతకుఁ గారణము.

గోపా—అటులనా? అయినఁ గుటుంబపోషణము శరీరపోషణముకూడ వలదందురా?

మాధ—అందులకే కాదు, సకల పురుషార్థములను సాధించుకొనుటకుఁ గూడ సాధనమైన ధనము నా కున్నది.

గోపా—ఏమాధనము?

మాధ—ఎనిమిదవయేఁట ఆచార్యుల యెదుట, అఖిల బంధుమిత్రుల యెదుటఁ దలిదండ్రు లతిప్రీతిచేఁ బెట్టిన ధనము, తరతరములనుండి వచ్చెడి ధనము, భైక్షధనము!

గోపా—[పరిహాసముగ] మాధవశర్మగారు! బ్రాహ్మణులందఱు జోలెఁ గట్టుకొనియేనా, పొట్ట నింపుకొన వలసినది? ఇదియేనా, వారి ధర్మము?

మాధ—అయ్యా! స్వధర్మమును వీడక కృషివాణిజ్యాదుల మూలమున బ్రాహ్మణులు కుటుంబ పోషణము చేసికొనవచ్చును. పనికిమాలిన పారతంత్ర్యమునఁ బ్రవర్తించుటకంటె నివియెంతయు యుక్తము లైనవి; విప్రులకు విహితములైనవి. నా యొనర్చిన విద్యోపాసనము లోకమున కుపయోగింపనెంచి ధర్మలాభముల మఱచిన దేశీయ సోదరుల నుద్బోధింపఁ దలంచి నే నితర వృత్తుల నపేక్షింపక యీ భైక్ష ధనము నపేక్షించుచున్నాను.

గోపా—మాధవశర్మగారు! సుఖ సుఖంబుగనుండి ప్రజలకుఁ బ్రభువు లకుఁ గాని పనులకేల తలయొగ్గెదరు? ఏల కష్ట మనుభవించెదరు? మా యిష్టానుసారము ప్రవర్తింపుఁడు. ఎనలేనికీర్తిప్రతిష్ఠలతో నానంద మనుభవించు చుండఁగలరు.

మాధ—నాకు నా జాతికి నా దేశీయసోదరులకేగాక నా యీ దేశమాతకు నయితము ప్రాణతుల్యమగు ధర్మ మణఁగఁద్రొక్కుచు నన్నెంత పైకెక్కింపఁ జూచుచున్నారు? మంత్రివర్యా! పశుపక్ష్యాదుల కంటె మానవుఁడనైన నే నెక్కుఁడని, నేను జేయవలసినది సంసార తరణ మని అందుల కనుష్ఠింప వలసినది ధర్మమని నాకుఁ బరమ పురుషార్థము మోక్షమని తలంచు నేనేకాదు. ప్రతి భారతీయ వ్యక్తియు ధర్మజీవితము వదలి కేవల జీవచ్ఛవ గౌరవాలంకరణమున కంగీకరింప నేరఁడు. వివేకముగలవా రెవ్వరైనను గష్టసాధ్య మైనను సత్కార్మా చరణమున సాధు శీలురై యున్నతపదవి నందుదురే గాని, సులభ సాధ్యమని జనసామాన్యమున మెప్పు కొన నగునని నింద్యకర్మలకుఁ దలయొగ్గి ధర్మదూరులై యాతనలకుఁ బాల్పడ నేరరు. ధర్మనాశన ప్రయత్నములు భయంకరములై యగ్నిజ్వాలల వలె నలుదెసలఁ గ్రమ్ముకొని వచ్చుచుండ, ఐహిక సుఖాశచే ధర్మ విముఖులగు నేత లమాయికమగు ప్రజాసామాన్యమును వంచించు చుండఁ బరమేష్ఠిచే లోకహితముకై సృజింపఁ బడితినని యెఱింగిన బ్రాహ్మణ జాతీయుఁ డెవ్వఁడును మతిమాలినవాని వడువున నుపేక్షింపనేరఁడు. మీ యాదరమను బంగారుసంకెలలతో నేను బం

ధింపఁబడఁజాలను. ధర్మమార్గమున లోకమును నడిపింపఁదగిన మహామంత్రులే ధర్మవినాశనమున కింతటి తీవ్రప్రయత్న మొన రించుచుండ, నింక నితరుల నేమనవలయునో తెలియనేరను. ఇట్లొన రించుచుఁ గష్టమందుమనని నన్నారడింపఁ దలంచుట, నిప్పులలో నడిపించుచుఁ బైన గొడుగుపట్టించు విధము కాకమానదు. మేడపైనుండి క్రిందికిఁ ద్రోయుచుఁ బీఠ మొసంగిన నెవ్వఁడు స్తిమితముగఁ గూర్చుండనేర్చును? సర్వదేశోన్నతిని గడించిన భారతీయ జాతిమత ధర్మౌన్నత్యమును హరించి మమ్ము మనుష్య కీటకములఁ గావింపఁదలఁచుటకంటె మాకును మా దేశమునకును వేఱొక హాని కలుగనేరదు.

ఉ. విష్టపసౌఖ్యముల్ గని త్రి♦విష్టపమేన్ గొనఁజాలు ధర్మముల్
భ్రష్టమొనర్చుచుండ నర♦పాలురు మంత్రులు దేశనాయకుల్,
గష్టముగాఁగ వేఱొకఁడు ♦ గల్గునె? భారతదేశవాసు లీ
నష్టము నోర్తురే యసువి♦నాశన మింతటి బాధఁ గూర్చునే?

ఇంతయేల? వేదశాస్త్రముల నమ్మక యార్యావర్తమునం దాదరములేక, ధర్మభంగము సేయఁదలఁచువారు మంత్రులేకాదు, మహారాజులైనను మరియెవ్వరైనను, అట్టివారిని మేము మన్నింపనేరము. వారికడనుండనోర్వము. మంత్రిశేఖరా! ప్రభువుల కసంతృప్తిపోలె ద్విజులకు సంతృప్తియే యలంకారము. ఏకోరికలులేక శరీరపోషణమునకుఁ దృప్తిపడు బ్రాహ్మణునకు రాజాధిరాజులే కాదు, ఇంద్రాదులుకూడ సరిపోలరు.

శా. ఏలా? సంపదలేల భోగనిచయం? ♦ బేలా మహౌన్నత్య? మీ
లీలల్ చంచలలట్లు చంచలములై ♦ క్లేశంబులం గూర్పవే
యాలాపించుచుఁ "గృష్ణ! కృష్ణ!" యని లో♦కారాధనంజేయఁగా
జోలెంబోలు ధనంబొకండుగలదే ♦ చూడంగ నాకియ్యెడన్.

కావున భిక్షావృత్తి నవలంబించి దేశసేవఁజేయఁదలఁచిన నన్నధికార సత్వములచేఁ జిత్రవధఁ గావింపఁబడకుండఁ జేసి యగ్రహారపు శాసనముచే నా యగ్రహార మన్యులపాలుగాకుండ నాస్థానమున

భద్రిపఱచిన మీకెంతయుఁ గృతజ్ఞుఁడ నగుచున్నాను. నాకాజ్ఞ యిండు. నేనింకఁ బోయివచ్చెద.

గోపా—పోవుటకే నిశ్చయించితిరా?

మాధ—అవును.

గోపా—అయిన మీయిష్టానుసారము కానిండు.

మాధ—[నిష్క్రమించును]

[కాళికాంబ మున్నగువారు మంత్రిని సమీపింతురు]

కాళి—మంత్రులవారు మహానుభావులు. సాక్షాత్తు దేవతాస్వరూపులు. నిజంవిచారించారు. నన్నుకూడా వుద్ధరించాలె. మహామంత్రిల్ని మిమ్మల్నే నమ్ముకున్నా. [నమస్కరించును]

సభా— దివిటీముందర దీపం, మాధవశర్మయెంత? అతనిచదువెంత? ఆహా! పంతులుగారిమేధా, ఆ ప్రజ్ఞ, ఆ కార్యనిర్వహణశక్తి శేషుఁడు కూడా వర్ణింపలేఁడు.

రామ—సందేహమేమిటి? పంతులుగారు సాక్షాత్తూ కేవలంగా అవతార పురుషుల్లో చెప్పవలసినవారు కాని సామాన్యులా మఱి? మా మాధవశర్మ ఏమోచదువుకున్నాడన్నమాటేకాని కేవలం మూర్ఖుడు. అధికారిమాటవినక అగ్రహారం పాడుచేసుకున్నాఁడు. అతని కర్మం; ఏంచేస్తాం?

గోపా—సభాపతిగారు! ఇప్పటికి మీరందఱు వెళ్ళవచ్చును.

సభా—చిత్తంబాబు. అనుగ్రహముంచండి.

రామ—సెలవిప్పించండి మహారాజా! దయవుంచండి.

కాళి—అయ్యా! ఆడదాన్ని, దిక్కులేనిదాన్ని, ఆధారంలేనిపక్షిని దయవుంచి కటాక్షం వుంచాలె, [అని కన్నులొత్తుకొనుచు నమస్కరించును] [ముప్వురు నిష్క్రమింతురు]

గోపా—ఔరా! మాధవశర్మ ప్రతివాక్యము నా హృదయమునకుఁ దాఁకి భారతీయ ధర్మవైభవమును స్ఫురింపఁ జేసినది. ఈతఁడే నిజము[illegible] గ్రహీతుఁడయ్యోనేని మఱుఁగువడు భారతీయ ధర్మప్రభ

దినకరప్రభవోలె ఖండఖండాంతరముల వెలయక మానదు. ఇట్టి ప్రజ్ఞావంతుల కెప్పుడో యెవ్వరో యిచ్చిన యగ్రహారాదులు లేకుండఁ జేసి ధర్మ మడఁపఁదలఁచిన మహారాజునకుఁ జేతనైనంత హితబోధఁ జేసెద. పిమ్మట నేమగునో విచారించెద. [నిష్క్రమించును]

మాధ—[గృహాప్రాంతమునఁ బ్రవేశించును] ఔరా! ఈతఁ డమాత్య శేఖరుఁడై చేయవలసిన మేళ్ళుచేయక రాష్ట్రరక్షణమునకును రాజ్య పాలనమునకును సర్వమునకును ధర్మమే మూలమన్న మాట కూడ మఱచి యాధర్మముపై దాడివెడలుచు నెంతతీవ్రతఁజూపుచున్నాఁడు! చండశాసనులగు చక్రవర్తులకుఁ గూడ సాధ్యపడలేదే, యీతఁడా ధర్మమును దైవమునుగూడఁ ద్రిప్పువాఁడు? స్వాతంత్ర్య సుఖముల నొనఁగూర్తుమను బెల్లపు వ్రేళ్ళను జూచి వశమగుచున్న యజ్ఞ లోకముకాదు. ధర్మమేరువును గదల్ప నెవ్వరికిని శక్యముకానేరదు!

సీ. చార్వాకు లడరుచు ♦ జగముఁ గలంచిన
దేహాత్మవాదంబు ♦ స్థిరతఁగనెనె?
బుద్ధశాసనమునఁ ♦ బొడవడంగినయట్టి
కర్మకాండ మదెల్లఁ ♦ గ్రాలలేదె?
గజినీమహమ్మదు♦కతనఁ గీడ్పడినట్టి
విగ్రహారాధన ♦ వెలయలేదె?
ఔరంగజేబ్ విప్ర ♦ లడర మోపినయట్టి
తలపన్ను బాధలు ♦ తొలఁగలేదె?

గీ. శిశిర మారుతుల రాల్చినఁ ♦ జెన్నుమీఱి
యలరు జొంపంబులును జెట్ల ♦ నలముకొనవె?
గీడ్పడంజేసి జగమేర్చు ♦ గ్రీష్మమునకుఁ
గాల్వలా జీవనదు లుగ్ర♦గతులు గనవె?

ప్రవాహవేగమునకుఁ బ్రబ్బవలె ఆవేశసమయమందరతియు నడఁగినట్లుండును; కాని భరతదేశౌన్నత్యమున కంతటికిఁ గారణ భూతమై యతిపవిత్రమగు నార్షధర్మ మంతరింపనేర— [పైనిఁ

జూచి] ధర్మమా! నీవప్పుడే నామమాత్రావశిష్టమయ్యెదవా? కావు కావు. నీ వెన్నఁటికినిఁ గాఁజాలవు.

గీ. గాలికెగిరెడు నాకుల ♦ కరణి నెగసి
బలితమై యేచు పెన్గాడ్పు♦పగిదిఁ గదిసి
విమతులెడలింప ధర్మంబు ♦ వెడలఁగలదె?
కాల్చునే మంచుకొండను ♦ గారుచిచ్చు?

ఓ పీఠాధిపతులారా! ధర్మతత్పరులగు నో భారతీయ సోదరులారా! మీకు నిలువనీడనిచ్చి యౌన్నత్యఫలముల నాదరించు మీ ధర్మ వృక్ష శాఖలు ఛేదింపఁబడుచుండఁ జూచుచుండియుఁ గను విప్పకుంటిరే? ఇది శాంతియనుకొంటిరా? కానేరదు. శాంతికిఁ బరాక్రమమే భూషణమను నార్యోక్తి మఱవఁజనదు.

ఉ. వేదసముద్రముల్ వెదకి ♦ విశ్రుతిఁగాంచిన ధర్మకల్పకా
పాదనఁజేయ ధాత్రిపయిఁ ♦ బ్రాచ్యమునుల్, నిగమాగమంబులన్
గాదని జాతిధర్మములు ♦ కంటకముల్ పెకలింతునంచు వా
గ్వాదమొనర్చు నీసచివ♦వర్యుఁడు, ధర్మరతుల్ సహింతురే?

కొండలనుండి దూఁకి కుమారిలభట్టును, పరకాయప్రవేశాదులొనరించి శంకరభగవత్పాదులును, కొట్టులకు సంసిద్ధులై విప్రవర్యులును, వేదములను, మతమును, శాస్త్రములనునిల్పిరి. ధర్మభంగ సమయమున మన మనదలమై యుండుట యుక్తముకానేరదు.

మ. నిదురంబోకుఁడు లెండు ధార్మికవరుల్! ♦ నిస్తంద్రులై యుండుఁడ
భ్యుదయంబుల్ వెలయించి దేశమున కెం♦తో కీర్తినార్జించి మో
క్షదమై వెల్గెడు ధర్మమాత విమతుల్ ♦ గారించుటల్ గాంచు చా
పదలం బాపనిచో జనశ్రమము లా♦పన్ రానివై పోపవే?

సోదరులారా! ఇది మీ యుపేక్షకు సమయముకాదు, లెండు. ధర్మోద్ధరణ దీక్షాబద్ధకంకణులు కండు.

గీ. వేదశాస్త్రాదులెఱుఁగక ♦ విజ్ఞులైన
ఋషులొనర్చిన ధర్మంబు ♦ తెలివియొ గనక

మహిత దేశప్రశస్తిఁ దా◆ర్మ్మజ్యోనర్తు
రధిపు, లిపుడైనఁ గన్విప్పుఁ◆డార్యులార!

మీరాలసించిన మీ మానవత్వమంతయు బూడిదలోఁ బోసిన పన్నీటి విధము కాఁగలదు. లెండు! త్వరపడుఁడు!

ఉ. వక్తలుగారె? మీరలు స◆భల్ వెలయింపఁగలేరె? వేదశా
స్త్రోక్తులు దెల్పలేరె విన◆కుండునె లోకము? ధర్మలాభముల్
వ్యక్తమొనర్చి దేశహిత ◆ వాంఛఁ జరించిన దివ్యులైన మీ
శక్తికి లొంగరే? నిగమ◆సంపద కన్యము సాటివచ్చునే?

సోదరులారా! ధర్మ సంస్థాపనా పటిష్ఠులు కండు! లోక సేవకుఁ జనుదెండు!

[అని నిష్క్రమించును]

ఇది ప్రథమాంకము.

# లలిత

## ద్వితీయాంకము

[శ్రీనగర రాజాస్థానము- రాజమంత్రుల ప్రవేశము]

సుదర్శనప్రభువు—మంత్రివర్యా! దేశస్థితి యెటులున్నది?

గోపా—మహారాజా! జాగీరు గ్రామముల నచ్చటచ్చటఁ బరిశీలించి వచ్చితిని. ధర్మసంస్కరణములు, ఈనాములు, అగ్రహారముల విషయమై శ్రీవారొనరించుచున్న మార్పులు నా కంత తృప్తిని గలిగించుటలేదు.

సుద—ఎందుచేత?

గోపా—మీ ప్రయత్నము సఫలమగునని తోఁపకుండుటచేత.

సుద—మాధవశర్మ ధర్మశాస్త్రములను సవరించుట కంగీకరింపలేదా?

గోపా—లేదు.

సుద—కారణము?

గోపా—కట్టలు తెగిన చెఱువువలె లోకము ధర్మశూన్యమగునని.

సుద—ఏమీ? ఈతఁడా, లోకస్థితినాపునది? అది యగ్రహారపు గర్వము. మా యాజ్ఞ నెఱవేర్పకున్న నీయగ్రహారము హరింపఁబడునని యేల చెప్పలేదు?

గోపా—చెప్పుటయేమి? రామపుర[illegible]హారమును జప్తుచేసియే మాట లాడితిని.

సుద—[illegible]ప్పటికి నాతఁడంగీకరింపలేదా?

గోపా—అగ్రహారమే కాదు, ప్రాణములు పోవనున్నను ఆతఁడు చలించు నట్లులేదు.

సుద—ఇది వట్టిడంబము, ఈ ఛాందస బ్రాహ్మణులకు మనమిచ్చిన యాధిక్యము.

గోపా—మహారాజా! విద్యచేత, శీలముచేత, కర్మచేత, తపస్సుచేత, భక్తిచేత, జ్ఞానముచేత, బ్రాహ్మణుఁ డధికుఁడై సర్వవిధముల నితరుల కాధిక్యమిచ్చినాఁడు. మాధవశర్మకూడ నట్టివాఁడని యే నా తలంపు.

సుద—అది ఇప్పటిమాటకాదు. ఈ నామమాత్ర బ్రాహ్మణుల కగ్రహారములుపోయి యుద్యోగములెగిరిన, తెక్కలూడిన పక్షులై, పడగలుచితికిన పాములవలె 'నలుగురితోఁబాటు నారాయణా'యని యెవ్వరి నెదురింప శక్తిలేనివారగుదురు. అప్పుడే సర్వజనులు సమానులై ప్రభుత్వము నిరుపద్రవముకాఁగలదు. మాధవశర్మ గీధవ శర్మ యేమిసేయును? బ్రాహ్మణాగ్రహారములు, ఈనాములు, వ్యవసాయదారులకగునట్లు ఆ బ్రాహ్మణుల కేమియు నుద్యోగములు లేకుండునట్లును, ఆ పాఱుల సర్వాధిక్యములు ప్రజలకుఁ బంచి యిచ్చి యింక జనులలోనే యాధిక్యము లేకుండునట్లును శాసనము లొనర్చెద. నా యీ యాజ్ఞల నెవ్వరుకాదందురో విచారించెద.

గోపా—ప్రభూ! అనుకరణ వ్యామోహ మేఘములు ఆత్మవిజ్ఞాన జ్యోతి నరికట్ట దాస్యపుగంతలు కట్టుకొనియున్న యీ భూసురుల కన్నులేల తెఱపించెదరు? జాగీరులకంటెఁగూడ ముందఱఁబుట్టిన యగ్రహారములకు ఈనాములకు నేల యాటంకము కలిగించెదరు? అనాయాసముగ నగ్రహారలాభమందిన జనులు, ఇతరుల యౌన్నత్యమేల గ్రహింపఁదలంపరు? రాజులన్న రాజాధిరాజులను మాత్రమేల త్రోసి రాజులఁజేయ యోజింపరు? పరిపాలనా పరిపాలకన్యాయమును గూడ వదలఁదలఁచినయెడల, మీరు చేయఁదలఁచిన సర్వసంస్కరణములు సాగుననుటకు సందియముండదు.

సుద—మంత్రివర్యా! ఇంతమాత్రముననే రాజభృత్య న్యాయమును వదలవలసివచ్చునా?

గోపా—మహాప్రభూ! తినమరగినకోళ్ళు వేల యిల్లెక్కికూయవు? అన రాదుకాని ప్రభువులు వారి బంధువులు వారిమిత్రులు వారియను చరులు వారిసేవకులు వారివారెల్లరు ప్రజలసొమ్ము కొల్లగొట్టుచు జనుల నతిహీనముగఁ జూచుచుండిరను కింవదంతి యంతటను వ్యాపించినది. సముద్రఘోషవలె ఈప్రజాఘోష మనివార్యముగనున్నది. తాము తమ వ్యయమును తగ్గింపక స్వజనౌన్నత్యమును దక్కువ సేయక ప్రజలకిష్టమనికాని మంత్రులకిష్టమనికాని లేక మీయిష్ట మనికాని దేశమున నెట్టిమార్పులు చేయఁదలఁచినను అది కష్టల తక్కెడ కాకమానదు. జాతిమత సంప్రదాయము తాఱుమాఱు చేయఁదలఁచుట, నిదురించు సింగములజూలు పెటికినట్లు ప్రజలను ధర్మరక్షణకై మేల్కొలుపుట కాకమానదు. ఇంతియేగాక ధర్మము లను దైవములను భంగపఱిచి యే ప్రభుత్వమును వృద్ధికివచ్చినట్లు కనుపట్టదు. త్వరపడక కార్యనిర్ణయమునకుఁ గడంగుఁడు.

సుద—అయిన మన కర్తవ్యము?

గోపా—మహారాజా! ఔన్నత్యసౌధమును వదలి యనుచరప్రాకార ములదాటి కూపకూర్మస్థితియను స్వనగరాంతర్వర్తిత్వము వదలుకొని తమజాగీరున నాధులులేని యనాధలకుఁ దండ్రులులేనిబిడ్డలకు ఎన్ని సంవత్సరములకు వారిభూములు వారికధీనమగుచున్నవో వారి రక్త మాంసములెంత క్రాఁగికరఁగిపోవుచున్నవో చూడుఁడు. న్యాయస్థాన ములు కార్యస్థానములను వలలోఁజిక్కి కార్యపరిష్కారవిముక్తిమా ర్గములు దొరకక రైతుపక్షులెంత తల్లడిల్లుచున్నవో కనుంగొనుఁడు. కట్ట బట్టలు లేక తినఁదిండిలేక ఉండనిండ్లులేక యెండకెండుచు వాన కుఁ దడియుచు దేశీయసోదరపక్షులెన్ని చెట్లక్రిందఁ బొరలుచున్నవో వీక్షింపుఁడు. మీరు మీప్రభుత్వమును శాంతియుక్తముగఁ జేయఁ దలఁతురేని మీశాసనాయుధముల నా కొసంగి ప్రచ్ఛన్నముగ నా [illegible]నుండుఁడు. మీ యీ శాసనములెంత దారుణములో, ఆశాస

నములయందుఁ బ్రజలెంతయనాదరమును జూపుచుండిరో మీామహా రాజనామము సైతము జనులకెంత యేవను గలిగించుచున్నదో మీారే తెలిసికొనఁగలరు. అటుపిమ్మట ఇష్టమువచ్చినన్ని మార్పులు చేయవచ్చును.

సుద—మంచిదటులనే గావింతము కాని మునుముందు మాధవశర్మను సమగ్రముగఁ బరిశీలింపవలె.

గోపా—దేవరచిత్తానుసారమే జరుగఁగలదు.

సుద—అయిన రండు పోవుదము. [నిష్క్రమించును]

రామచయనులు—[తెరలోనుండి] "హరే రామ హరే రామ, రామ రామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే" [అనుచు మాధవశర్మయింటిముందుఁ బ్రవేశించి] మాధవ శర్మ మంత్రిచెప్పినా, మధ్యవర్తులు చెప్పినా వినక అగ్రహారం ఆస్థానాని కర్పించి కాళికాంబను గడపలోనికి రానీయనని గట్టిగా చెప్పాడు. ఈ ఛాందసుడు ఇంక మావాడువచ్చిన పేచీపెట్టక మానడు. రేపు బిడ్డ సుఖపడదుకాబోలు. కానీలే, అబ్బాయివచ్చింతర్వాత ఇతనిసంగతి విచారిస్తాం. ముందు కోడల్ని పంపుతాడో లేదో అడగాలి. కాస్త ఇంగ్లీషు, కాస్త సంగీతం, కొత్తకొత్తగా తలదువ్వటం, ముచ్చటముళ్లు, బంగాళీముళ్లు, అవ్వి వెయ్యటం, చీర కట్టటం, జాకెట్టు వెయ్యడం, మనవూరి పంతులమ్మవద్ద నేర్పించమని మా చిట్టినాన్న జాబువ్రాశాడు. నిజమే; వాడు ముప్పయివేలు ఖర్చుపెట్టి అంతదూరంపోయి, అంత పెద్దచదువు చదువుకుంటున్నప్పుడు, వాడివేషానికి, వాడిసీటుకు, వాడిగోటుకు, ఆడదైఁది సరి పోవద్దూ ? కోడల్ని తీసికెళ్ళి సంగీతంపెట్టికొని వందరూపాయిలు ఖర్చుపెట్టి పంతులమ్మదగ్గఱ అన్ని నేర్పిస్తా. [ప్రకా] బావగారు ! బావగారు ! నేను రామచయనులను.

మాధ—[ప్రవేశించి] ఓహో చయనులుగారా! దయచేయుఁడు [అని చేయిఁబట్టుకొని తీసికొనిపోయి దగ్గఱఁ గూరుచుండఁ బెట్టుకొనును] బావగారేదియో పనిమీాఁద వచ్చినట్లున్నది?

రామ—అబ్బాయి జాబువ్రాశాడు చదవండి [అని జాబునిచ్చును.]

మాధ—[జాబుతీసికొని చూచుచు డియర్ ఫాదరిల్లాగారికి- నమస్కారములు. నేనిక్కడ ఖులాసాగావుండి బాగా స్టడిచేస్తున్నాను. ప్రస్తుతం నాకు తగిన అప్టుడేట్ గరల్ను నేను మారేజీ చేసికొనవలసియున్నది. అయినను మీరునాకు ఘస్టుగురువులు. కనుక మీంపిల్లతో సంబంధము వదలుకోలేకున్నాను. మీడాటర్ ఓల్డుఫాషన్సునాకు ప్రీతి కలిగింపవు. అందుచేత మీకూతుర్ని మాయింటికంపిన మానాయన గారు మావూరి పంతులమ్మను ప్రయివేటుట్యూటర్నుగా కుదిర్చి కాన్వెంటుస్కూలులో చేర్చి ఇంగ్లీషు డాన్సువగైరా న్యూ ఫేషన్సు టీచ్ చేయించ గలరు. ఇందులకు భిన్నముగ జరిగిన డైవోర్సు వ్యవహారము అమలులోనికి గావలసియుంటుంది.

ఇట్లు,
మోహన్.

[కొంచెమూరకొని నిట్టూర్చి] చయనులుగారు! మీకుమారుఁడు మురహరిశర్మయను పేరును మార్చినాఁడని తెలుఁచెద.

రామ—ఔను, మావాడు చక్కనివాడని స్నేహితులూవాళ్లూ పెట్టిన పేరట. ఉత్తరాల్లో మోహన్ అనే వ్రాస్తూవుంఛాడు.

మాధ—ఐతే బావగారు! పంతులమ్మ ఎవరండి?

రామ—ఆమె చాలా తెలివిగలదమ.

మాధ— తెలివిగాదు, కులము.

రామ—నూటయాభై రూపాయలు జీతమమ. తెల్లనివస్త్రములు కట్టుకొని, తల, వొళ్ళు మాయకుండా చక్కగా చెప్పులు తొడిగి, చేతులో గొడుగు, పుస్తకాలు, బంగారపుగాజులు, గడియారము, మెళ్లో గొలుసు వేసి బళ్లోకి పోతూవస్తూ ఉంఛుంది. తెల్లవారికి, నల్లవారికి సంబంధీకురాలమ.

మాధ—[తల పంకించి] వైదికాంగనల వేషభాష లన్యమతములవారా సంస్కరించుట ? అక్కటా ! కాల మెట్టి మార్పులను గావించు చున్నది !

రామ—బావగారు ! మీరింకా వైదికం, గియిదికం, అంటూ పెరటి తోవలోనే ఉన్నారండీ. మీరుచదివిన చదువుకు, కాస్త కాలానికి ముందుకు వచ్చి యిప్పటివారి కిష్టమైన నాలుగు ఉపన్యాసాలిచ్చారంటే, లక్షలార్జించకపోయినారూ! మన చాదస్తం మనం వదలం. మనదగ్గఱికి డబ్బురాదు. ఇదెందుకు లెండి కోడల్ని ప్రయాణంచేయించండి.

మాధ—[నిట్టూర్చి] చయనులుగారు ! మీకోడలిని మీకడకంపుటకు సంశయముండదు. కాని మఱికొంతకాలము మా లలిత ముద్దుముచ్చటలు చూచుకొనుటకు మీయనుజ్ఞ వేఁడుచున్నాను.

రామ—బావగారు ! అబ్బాయి ముక్కోపి. వానియాజ్ఞ నతిక్రమించామంటే మమ్మల్నే సహించేవాడుకాడు. వేషభాషలుమార్చినైన ఇప్పట్ల మావాడు మీకూతుర్నేలుకొంటూ ననటమే పెద్దవరంగా తలంచి మీఅమ్మాయిని పంపివేయండి. లేదా లలితయదృష్టదేవతను కాలితో తన్నుచున్నా ననుకోండి. ఇంక మీయిష్టం, కాదంటే పోవటమే. [అని పోఁబోవును.]

మాధ—[చయనుల నాపి] చయనులుగారు! ఆగ్రహింపకుఁడు. మీయిష్టమే కానిఁడు.

రామ—[సరాళించుచు] అయితే యిప్పుడే బండితీసుకొస్తా. ప్రయాణం సిద్ధంచెయ్యండి. [అని లేచును.]

మాధ—వైశ్వదేవానంతరము తెప్పింపవచ్చును.

రామ—వైశ్వదేవం ఇక్కడచేస్తే ఎల్లాగండి? నాలుగురూపాయి లెవరిస్తారండి ? ఇక్కడకాదులెండి, మా కృష్ణాగ్రహారం రెండుమైళ్లే కాదండీ? అక్కడ పెద్ద సదస్యం. తప్పక వెళ్లాలి. బండితీసికొస్తా. ఇంకా ఆలస్యంచెయ్యకండి. కోడల్ని పంపించండి.

మాధ—చిత్తము.

రామ—[నిష్క్రమించును]

మాధ—[విచారముతో] కుమారీ! నీవు పతిగృహమున కేగి [illegible]కనులు

మూసి నాకు బాధిర్యమును కలిగించెదవా? లలితా! నీవు సకల సద్గుణకలితవే! నిన్నెట్లు మఱువనేర్తును తల్లీ!

మ. కళలం దేఱఁగ నెమ్మొగం బమృతమొల్కన్ గీతముల్ పాడుచున్
బలుకుం దేనియఁ జిల్కరించుచును గావ్యశ్లోకసందర్భముల్
పలుమాఱెన్నుచుఁ బద్యమల్లుచిట భావంబున్నదా తండ్రి! యం
చలరంజేసెడు నాదుకూర్మిసుతఁ బాయన్ శక్యమే నా కికన్.

[కనులు మూయును.]

రాధ—[పూవులబుట్టతోఁ బ్రవేశించి] [స్వ] ఆర్యపుత్రుఁడేదియో విచారించుచున్నట్లున్నది. [ప్ర] నాథా! చదువుకొనుటమాని యేమియో యోజించుచున్నారు?

మాధవ—మన లలితను బ్రయాణముచేయవలెను.

రాధ—ఎక్కడికి?

మాధవ—అత్తవారింటికి.

రాధ—అల్లుఁడుగారు వచ్చిరా యేమి?

మాధవ—లేదు. మునుముందు వారి నాగరకత నలవఱచుకొనవలెనఁట.

రాధ—నాథా! లలితస్థితిఁ దలంచిన నా గుండెలదరుచుండును. వారు యథేచ్ఛాచారులు. లేక లేక కలిగిన యొక్క బిడ్డ నెడఁబాయ వలసివచ్చునే. ఆర్యపుత్రా! శాస్త్రముల విషయమై యెవ్వరికి లేని పట్టుదల మీకు మాత్ర మంత యెందులకు? మంత్రిగారిమాట మన్నింపకుంటిరి. కాళమ్మక్క ప్రార్థన నిరాకరించితిరి. అల్లుని మాత్రము వదలకుందురా? అందఱునుద్యజించిన మనకు మాత్రము సాయపడువా రెవ్వరు?

మాధవ—దైవమే సహాయము. ధర్మమే తోడు. విచారింపకుము.

రాధ—మీకు భిన్నముగఁ జెప్పుదునా? వెనుక ముందు యోజించి నిర్ణయ మొనర్పుఁడు.

మాధవ—ధర్మాచరణమునకును, మోహమోటమునకును జాలదూరము. ఇంక లలితపైఁ బ్రేమానుబంధము త్రెంచుకొనక తప్పదు. అన్య

విద్యాభ్యాస మొనరించుచు అన్యదేశీయుల ననవరతముఁగాంచుచు అన్యులను గొలుచువారే మతాచారముల మంటఁగలుపుచుండ, నాలుగైదేండ్లు కేవల మద్యమాంసాశనుల యిండ్లఁ దినివచ్చెడి మన యల్లుఁడు స్వమతదూరుఁడై మన కహితుఁడు కాకమానఁడు. అట్టివానితోఁ గలయిక యసంభవము.

రాధ—అయిన లలితగతియేమి? [వినుట నాలకించి] అదిగో లలిత వచ్చుచున్నది. అమ్మా! లలితా! ఇటురమ్ము.

మాధవ—ఇటురమ్ము తల్లీ! [దగ్గఱకుఁ దీసికొని శిరము నిమురును.]

లలిత—[చూచి నిర్విణ్ణయై] నాన్నగారు! ఏమో విచారించుచున్నారేమి?

మాధవ—నీ కొఱకే విచారము తల్లీ! నీ వత్తవారింటికిఁ బోవలెనఁట. నీకు మేముచెప్పిన గృహవిద్య, సంస్కృతాంధ్రములు పనికిరావఁట. పంతులమ్మవద్ద నిన్నుఁ గొత్త దానినిఁ జేయుదురఁట. చిరకాలము విదేశవాసమొనరించి నూతనపద్ధతుల కలవడు నీ భర్తకెట్లుపచరింతువా? యని చింతిల్లుచున్నాను. తల్లీ! ప్రకృతి సుకుమారవు; నీ భర్తవల్ల నీ కెట్టి స్థితి కలుగునో గదా?

మ. తలపూవై విలసిల్లెదో పతిపదద్వంద్వంబునన్ వ్రాలెదో
చులకంజేయుచుఁ గంటకావృతిపయిన్ సోలింప శోషిల్లెదో
తలఁపన్ రాదు వచింపరాదు లలితా! త్వద్భావిభాగ్యంబు నన్
గలఁపన్ జొచ్చెను మేన్వడంకుఁ గనులం గ్రమ్మన్ జలం బక్కటా!

కుమారీ! అనభ్యస్త విదేశాచారవే, నీ భర్తనెట్లు సేవింపఁగలుగుదువు? తల్లీ!

సీ. పతికంటె ముందుగఁ బర్వుపర్వున లేచి
కుక్కుటాండరసంబు గూర్పవలెనో?
దంత ధావనమైన ధవుఁడొనర్పక మున్నె
ప్రక్కమీఁదికిఁ గాఫి పంపవలెనో?
పెద్దరొట్టెలఁదెచ్చి యొద్దికగాఁజీల్చి
ముంచి యేమధువుఁ దినిపింపవలెనో?

పెదవులసందునఁ ♦ బొదలుచుట్టల కేవ
గింపక వాని వెల్గింపవలెనో ?
గీ. ఎట్టి వంటల వండి ముం ♦ దిడఁగ వలెనో !
యేమి త్రాగింపవలెనో ! యెం ♦ దేఁగుచున్న
నెలమితో నేఁగి నీ వటు ♦ లెవ్వరెవరి
చేతులంబట్టి సంప్రీతిఁ ♦ జేయవలెనో ?

లలిత—జనకా! మామగారు చయనము చేసిరికదా? వారి పుత్రు లిట్టి పనులు చేయుదురా?

మాధవ—కుమారీ! ఎంత వెఱ్ఱిదానవు! చిరస్నేహ మూరకపోవునా? ఇంతయేల? బహుకాలము పరదేశవాస మొనరించివచ్చిన భర్తతోఁ బాటు నీవుకూడ కులధర్మములు మఱతువేమో? యని శంకించు చున్నాను.

సీ. ధవుని యుద్యోగంబు ♦ తలఁపువచ్చెడు వేళఁ
దులసిపూజలమాటఁ ♦ దలఁపనగునె?
మోటారు వాకిట ♦ మొరయుచుండెడు వేళ
దేవుఁ డున్నాఁడన్న ♦ తెలివియున్నె?
జడ్జీలు మునిసిఫుల్ ♦ సరసనుండెడు వేళ
జన్మకర్మంబులు ♦ జ్ఞప్తియున్నె?
పూదండ లర్పింపఁ ♦ బొంగిపోయెడు వేళఁ
బరులు స్వీయు లఁటన్న ♦ సరణి యున్నె?
గీ. వేషభాషలు గలవారు ♦ వింతవారు
ధనికు లుద్యోగులుం దక్కఁ ♦ దక్కువారు
కనియుఁ బెంచినవారేని ♦ గంటఁబడినఁ
బసులగతిఁ దోఁపకుందురే ♦ భావమునకు?

లలిత—నాన్నగారు! ఇంతటి విపరీతస్థితి గలుగునా?

మాధవ—కుమారీ! నీవేమి చేయఁగలవు? అది కాలపరిణామము.

లలిత—జననీ జనకులారా! మిమ్ము వదలి వెళ్ళుటకుఁ గాళ్లాడకున్నవి. ఆ స్థితిఁ దలఁచిన గుండె లదరుచున్నవి. [విచార మభినయించును.]

రాధ—[కన్నీరుదుడుచుట నభినయించుచు] అమ్మా! చింతిల్లకుము. నీ వెట్టి స్థితిలో నున్నను, బడఁతులకుఁ బతిసేవయే పరమధర్మమని భావించుచుండుము.

మాధవ—[శిరము నిమురుచు] కుమారీ ! విచారమువలనఁ బ్రయోజనములేదు. నా యీ పలుకులు శ్రద్ధతో నాలకింపుము.

మ. పతికిష్టంబగు వేషభాషణములన్ ♦ బాటించి వర్తింపు నీ
చతురత్వంబు వెలుంగఁజేయుచు విభున్ ♦ సంప్రీతిమైఁ గొల్వు మే
స్థితి నీ కబ్బిన దేహమున్ విడకు త♦ద్దేహాధికంబై మహో
న్నతమా శీలము ప్రీలనీకు సతమున్ ♦ ధ్యానింపు రామప్రభున్.

రాధ—నాథా! అమ్మాయి నిప్పుడే పంపవలయునా?

మాధ—విచారించినఁ బ్రయోజనములేదు. చయనులుగారు వచ్చెడు సమయమైనది. అమ్మాయినికుల దేవతలకు నమస్కరింపఁజేసి పసుపు కుంకుమయిచ్చి తీసికొనిరమ్ము.

లలిత—నాన్నగారు! నాల్గు దినములుండును. వదినెను నాతోఁ బంపుఁడు.

మాధ—కోడలినిఁగూడ ప్రయాణముచేయుము.

రాధ—అటులనే చేసెద. [రాధాలలితలు నిష్క్రమింతురు]

చయ—[ప్రవేశించి] బావగారు! బండివచ్చింది.

మాధ—సరే రానిండు. కాని కొడుకునేకాక కోడలినిఁగూడ ఆంగ్ల విద్యలోఁ బ్రవేశపెట్టఁదలఁచు మీస్థితి యేమగునో యని విచారము కలుగుచున్నది.

మ. తనఖావ్రాసితి వగ్రహారమును దా♦తల్ తండ్రులార్జించి యి
చ్చిన ద్రవ్యంబు వ్యయంబొనర్చితివి గా♦సింజెందుచుం గూర్చు నీ
ధనమర్జించితి పుత్రవిద్యకయి త♦త్తద్వేషభాషావినో
దనుఁడౌఁగాక తలంచునే సుతుఁడు నిన్ ♦ దన్వం బ్రయత్నించునే?

రామ—బావగారూ! మోహనుడందటివంటి యీకాలపు కుఱ్ఱవాడు కాడండి. నన్ను, నిన్ను, బంధువులనుగూడా బాగా ఆదరిస్తాడండి.

మాధ—చయనులుగారు! మీతనయుఁడు వచ్చినవెంటనే తగినవేషము హంగు మీవలనఁ గావలసియుండును. అదియైనపిమ్మట మీయం

దలి యాదరము మీకే తెలియఁగలదు. అదిగో లలిత వచ్చుచున్నది. ఇంకఁ దీసికొనిపొండు.

రాధ—[లలితను బ్రయాణ వేషముతోఁ దీసికొనివచ్చి] అమ్మా! నాన్నగారికి నమస్కారముచేయుము.

లలిత—[తండ్రికి నమస్కరించును.]

మాధ—దీర్ఘసుమంగలీ భవ [అనిదగ్గఱకుఁదీసికొని] తల్లీ! మాకయి విచారము పెట్టుకొనకుము. అత్తమామల యాజ్ఞానుసారము ప్రవర్తింపుము.

లలిత—[తల్లికినమస్కరించి] అమ్మా! ఇంకనాకాజ్ఞనొసఁగుము [విచారమభినయించును.]

రాధ—[కన్నులద్దుచు] కుమారీ! విచారపడకుము. నీయత్తమామలే నిన్నాదుకొనఁగలరు. అమ్మా! మామగారికి నమస్కరింపుము.

లలిత—[నమస్కరించును]

రామ—దీర్ఘసుమంగలీ భవ. సుపుత్రావాప్తిరస్తు!

మాధ—అన్నగారు! ఏమియు నెఱుంగని యీపసికూన నెట్లాదరింతురో సర్వము మీదే భారము.

శా. దేవీసన్నిధిఁ బాడుటో **తు**లసిఁబ్రీతిం బెంచి యర్చించుటో
పూవుల్ గ్రుచ్చుటో! సంస్కృతాంధ్రపఠనంబుం బాల్యఁగాఁజేసి త
ద్భావంబుల్ గ్రహియించిచెప్పుటయొ యభ్యస్తంబులౌఁగాని యిం
కేవిన్నాణ మెఱుంగదీముగుద మీరెమ్మెరీతి సేవించునో?

రామ—అమ్మా! రాధమ్మా! విచారింపకుము. కోడల్ని కళ్ళల్లో పెట్టుకొని చూచుకుంటాం. ఇంక ఆలసింపకుము.

మాధ—అమ్మా! ఇంక నడువుము. రామాయణమును జదువుకొనుచుండుము.

లలిత—నాన్నగారు! నాకై విచారింపకుఁడు. అమ్మా! దుఃఖపడకుము. వదినే! పోవుదమురమ్ము! [నమస్కారాలింగనాదులు చేయును.]

రామ—బండితిప్పవోయ్ !

మాధ—అమ్మా! ఇంకనడువుము. [అని పంపుదురు]

లలిత—[తులసినిఁగూడి విచారముతో నిష్క్రమించును.]

రాధ—[పుత్త్రిక వెళ్ళినవంకఁజూచుచు] హా లలితా ! లలితా ! [అని నిశ్చేష్టయగును.]

మాధ—[భార్యనుబట్టుకొని] విచారమువలనఁ బ్రయోజనము లేదు, ధైర్యమవలంబింపుము. [అని కూరుచుండఁబెట్టును.]

రాధ—అయ్యో! నా దృష్టి, నా గృహరత్నము, అట్టి నాప్రియ పుత్త్రిక, లలిత లేక నేనెట్లుచూడఁగలను? ఇంట నేనెట్లుండఁగలను? [విచార మభినయించును.]

మాధ—ఇంతటి వ్యామోహము తగినదికాదు, ఊరకొనుము.

రాధ—ఆర్యపుత్త్ర! నా ముద్దులమూట, నా బంగారుచిలుక, నా రత్నాలపేటిక, లలిత కలిగినదిమొదల లొక్కనాఁడైన వదలి యెఱుఁగనే! యీ వియోగమెట్లు భరింపఁగలుగుదును?

మాధ—ఇట్టి సమయమందె ధైర్యమవలంబింపవలయును.

రాధ—నాథా ! సంస్కృతాంధ్రములనేర్చి సంగీతమునఁగూడ నేర్పు వహించినబిడ్డను, అన్యభాషాభ్యాసములు, అత్యాచారములు ఎట్టి మార్పుఁ గావించునో గదా?

మాధ—పరమేశ్వరుఁడేమి చేయదలఁచిన నదిచేయును. దానికై విచార పడినఁ బ్రయోజనము లేదు. సంయోగ వియోగములు సర్వలోక సామాన్యములు. మనస్సును గలఁతనొందించుకొనకుము.

[తెరలో] అయ్యా ! మాధవశర్మగారెందున్నారు?

మాధ—[వినుట నభినయించి] విశ్వపతీ ! ఎవ్వరది?

విశ్వపతి—[ప్రవేశించి] అయ్యా ! ఆస్థానమునుండి, యెవ్వరో పత్రిక దెచ్చినారు.

మాధ—తెచ్చితివా?

విశ్వ—ఆఁ [అని పత్రిక నిచ్చును.]

మాధ—[పత్రికనుజూచి నిట్టూర్చి] విశ్వపతీ! ఆతని నింక వెళ్లుమని చెప్పుము. నీవు ప్రయాణమునకు సిద్ధముగనుండుము.

రాధ—ఆర్యపుత్ర! ఏమది?

మాధ—[మరలఁ బత్రికనుజూచి] నే నిప్పుడే మణిపురముననున్న మన యాలయములకడ కేగవలయును. అక్కడనుండి మరల నా దేశసేవా ప్రయత్నమునుసాగించుకొనియెదను. సంవత్సరమువఱకు ధాన్యము మొదలగునవి కలవుకదా? సుబ్బయ్య గుప్తకుఁ జెప్పివెళ్లెదను, అతఁడు మిగులధనవంతుఁడైనను వినయవంతుఁడై నాయెడమిక్కిలి యాదరముతో నుండును. అవసరమయిన నేమయినఁ బయికము తెప్పించుకొనుము. విచారముడిగి ధైర్యముగనుండుము. కోడలినిఁ దులసిని బిలిపింపుము.

రాధ—ఆర్యపుత్ర! భాష్యప్రవచనమునకును ఉపన్యాసములకును బోయి తిరిగితిరిగి వచ్చి పట్టుమని పది దినములైనను గాలేదే? అప్పుడే మరలఁ బ్రయాణ మన్న నే నేమనఁగలదానను?

చ. ఎలమి ఘటించుచుండు మన ♦ కృష్ణయ విద్యగడింపఁ బోయెఁ గ
న్నుల కమృతాంశు రేఖయయి ♦ నోముఫలంబగు ముద్దుపట్టి తా
నలరఁగఁబోయె శ్వశురగృహ ♦ మందునఁ, బ్రాణసమానులైన మీ
రలు చన నేమి యుండిటఁ ద్వరన్ జనుదెండననేల? మిమ్మిఁకన్.

[అని నిశ్చేష్ట యగును]

మాధ—ప్రేయసీ! ఏల బేలవయ్యెదవు? విచార ముడుగుము [అని యోదార్చును]

రాధ—[విచారముతో] ఆర్యపుత్ర! సర్వజ్ఞులగు మీ కేమి చెప్పఁగలను?

చ. పడఁతికిఁ బ్రాణకాంతుముఖ♦పద్మముగన్గొనకుండ నున్నచోఁ
బొడమదె దృష్టిదోషములు ♦ బోఁటికి నాథుని పాదసేవ నే
ర్పడర నొనర్పకున్నయెడ ♦ భ్రాంతిజనింపదె? భర్తృసన్నిధిన్
విడిచిన కాంతకెంతయును ♦ వ్రేఁగయి ప్రాణమునిల్వ నేర్చునే?

మాధ—ప్రేయసీ! విపద్వాత సంఘాత సంక్షుభిత తట తరుమూలంబగు సంసృతిప్రవాహంబున సతీపతు లను లతానోకహంబులు స్థిరంబు

లని తలంచెదవా? బహుజన్మ పుణ్యకర్మ విశేషమున లభించిన యీ మానవ దేహమున సంసారసాగర నిస్తరణ మార్గమును జూడక బుద్బుదప్రాయములగు పతిపుత్త్రాది శరీర సంబంధ బాంధవ్యాదులఁ జిక్కి సుఖింపఁదగునా?

రాధ—నాథా! మిమ్ము సేవించుటఁ దక్క యన్యమెఱుఁగని యీ చరణదాసి నుద్ధరించు మార్గ ముపదేశించి ధన్యురాలినిఁ జేయుఁడు [అని నమస్కరించును.]

మాధ—దేహత్రయాతీతమై జాగ్రత్స్వప్నసుషుప్తులకు సాక్షిభూతమై యుపచయాపచయరహిత చిత్స్వరూపమై వెలుంగుచుండు ఆ పరంజ్యోతియే నీకును నాకును సమస్త ప్రాణిజాతమునకును స్వరూపభూతమై స్త్రీ పున్నపుంసక భేదరహితమై నిఖిల బ్రహ్మాండాంతర్బహిర్వ్యాపకమగు పరమాత్మతత్త్వ మని గుర్తెఱింగి నిరంతరము తన్నిష్ఠచేఁ బునరావృత్తిరహితమగు నిత్యప్రశాంత పదము నధిగమించియుండుము. ఇదియే పరమపురుషార్థము.

రాధ—ఆర్యపుత్త్ర! తమ యుపదేశమువలన నేదియో యొక మహత్తర తేజము నాకుఁ బొడకట్టుచున్నట్టులుండినను, ఇదమిత్థమని నిర్ణయింపలేకుంటినే? అట్టి కించిజ్జ్ఞ దుర్విజ్ఞేయమగు నిర్గుణాత్మానుసంధానమునకు నేనెట్లు సమర్థురాలనగుదును?

మాధ—[యోజన నభినయించి] అటులైన నీవు నీపురాకృత సుకృతమున భాగవతమును బఠించుచు, నావలన నుపదేశమందిన శ్రీకృష్ణమంత్రమును జపించుచు శ్రీకృష్ణునిఁ బూజించుచుంటివి. ఆకృష్ణపరమాత్మనే నిరంతరము సేవించుచుండుము. ఆ దేవదేవుఁడే నిన్ను న్నిట నుద్ధరింపఁ గలఁడు.

రాధ—నాథా! తాము పైఁజెప్పిన యుత్తమ పదమున కర్హురాలను గానని యీ విగ్రహారాధన ననుగ్రహించుచున్నారు?

మాధ—కాదు కాదు; ఇట్లు భ్రమపడియే యిప్పటి కొందఱార్యులిట్టి భగవద్విగ్రహారాధనమును దృణీకరించి స్వదేహారాధన మాత్రతత్పరులై సర్వాత్మకమగు నిర్గుణతత్త్వము నధిగమించు మార్గముఁ

గానలేక యుభయభ్రష్టు లగుచున్నారు, గాన సావధానవుకమ్ము.
సగుణ నిర్గుణ తత్త్వరహస్యమును దిఙ్మాత్రముగఁ జెప్పెద.

రాధ—ఆర్యపుత్ర! మీకృపకుఁ బాత్రురాలనయితిని. అనుగ్రహింపుఁడు దయతో ననుగ్రహింపుఁడు!

మాధ—ఏ పరబ్రహ్మము చిన్మాత్రమై నిర్విశేషమై స్వయంప్రకాశమానమై పరిపూర్ణముగ వెలుంగుచుండెనో; యట్టి యద్వితీయ నిర్గుణాత్మతత్త్వమే మాయామాత్రమున రజ్జువు సర్పముగఁ దోఁచిన భంగి నిఖిలలోకలోకాధినాథాత్మకముగఁ జూపట్టి సగుణమని చెప్పఁబడును. అందు విధిమార్గము ననుసరించి భజింపఁబడు, వశీకృత మాయులగు శివకేశవాది సగుణమూర్తులే సద్గురుకటాక్షమూలమున సాధకులకు నిర్విశేషాఖండజ్యోతిరూపముగ సాక్షాత్కరింతురు. అప్పుడు జీవ దేవ జగద్భావములంతర్హితములగును. అదియే సత్యాఖండానందాత్మకమగు కైవల్యము; గాన సగుణ నిర్గుణములకు భేదములేదు. అట్టి నిరతిశయ నిర్గుణపదప్రాప్తికి సగుణోపాసనమునకంటె మార్గాంతరము లేదు. ఇదియే పూర్వోత్తర మీమాంసా శాస్త్ర సామరస్య సమన్వయము. దీని నేమరక శ్రీకృష్ణుని భజింపుము. ఆ శ్రీకృష్ణపరమాత్మయే నిన్నున్నిట నుద్ధరించును. ఆహా! ఆ బాలకృష్ణరూపమెంత మనోజ్ఞము! ఆ శ్రీకృష్ణుసేవ యెంతటి యానందదాయకము!

చ. జలకములార్చి మోముపయిఁ ♦ జక్కని చుక్క సమర్చి మాలికల్
గళమునఁజేర్చి, గజ్జెలును ♦ గంటలు గల్లనఁ గాంచిఁ గూర్చి యు
య్యేలఁబవళింపఁజేసి పర♦మేశ్వర! మాధవ! కృష్ణ! యంచు మం
జులగతి జోలఁబాడుకొన ♦ సూనుఁడుగా హరి హాఁజెలంగఁడే!

ఆ పరమేశ్వరానుగ్రహకల్పకము లభించిన మానవుల కందరాని సౌఖ్యముండునా?

క. అతిదాత యగుచు సిరినిడు
కుతుకంబొనరించుఁ బుత్త్ర♦కుండయి గురుఁడై

వెతలడఁచి మోక్ష మొసఁగును
సతతము హరిఁ గొలువ, రాని♦సంపద లున్నే?

రాధ—మీయుపదేశము నా కిహపరసాధకమై కొంత మనశ్శాంతినిఁ గలిగించినను మిమ్ము వదలుట యన్న శక్యముగాకున్నది.

మాధ—విచార ముడిగి శ్రీకృష్ణసేవాతత్పరవై కాలము గడపుచుం డుము. అతిథిసేవయం దనాదరము సూపకుము. కోడలిని, తులసినిఁ బిలిపింపుము.

రాధ—నాథా! మరల మీదర్శనభాగ్య మింకెన్ని నాళ్లకో కదా?

గీ. నాథ! యీ రాధ కీవె ప్రా♦ణంబుసుమ్ము
వత్తుననుమాట మఱవంగ♦వలదు సుమ్ము
ప్రీతిమై దేశసేవఁ గా♦వించిరమ్ము
భద్రములు వేగఁ గొనిరమ్ము ♦ ప్రముదమిమ్ము.

[నమస్కరించి పాదరజమును బూసికొనును]

మాధ—[భార్యను లేవఁదీసి] ధైర్యమును వదలకుము, నావాక్యముల యందు శ్రద్ధ వహింపుము, పోవుదమురమ్ము.

ఇరువురు — [నిష్క్రమింతురు]

ఇ ది ద్వి తీ యాం క ము.

# లలిత

## తృతీయాంకము

[రామపురాగ్రహారప్రాంతమున విశ్వపతి ప్రవేశించును]

విశ్వపతి—అబ్బ! ఎంతబరువిది? [అనిమూటనుగ్రిందఁ బెట్టినిట్టూర్చి] గురువుగారివద్ద ప్రవేశించిన తరువాత మూటమొయ్యటం ఇదే మొదటిసారి. ఇది నాకెంతవఱకు చంకతాళికావలసియుండునో, తెలియనేరను. పోనీ యిప్పుడే దీనికి ఉద్వాసనం జెప్పుదామా అంటే యింతటి మహానుభావుడు గురుదేవుడు మాత్రం నాకు లభింపనేరడు. ఇంతకంటే పెద్దమోతబరువు గ్రంథాలతో దేవతార్చనపెట్టె, వారు గురువుగారు బయలుదేరుతున్నారు. కానీ యేమాతుందో చూస్తా. మొన్న మంత్రిగారిరాకతో ఆచార్యులవారి కగ్రహార భారం వదిలింది. మళ్లీ మంత్రిగారూ, రావడం ఆలయాలవద్దకు రమ్మనటం చూస్తే ఇదేదో గొప్ప ఉప్పెనచిహ్నంలాగే తోస్తూంది. గురువుగారికేం లక్ష్యంలేదు, కాని మంత్రులు మార్పులు అని వింటూవుంటే కాళ్లువణకుతూ గుండె నీరైపోతూంది. వెనకటికి జుట్టుకు పన్నుకట్టి సాహెబులలో గలుపుకుండేవారట. ఇప్పుడు జంఝాలకు పన్నుగట్టి అందఱిని ఒకటేచేస్తారట. ఏమైనా సరే ఉత్తరకుమారుడికి అర్జునుడులాగ సర్వసమర్థులు మాగురువుగారే నాకు శరణ్యం. అరుగో దేశికులు వచ్చుచున్నారు. ఇంక ప్రయాణం చెయ్యాలె. [అని మూట సర్దుకొనుచుండును]

మాధవశర్మ—[ప్రవేశించి] విశ్వపతీ! మూట బరువుగా నున్నదా?
విశ్వపతి—తమమూటకంటె ఇది చిన్నదేకదా?
మాధవ—నీ వభ్యాసము లేనివాఁడవు.
విశ్వపతి—ఎన్నఁడూ యింతకూర అయినా అంగవస్త్రమునగట్టి తెచ్చి యెఱుగరే తమకుమాత్రమిది యభ్యాసమా?
మాధవ—బాల్యమునఁ గొంచెమలవాటుండెడిది. సమయమువచ్చిననేను సాహసింపఁగలను.
విశ్వపతి—నేను మాత్రమేమి? వడ్లతోపాటు తట్ట; గురులతోపాటు శిష్యుడు. బరువేమిటి? భారమేమిటి? పోదాం పదండి.
మాధవ—మంచిది. బయలు దేరుము. [అని నడచుచుండును]
విశ్వ—చిత్తము (అని మూటయెత్తుకొని నిష్క్రమించును)
[కొండకడనున్న ఆలయములవద్ద మంత్రి గోపాలరావు, ఉద్యోగీయులు, సభాపతి, అధికారులు, గ్రామస్థులు మున్నగువా రుండి యుందురు.]
పటేలు—[పూజారితో మంత్రికడకేగి] దణ్ణాలు అయ్యగారికి. గుడి పూజారి యీనే నండి. [అని పూజారిని జూపును]
అర్చకుడు—అయ్యా! నమస్కారములు.
గోపా—నీ పేరు?
అర్చ—నా పేరు సుబ్బయ్య అంటారండి.
గోపా—స్వామిపూజమైనదా?
అర్చ—ప్రాతఃకాలపూజ అయిందండి.
గోపా—ఈ ఆలయములకు జనులందఱు వచ్చుచుందురా?
అర్చ—చతుర్థులవఱకు అందఱు వస్తూవుంటారండి.
గోపా—హరిజనులకు అన, పంచములకు ఆలయప్రవేశాధికార మిచ్చితిమి. ఇంక నా హరిజనులను నిరాటంకముగ గుళ్లలోనికి రానిచ్చుచుండవలెను.
భటుఁడు—[మాల మాదిగలతోఁ బ్రవేశించి] అయ్యా! వీరేనండి యిక్కడి హరిజనులు.

అందఱు—దణ్ణాలు దణ్ణాలు పెబువులికి. [అని నమస్కరించి వేఱు వేఱుగా నిలిచియుందురు]

గోపా—ఓయీ! మీ కందఱకు గుళ్లలోనికిఁ బోనిచ్చుటకు మేము ఆజ్ఞనిచ్చితిమి. మీకు నిరాటంకముగ స్వామికడకుఁ బోవచ్చును.

అందఱు—సిత్తమండి సిత్తం బాబయ్యా! [అని యొకరి నొకరు చూచుకొందురు]

గోపా—సుబ్బయ్యా!

అర్చ—స్వామీ!

గోపా—ఆలయములోనికి వీరెప్పుడు వచ్చినను నిరాటంకముగ రానిచ్చి, వీరిచే స్వామికిఁ బూజా పురస్కారములు చేయించి, తీర్థ ప్రసాదము లిచ్చుచుండవలెను. ఇందులకు గ్రామస్థులు, కాని మరి యెవ్వరుకాని యే యాటంకములు చెప్పఁగూడదు. గుళ్లతలుపులు తీసి స్వామిదర్శనముచేయించి ముందు వీరికిఁ దీర్థప్రసాదము లొసంగుము.

అర్చ—అయ్యా! ఈ ఆలయములను అగ్రహారీకులు కట్టించినారు. మీ రే యాజ్ఞయిచ్చినను ధర్మకర్తల కియ్యవలయును. [ముందుఁ జూచి] వారే గుడి యజమానులు. మాధవశర్మగారు వచ్చుచున్నారు. తొలగండి, తొలగండి. స్వామీ! ధర్మకర్తగారూ! దయచేయండి. [అని యెదురేఁగును]

[మాధవశర్మ శిష్యులతోఁ బ్రవేశించును.]

గోపా—మాధవశర్మగారు! ఈ యాలయధర్మకర్తలు మీరేనా?

మాధవ—చిత్తము.

గోపా—ఈ యాలయములలోనికి హరిజనులకు సైతము ప్రవేశము కలిగింపవలయును.

మాధ—[క్షణమూరకొని] నాలుగుజాతులవారివఱకే ఆలయప్రవేశము.

గోపా—హరిజనులకు మాత్రమేల ప్రవేశాధికార ముండఁగూడదు?

మాధ—ఏయాగమములు ప్రజలకు విగ్రహారాధనమును విధించి తద్వి

ధానమును నిర్ణయించెనో ఆయాగమములే ఆలయములలోఁ బంచమ ప్రవేశమును నిరాకరించినవి.

గోపా—అయిన వారికి దేవతారాధనము, తరణోపాయము అక్కఱ లేదా?

మాధ—ఏల అక్కరలేదు?

గోపా—ఈశ్వరసాన్నిధ్యము లేనివారికిఁ బూజాపురస్కారాదులెట్లు? ధన్యులగుటయెట్లు?

మాధ—కృతత్రేతాదియుగములలోఁ జిరకాలముచేసిన తపస్సు, పూజ మొదలగువానిఫలము, కలికాలమున స్వల్పకాలముచేయుటవలననే మానవుల కా ఫలము లభించునట్లు దైవసాన్నిధ్యమున కేగినవారు మంత్రతంత్రముల చేతను, స్తుతిపాఠములచేతను జేసిన పూజా ఫలము, భక్తిగల పంచములకు దేవాలయ శిఖరదర్శనాదులచేతను, ఉత్స వాదులలో స్వామిని సేవించుటచేతను గలుగును. పంచములలో సైతము వారి విధి ననుసరించి తరించినవా రనేకులుగలరు.

గోపా—ఈవ్యత్యాసములు, ఈ నిరాకరణములు ఆత్మోన్నత్యప్రధాను లగు బ్రాహ్మణబ్రువుల స్వకపోలకల్పితములు. వానిని మేము విశ్వసింపము.

మాధ—అటులైనచో నట్టి యాగమవిధి ననుసరించి నిర్మించిన యీ యాలయములు దేవతారాధనలు మాత్రము మీ కేల? విశ్వాసము గలవారికే వానినివదలి మీరు తొలఁగుట యుక్తము.

గోపా—తొలఁగుటకాదు. హరిజనుల నందఱతోఁ గలుపుటయే మా కర్తవ్యము. ఇది జాగీరువారియాజ్ఞ. పూజారీ! తీయుము, ముందు తలుపులు తీయుము.

సుబ్బ—అయ్యా! మేమెన్నఁడు ఆలయములలోనికిఁ బంచముల రానిచ్చియెఱుఁగము. నేను తలుపులు తీయఁజాలను. [మాధవశర్మను జూపి] మాధర్మకర్తలువారు. వారు మాకిచ్చిన కుంచెకోలను వారికే యిచ్చెద. ఆపైనఁ దమయిష్టము వారియిష్టము. [కుంచెకోల గ్రహించి] మాధవశర్మగారు! చిరకాలమునుండి తమ యుప్పుఁ

బులుసుఁదిని తమ యాజ్ఞచొప్పున యథాశక్తి స్వామిని సేవించితిమి. ఇప్పుడు మాకును దేవాలయములకును ఋణము తీరినది. ఇంక స్వామి పూజఁ జేయఁజాలము. కుటుంబముతో నెచ్చటికైనఁ బోయెదము. తమ కుంచెకోలను దాము గ్రహింపఁ గోరుచున్నాము. [అని కుంచె కోలను గ్రిందఁబెట్టి నమస్కరించును.]

గోపా—ఇంక మీరు తలుపులు దీయుఁడు.

మాధ—నేనెన్నఁడు కుంచెకోలను ముట్టియెఱుఁగను.

గోపా—హరిజనోద్ధరణమును మీరు సమ్మతింపరా?

మాధ—హరిజనుల నేమి? చేతనైన నెల్లర నుద్ధరింపుఁడందును.

గోపా—మీ యందఱితో హరిజనుల నాలయములఁ గలుపుటయే వారల కుద్ధరణసూచకము; భక్తిసూచకము.

మాధ—అట్లు మీ రనుకొనుటయే పొరపాటు.

గోపా—ఎందుచేత?

మాధ—నిదురించుచున్న యజమానుని కణఁతపై వ్రాలిన యీఁగను జంపుటకు ఱాయి విసరి తన యేలికను జంపుకొన్న మర్కటము వడువున ఈ దేవాలయప్రవేశోద్యమము హరిజనోద్ధారకము కాక పోఁగా శాస్త్రప్రతిషిద్ధమగుటచే వారికిని మీకును దేశమునకును గూడ హానికరము కాకమానదు. నిజముగ నా హరిజనుల నైహిక ముగ నాముష్మికముగఁ గూడ నుద్ధరింపఁ దలంచిన యెడలఁ బ్రప్ర థమమున మీ బొక్కసమునుండి కొంత ద్రవ్యసహాయము చేయుం పుఁడు. అటుపై నుద్యోగీయుల వేతనములనుండియు భూస్వాముల నుండియు, ధనికులనుండియు, సర్వవిధాదాయములనుండియు నుచిత రీతుల ధనము గ్రహించి, గ్రహించిన ధనమును మధ్యనుండు పెద్ద పేరిటివారి ననుభవింప నీయక కేవల హరిజనసహాయమునకై విని యోగింపఁజేయుఁడు. గోహత్యను దొలఁగించి మద్యపానమును మాన్పింపుఁడు. పైఁజెప్పినరీతి దేవాలయ శిఖర దర్శనాదులచేతను, భగవన్నామసంకీర్తనాదులచేతను వారినుద్ధరింపఁ బ్రయత్నింపుఁడు.

గోపా—తొలుత వారి నాలయములఁ బ్రవేశింపఁజేసి పిమ్మట నన్ని సదుపాయములను జేయవచ్చును.

మాధ—అయ్యా! చేతులు కాల్చుకొనినపిమ్మట, ఆకులకు విచారించినట్లు దేవాలయప్రవేశానంతరము విచారింప నెంచుటఁ జూడ, హరిజనోద్ధరణ మను పేర, భరతమాత కలంకారభూతములై భారతీయులకుఁ బ్రాణతుల్యములై ఖండాంతరాసాధారణము లగు వేదశాస్త్రములను, అనూచానములగు ఆచార సంప్రదాయములను ఉన్మూలించి మతాంతరవ్యాప్తికై చేసెడు దోహదమే కాని, వేఱు కానేరదు. నిజముగ నిది కాపట్యమే. కానిచో భరతదేశమున నొక హరిజనోద్ధరణమే యేల? ఉండ నిండ్లు లేక, నిలువ నీడలేక, దారపుత్రాదులతోఁ గోఁతులవలెఁ బిల్లల నడుములకుఁ గట్టుకొని, గృహముల గృహోపకరణముల నెత్తినఁ బెట్టుకొని గ్రామైకరాత్రముగఁ బరిభ్రమించుచు, అన్న వస్త్రముల కటమటించుచున్న చెంచు బుడబుడక వడ్డెర యెఱుక యేనాది మున్నగు నిఱుపేదజనముపై మీ దృష్టి యేల ప్రసరింపదు? వారి నుద్ధరించుటకు మీ రేల ప్రయత్నింపరు?

గోపాల—సర్వసహాయములను బొందుచుఁ బయిజాతులవారీ హరిజనులను మల మాంస భక్షకము లగు శునక సూకరాదులకంటెఁ గడు నీచముగఁ జూచుచు దేవసాన్నిధ్యమునఁ గూడఁ దక్కవచేయుట మిక్కిలి పక్షపాతము. అందుచేత వారినే మునుముం దుద్ధరింపఁ బ్రయత్నించుట ముఖ్యము.

మాధ—ఔరా! స్వమత విజ్ఞానరాహిత్యము, విమతవాసనాప్రసరణము ఎంతెంతవారి నెంతెంతగాఁ దలక్రిందుఁ జేయుచున్నవి! అయ్యా! మతము, శాస్త్రము, ఎక్కువ తక్కువలు, కట్టడి భారతీయులకే కాదు, క్రైస్తవులు మహమ్మదీయులు మొదలగు నిహపరములఁ గోరు సకలమానవులకును గలవు. శాస్త్ర సంప్రదాయ విశ్వాసమున్న హైందవుల కెల్ల నుత్తమ జాతీయులైనను రజస్వలా స్త్రీలను వలెనే చండాలురను గూడ దేవమందిరములఁ బ్రవే

శింప నీయరాదని తెలిసియుండియు బుద్ధిమంతులనఁ దగినవారు సయితము విపరీతపుటూహలు కలిగియుండుట దేశదౌర్భాగ్యము కాని వేఱుకానేరదు. కొందఱు జీవకారుణ్య సాంఘికులమని పేరు పెట్టుకొని ప్రతిపట్టణమునఁ బ్రతిపల్లెను వేలకు వేలు జంతువులు బలవన్మరణమునకుఁ బాల్పడుచుండుటఁ గాంచుచుఁ గసాయిదుకాణముల పొంతఁ బోవుచు, అట్టి కసాయిదుకాణములు కట్టుట కధికారవర్గ మనుమతించుటఁజూచుచు నాయకవర్యులనామములతోడనే యవి విరాజిల్లుటఁ గనుఁగొనుచు, నేమియుఁ జేయనేరక, యెక్కడనో యెప్పుడో యొకానొక ద్విజుఁడు విధివిహితమని నమ్మి వేల జనుల కన్నదానము సేయుచుఁ జేయఁబోవు పశువిశసనము నాపి, యజ్ఞవిధ్వంస మొనర్చుచున్నట్లు, ఎన్నియో జగదుద్ధరణ కార్యము లుండ వాని నన్నిటిని మఱచి మీబోంట్లు హరిజనోద్ధరణమను పేర దేవాలయములపై దాడివెడలుటఁ జూడ, సాహసము లోకవంచనము కాకమానదు.

గోపా——ఏమైనంగానిండు. మీమాటలు మేము లెక్కసేయము. మేము తలఁచినట్టుచేసితీరెదము. ఆలయప్రవేశ మూలముననే హరిజనుల కన్నివిధముల సంస్కరణము కాఁగలదు. ఏలకాలయాపనము? తలుపులుదీయుఁడు. ఆలసింతురా, హరిజనుఁడే యింక గుళ్ళకర్చకుఁడు కాఁగలఁడు.

మాధ—మంత్రివర్యా! విద్యాశాలలలోఁ గక్ష్యలవలె, రాజధానిలో రాష్ట్రములు మండలములు మొదలగువానివలె, రాజరక్షణకుఁ జతురంగబలమువలె, దేహరక్షణకు పరశు, పట్టిస, ప్రాస, కుంత, తోమరములు మొదలగువానివలె, ధర్మరక్షణకు వర్ణములు విధి విహితములు. జాతి మత సంప్రదాయముల ననుసరించి భిన్నభిన్నములుగ నున్నను, వ్యక్తిధర్మము లన్నియు మోక్షసాధనములై తనుధనంబులకంటె భారతీయులకు మిక్కిలి గౌరవాస్పదములగుచున్నవి. ధర్మనిష్ఠాగరిష్ఠులైన భారతీయు లవసరమైన నసువులనైన విసర్జింతురుకాని యాత్మధర్మములమాత్రము

వదలనేరరు. ఒకప్పుడు విశ్వనాథాలయము మసీదుగ మాఱినంత మాత్రమునఁ గాశీపురగౌరవము మాసిపోలేదు. విశ్వేశ్వరుఁడు వెల యకపోలేదు. కోట్లకొలఁదిగ గుళ్ళన్నియుఁ గూలినప్పుడుసైతము, దేశీయసోదరులకు దేవుఁడు కలుగకపోలేదు. మీ ప్రేరణమున హరి జనుఁ డాలయమున కర్చకుఁడైనంత మాత్రమున, ఆర్షసంప్రదాయ మంతరింపనేరదు. జగదుద్ధరణహేతు వగు ధర్మము భంగపడఁ జాలదు. చేసికొనుఁడు. మీయిష్టానుసారము చేసికొనుఁడు. నాకాజ్ఞ యిండు, పోయివచ్చెదను. [అని పోఁబోవును.]

యోగి—అయ్యా! నేనుగూడ మి మ్మొకటి రెండు మాట లడుగు చున్నాను.

మాధ—అవశ్యమడుగుఁడు.

గోపా—వీరు రాజయోగులు, మాకును సంస్థానమునకును గురువులు. వీరి ప్రశ్నలకు సమాధానము చెప్పుఁడు.

మాధ—ఎవ్వరడిగినను దెలిసినంతవఱకుఁ జెప్పుటకభ్యంతర ముండదు. అడుగవచ్చును. అడుగుఁడు.

యోగి—ప్రశాంతముగ నుండఁదగిన గుళ్ళనిండ గోపురములనిండఁ గామక్రోధాదులఁ బెంపొందించుబూతుబొమ్మలు కలహాపుబొమ్మలు నుండుటయు సర్వసముఁడుగ సేవింపఁదగిన దేవునికడ జాతివైషమ్య ములఁ బురికొల్పు గర్భాలయాదిబహిర్ద్వారాంత కక్ష్యా భేదము లుండుటయు, సర్వవ్యాపకుఁడై సర్వసులభుఁడుగ నుండఁదగిన భగ వానుఁడు ముఖమండపమునఁ గాక యంతరాళమునఁగాక చీఁకటి కోనవలెనుండు గర్భాలయమున బందిఖానలోవలె మిటుకు మిటుకు మనుచుండుటయుఁ జూడ నిదియంతయు స్వార్థపరులకల్పనానైపుణి యనియు లోకవంచనమనియు తోఁపకమానదు, గాన దేశాభ్యు దయప్రతిబంధకము లగు నిట్టి హిందూదేవాలయ ప్రక్రియల రూపుమాపి సర్వమానవ సోదరత్వమును బ్రతిష్ఠించుటకై నేఁడు ప్రభువులును మంత్రిపుంగవులును హరిజన సమస్యను బూనుకొనుట లోకకల్యాణ మనక తప్పదు. ఇట్టి శుభసమయమం దాలయములలో

నందఱకు హక్కు లేదనుటకంటె వేఱు ద్రోహచింతనము లేదు. ఇట్టి ఘోరకృత్యమునకుఁ బాల్పడుట మీబోంట్ల కుచితమయిన పని కాదు. స్వార్థపరత్వమును వదలి యర్థములేని వ్యర్థకార్యములకుఁ బూనుకొనక, యెల్లర కింక నీ గుళ్ళను వదలివేయుఁడు.

మాధ—అయ్యా! మీరు యోగులుకదా? రథములు, గుళ్ళు, గోపురములు, ఆలయములు, ప్రైవనులు, మీకెట్టి యర్థమునేనా, బోధించినవి?

యోగి—ముంజేతి కంకణమున కద్దమేల యని ప్రత్యక్షముగాఁ గన్పడు వానిలో నికఁ బ్రత్యేకత లేమి యుండును?

మాధ—అయ్యా! ఆర్ష సంప్రదాయజ్ఞులగు భారతీయుల ప్రతికార్యము పరమార్థమును బ్రతిఫలింపఁ జేయునదిగ నుండును. అందును సర్వజన సేవ్యములగు ఆలయాదులను గురించి వేఱుగ నడుగవలయునా?

యోగి—ఏమీ? ఈ పిచ్చి కంతటికిఁగూడ పరమార్థమా! ఏమి, యా పరమార్థము?

మాధ—అయ్యా! మీ రెప్పుడైన శరీర విచారణఁ జేసికొని యుంటిరా?

యోగి—చేసికొనిన?

మాధ—ఆలయార్థముల నెఱుంగుట సుకరముగా నుండును.

యోగి—అదియెట్లు?

మాధ—దేహముల ననుసరించియే దేవాలయ నిర్మాణము. ముఖమండపమను స్థూలదేహము, అంతరాళమను సూక్ష్మదేహము, గర్భాలయమను కారణదేహము - కాక వీని కావలనుండి యీ దేహత్రయమును వెలిఁగించువాఁడే దేవుఁడని యర్థము.

యోగి—కొన్ని యాలయములలో నైదు భాగములుగ నుండునే! వాని నేమందురు ?

మాధ—అప్పుడు పంచకోశముల కతీతముగనుండి కోశపంచకమును వెలిఁగించువాఁడని చెప్పవలెను. ఇంకను బెద్దయాలయములలో అంతరాళము లేడుసంఖ్యలుగఁగూడ నుండవచ్చును. వానిని యోగరీత్యా

మూలాధారము మొదలు సహస్రారాంత సప్తకక్ష్యల కవ్వలనుండు వాఁడని యర్థము.

యోగి—[శిరఃకంపము చేయుచు] అయిన ఈ శిఖరములు?

మాధ—ఈ మూఁడును లోకస్థానీయములు. అందుకనియే లోకములో వలెఁ గ్రామ క్రోధాదులు, భక్తి వైరాగ్యాదులు సూచించు చిత్రములు వానిపై నుండును. కామ క్రోధాదులను దెలుపు బొమ్మలే విచారణలేని మీబోంట్లకు బూతుబొమ్మలైనవి. ఇటులనే కొన్ని చోట్ల ఏడులు పదునాల్గువఱకుండును. అవి యన్నియు లోకస్థానీయములు.

యోగి—(గుడ్లు మిటకరించుచు గుడిమీఁదనుండి గోపురమును మోయుచున్నట్లుండునే! యీ వికృతాకారము లెందులకు ?

మాధ—తనకు స్వరూపభూతమగు ఆత్మతత్త్వమును మఱచి, కుటుంబముమీఁద తా నాధారపడి తనమీఁదనే కుటుంబమాధారపడినట్లు తలఁచుచు సంసారభారమంతయుఁ దనమీఁదనున్నదనుకొని కుంగిపోవు జడగృహమేధుల చిత్రము లివి; చూడుఁడు, విమర్శించు చూడుఁడు. ఇట్టి లోకస్థులను లోకంబులను దేహత్రయాదులను వెలిఁగించుచు సర్వాంతర్యామియై వీని కతీతుఁడుగా నున్నవాఁడే దేవుఁడని యాదేవునిగొల్చుటయే తరణోపాయమని చెప్పుటయే యాలయరహస్యము. ప్రభుసాన్నిధ్యముఁబోలె విశ్వవిభుసాన్నిధ్యమెల్లరకు సుగమము కానేరదు. అందుకనియే యీ కక్ష్యాభేదములు.

యోగి—అయిన దేవుఁడొక్కఁడనియే యనుచుందురే! ఈ రుబ్బుఱాతివలెనున్న యీ లింగాకార మేమి ? శంఖ చక్ర గదాద్యాయుధోపేతుఁడై చతుర్భుజుఁడగు ఈ గోపాలుఁడననేమి? దర్వీవిరాజితహస్తయగు నన్నపూర్ణ యననేమి ? మైమఱచి కనులుమూసికొనిన యీ వానరాకార మేమి ? ఆంగ్ల కళాశాలలో నుపాధ్యాయుల వలెను ఇందఱు దైవము లున్న భక్తి యెక్కడ నిలుపవలె ? ఎవ్వరిని సేవింపవలె ?

మాధ—అయ్యా! ఈ ప్రశ్నములెంతయు ప్రశంసనీయములు. ఈ లింగాకృతియే సకల జగత్కల్పనాధిష్ఠానము. ఇయ్యదియే కరచరణాదులు లేక స్వగత పరగతాది భేదములు లేక వెలుఁగొందు పరంజ్యోతి. "ఆపాతాళ నభస్థలాంతర లసజ్జ్యోతిర్మయం స్ఫాటికమ్" అని ఈ దివ్యమూర్తిని పాతాళము మొదలు నభస్థలము వఱకు నిండి నిబిడీకృతమై, విజ్ఞానమయమై, దివ్య తేజఃపుంజ మనఁదగిన స్ఫాటికలింగమని, పంచాక్షరీ మంత్రస్వరూపమని, సనాతన మని ధ్యానమొనర్తురు. ఈ మూర్తియే యుపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భాష్యములు మున్నగునవి నిరూపించిన దివ్యమూర్తి. ఇదియే యాత్మమూర్తి. అన్నపూర్ణయు, గోపాలుఁడును వశీకృతమాయామూర్తులై సేవించు భక్తుల నుద్ధరించుచు, ఆయాత్మమూర్తియం దైక్యముగావించు దివ్యాకృతులు. తొలుదొల్త దేహబుద్ధిచే దాసుఁడై పిమ్మట జీవబుద్ధిచే తదంశకుఁడై యటు పిమ్మట ఆత్మబుద్ధిచే తదూప్రుఁడై, శరీరేంద్రియభానము లేక యాత్మనిష్ఠుఁడై వెలుఁగొందుచు, భక్తి జ్ఞాన స్వరూప మనఁ దగిన మహాత్ముఁ డీ యాంజనేయుఁడు. వేద వేదాంగ ప్రతిపాదకములై, కార్మికులకు, భక్తులకు, తపస్వులకు, యోగులకు ధ్యేయములగు దివ్యమూర్తులీయవి. తత్త్వమెఱింగి యధికారభేదమున నా మూర్తులఁ గొలిచి యెందఱెందఱో ధన్యులగుదురు. ఇట్టి ఈశ్వరానుగ్రహ ప్రాప్తియే సకల భోగముల సమకూర్చి మానవులను జనన మరణ వ్యాధులనుండి తొలఁగించి మోక్షసామ్రాజ్యమున కర్హులఁ జేయును. ఇదియే భారతీయుల యౌన్నత్యము. దీనికొఱకే జాతులు, మతములు, నీతులు, నియమములు, ఆచారములు కావలసి వచ్చును. విజ్ఞుఁడగు భారతీయున కివి ప్రేమాస్పదములైన ట్లన్యములు కానేరవు. వేద రహస్య సూచకములై దేవతా రహస్యములను లోకులను లోకములను సర్వమును దెల్పు దేవాలయములను దైవములను విచారింపక సామాన్యదృష్టిచేఁ జూచి యేవగింపఁదలంచుట కోవిదలక్షణముకాదు. లోకమును ధర్మవిరుద్ధముగఁ బ్రవ

ర్తింపఁజేయుట యుక్తమార్గము కాదు. ఇయ్యది ప్రభువులకుఁగూడ హానికరము కాకపోదు.

యోగి — ఇంత యెందులకు? ప్రజాసామాన్యమునకభీష్టములగు పనులకుఁ దోడ్పడుటయే ప్రభుధర్మము. వారిధర్మముల వారు నెఱవేర్చుట లోకోద్ధరణము కాని యన్యము కాదు.

మాధ — ఇది భారతీయ రాజనీతి కానేరదు. స్వేచ్ఛాచారులుగఁ బ్రజల సిద్ధముచేసి, రాజ్యము నేలుట యెంతసులభమో ధర్మబద్ధత లేమి, అన్యోన్య కలహములును నిరంతరాశాంతియుఁగలిగి యట్టిరాజ్యము లంతరించుటకూడ త్వరితముగనే తటస్థించును. పునాదిబలము లేని సౌధము లెంతపెద్దవైనను స్థిరముగ నిలువనేరవు. ప్రవాహము వలె జనసామాన్య ప్రకృతి నిమ్నగతిగ నుండును కావున, భగవదంశజులైన ప్రభువులు, తలిదండ్రులవలె లోకహితకాంక్షులై ప్రజల కున్నతిసాధనము లగు ధర్మమార్గముల నడిపింపవలయును, గాని పతనహేతువగు స్వేచ్ఛావృత్తికిఁ దోడ్పడుట ధర్మపథము కానేరదు.

యోగి — ధర్మము, ధర్మమందురే? విద్యావినయసంపన్నుఁడగు బ్రాహ్మణునియందును, గోవునందును, ఏనుఁగునందును, కుక్కయందును, కుక్కను దిను మానవునియందును పండితులు సమదృష్టులని భగవంతుఁడగు శ్రీకృష్ణుఁడు గీతలయందుఁ జెప్పియుండెనే? అందఱొక్కటిగా నుండుట కేమి యభ్యంతరము? ఇంతకంటె ధర్మమేమి కలదు?

మాధ — మీరు చెప్పినచొప్పున అందఱొక్కటియేయైన శ్వానముల వలె తత్త్వవేత్తలుకూడ అశుచిభక్షణమే చేయవలసివచ్చును. ఆవుపాలవలె కుక్కపాలుగూడ పథ్యము కావచ్చును. కాని యందు కెవ్వరు నంగీకరింపరు. భక్తుని దృష్టికి ఆలయములోని దేవతావిగ్రహములవలె జ్ఞానిదృష్టికి ఉపాధులలోని పరమాత్మయే కనఁబడును. విగ్రహములకువలె, ఆత్మలకైక్యమును జెప్పుటయే దాని కర్థమగును.

యోగి—"చండాలోస్తు స తు ద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ" యని శంకరుఁ డొప్పుకొనెనే! దాని కేమందురు?

మాధ—ఆ శ్లోకములోని పూర్వార్ధమే దానిని నిర్ణయించినది.

యోగి—ఏమని?

మాధ—జాగ్రత్స్వప్న సుషుప్తులయం దేవిజ్ఞానము మిక్కిలి స్ఫుటముగఁ బ్రకాశించు చున్నదో, ఎయ్యది పిపీలిక మొదలు బ్రహ్మపర్యంతము, సకల దేహాంతర్వర్తియై, నిఖిల జగత్తునకు సాక్షిస్వరూపమై ప్రకాశించుచున్నదో, అట్టి విజ్ఞాన స్వరూపమే నేననితలంచితదన్యమగు యావద్దృశ్య ప్రపంచము నెవ్వఁడు నిరాకరించునో యాతఁడు "చండాలుఁడైననుద్విజుఁడైనను నాకుగురువగు"నని "జ్ఞానీ త్వాత్మైవ మే మతం" అను గీతావాక్యానుసారము, జ్ఞానికి, పరమాత్మకు అభేదమును సూచించుటయే దీనికర్థము. ఇంతియకాక, చండాలోస్తు అనుటచేతనే ద్విజోపాధులకుఁ జండాలోపాధులకుఁ గల భేదము స్పష్టమగుచునే యున్నది. పూర్వాపరములఁ జూడక సంప్రదాయముల నెఱుంగక శ్రుతిస్మృతుల కర్థము చెప్పఁ బూనుట, తననే గాక లోకమును గూడ వచించుట కాక మానదు. అందుకనియే అల్ప ప్రజ్ఞ కలవానినిఁ జూచి తనను దాఱుమాఱు చేయునని వేద మాత మిక్కిలి భయపడుచుండును!

యోగి—అదియటులుండనిండు. ఆత్మయొక్కటియైనప్పుడు ప్రకృతిమాత్రమేల యొక్కటికాదు? ప్రకృతిజన్యములగు శరీరములకు మాత్రమీ భేదమెందులకు? అందఱు నొక్కటియే యని యేల యంగీకరింపఁ గూడదు?

మాధ—ప్రకృతియనఁ నామరూపాత్మకమైనది. రామకృష్ణాది నామములును పృథివ్యాదిభూతముల రూపములును మాఱనేరవు. అందుకనియే వర్ణవ్యత్యయమెప్పుడును జేయఁదగనదికాదు. ఇంకఁ బ్రకృతి కేకత్వమన నయ్యది ప్రళయమునందేకాని యీలోపలఁ గలుగునది కాదు. ఇంతయెందులకు? ఎంతటిజ్ఞానికైనను పాధినియమము లుండక మానవు. అందుకనియే 'భావాద్వైతం సదాకుర్యాత్, క్రియాద్వైతం

న కర్హ్వాచిత్, అద్వైతం త్రిషు లోకేషు నాద్వైతంగురుణా సహా.' శరీరేంద్రియాదులమఱచి ఎంత యాత్మనిష్ఠుఁడై యుండినను జ్ఞాని గురు సన్నిధానమున నుపాధినియమములగు ప్రణామాదులఁ జేయక మానఁడు. అందుకనియే ఆత్మైక్యమేగాని శరీరైక్యము పనికిరాదు. అందఱమేకమగుటకు శాస్త్ర మంగీకరింపదు. మే మంగీకరింపము. మీరును మీమంత్రులుకూడ శాస్త్రవిరుద్ధముగ,ఆచారవిరుద్ధముగఁ బ్రవర్తింపరాదని మనవిచేయుచున్నాను. కాదందురా? మీ యిష్టానుసారముకానిండు; మా కనుజ్ఞయిండు; పోయివచ్చెదము.

గోపా—మాధవశర్మగారు! ఏలత్వరపడియెదరు? ధనధాన్య సమృద్ధమగు అగ్రహారమును వదలి సకలాభీష్టప్రదమగు ప్రభుకృప కేల దూరమయ్యెదరు? నామాటవిని రాజాజ్ఞల నిర్వర్తింపుఁడు. యువరాజును వలె నాదరించుచుఁ గాలు క్రిందఁబెట్టకుండఁ గనకాసన మధిష్ఠించి యుండునట్లుచేసెద; రండు పోదము. [అని చెయ్యిఁబట్టుకొనును.]

మాధవ—మంత్రిశేఖరా! నాలుగుదిక్కుల నాలుగువేల సంవత్సరములు ఘోరతపస్సుచేసినను, విశ్వామిత్రునివంటివాని కలభ్యమైనదే, బ్రాహ్మణ్యము! అట్టి బ్రాహ్మణ్యము నొక్క ప్రభుకృపకు, నొక్క కనకాసనమునకుఁ గట్టివైచి జీవితలాభమంతయు వ్యర్థమొనరించుకొ మ్మందురా?

చ. క్షితిసురవంశజుండనయి ♦ కీడ్పడఁజేసి స్వధర్మ మర్థ సం
గతికిటు లెన్నఁడేనియును ♦ గైవసమై చరియింతునేని దు
ర్గతిఁగని యన్యులంజెఱుపఁ♦గాఁ దగువాఁడనుగాక యుందునే?
వితతభవాబ్ధివీచికల ♦ వెల్వడనేర్తునె? యెన్నఁడేనియున్.

అంతియేగాక యీ మాధవశర్మ యెప్పుడును బదవులకును ధనకనకాదులకును లోఁబడువాఁడుకాఁడు.

గీ. ధనము మఱి యేమి? మేరు భూ♦ధరమునిడినఁ
దనిసి ధర్మంబు విడునె? స్వ♦ధర్మపరుఁడు,
అర్థకామంబులకు ధర్మ ♦ మఱఁచు టరయఁ
దల్లి నడువీథినమ్మువి♦ధమ్ముకాదె?

కాన మీ యాజ్ఞ నెఱవేర్పఁజాలనందులకు మన్నింపవలె.

గోపాల—శర్మగారు! రాజున కభిమతమైనదే ధర్మము. దానికి భిన్నముగ జరుపు మఱియే ధర్మమునకును దావుండదు. ప్రాఁతధర్మసూత్రములఁ బట్టుకొని వ్రేలాడు సనాతనులు ప్రజలకుఁ బ్రభువులకుఁ బనికిరాక పై పెచ్చు వారియాగ్రహములకు నిగ్రహములకుఁ బాత్రులుకావలసివచ్చును. శాపశక్తిగల వసిష్ఠాదుల మనుకొనక ధనుష్మదగ్రణు లగు ద్రోణాదుల మనుకొనక పాతరవడిన గింజలు విత్తనములకుఁ బనికిరానట్టు ప్రాఁతవడ్డ బ్రాహ్మణ్యము ఫలసాధకము కాదని నిశ్చయించి సారహీనమగు సనాతనత్వమునకు సన్న్యాసము నిప్పించి మా మాటలు విశ్వసించి సౌఖ్యమనుభవింపుఁడు. కాదందురా? మీకంటె నుత్తము లనిపించుకొన్న సనాతనులచే శాస్త్రసమ్మతమని యొప్పించి మీ బ్రాహ్మణ్యమును మీయాధ్యాత్మిక తత్త్వమును లోకమున వెదజల్లించెద. సర్వమునేకముగావించెద. మీ రేమిచేయఁగలరో విచారించెద.

మాధ—[శిరఃకంపము చేయుచు] మంత్రిశేఖరా! సూర్యుఁడు సనాతనుఁడు. చంద్రుఁడు సనాతనుఁడు. ధర్మము సనాతనము! అట్టి సనాతన ధర్మములే భరతదేశమహాలక్ష్మి కమూల్యములగు మణికిరీటాంగదాదులు. అవియే జనుల కిహపరసాధకములు. మఱియు నో మంత్రిపుంగవా! ఎంతటి చక్రవర్తియైనను దనకుమారుల నెల్లరఁ జక్రవర్తులఁ జేయనేరఁడు. ఎట్టి పండితుఁడైనను బుత్త్రుల నందఱఁ బండితుల నొనర్పఁజాలఁడు. ఎటువంటి మహాత్ముఁడును గుటుంబమునంతయు నొక్కవిధముగ నడిపింపనోపఁడు. కాఁపుబిడ్డయైన దున్నిన నేల వెదవేయును గాని కన్నులు మూసికొని భూమియంతయు నొక్కటియే యని చవిటిపఱ్ఱలను బీటినేలలను విత్తనములుపోసి, విఫలుఁడు కానేరఁడు. జనసమూహమున నొకానొకనికి బహుజన్మ సుకృత పరిపాకమున లభింపఁదగిన, బ్రాహ్మణ్యమును ఆధ్యాత్మిక తత్త్వము నంతట వెదజల్లించెదరా? ఇది తెలియనిమాట; సాహసము. ధర్మప్రాశస్త్యమును దడవనేరక, విజ్ఞాన విభవమున వెలయఁజాలక అధి

కారబలమునఁ బల్కు మీబోంట్ల పల్కులకు విజ్ఞతకలవారెవ్వరును వీనులొగ్గనేరరు. స్వమతాచారపరాఙ్ముఖులు కానేరరు. ఇంతియే కాక,

శా. శాపంబిచ్చెడు శక్తిలేదు కడుని♦స్సారంబు లిమ్మేను లే
ప్రాపున్ లేదని మమ్ము పాఱుల నిటుల్ ♦ వంచింప యోజింతె మా
ప్రాపున్ బ్రోపును ధర్మమాహరియు ధ♦ర్మప్రాభవుం జెయ్యెడన్
రాపుల్ వెట్టఁగనోర్చునే విభవసం♦త్రాణంబు గావింపఁడే ?

ఇంతయేల?

చ. కలకల వేదనాదములు ♦ గ్రాలుచునుండఁగ విప్రులందు దే
వళముల నర్చనాదిక మ♦పారముగా వెలుఁగొందుచుండ రా
జులు భటులన్నభేదములు ♦ చొప్పడుచుండ మహోజ్జ్వలత్సతీ
తిలకములుండ నీభరత♦దేశము ధర్మమువీడి యుండునే?

గోపాల — ఏమీ! అంతటినిశ్చయమా?

మాధవ — అంతియేకాదు. ప్రణవము త్రిమూర్తులకువలె, ధర్మమే అన్నిపురుషార్థముల కాధారము. అట్టిధర్మము నెన్నియిక్కట్టులు వచ్చినను విడువఁజాలను.

గీ. అస్థిచర్మామిషమయంబు ♦ నస్థిరంబు
దేహమిది పోవుననుచుఁ జిం♦తిలఁగఁబోను
సురపురకవాటపాటన ♦ కరము మోక్ష
ఫలకమయిన స్వధర్మంబు ♦ వదలఁబోను.

గోపాల — మాధవశర్మగారు! రాజశాసనమునకు దయాదాక్షిణ్యములు లేవు. బంధుత్వ మిత్రత్వములు లేవు. మిమ్మేమిచేయవలసివచ్చునో యని విచారించుచున్నాను. మితిమీఱక రాజాజ్ఞల నిర్వర్తింపుఁడు.

మాధవ — మంత్రివర్యా! ఒకజాతి నుద్ధరించుట యనుపేరున ఇతర జాతుల నిర్బంధించుట యుక్తముకాదు. బలవంతమునఁ జేయు కలయికచే నెవ్వరికయిన శిరములువంగినను చిత్తములు లొంగనేరవు. ధర్మబద్ధుఁడనై నియమబద్ధుఁడనైన నేను దేశీయసోదరులఁ గాదని ప్రతిదేశమునఁ బ్రతికులమునఁ బ్రతిగృహమున వెలయుచున్న

జాతిమతాచార సాంప్రదాయములకు విరుద్ధముగ మీయాజ్ఞాబద్ధుఁడను గాఁజాలను. మీచే నున్న కఠినశాసనముల కేకాదు, కఱకు కరవాలముల కేకాదు, చెఱలకు, ఉరులకుఁగూడ నేను వెఱవనేరను. చేయుఁడు. మీయిష్టానుసారము చేయుఁడు.

గీ. స్వర్గసోపానములఁ జేయ ♦ వలతు రేని
సరఁగఁ గొనుఁడింక బ్రాహ్మణ ♦ శల్యములను
దారిబత్తెంబుగాఁ గొనం♦ దలఁతు రేని
విప్రరక్తామిషంబులు ♦ వీఁకఁగొనుఁడు.

ధర్మమునకై వెచ్చింపఁ దలఁచిన యీశరీరమును గైకొనుఁడు. మీయిష్టానుసారముగై కొనుఁడు. [అని నడుమునకు బట్టచుట్టి నిలుచును.]

పౌరులు—అయ్యా! మేముకూడ ధర్మవిరుద్ధముగఁ బ్రవర్తింపనేరము. మమ్ముఁగూడ మా మాధవశర్మగారితోఁబాటు చేయుఁడు. మీయిష్టానుసారము చేయుఁడు. [అని కొందఱు నడుములుకట్టి ముందునకు వత్తురు]

గోపాల— [తీవ్రముగఁ జూచుచు] పౌరశ్రేష్ఠులారా! మీ కిందుఁ బ్రసక్తి లేదు. నిలువుఁడు. దూరముగ నిలువుఁడు. మాధవశర్మగారు! మిమ్మిప్పటికి వదలివేయుచున్నాను. నడువుము. శీఘ్రముగ నడువుము.

భటుఁడు—అయ్యా! దయచేయండి. [అని సమీపించి చేయిఁబట్టుకొనును.]

మాధవ—అయ్యా! కొంచె మనుగ్రహింపుఁడు. ఆలయదేవతల సెలవుఁ గైకొని పోయెద.

గోపాల—త్వరగఁ గావలె.

మాధవ—చిత్తము. [ఆలయముల యెదుట నిల్చి] విశ్వనాథా! నీ సేవకు దూరమగుచున్నాను. గోపాలదేవా! మా స్థితి నరయుచుండుము. అన్నపూర్ణాదేవీ! మమ్మాదరింపుము. ఆంజనేయా! మనోజవము కల్పింపుము. ఓ నా యాలయదేవతలారా! మీ రెల్లరు

నన్నిట్లు వెడల నడుచుచున్నను నేను మాత్రము మిమ్ము విడనాడు వాఁడనుగాను.

మ. వడిగా నూర్ధ్వేడలించిన౯ విడను ద♦ల్వ౯ వచ్చునాచెంతకు౯
జడధుల్ కానలు క్రోనలు౯ నగములు౯ ♦ సర్వంబు వాదేల? నీ
గుడిని౯ నిన్నును నీసతి౯ బవనుజు౯ ♦ గోపాలు నూరూరు వెం
బడిఁ గొంపోవుచు నిల్పనే? కవికి లో♦పంబున్నె? విశ్వేశ్వరా!

విశ్వపతి, పూజారి ప్రభృతులు [నమస్కరింతురు.]

మాధవ— ఇంతియేకాక, మీ ప్రతి రూ ప ము లీ సంపుటమునఁ గలవు. మీకు మాఱుగ వీనినిఁ బూజించుచు, మీ సేవాఫలమును బొందుచుండెద. ఇంక దయతో నా కనుజ్ఞయిందు. [అని నమస్కరించి] విశ్వపతీ! ఇంకఁ జోదముపద. [అని మూటఁబట్టుకొనఁ బోవును.]

అర్చకుఁడు—అయ్యా! మీ మూటను నేను దెచ్చెద. మీరు వదలుఁడు దయతో వదలుఁడు. [అని గ్రహించును.]

మాధవ—మంచిది, కానిమ్ము. [మఱల ఆలయములకు నమస్కరించి నడచుచుండును.]

సభాపతి—[యోజన నభినయించి యాతురతతో] మాధవశర్మగారు! మీరు వెళ్ళఁగూడదు. ఆఁగండి. [అని సమీపించును]

మాధవ—ఎందుచేత ?

సభాపతి—మంత్రివర్యా! మాధవశర్మగారికడ నున్న దేవతార్చన పెట్టె గ్రామసంబంధమయినది. అది యిక్కడనే యుండవలె. మాది మా కిప్పింపఁగోరుచున్నాను. [అని నమస్కరించును]

గోపాల—మాధవశర్మగారు! ఇదియేమి?

మాధవ—అయ్యా! మాపూర్వులచేఁ బూజింపఁబడుచున్న సాలగ్రామములుగల సంపుటమిది. మాదికాని, వీరిది కానేరదు.

సభాపతి—అయ్యా! ఈ గుళ్ళు, దేవుళ్ళు సాక్షిగ ఇది మాగ్రామ దేవతార్చనపేటిక. మాది మాకిచ్చితీరవలె. సర్కారువారు దయతో

మా విగ్రహములను మాకు దయచేయించవలె. వలయునన్న ప్రమాణ పూర్వకముగ అర్జీ వ్రాసికొనియెద.

గోపాల—అయిన వ్రాసి యిమ్ము.

సభాపతి—చిత్తం ఆలాగేనండి. [ఆతురతతో జనాంతికముగ] కరణం గారు! దేవతార్చన పోతున్నది. దక్కించుకోవాలె. ఈశ్వరసాక్షిగా అది మనదే అని నాలుగుముక్కలు వ్రాసిపెట్టండి బాబు! త్వరగా వ్రాయాలి. [అని బతిమాలును]

కరణము—[వ్రాయుట నభినయించుచుండును.]

మాధవ—[స్వ] ఔరా! ఈ సభాపతి యెంతకు సాహసించినాఁడు! అన్యాయమున కెంతటి యవకాశము కలుగుచున్నది! మంత్రుల సాన్నిధ్యమే యింతటి కుతంత్రముల కాస్పదమగుచుండ, దూర దూరమున నుండు కార్యస్థానముల వేఱుగ నడుగవలయునా? పూర్వము గంటములతో వ్రాసెడుకాలము. గంటమునకు నాలుక యొక్కటి. ప్రస్తుతము కలములతో వ్రాసెడు కాలము. కలమునకు నాలుకలు రెండు. ఇంక సత్యము మృగ్యముగా కెటులుండును?

సభాపతి—[అర్జీమీద దస్కతుచేసి అయ్యా! అనుగ్రహించి మా దేవ తార్చనపేటికను మాకు దయచేయించి పుణ్యం కట్టుకోండి. [అని మంత్రికి కాగితము నిచ్చును.]

గోపాల—మాధవశర్మగారు! సభాపతిగారు ప్రమాణపూర్వకముగ వ్రాసినారు. ఇంక దేవతార్చనపెట్టె వారికిచ్చివేయుఁడు.

మాధవ—సభాపతీ! సత్యనారాయణ! చేసినది చాలక, నేను దేవతార్చన చేసికొనుట కూడ నీ కిష్టము లేకపోవలయునా! అన్యాయ మధః పతితులఁ గావింపక మానదు. చేయుము. శక్తి యున్నంతవఱకుఁ జేయుము. [మంత్రిదిక్కై] అయ్యా! గ్రహింపుఁడు. [అని పెట్టెనీయఁ బోవును.]

గోపాల—సభాపతిగారి కెందు.

మాధవ—అయ్యా! ఎంతయు నసత్యమును గల్పించి వంచింప నెంచు నీతని యపవిత్రహస్తముల నేను ముట్టనేరను. ఈపెట్టెను ద్వారము కడ నుంచెద. [అని యాలయములకడ నుంచి చేతులు జోడించి]సన్నిహిత దేవతలారా! నేఁటితో మీ పూజాభాగ్యముకూడ వదలిపోయెనే, యేమి సేయుదును?

[నిలిచినిశ్చేష్టుఁడై నిట్టూర్చి] ఓరా! అగ్రహారములు, ఆలయములు, గృహదేవతార్చనముకూడ లేకపోవలసివచ్చెనే? బ్రాహ్మణుఁడా! నీ వకారణముగ లోకమునకు వెక్కసమవైతివి. అపరాధులకు శిక్షాస్మృతులవలె, అలసులకు నీనియమము లాగ్రహకారణములైనవి. నీ బ్రాహ్మణశబ్దము జనులచెవికిఁ గంటకప్రాయమైనది. ఇంకనీకు నిలువనీడ లేదు. చొచ్చుటకుఁ దావు లేదు. నీధర్మమును నీవు నిలుపుకొనఁజాలవు. నీ వభాగ్యుఁడవు. నీజన్మము వ్యర్థము. పొమ్ము, నెత్తిన గుడ్డవేసికొనిపొమ్ము. జాతిమతవిరహితుఁడవై పొమ్ము. దూరదూరముగఁబొమ్ము. ఎవ్వరికిఁ గనఁబడకుండ శీఘ్రముగ లేచిపొమ్ము. [ముందునకు నడచి] హృదయమా! త్వరపడకుము. మాధవశర్మ! నీవెంతలో నెంత తాలుమాలుగుచుంటివి! రాణాప్రతాపసింహునకు ధనరాశినొసంగి సంగ్రామరంగమున సకలవిధములఁ దోడ్పడి ఆతనిని శాశ్వతకీర్తివిభ్రాజితునిఁ జేసిన భామాషాహి బ్రాహ్మణుఁడు. బుక్కరాయాదులను నరసరాయని నరపతిశ్రేష్ఠులఁగావించి విశ్వశ్రేయమునకై వేదభాష్యములను వివిధగ్రంథములను వ్రాసిన మాధవాచార్యుఁడు బ్రాహ్మణుఁడు. నందవంశచ్ఛేదన మొనర్చి ప్రతిజ్ఞాపరిపాలకుఁడై విరాజిల్లిన చాణక్యుఁడు బ్రాహ్మణుఁడు. ప్రభురక్షణమునకు దేశరక్షణకుఁ బాల్పడిన తిక్కన యుగంధర తిమ్మరుసు ప్రభృతులు బ్రాహ్మణులు. భరతదేశాలంకారులై ప్రసిద్ధివడసిన భారతీయప్రభువర్యులకెల్లరకు గురువు మార్గదర్శి యాచార్యుఁడు సేనాపతి సర్వము బ్రాహ్మణుఁడు. అట్టిబ్రాహ్మణరక్తము నిర్జీవముకానేరదు. ఆమహత్తర పరమపవిత్రరక్తరేణువు లింకను ఈ నీశరీరమున నినుకలేదు.

నీ కసాధ్యములేదు. విచారింపకుము. ఈ యాలయము లేల? యీ దేవతార్చనయేల? నీకు నీ దేహదేవాలయముకలదు. అందు సనాతనుఁడైన జీవదేవుఁడుకలఁడు. అజ్ఞాననిర్మాల్యమును దొలఁగించి "సోహంసోహం"అని పూజింపుము. నిన్నెవ్వరు అడ్డగింపనేరరు. నిన్నేమియుఁ జేయనేరరు. నీకదియే ధ్యేయము. అదియే నీపరమ పదము. [దృష్టినిగిడ్చి] దేవదేవా! నీవే నాకింకశరణ్యము. నా హృదయకర్పూరమును వెలిఁగించుచున్నాను. ఆ హారతి నందు కొని నన్నుద్ధరింపుము. [అని కనులుమూసి] ఆహా! ఏమి యీ దేవ దేవుని యనుగ్రహము! ఎట్టి మనోహరదృశ్యము, ఎట్టి యద్భు తము, ఎట్టి యానందమయము!!!

శా. అన్యంబింతయులేదు భూతతతి ది♦వ్యశ్రేణి బ్రహ్మాండముల్
విన్యస్తంబగు నిర్మ్యోడన్, సకలముఁ ♦ వెల్గొందుచున్ డాఁగు, సా
మాన్యంబౌ కనుదోయి యిద్దిగనునే ♦ మాయన్ దొలంగించి నన్
ధన్యున్ జేసితివయ్య! దేవ! మహదా♦నందానుసంధాయివై.

[మఱల ధ్యానమునటించి పరమోత్సాహముతో] నేనే సర్వ దేవతా స్వరూపకుఁడను, నేనే సర్వజగత్స్వరూపకుఁడను, సర్వము నేనే! నేనే.

గీ. సకలము సృజించుచుండెడి ♦ స్రష్ట నేను
చండగతివెల్గు తీక్ష్ణక♦రుండ నేను
దివిజనాథుఁడ నేను వా♦యువును నేను
లేదు నాకంటె నితరంబు ♦ లేదు లేదు.

[పై పద్యముచదువుచు శిష్యులతో నిష్క్రమించును.]

అందఱు—[ఆశ్చర్య మభినయింతురు.]

యోగి—[నిశ్చేష్టుఁడగును.]

గోపాల—[నిట్టూర్చి శిరఃకంపము చేయుచుండును.]

పౌరులు—[వెడలుచుందురు.]

గోపాల—[ఆశ్చర్యముతో] పౌరులారా! మీ రెచ్చటికిఁ బోయెదరు?

రామిరెడ్డి—అర్చకుఁడు, గుడిధర్మకర్తగారే వెళ్లిపోతే, ఇంక మేమేం చెయ్యేం? మాకుకూడా సెలవు దయచేయించండి.

గోపాల— వెళ్ళఁగూడదు. మీరందఱుగలిసి తీర్థప్రసాదములు గ్రహించవలె.

అందఱు—[ఆగుదురు.]

రామిరెడ్డి—ఇవ్వాళ తీర్థప్రసాదాలు, రేపు భోజనభాజనాదులు, ఎల్లుండి పెళ్ళి పేరంటాలు! బాగుంది, భరతదేశప్రశస్తి! మహాబాగుంది! చెయ్యండి, యింక మంత్రులయిష్టం వచ్చినట్టు చెయ్యండి. మమ్మెల్లందఱ్నీ వెట్టివెంగళప్పల్ని చెయ్యండి.

గోపాల—రెడ్డిగారు! త్వరపడకుఁడు. మీ యైకమత్యమే మీ యభివృద్ధికి మూలమంత్రము. అయ్యదియే మీ యౌన్నత్యసౌధమునకుఁ బ్రథమసోపానము. రాజకీయరంగమునఁ బ్రస్తుత మింతకంటెఁ బ్రభువశీకరణమునకుఁ బరమహంసక్రియ మఱియొకటిలేదు. ఇది మీకోర్కెలు కొనసాగించును. అఖిలైశ్వర్యము లందఁజేయును. వినుఁడు. మీహితమునుగోరి చెప్పెడు నామాటవినుఁడు. మీరింక జాతిమతములను ఎక్కువతక్కువలను వదలి యన్నదమ్ములవలె మెలఁగుఁడు.రండు. ఆలయములకురండు.[అని యందఱ ననునయించును.]

రామి—అయ్యా! ఎండైన నెండమావులు దాహశాంతిఁజేయునా? ఊసరవెల్లివలె క్షణక్షణమునకు మాఱురాజకీయరంగమునునమ్మి యెవ్వఁడు విశ్రాంతి నందఁగలఁడు? ఇంతియేగాక, జాతిమతములను వదలిన సకలాభీష్టములు కలుగుననుట తలతీసికొనిన దంతావళ మెక్కించెద నన్నట్లుండును. అభీష్టసిద్ధులను, రాజానుగ్రహమునే కాదు. మహారాజ్యమునైనను త్యజించి ధర్మదీక్షితుఁడగుట భారతీయున కలంకారము. దేశప్రశస్తినిఁగన్న భారతీయ విజ్ఞానమునకంటె అన్యములుత్కృష్టములు కానేరవు. అగ్రహారీకులను, అర్థవంతులను అణచి వైచితి మనుటకాదు. శాసనాయుధములచే సర్వమునకు మార్పు చేయుద మనుటకాదు. భూస్వాములు, పాలేర్లు, ప్రభువులు, ప్రజలు, సమానము కావలసివచ్చినప్పుడు క్ష్మాపతుల సమదృష్టి

బయలుపడకపోదు. నిర్బంధవిధానము నీతిసమ్మతముకాదు. వదలుఁడు. మమ్ముఁవదలుఁడు. అట్లుగాక రాజశాసనప్రయోగ నెపమున మమ్ముల రాతివిగ్రహములఁజేయఁ దలంచితిరా చేయుఁడు. చేతులఁగట్టి చెఱలఁబెట్టి అందఱనొకటిచేయుఁడు. మిమ్మటతీర్థప్రసాదములనే గాదు; మీయిష్టము వచ్చినట్లు చేయుఁడు. ఆలస్యమేల? వేయుఁడు. బేడీలు వేయుఁడు. [అని ధైర్యముతో నిలుచును.]

ఇతరులు—చేతులు గట్టించి చేయండి; మీయిష్టానుసారం చేయండి. [అని నిలుతురు.]

యోగి—[ఆశ్చర్యముతోఁ జూచును.]

గోపాల—[నిట్టూర్చి] సభాపతిగారు! మీరేమందురు?

సభా—దేముఁడు దైవం సర్వము నాకు మీరు. మీరేంజెయ్యమంటే అదిచేస్తా.

గోపాల—మంచిది. గుప్తగారు! మీయభిప్రాయమేమి?

సుబ్బి—చూచారుగదా! మహానుభావుడు, మాధవశర్మగారు, అదేమిటి ఇదేమిటి, నాదేహమే దేవాలయం, జీవుడే దేవుడు అన్నాడు. కాకపోయినా తమరేమనుకున్నా సరేగాని వారిల్లే ఒకదేవాలయం, ఒక పాఠశాల, ఒక ధర్మసత్రం. వారికి గుళ్లుపోయినా యేంపోయినా ఏవిగ్రహాన్నో, ఏలింగాన్నో, యే రుద్రాక్షనో, అది యిది కాకపోతే ఇంతమట్టితో జేసిన లింగాన్నో పూజేస్తారు. ఎటువచ్చి మధ్య వాళ్లకే యిబ్బంది. అయినా అందఱు ఒక్కటే, గుళ్ళల్లోకి రావాలంటారే తలలైనా తీసుకుంటామంటారుకాని వైష్ణవులు శివాలయాల్లోకి, శైవులు విష్ణాలయాల్లోకి వస్తారా? దానికీ శాసనాయుధమే నంటారా? అదిసరేకానీ, [మాలమాదిగలనుజూపి] వాళ్ళక్కడ వీళ్ళిక్కడ నిలుచున్నారే యెందుకో ముందడగండి.

గోపాల—మీరెందులకు వేఱువేఱుగా నిలిచితిరి?

పంచములు—[ఒకరినొకరు చూచుకొందురు]

సుబ్బి—చెప్పండోయ్ చెప్పండి. దాచకుండా మనసులో మాటలు చెప్పండి. [అని ప్రోత్సహించును.]

వెంకఁడు—మేం మాదిగోళ్లం. ఆళ్ళు మాలోళ్ళండి, దొరగారు! మేం ఓర్నోరం తాకమండి. ఇందులో డొక్కలోళ్లు, ఆళ్ళు ఈళ్ళు సాలా కులాలున్నయండి. మాకులం మాఆశారం మాబావులు మాదేవర్లు అంతాఏరండి. ఆళ్ళవన్నీ యేరండి. ఎక్కడా మేం కలియమండి. అందుకనే యేరే యేరే నిలుసున్నామండి.

గోపాల—[మాలలవంకఁజూచి] ఏమి యీమాట నిజమేనా?

మాల—పెబువులకాడ అబద్దం వస్తుందా దొరగారు? ఆ శెప్పిందంతా నిజమేనండి బాబయ్యా!

గోపాల—ఇప్పుడు మీరుమీరు కలిసి గుళ్లో తీర్థప్రసాదాలు తీసికొనవలె.

వెంకఁడు—[ఒకరినొకరు చూచుకొందురు] దొరగారు! తండ్రి తాతల కాణ్ణుంచి మేం కలియటంలేదండి! మేం వొప్పుకున్నా, ఆ డోళ్ళస లొప్పుకోరండి! ఎరే యిప్పించాల్సిందేనండి.

మాలమాదిగలు—ఏరే ఏరే కావల్సిందేనండి. [అని నమస్కరింతురు]

గోపాలఁ—చౌదరిగారు! మీ యభిప్రాయమేమి?

చౌదరి—అయ్యా! హరిజనోద్ధరణముకొఱకు మేము వ్రాసిన వ్రాతలు చేసిన ప్రచారములు మా వాళ్ళు సాగించిన సినిమాప్రయత్నములు కూడా, లోక మెఱుఁగని విషయముకాదు. ఈ ప్రయత్నమంతయు నెప్పటికప్పుడు గాలిదుమారమువలె ధూళిని లేపి కొమ్మలఁ గదల్చునేకాని జాతిమతసాంప్రదాయము లను చట్టాలను గదల్పలేక ధర్మవృక్షమూలముల పొంత పోనేరకయున్నవి. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులలోని భేదములైన తడకలవలెనుండును గాని తదితర జాతులలోనిఅంతర్భేదములు ఇటుకగోడలవలె ఇనుపగోడల వలె నుండును. మొన్న నే నొక పెద్దకమ్మమిత్రునింట భుజింపవలసి వచ్చినది. అచ్చట నాకు స్త్రీసందర్శనములేదు సరికదా? వెలుపల గదిలో పాలేరు వడ్డించుటయు దాసీది విస్తరిలేయుటయుఁ దటస్థించినది, మంచితీర్థము త్రాగిన చెంబును తొలిచినఁజాలక తోమినఁగాని యజమానురాలింట నుంచుట కాజ్ఞయిచ్చినదికాదు. ఇంక నితరవిష

యము లెంతతీవ్రములుగా నుండునో తెలిసికొనవచ్చును. ఇంతియే గాక దొంగలువచ్చెడురోజులలో జనులకు జాగరూకత కలిగినట్లు మన యీ ప్రయత్నములెంతయు నశాంతికరములై జుట్టుపట్టుక లాగినట్లు ప్రజలను మేల్కొల్పుచున్నవి. నే నెంత సంస్కరణాభిలాషి నైనను ఎంతప్రయత్నించి చూచినను నా కీయుద్యమము ప్రయోజనకారి కాదని తోఁచినది. హృదయమును వంచించి లోకమును మోసగించుట మహాదోషమని తలంచి నిజముచెప్పిన నా యీ వాక్యములు మన్నింపఁగోరుచున్నాను.

గుప్త—[జనాంతికముగా] చౌదరిగారు! సత్యము చెప్పినారు. మొన్న నేను వంటరిగా అడిగినప్పుడు చెప్పినమాటే చెప్పారు. చాలా సంతోషం. [ప్రకా] అయ్యా! మహామంత్రులు చెప్పారని భయానికో భక్తికో యివ్వాళ వాళ్లూ మేము కలిసి గుళ్లోకి పోయినా రేపువాళ్లూపోరు. మేమూపోము. ఇదంతా గుళ్లు పాడవటానికీ దేవుణ్ణి మరచిపోవటానికేగాని యింకెందుకు పనికిరాదు. ఏంపోయినాసరే కాని, చూస్తూచూస్తూ జాతి మతం పోయిందంటే ప్రాణంపోయినట్టుగా వుంటుంది. వాళ్ళనుద్ధరించాలంటే మా మాధవశర్మగారు చెప్పినట్టు జాగీరుసొమ్ము ఖర్చుపెట్టండి. లేదా చందాలు వేయించండి. అక్కడ ఋణాలబిల్లుతో పోతేయేంజేశాం; పదింట్లో పదకొండు, నే నొక్క వెయ్యిరూపాయిలిస్తా. అదీ కాదంటారా వీళ్ళకో వెయ్యి వాళ్లకో వెయ్యి యిస్తా. చేస్తే వాళ్ళను మానవాధికుల్ని చెయ్యండి. ఇంకా చేస్తే దేవతల్నిగూడా చెయ్యండి. మమ్మల్ని వాళ్ళను మాత్రం కలపకండి.

రెడ్డి—గుప్తగారి యూహాయు త్యాగమును మిక్కిలి ప్రశంసనీయములు, నేనును మా సంఘమునుండి రెండు వేలు వసూలుచేసియిచ్చెద.

చౌదరి—నేనును మా మిత్రమండలినుండి రెండు వే లిప్పించెద. చేయుఁడు, హరిజనుల కుపకారముచేయుఁడు! మునుముందు, త్రాగుడుభూతమును వదలించి వారుచేయు పశుహింసను మానుప్రయత్నమును గూడ చేయుఁడు.

వెంకఁడు—అయ్యా! మేం తాగటం బతికున్నోట్ని కొయ్యటం మానే శామండి?

గోపా—అదియెట్లు?

వెంక—ఒకరోజున మావోడోడు తాగి బట్టలేకుండా దార్లోపుట్టమీద పడిపోతే పాంగరిస్తే మాధవయ్యగారు శూశి మావోణ్ణిముట్టుకొని మందిచ్చి వుపశారంశేశి రచ్చించి వాడయ్యకి గురవయ్యకు కప్ప శెప్పి దార్లోపడిపోతాడేమోనని సూస్తా గూడంకాడికొచ్చారండి. మేం అంతా గూడెంకాడ ఆవుపెయ్యకోతకొస్తే కొని కొయ్యబోయాలికి ఆదొరగారు అడ్డమొచ్చి పెయ్యనుపట్టుకొని కళ్లెంట నీరుకారుస్తా, ఆ ఆవమ్మగొప్పంతా గంటసేపుసెప్పి యీ ఆవుతల్లి మనకందఱికీ తల్లి, దీనిశాతనే లోకాలన్నీ బతుకుతున్నాయి. దీన్నికోస్తే మీ తల్లి గొంతు కోసినట్టు నాగొంతుకోసినట్టు, అని వోట్టెట్టుకుని పాతిక రూపాయిల వుంగరం మేం వద్దన్నా మాకిచ్చి ఆవునురచ్చించి, మమ్మల్నింక ఆవుల్నీ బతికున్న జీవాల్నీ కొయ్యొద్దని తాగుడు మానే శెయ్యమని మాకింకా శానాశానా శెప్పారండి. వార్నిసూశి వారి మాటవినాల్కే మా దేహాల్లో నెత్తురంతా సచ్చి మాతలలు తిరిగి పోయినాయండి. మేం ఇంక బతికునోట్ని కొయ్యమని వోట్టెట్టు కున్నామండి. తాగుడు మానేశేస్తామని కట్టుకట్టుకున్నామండి, గూడెంలో ఆర్నెల్లనుంచి తాగుడుకాని బతుకునోట్ని కొయ్యటం కాని లేదండి, ఇంక మా శిరుస్సులుపోయినా అన్నమాట ప్రికారం జరిగేదేనండి. ఆదొరగారు, మాదవయ్యగారు గూడెంగూడెంకాడికి పోయి అందఱికి ఆవుతల్లిమలత్తుసెప్పి అందరిశేత తాగుడు బతికు నోట్ని సంపటం ఆపుశేశారండి. ఇరువయి ముప్పయి గూడాలు మా ఆశారంగా వున్నయండి. ఇంక మాకు కోత, తాగుడు ఇశయం శెప్పక్కర్లేదండి. శేశే వుపకారం శెయ్యండి. దొరగారి సెలవైతే మావోళ్ళ అందఱిపచ్చాన ఒక్కమాట శెప్పుకుంటానండి.

గోపా—అవశ్యము చెప్పవచ్చును. చెప్పుము.

వెంకఁడు—దొరగారు! బాగా యినుకోవాలండి.

గోపా—వినుచున్నాము.

వెంకడు—మా తాతముత్తాతరోజుల్లో సాయెబుదొరలొచ్చి మాశాత పన్లు శేయించుకుంటా మీారు మేం వకటేననుకుంటా మమ్మల్ని కలుపుకుంటా వున్నట్టుండి మా తోళ్ళయవారాలు, మా చెప్పులదుకాణాల యావారాలు అన్ని కాజేశి మా కూళ్ళల్లో సగం మన్నుకొట్టారండి, దొరగారు! అదంతా మాది మాకుంటే లచ్చలకు లచ్చలు సంపాదించోళ్ళమేనండి. ఇప్పుడీ యింగిలీసులు సదివినోరు మీారుమేం అంతా ఒకటేనంటూ లెక్కశెర్లు శెప్పి శేతులు శేతులుపట్టుకునేవోరు అందరు అన్నిపన్లు శెయ్యవచ్చునంటా వుండేవారు, మా తోళ్లు ముందరేసుకొని మా నోటికాడి జీవనం కాజేత్తారేమోనని మా బయంగావుందండి. మారాజుగారి తరువాత మారాజులంతోరు మంతిరిగారు! మీారు మా బీదోళ్లమీాద దయవుంచి యీారెడ్డివర్ని మా తోళ్లజోలికి రాకుండా శెయ్యండి. దండమెట్టుకుంటాం.

మాలమాదిగలు—దొరగారు! మానోటికడ్డం రాకుండా, మాకడుపుల మీాద కొట్టకుండా సెయ్యండి. అదే మమ్మల్ని ఉద్ధరించడం బాబు!

[అని నమస్కరింతురు]

గోపా—మీాకు జీవనభంగము లేకుండఁ జేసెదము. మీారింక వెళ్లుఁడు.

మాలమాదిగలు—దండాలండి - దండాలు.

[అని నమస్కరించి నిష్క్రమింతురు.]

గోపాల—సభాపతిగారు! ప్రస్తుతం ఆలయములలో పూజాపురస్కారములు నివేదనలు మీారు చేయవలె.

సభాపతి—చిత్తం, చిత్తం. ఆలాగేనండి.

గుప్త—[జనాంతికముగ] సభాపతిగారు! అదృష్టంచేత దొరికిందిచెయ్యండి, పూజారితనం బాగాచెయ్యండి.

గోపాల—సుబ్బయ్య గుప్తగారు! రెడ్డిగారు! చౌదరిగారు! తరువాత పిలిపింతును. ఇంక మీారుపొండు.

సుబ్బ-రామి-చౌదరి—చిత్తం [అని నమస్కరించి నిష్క్రమింతురు]

గోపాల—మీరందఱు వెళ్ళవచ్చును.

అందఱు—[నమస్కరించి నిష్క్రమింతురు.]

గోపాల—స్వామీ! హైందవుల ధర్మాగ్రహ మెంత తీవ్రమయినదో చూచితిరికదా! ఎక్కడనో చూచి యే పద్ధతులనో దలంచి సంస్కరించుట కాదు. భూమి నెఱిఁగి విత్తనము వేయవలె. లోకమును బరిశీలించి సంస్కరింపవలె. ధర్మసూత్రముల నడిపించి ద్వేషభావ మడంచి యందఱ గమ్యస్థాన మొక్కటిగఁ జేసి పరిపాలించు భారతీయ సాంప్రదాయముకంటె భరతదేశోద్ధరణమున కనుకూలమార్గము వేఱొకటిలేదు. సాహసించి మఱియేమిచేసినను శాంతి మాత్రము కలుగ నేరదు. ఇట్లు విమర్శింపక చేసిన శాసనములు సవరణలు చేయ వలసివచ్చుటయే నిదర్శనములు.

యోగి—నిజమట్లేయున్నది. కాని, శిథిలమార్గములను జక్కఁజేయుట సాధ్యమా?

గోపాల—రోగికారోగ్యము కలిగించుట కష్టమని బయటవేయుట భావ్యమా? జీర్ణోద్ధారణ మనంతపుణ్యప్రదమని తలంచి దుష్ట శాసనములనూపడంచి భారతీయ ధర్మోద్ధరణకై ప్రయత్నించి మీ కీర్తి నాచంద్రార్కస్థాయినిఁ జేసికొనుఁడు.

యోగి—కానిమ్ము. ఇంకను లోకస్థితులఁ బరిశీలించి పిమ్మటఁ గర్తవ్యము నిర్ణయించెద.

గోపాల—అయిన నట్లే చేయుఁడు. రండుపోదము. [అనినిష్క్రమింతురు]

మాధ—[వనప్రాంతమున నడుచుచుండును.]

విశ్వపతి—[ఆయాసము నటించుచు మూటతోఁ బ్రవేశించి] [స్వ] అబ్బా! గురువుగారెంత వేగముగ నడుచుచున్నారు! (ప్రకా) శాస్త్రులుగారు! పూజరి సుబ్బయ్య యింకను వెనుకనేయున్నాఁడు. కొంచె మాఁగి పోవుదము.

మాధ—[వెనుకకు మరలి] అట్లే కానిమ్ము. [అని కూరుచుండును]

విశ్వపతి—[మూటఁగ్రిందనుంచి] గురుదేవా! ఎండకన్నెఱుఁగరే, కాలు క్రిందఁబెట్టరే, యగ్రహారపుభూములనైన నన్నియుఁజూచియుండరే?

ఈ కాలినడకతో యీ మోతబరువు గ్రంథములతో నెట్లు ప్రయాణము సాగింతురు? ఎచ్చట నివసింతురు ?

మాధవ—విశ్వపతీ! మనము సాగించునదేమి ? అవసరమే యన్నిటిని సాగించును.

విశ్వపతి— కాలేజీ పదవిని గర్హించి, వేదభాష్యముల వ్రాసిన నేలిచ్చెద నన్న గ్రంథవిక్రేతలం గాదని యగ్రహారభంగమునకైన నాతురతం బడకున్నారే, ఏమి మీ నిశ్చయము ?

మాధవ— స్వధర్మ నిర్వహణము.

విశ్వపతి—గురుదేవా! పతితుండు, మహాపాపి, వంచకుండు, అధముండు, దరిద్రుండు, దాస్యానర్హుండని పలువురచే బహువిధముల నిందింపం బడుచున్న బ్రాహ్మణుం డీకాలమున స్వధర్మనిర్వహణుండు కాంగలండా? ధర్మ ప్రబోధకుండు కాంగలండా? కులము దాంచుకొనకున్న విప్రునకుం జివఱకు గోరుముష్టియైన దొరకునా ?

మాధవ—కుమారా! బ్రాహ్మణునకుం గాందగిన దవమానము, నింద, పరిభవము, దారిద్ర్యము, తిరస్కారము. అవమానాగ్ని యలముకొనవలె. నిందాగ్ని పెంపొందవలె. దారిద్ర్యాగ్ని తాండవింపవలె. అప్పుడే యథార్థ ద్విజరక్తనాళములు కాంగును. మాంస ముడుకును. శల్యములు కరంగును. హృదయకుండములు ప్రజ్వరిల్లును. ఆ మహత్తర తీవ్రాగ్నియే ద్విజరక్తమాంసశల్యములయం దణంగియున్న పరమఋషుల దివ్యతేజఃకాంచన రేణువుల నెగయం జేయును. దానినిం బశ్చాత్తాపాగ్ని పారిశుద్ధ్యమునొందించును. ధర్మతత్పరతాశాణము బహుభంగులం బ్రకాశింపం జేయునుగావున బ్రాహ్మణునకిప్పు డవమానము గొప్ప బహుమానము, ఉన్నతపదవి నందం జేయు విమానము.

విశ్వపతి— ఆర్యా! పరవేషములు, పరచిహ్నములు, పరభాషావ్యామోహములు, పరదేశాభిరుచులు, ప్రతిపల్లెలం బ్రతిపట్టణములం బ్రతిమూలల వ్యాపించియుండం బ్రాచీనధర్మములు లనం బరిహాసాస్పదమైయుండ, సనాతనశబ్దము కర్ణకఠోరమైయుండ, మీకెక్కడ

నిలుకడకలుగును? మీ ధర్మోపన్యాసముల, మీభాష్యప్రవచనాదులను ఎవ్వరాలింతురు? ఎవ్వరాదరింతురు?

మాధవ—విశ్వపతీ! దూరమునకుఁ గొండలు దుర్గములై, యెత్తుగానున్నట్లుండును. దాపునకుఁబోయిన దారులుకలిగిన తగ్గుప్రదేశము లే యెక్కువగానుండును. పైనఁగనఁబడు వేషములు, పైకివినఁబడు భాషణములు, పత్రికలలోని ప్రచురణములు, ప్రబంధములలోని ఖండనములు చూచి భరతదేశ మప్పుడే ధర్మపథభ్రష్టమయ్యెనని తలంపకుము.

మ. పరభాషల్ పరవేషముల్ పరులభా♦వంబెందు నెల్గొందనీ
పరధర్మంబులె ధర్మమంచు జనముల్ ♦ భాషింపనీ దేవతా
దరముంజూపి స్వధర్మముం దెలుపు కాం♦తల్ పూరుషుల్ లేరె? యీ
భరతోర్వీస్థలి ధర్మవార్నిధులఁ బూ♦డ్పన్ శక్యమే యేరికిన్ ?

విశ్వపతీ ! ఇంతయేల? మొన్నటి మహాపండితసమావేశసభకుఁ బోయి యుపన్యాసములిచ్చుచు వచ్చునపుడు భారతీయసోదర ధర్మము లెన్ని ప్రదేశములఁ గనువిందొనరించి యుండలేదు? ఎందఱు నన్నాహ్వానించియుండలేదు?

సీ. సల్పుచుండుటలేదె? ♦ సవనంబు లందందుఁ
కర్మకాండము జీవ♦గఱ్ఱగాఁగ
వెలయించుటలు లేదె? ♦ వివిధాలయంబులు
భక్తికి రత్నాల♦బాటగాఁగ
నెలకొల్పుటలు లేదె? ♦ నిగమాధ్యయనశాల
లమలవిజ్ఞానసౌ♦ధములుగాఁగ
అర్చించుటలు లేదె? ♦ యధ్యాపకులనెల్లఁ
దతవేదతరువసం♦తంబుగాఁగ

గీ. అన్యదేశంబు లెఱుఁగని ♦ యాత్మవిద్య
పాటలం బద్దెముల మహా♦భాష్యములను
విని పఠించుచు విజ్ఞత ♦ వెలసియున్న
భరతభూమిని ధర్మముల్ ♦ కొఱతవడునె?

మనుముందు ఆర్య విజ్ఞాన బీజ రక్షణ మవశ్యకరణీయము, అందులకు వేదశాస్త్రపాఠశాలను స్థాపించవలసియున్నది. ఎందేని స్థానమును జూచుకొని కుటుంబమునకు వర్తమాన మంపుదము. అదియే ద్విజవరాశ్రియంబగు రాజవరము. నేఁడు భిక్షాటనముచేసిన పదార్థమే భుజింపవలె. జోలెగట్టుట కిదియే సుముహూర్తము. [బట్టఁదీసి జోలెఁగట్టుట నభినయించును.]

విశ్వపతి—గురుదేవా! ఎన్నఁడెఱుఁగరే, యీజోలెఁ బట్టుకొనఁగలరా? ఈ స్వల్పకార్యము ననుష్ఠింపఁగలరా?

మాధవ—విశ్వపతీ! ఇదియే ఘనకార్యము. దీనిచే నెందఱెన్నికార్యములను సాధించిరి! ఎందఱుమహాత్ములైరి! పరమపదసోపానమగు నీభైక్షమసమానమనుటకు సందియములేదు. ఇంతయేల?

గీ. జోలెహరుఁడు శివుండయి ♦ శోభఁగాంచె
జోలెహరియుఁ దివిక్రమ ♦ లీల నెగడె
జోలె ద్విజధర్మదీక్ష దు♦కూలచేల
జోలె యీముక్తికాంతము♦త్యాలమాల.

అట్టిజోలెఁబట్టు నే నెంతధన్యుఁడను! [జోలె గ్రహింపఁబోయిక్షణమాఁగి] హృదయమా! వదలుము అభిమానమును వదలుము. జోలె నైచ్యచిహ్నముకాదు. స్వతంత్రజీవనధ్వజపతాక నెత్తుము చేతనెత్తుము. [జోలెను గ్రహించి నిట్టూర్చి] కృష్ణా! శ్రీకృష్ణా! లోకారాధనకై, స్వధర్మనిర్వహణమునకై భిక్షాటనము సేయ నెంచిన నన్నుద్ధరించు భారమంతయు నీదే.

శా. నీపాదాబ్జములం దలంతు సతమున్ ♦ నిన్నాత్మలోనుంతు నీ
ప్రాపే దిక్కనియెంతు నీదుతల నా♦భారంబు నెక్కింతు నే
తాపంబెనియునాకుఁ గల్గదనుచున్ ♦ దర్పింతు ముందుండి నన్
గాపాడంగదవయ్య, కృష్ణ హరి భ♦క్తత్రాణపారాయణా!

[శిరమువంచి నమస్కరించి] ఆహా! భరతదేశమెంత పవిత్రమైనది! ఇందలి జడములగు వృక్షములు ఫలదానముసేయును. నదీనదంబులు జలదానము లొనర్చును. కొండలు గుహామందిరము

లిచ్చును. ఇంక విజ్ఞతకల దేశీయసోదరుల యౌదార్యము లడుగవల యునా? సోదరులేమి, భారతీయసోదరీమణు లెంతత్యాగమూర్తులు! తల్లులారా! సాధ్వీమతల్లులారా! మీ హృదయము లతికోమల ములు, గోపాలునకుఁ బరమాన్నములిడిన భవ్యమూర్తులు! శ్రీ శుకునిచే బేర్కొనఁబడిన పుణ్యమూర్తులు, పళ్లెరములనిండ నక్కఱ లేదు. పట్టెడు భిక్ష పెట్టుఁడు, భరతదేశ గౌరవమును గాపాడుఁడు, భవతి! భిక్షాం దేహి, భవతి! భిక్షాం దేహి, భవతి! భిక్షాం దేహి. [అని కనులు మూసికొనును.]

విశ్వపతి—[ఆశ్చర్యముతోఁ జూచుచుండును.]

మాధవ—విశ్వపతీ! నాచిన్ననాఁటి మంత్రము సిద్ధియయినది. ఇంక పోవు దముపద. [ఇరువురు నిష్క్రమింతురు.]

ఇది తృతీయాంకము

# లలిత

## చతుర్థాంకము

[పురోపవనప్రాంతమునఁ బుష్పమాలలు గంధము తీసికొని శారదా గిరిజలు ప్రవేశింతురు]

శారద—గిరిజా! మన యభినవకృష్ణానందస్వామి, చిన్నవాడుకదా, చక్కనివాడుగదా? మళ్లీ పెళ్లాడి పిల్లలనుగనదగిన యీడుకలవాడు కదా? నిజంగా భక్తుడైపోయినాడంటావా?

గిరిజ—ఏమో? మావారు స్వామివారికి పూలుచుట్టు; గంధముపుయ్యి, కావాల్నంటే అన్నంతినుపించూ. అంటారు. ఆయనచక్కనిశరీరం, నల్లనిగిరజాలు, కాటుకదిద్దిన విశాలములైన గుండ్రనికండ్లు, పెదవుల్లో విహరిస్తూవుండే నవ్వు, అందర్ని అమ్మా! అమ్మా! అనటం చూస్తే బాగానే ఉంటుందికానీ, ఇరుగమ్మ, పొరుగమ్మ, భక్తుడైతే నిత్యక్షవరాలు, తలంట్లు, అత్తర్లు, పూలు, బుక్కాయీలు, ఉండాల్నా? ఇంగ్లీషుకథ చదువుచు అర్థం జెప్పటాని కిన్నివేషాలుండాల్నా? అన్నారు.

శారద—మరి మీ ముసలమ్మేమన్నది?

గిరిజ—అబ్బో! మా యింట్లోముసలమ్మ, మావారి అమ్మమ్మ, ఇటువంటివాళ్లన్నమ్మి, చిన్నచిన్నవాళ్లపచారాలేమిటి? ఇన్ని ఉన్నవారికి లోకంతోపాటు అన్నివాంఛలూ ఉండకుండా వుంటాయా? మగవాళ్లకేం తెలియదు, మొద్దులు. మరీ మావాడికి కళ్ళేలేవు. ఎవళ్లైనా స్వామితో వెళ్ళిపొయ్యేదాకా పిల్లింతే అని గొణుగుచు, మనమణ్ణి పంపించవద్దంటుంది. వెట్టివెట్టివేషాలేమిటి, మేమెప్పుడు

ఎరగం అంటూ నన్ను పోవద్దంటుంది. నాకు పరాయిమగవాళ్లని ముట్టుకోటం తలదువ్వటం పూలుచుట్టటం ఎలాగో ఉంటుంది. నిన్న కమల కాటుక దీర్చేటప్పుడు కృష్ణానందస్వామివారు చైతన్య మామెశరీరంలోనికి ప్రవేశపెట్టినట్టు, ఆమె నొక పావుగంటసేపు నిశ్చలంగా చూచి పెద్ద నిట్టూర్పు విడిచారు.

శారద—[శిరఃకంపము చేయుచు] ఓహో! అలాగా? ఏమీ, చెప్పవు!

గిరిజ—స్వామివారు, చదివిచక్కగా మాటలు చెప్పారు. గిట్టో గిట్టకనో స్వామివారిని ఒకవ్వాళ్లో ఏమో అన్నారని ఏమో చెయలీ పోయినారని మగవాళ్ళల్లో గుసగుసలు పుట్టాయట.అదంతా మన కేం శారదా? మనం భక్తిగాఉంటే, యిక్కడ స్వామివారు, పైన దేముడు సంతోషిస్తారు. స్వామివారి కలంకార సమయ మైంది. పోదాంరా.

శారద—గిరిజా! స్వామివారు, నిన్న ఆడవాళ్లందఱిచేత భజన చేయిస్తూ, చిఱుతలు వాయిస్తూ, వారిమధ్య తాండవిస్తూ తాండ విస్తూ అందఱికి వొళ్లు రాయటం మొదలెట్టారు. ఆయన వొళ్ళు తగిలేటప్పటికే నాగుండె ఝల్లుమన్నది. కమలమ్మ చాల భక్తురాలని భజనలో వొళ్లే తెలియదని ఆపారవశ్యమున తనపై పడినదని స్వామివారు చెప్పారు. ఎంతభజనలోవున్నా మగవాళ్లు కాస్తదగ్గఱకువస్తే నాకెట్లాగో వుంటుంది?

గిరిజ—కాదే శారదా? భజనలో ఆడా మగా అంతా యేకం గావాలం టారు స్వామివారు. రేపురాత్రి రాసక్రీడ చేయిస్తారట. అందరూ రావాలన్నారు.

శారద—ఏమోనే గిరిజా! ఆయనెంతస్వామివారైనా ఆనీట్లు ఆగోట్లు ఆసొక్కడం ఆసోలడం ఆడవాళ్లకు వొళ్లురాయటం చేతులురాయటం ఆనక్కవినయాలు ఆకీగంటిచూపులు నాకిష్టంలేదు. నేను రేపురాను.

గిరిజ—అలాగనుకుంటే మనకు భక్తి యెలాగా మఱి?

శారద—ఇలాకాదే, మనం భర్తల్నే సేవిస్తూ వారివల్లనే రామమంత్ర మో కృష్ణమంత్రమో వుపదేశంపొంది ఆరాముణ్ణో కృష్ణుణ్ణో

నమ్మి పూజాపునస్కారంచేస్తూ కొలుస్తూవుంటే మనస్సు పరిశుద్ధమై దేవుడిపై నమ్మకం బాగా కలుగుతుందట. అప్పుడా దేవుడే మన నుద్ధరిస్తాట్ట. మనకు నిజమైనభక్తికి మార్గ మదని రాధమ్మగారు చెప్పాగు. తులశమ్మ భాగవతం చదువుతూవుంటే రాధమ్మగారు అర్థంచెప్పుతూవుంటే అష్టపదులు తరంగాలు అవ్వి పాడుతూవుంటే నిజంగా కృష్ణుడు తాండవిస్తున్నట్టు వుంటుంది. నాటకాల్లోలాగ వేషాలువేసుకోటం నేనే కృష్ణుణ్ణి అనటం మీరుగోపికలుగా నటించ మనటం చూస్తే నాకు అంతా వెఱ్ఱి వెఱ్ఱిగావుంటుంది. ఈయన సంగతే మిటో ఈవేషాలేమిటో కనిపెట్టి చూడాలె.

గిరిజ—మా రాధమ్మా తులశమ్మా ఎప్పుడు ఇక్కడకివచ్చినట్టులేదేం?

శార—పూవులు గంధాలుపుచ్చుకొని మనంవస్తున్నాంచాలదా? మన కమలమ్మ తైతక్కలుచాలవా? మంచి మాణిక్యాల్నెక్కడనైనా చాటుగమాటుగ వుండనీ?

గిరిజ—ఔనే శారదా! రాధమ్మగారు చాలభక్తురాలని అందరూ అంటారు. ఇదివరకు మావారు కడుపేకై లాసం ఇల్లేవైకుంఠంగా ఎక్కడికి వెళ్ళనిచ్చేవారుకారు. అందుకని నేనెప్పుడు వెళ్ళలేదు. అక్కడికి కూడా నన్నుతీసుకొనిపోతూవుండు. సరేకాని మనమాటల్లోస్వామి వారి కలంకారసమయం మిగులుతుంది. ఈగంధం మనమేపూసుకొని పూలుకూడా మనమే పెట్టుకోవాల్సొస్తుంది. పోదాంరా. [అనిత్వర పెట్టును.]

శారద—[నవ్వుచు] అయితేయేం,మనలో దేవుడులేడా?ఆగంధం మనమే పూసుకుందాం, ఆపువ్వులు మనమేతీసుకుందాం.

[అని నిష్క్రమింతురు.]

[ఉపవనమున వేదికపైన అభినవ కృష్ణానందస్వామి కూర్చుని యుండఁ గమలయను సువాసిని స్వామికి అలంకరించు చుండును.]

శారదా, గిరిజలు—[ప్రవేశించి ఆశ్చర్యముతోఁజూచి యాగుదురు.]

గిరిజ—చూచావా శారదా! అప్పుడే స్వామివారికడ కమల సాక్షాత్కరించింది.

శారద—అది యేకాంతభక్తురాలు, ఎప్పుడుపడితే అప్పుడే సాక్షాత్కారం, మనమో మెవరైనా లేకుంటేకానిరాము. [అనుచు పింతురు.]

గిరిజ—కమలా! స్వామివారి కలంకారమంతా నీవే చేశావేమి?

కమల—అలాగే! కాని నీవు వచ్చావుగనుక, కొంచెం మిగులుస్తా.

స్వామి—[ఎలనగవుతో] కమల శ్రీ; చుక్క, దెబ్బ, మీలో ఎవరో?

శారద—[తలపంకించుచు] కమల శ్రీ కాదండి, ఎప్పుడు శ్రీయేనండి.

గిరిజ—స్వామివారు! నేనేముందు బయలుదేరా, రెండడుగులు ముందు కూడా నేనేవచ్చా. నేనేచుక్కనండి.

స్వామి—[ఓరచూపుతో] ఆఁ నీవు చుక్కవే, తప్పక చుక్కవే, సాక్షాత్తు చుక్కవే!

కమల—ఇంక శారదకే దెబ్బ.

శారద—కమలా! నీవు ప్రత్యక్షంగా శ్రీవై యుండ, అలంకరించుకొనిన స్వామివారు, నిజంగా శ్రీకృష్ణులైయుండ, ఇట్టి మీసన్నిధిని ఫలదానము జరుగవలెఁగాని, దెబ్బలదానమా? నీయేకాంతభక్తికి నిదర్శనంగా స్వామివారిచ్చు శ్రీ, చుక్క, పైదానికి పాత్రురాలవై సేవకు వచ్చిన మమ్ముద్ధరింపుము.

స్వామి—[సాభిప్రాయముగఁ దలపంకించి] శారదమ్మ మిగుల వాగ్మి శారదమ్మ.

కమల—స్వామివారిచే సాక్షాత్తు శ్రీకృష్ణభగవాన్లచే దెబ్బతింటే ఒళ్లు పవిత్రం కాదటే ?

శారద—అందుకనియే రోజుకు నాలుగు మూఁడు స్వామివారిచేత తిని శరీరం త్వరగ పవిత్రం చేసుకో.

కమల—ఓ అలాగే! అంతకంటే యింకా యేఁగావాలె ?

స్వామి—[సాభిప్రాయముగఁ జూచుచు] కమలమ్మ చాల శ్రమపడినది. అన్న మా యమ్మ పెట్టినది. తల దువ్వినది, కాటుకదిద్దినది. ఇంక చందన చర్చ· అమ్మా! శారదమ్మ! నీవంతు. అమ్మా! గిరిజమ్మ! పసుపుపారాణి నీవంతు.

గిరిజ—నామనస్సు అంచక్కగా తెలుసుకున్నారు. దేవుడే స్వామివారంటే! వచ్చేటప్పుడు, ఎలాగయినా ఇవ్వాళ స్వామివారిపాదాలు పట్టుకోవాలనుకొన్నా. అంతేజరిగింది. [అని పసుపు బూయుచు అలంకరించుచుండును.]

కమల—శారదా! స్వామివారికి గంధంపూసి భక్తినేర్చుకో.

శారద—కమలమ్మభక్తిపండి ఫలము వచ్చిన తర్వాత చూచి నేను బాగా భక్తి ప్రారంభిస్తా. చేఁజేత నీవే గంధముకూడా పూయి, స్వామికి నేను విసరుతా [విసరుచుండును.]

కమల—[గంధము పూయుచు] శారదా! మీరెవ్వరూ రాకుంటేనేం సేవించకుంటేయేం, స్వామిని నేనే సేవించుకుంటా.

శారద—కమలా! నీవింకఁ త్వరలో స్వామివారిలో ఐక్యం అవుతావు.

కమల—నిజంగా ఇల్లు, వాకిలివదలి స్వామివారిదగ్గఱ కూర్చోమంటే, ఆహా! నిశ్చింతగా, సుఖంగా, ఆనందంగా కూర్చుంటా.

స్వామి—అమ్మా! కమలమ్మా! అట్లా సంసారవాంఛవదలాలి. బాలు రేడ్చినా, భర్తకోపపడ్డా, బంధువులు వారించినా, భగవద్భక్తులవదల గూడదు. అదియే భక్త్యుద్రేకము. అప్పుడే "మద్భక్తాయత్ర గాయంతి, తత్రతిష్ఠామినారద" అన్నట్లు మావంటి భక్తరూపుడయిన కృష్ణపరమాత్మ మీవంటి భక్తురాండ్రను నను గ్రహింపఁగలఁడు. నీయెడ గొప్పభక్తిలక్షణములు కనఁబడుచున్నవి. త్వరలో భక్తురాండ్రలో మేటివై లోకోద్ధరణకు బయలుదేరుదువు.

గిరిజ—[దైన్యముతో] స్వామీ! కమలకు మీరేదో ఉపదేశంచేశారండి. భక్తిభావాలు బాగాఅబ్బాయంకి. నన్నుకూడా కాస్త ఒడ్డెక్కించరు?

కమల—గిరిజా! మనము స్వామివారిని యేకాంతంలో సేవించుకోవాలి. అప్పుడు, నిజంగా వారిదగ్గఱ, వారియెదుట సాక్షాత్తు శ్రీకృష్ణులవారి సన్నిధానంలో ఒళ్ళుపులకరిస్తుంది, ఆసంగతులు అనుభవంలో తెలుస్తయి.

శారద—కమలా ! నీవు పెద్దభక్తురాలవు. గిరిజ చిన్నభక్తురాలు. మీరిద్దఱు కడతేరేటప్పటికి స్వామివారిసంగతి బాగా తెలుస్తుంది. అప్పుడు అందఱు మీభక్తులై పోతారు. [అనుచు విసరుచుండును.]

కమల—సందేహమేమిటే? పిచ్చిదాన! అందఱు మాభక్తులుకావాల్సిందే? మమ్ము సేవించాల్సిందే.

స్వామి—శారదమ్మా ! చాలు. కమలమ్మా! నాపుస్తకము తీసికొని సమాజమువద్దకు పద. గిరిజమ్మా! అందఱిని పిలువమ్మా.

గిరిజ—స్వామి! ఇవ్వాళఅంతా, ఆబజారువాళ్ళుకూడా వస్తామన్నారండి, సమాజంవద్దకు త్వరగా దయచేయండి.

స్వామి—[తలయూచుచు] ఆ వెంటనేవచ్చెద.

స్త్రీలు – [నిష్క్రమింతురు.]

స్వామి—[స్వ]కమల వశ్యురాలయినది. గిరిజయుఁ దాదృశయే కాఁగలదు. శారదమాత్రము దూరదూరముగఁ గన్పట్టుచు శ్లేషోక్తులవదలుచుఁ బ్రౌఢగాఁ బ్రవర్తించుచున్నది. ఏకాంతమునఁగాని యీమెహృదయము తెలియరాదు. కానిమ్ము, ప్రౌఢకడ నేనును బ్రౌఢ నభినయించెద. [ముందుఁజూచి] ఎవరావచ్చునది? [మఱలఁజూచి శిరఃకంపము చేసి] ఈమెరాధాదేవికోడలు, తులసియని వింటిని. మొన్నఁబూవులు గోయుచుఁదులసి పాడినపాట నైతము నామనస్సును మార్చివేసినది. [మఱలఁ జూచి] ఆహా! ఏమి యీ నవకము!

చ. ముడిచిన వ్రేల్ముడిం దొడరి ♦ పూలసరంబులు వ్రేలఁబైఁటచే
నొడికముగా ముఖాంబుజము ♦ నొత్తుచుఁ గానసియాడ, హస్తమం
దడరఁగఁబువ్వుసజ్జ, కుసు♦మాపచయం బొనరించు చల్లన
ల్కడలను గాంచిపాడుకొను♦కాంతగళస్వనమెంతొ యొప్పెడిన్.

చూచిన కొలఁదినిఁ జూడవేడుక పొడముచు నీరమణీమణి వయఃపరిణామమెంత యామోదపాత్రమగు చున్నది!

గీ. విరియఁబూచిన నునుదీవె♦కరణిఁగ్రాలి
చేతికందెడు ఫలశాఖ♦భాతిఁ దనరి

సరసిజ విభాసురంబగు ♦ సరసివోలె
యౌవనోజ్జ్వలమై యింతి ♦ యలరు నపుర!

కానిమ్మిందే యుండి యేదో నెపమున నీమెను మాటలాడించి చూచెద. [ఆవలికేగును.]

తులసి—"కలయ సఖి సుందరం" [అని పాడుచుఁ బ్రవేశించును.] ఆహా! ఈచెట్లెంత చక్కఁగఁ బూచినవి! ఆమూలము మొగ్గఁదొడగిన యీ మల్లికను జూచినను, పరిసరవృక్షరాజములను గాంచినను, నేఁడు చదివిన భాగవతము నాకుజ్ఞప్తికివచ్చుచు నన్నువివశను జేయుచున్నవి. ఇట్టి రమణీయ ప్రదేశములయందే కదా భగవానుఁడు శ్రీకృష్ణుఁడు మురళీగాన వినోదమును సల్పినది. ఇట్టి నికుంజపుంజములను ఇట్టి మనోహర భూజరాజములనే కదా వ్రేతలు శ్రీకృష్ణుని జాడ లరయుచు వేఁడినది. నేనును గోపికలవలె శ్రీకృష్ణపరమాత్మను వెదకినఁ గనఁబడునేమో? వెదకి చూచెద.

ఉ * నల్లనివాఁడు పద్మనయ♦నంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు, మాళిపరి♦నర్పిత పింఛమువాఁడు నవ్వు రా
జిల్లెడు మోమువాఁడొకఁడు, ♦ చెల్వల మానధనంబు దెచ్చె నో
మల్లియలార మీపొదల♦మాటున లేఁడుకదమ్మ తెల్పరే?.
"కలయ సఖి సుందరం" [అని పాడుచు వెదకును.]

స్వామి—ఈమె వల్లవాంగనయైనది. మురళీగానవినోదనుఁడనై, అలంకృతుఁడనై కృష్ణానందనామధారినైన నేను మాత్రము సాక్షాత్తు శ్రీకృష్ణుఁడ నేల కాఁగూడదు? కానిమ్ము ప్రయత్నించి చూచెద. [అని యావలికేగును.]

తులసి—[తెరలోనుండి]

సీ * అదెనందనందనుం ♦ డంతర్హితుండయ్యెఁ
బాటలీతరులార ♦ పట్టరమ్మ!
హేలావతులఁ గృష్ణ♦యేలపాసితివని
మైలేయలతలార ♦ యడుగరమ్మ!

---

* భాగవతము

[ప్రవేశించుచు]

వనజాక్షుఁ డీచటికి♦వచ్చి దాఁగఁడుగదా?
చూతమంజరులార! ♦ చూడరమ్మ!
మానినీమదనుతో ♦ మారాక మెఱిఁగించి
మాధవీలతలార ♦ మనుపరమ్మ!
ఆ. జాతిసతులఁ బాయు ♦ నీతియ? నీకని
జాతులార! దిశలఁ ♦ జాటరమ్మ
కదళులార! పోయి ♦ కదలించి శిఖిపింఛ
జూటుఁ దెచ్చినాకుఁ ♦ జూపరమ్మ.

[తులసిచెట్టునకుఁ బ్రణమిల్లి, యాదరముతో] తులసీదేవి! ఈ తులసీ వృత్తాంతమంతయు నా తులసీ మాలాలంకృతునితో నివేదింపుము.

క. * హరిచరణములకుఁ బ్రియమై
హరి నిను మన్నింప భద్ర♦మందెదు తులసీ!
హరి నీ దెస రాఁడుకదా? హరిచో
ప్పెఱిఁగించి శుభము♦నందింపఁగదే?

[నమస్కరించును]

[లోపలినుండి సంగీతమువినఁబడును]

తులసి—[ఉత్సాహముతో] ఎచ్చటిదీ మరందధార? ఇయ్యదియెంతయు శ్రుతిసుఖంబై హృదయానంద మొదవించుచున్నదే? [వినుట నభినయించి సంతసముతో] మురళీనాదమువలె మిక్కిలి మనోహరముగ నున్నదే! [మఱల వినుట నభినయించి] మధురమధురంబై సకలేంద్రియసమ్మోహనంబై యననుభూతపూర్వంబగు నీ గానామృతరసప్రవాహము నిమేషమాత్రమున నీ ప్రదేశంబును ముంచివైచెనే! నా దేవుఁడు భగవానుఁడు శ్రీకృష్ణుఁడే మురళి వాయించుచుండెనా యేమి? పోయి చూచెద. [సంభ్రమముతో నటునిటుఁ జూచుచు నిష్క్రమించును]

---

* భాగవతము.

స్వామి—[ప్రవేశించి] ఓహో! ఈ తరుణి గాన లాలసయై కృష్ణాన్వేషణ మొనర్చుచున్నది. ఈమె ఈ యన్వేషణమే నా యభీష్టసిద్ధికి ముఖ్య సాధనము. కాని శ్రీకృష్ణుని మాహాత్మ్య మసమానమనుటకు సందియములేదు. ఆ భగవానునివేషము ఆ చిహ్నములు నాకెంతయు గౌరవప్రతిపత్తులు కలిగించుచు కామినుల నేత్రములకు సాక్షాత్తు కామజనకుని గావించి నన్నిటఁ గృతకృత్యునిఁ జేయుచున్నవి. ఇంక నా యదృష్టమునకుఁ గొదువ లేదు.

గీ. వేషమునకొక్క సుందరి ♦ ప్రీతి నెఱపు
భాషణంబునకొక తన్వి ♦ భ్రాంతిఁ జెందు
గానమున నొక్క కాంత తాఁ ♦ గదిసి పలుకు
నౌర ! నటనంపు భాగ్య మే♦మనఁగవచ్చు !

అదిగో మఱలఁ దులసి వచ్చుచున్నది. మఱియొక ప్రక్కనుండి యింకొకమాఱు గానకలాకౌశలమును వెలయించి యీమెకింకను ఆశను గల్పించెద. పిమ్మట కర్తవ్యము నిర్ణయించెద. [అని లోనికిఁ జనును]

తులసి—కృష్ణా, కృష్ణా! [అని సంభ్రమమునఁ బ్రవేశించి] ఔరా! ఆ వేణుగానవినోదనుఁడెందును గానరాకుండెనే! ఏమిచేయుదును? అయ్యో! ఏమి నావెఱ్ఱి! బృందారకేంద్రవందితచరణారవిందుండై, గో, గోప, గోపీ పరిపాలకుండై, నిరంతరబృందావనవిహారియగు యశోదానందనుండేమి, యిందు వచ్చుటేమి? [యోజించి] అక్కటా! ఆ నందనందనుఁడే యిందు రాకున్న నీ యపూర్వగానరసప్రవాహమున మునిఁగి తేలుదునా? ఔరా! నాకిపుడేదియుఁ దోఁపకున్నది కదా? [మఱల సంగీతము వినఁబడును]

తులసి—[వినుట నభినయించి యుత్సాహముతో] ఆహా! ఏమి యీ గానమాధుర్యము! నారదాదులకుఁగూడ నిదియే చిరతరాశ్రయమై యుండును. దేవదేవా! శ్రీకృష్ణా! ఇంకను నీ మనోహరగానామృతమును వర్షించి నీ దాసియగు నీ తులసినిఁ గటాక్షింపుము. తండ్రీ! కటాక్షింపుము. [సంతసమభినయించును. సంగీతమాగును.]

అయ్యో! గానముతోఁబాటు శ్రీకృష్ణుఁడుకూడ అంతర్హితుం
డయ్యెనే! అయిన నేనేమిసేయుదును? కృష్ణా! పోవలదు, నీదాసి
యగు తులసికి దర్శనభాగ్య మీయకపోవలదు, పోకుము, పోకుము,
కృష్ణా! పోకుము. [అని సంభ్రమముతోఁ బోవును.]

స్వామి—[ప్రవేశించి] ఓహో! కృష్ణాన్వేషణవివశయై పరిభ్రమించు
ని త్తరుణిసంభ్రమ మెంతయు దర్శనీయమై విరాజిల్లుచున్నది. ఇట్టి
మనోహరాకృతి నాదరించు భాగ్య మెన్నఁడైనఁ గలుగ నేర్చునా?
ఓయీ! నీ కేల యీసంశయము? నీవిప్పుడు కృష్ణాసందుఁడవు. నీ
కెయ్యది యసాధ్యము కానేరదు. నీకోర్కె నెఱవేఱక మానదు.

ఉ. చెక్కులఁ జుక్కలల్లమరు ♦ చెమ్మటలద్ది కలంగు ముంగురుల్
చక్కఁగదిద్ది వీఁపుపయి ♦ జాఱెడు వేనలి సర్ది యెంతయుం
బ్రక్కలజీరుకాఁడుకొను ♦ పయ్యెదనయ్యెదనొయ్యఁజేర్చిలో
మక్కువతీర నీసుదతి ♦ మానితయౌవనలక్ష్మి నేలనే?

ఇదే వచ్చుచున్నది. మఱియొకవంక కేఁగి మఱల నింకొకతూరిగాన
ప్రవాహమున దిక్కులు ముంచివైచెద. [అని నిష్క్రమించును.]

తులసి—కృష్ణా! కృష్ణా! [అనుచుఁ బ్రవేశించి] అక్కటా భగవానుఁ
డెంమనుగానరాకుండెనే ఏమిసేయుదును? ఔరా! ఇదికలయా? నిక్క
వమా? [శిరఃకంపముచేసి] ఏమినామతిభ్రమణము! యమునాతీర సం
చారిణులగు గోపకామినులకుఁగాక, నావంటి యభాగ్యురాలికి నీ
మధుర మధురతర వేణుగాన సుధారసపానము సమకూరునా?
చిరతర తపస్సంపన్నులగు నారదాదిమునిపుంగవులకును, బహుజన్మ
సుకృతపరిపాకలబ్ధశరీరులగు అక్రూరముఖ్యభక్తశిఖామణులకుఁదక్క
నావంటిహీనకాంతకు, నీదర్శనభాగ్యములభించునా? కృష్ణా! నిగమాటవీ
సంచారివే! యోగివరమానససౌధవిహారివే! నిన్నెట్లుచూడఁగలను?
శ్రుతిశిఖావిభాసురంబులగు నీపాదపద్మము లెట్లు కనుఁగొనఁగలను?
తండ్రీ! శ్రీకృష్ణా! నీ వాయుపనిషదర్థగోచరుండవైనను, భక్తజనావ
నుండవై యులూఖలనిబద్ధుండవు కాలేదా? నీ వా వైకుంఠనిలయుండ
వైనను గజరాజవరదుండవు కాలేదా? తండ్రీ! ఆర్తరక్షణపరాయ

ఁఖండవగు నీకుఁజొరరానిచోటును రక్షణీయముకాని పదార్థమును గలుగునా? జనకా! నీదర్శనమునకై వేచియున్న నన్నుఁ గటాక్షింపుము. దేవదేవా! శ్రీకృష్ణా! త్రిజగన్మోహనకరంబగు నీసౌందర్యమునుజూపింపుము. ఆహా! నీవెంతదర్శనీయుఁడవు తండ్రీ!

ఉ. నీవదనేందుమండలము ♦ నీదరహాసవిలాసచంద్రికల్
నీవిమలేక్షణామృతము ♦ నీవిలసత్తనుకాంతిపూరమున్
భావనఁజేయఁ ద్వద్విషయ♦వాంఛ లెసంగఁగ నిర్వికల్ప మో
దావహమై తనర్చుమది, ♦ యట్టి నినుంగను టెట్లు మాధవా!

కృష్ణా! భవదధీనమానసయైన యీదీనురాలి ప్రార్థనమాలకించి సర్వానందకందంబగు నీసుందరవదనారవిందము గనుపించి నా హృదయ తాపముఁ దొలఁగింపుము. తండ్రీ! గోపాలా!

మ. పులకల్ పుట్టఁగ మేని కెంతయు భవ♦న్మూర్తిక్ విలోకింప స
[illegible]ళలం దేటెడు నీ ముఖేందురుచికిం ♦ గందోయి నర్పింప ని
శ్చలభావంబునఁ ద్వత్పదాబ్జములు పూ♦జల్ సేసి ధ్యానింప వ్యా
కులతం జెందెడు నీదు దాసిఁ దులసిన్ ♦ గోపాల! కాపాడవే?

[ప్రణమిల్లి] దేవదేవా! సహస్రభాస్కర ప్రతిమానమగు నీదివ్యదేహ మింద్రాదులకు సైతము దుర్నిరీక్ష్యమని విందును. అట్టి నీ యద్భుత రూపమును జూడఁజాలనేమో యని శంకించుచున్నాను. యశోదాకిశోరమవై యదుబాలక సహచరుండవై బృందావనమును ధన్యత నొందించిన నీజగదానందకరాకారమును జూపింపుము. తండ్రీ! నీ వొసంగిన యీవినశ్వరశరీరమును నీసేవావిధికి వినియోగించి ధన్యనయ్యెద. తనుధనంబులు నీ సపర్యకై వినియోగించుటకంటె వేఱు సుకృత మున్నదా? కృష్ణా! రమ్ము. నాసపర్య లందుకొమ్ము.

సీ. కరువలియొరపున ♦ విరిసిన శిఖిపింఛ
మలరించి కురులొత్త♦వలదె శౌరి!
వడివడి నడ తేరఁ ♦ గడు చెమ్మగిల్లిన
తిలకంబు దిద్దఁగా ♦ వలదె కృష్ణ!

కదలిన వ్రేఁగునఁ ♦ గౌస్తుభం బెనసిన
వనమాల సరిఁ జేర్పఁ ♦ వలదె శార్ఙ్గి!
తపనురశ్మికిఁ దూలు ♦ తనువు తాపముఁ బోవఁ
గలఁప మలఁది వీవ ♦ వలదె చక్రి!

గీ. గద్దియం జేర్ప వల్వాదె ♦ కనకచేల!
యిదె యుపాయన మనవల ♦ దే ముకుంద!
పాద్యపునీవన వల్వ దే ♦ వాసు దేవ!
పరమపద మందవలవదే ♦ పరమపురుష!

కృష్ణా! దీనావనుండవే యింత కాలహరణ మేల చేసెదవు తండ్రీ! నీమురళీరవాకర్ణనమున నాహ్లాదయావేదన మెక్కుడగుచున్నది. ఏల నా కాశను గల్పించి మటుమాయమయ్యెదవు? బ్రహ్మాదులకుఁ గూడ నీ మాయ తెలియనప్పుడు అబలను, అజ్ఞను నీ మాహాత్మ్య మెఱుఁగఁజాలుదునా? దేవదేవా! జగన్నాథా! శ్రీకృష్ణా! గోపాలకృష్ణా! మాం పాహి, మాం పాహి. [అని కరములు మోడ్చును.]

స్వామి—[ప్రవేశించి] ఔరా! ఏమి యీతరుణి కృష్ణదర్శన లాలసత! అసమానముగ నున్న దే!

గీ. గానరసమున నోలాడి ♦ కాంచిదిశలు,
రమ్ము పూజింతు కృష్ణ! రా ♦ రమ్మఁటంచుఁ
బిలిచి కనుమోడ్చి యదిగో యం ♦ జలిఘటించి,
భక్తి రూపొందెననఁ బొల్చెఁ ♦ బడఁతియారా!

కానిమ్ము. ఇదియే మంచి సమయము. [తులసిని సమీపించి]

గీ. తులసి! తావకమగు భక్తి ♦ తుష్టిఁ జేసె
భావ ముప్పొంగె నీమ స ♦ ద్భావమునకు
నాశ్రితావనదీక్ష నే ♦ నలరియుండఁ
గుందఁగానేల నీవిటు ♦ కువలయాక్షి!

తులసీ! తులసీ! లేలెమ్ము. [అని సమీపించును.]

తులసి—[సంభ్రమాశ్చర్యములతో] ఆహా! నా దేవుఁడా! దేవదేవుఁడును భగవానుఁడగు శ్రీకృష్ణుఁడా! ఏమినాపుణ్యము! ఏమినాసుకృతము! వాసుదేవా! వచ్చితివా? నాకన్నులకఱవుఁ దీర్చితివా! దేవదేవా! శ్రీకృష్ణా! ఏమి నీదివ్యమూర్తి!

చ. చిఱునగవుల్ ముఖేందునకుఁ ♦ జెల్వగు వెన్నెలలై వెలుంగ సుం
దరవదనంబు గాత్రజల♦దంబున నొప్పు మెఱుంగు గాఁగ భా
సురనయన ప్రసారములు ♦ శుభ్రసరోరుహ పంక్తి నీన, నా
మొఱవిని వచ్చినావె ననుఁ ♦ బ్రోవఁగ దీనశరణ్య! మాధవా!

తండ్రీ! శ్రీకృష్ణా! ఈ చిఱుతపాదములా నిగమాంతసీమంతినీ సీమంత శృంగాటక విహరణశీలములు! ఈ పదపల్లవములా కాళీయ ఫణిఫణాగ్రరత్న నీరాజితములు! ఈ చరణారవిందములా సంసారసాగర నిమగ్న భక్తజనతరణ తరణులు! తండ్రీ! వాసుదేవా! [illegible]కులకు, యోగులకుఁ, దపస్వులకు, జ్ఞానులకుఁగూడ, నీదర్శన భాగ్య మలభ్యమే! అట్టి నీమనోహరాకారమును కన్నులారఁజూచిన నాభాగధేయము నెంతయని కొనియాడుకొందును! దేవదేవా! ఇప్పుడియ్యది యతిపవిత్రమగు యమునానదీ తీరప్రాంతము. ఇది మహాభాగ్య సంపన్నమగు బృందావనము. నేను యశోదను, రాధను, గోపికను. ఇంద్రాదిబృందారకులకెల్ల వందనీయమగు నీపాదారవింద సేవ నాకుఁలభించినది. నేను మిగుల ధన్యను ఇంక నీపాదపద్మముల వదలనేరను. [అని పాదములఁబట్టుకొని కనులకద్దుకొనును]

స్వామి—[స్వ] ఈమె నిజముగ, శ్రీకృష్ణదర్శనమైనట్లే తలంచి ప్రార్థించుచున్నది. కానిమ్ము. [ప్రకా] భక్తిపరతంత్రవగు నోకాంతామణీ! లెమ్ము నాపలుకులాలకింపుము.

తులసి—[సంభ్రమముతో] కృష్ణా! కృష్ణా! నాయందు దయదలఁచి కఠినప్రదేశముల నింతదూరము వచ్చి నాకు దర్శనభాగ్య మిచ్చిన నిన్నెట్లు పూజింపఁగలను? నిన్నెట్లు సేవింపఁగలను? నాకడ నేమియు లేదే! [ముందుఁజూచి] దేవా! నీసపర్యకై కోసిన పుష్పములివి. ఇది నీకత్యంతప్రియమగుతులసి. వీనినిగ్రహింపుము. వీనిచే సంతుష్టినొం

దుము. [అనుచుఁబూవులు తులసీదళములు మాయాకృష్ణుని శిరమునఁ బాదముల నుంచును.]

స్వామి—తులసీదేవీ! నీయాదరమున కెంతయు సంతుష్టాంతరంగుండ నైతిని. ఇంక నీయభీష్టము నెఱవేర్చెద. సావధానచిత్తవు గమ్మా.

మ. నిను భోజాత్మజభంగి నేలుమనెదో ♦ నీలాసతింబోలె ల
క్షణరీతిన్ దయఁదల్పమంచనెదొ? యా♦సాత్రాజితీదేవిఫ
క్కిని మన్నింపఁ దలంతువో? యితరపం♦కేజాస్యలం దేల్చు న
ట్లనురాగాంబుధిఁ దేల్పుమంచనెదొ? కాం♦తా! కోరుమా! కోరికల్.

రమణీమణీ! యిటుఁజూడుము.

గీ. కుంజహర్మ్యం బిదే గురి♦గింజగుత్తి
దివ్వెలిటవెల్గుఁ బూసెజ్జ ♦ నివ్వటిల్లు
నఁటవసించి యొకింత నీ♦యాత్మఁగల్గు
కుతుకములఁ దీర్చుకొనరమ్మ ♦ కువలయాక్షి!

రార మిమ్మా పూవుటిరమునఁ గూర్చుండి నీవాంఛల నన్నింటినిఁ దీర్చుకొందువులెమ్మ. [అని చేయిఁబట్టుకొనఁబోవును]

తులసి—తండ్రీ! జగన్నాథా! నీదయామయత కేనెంతయు సంతసిల్లు చున్నాను. మాతల్లులగు రుక్మిణీదేవ్యాదులఁబోలె నన్నాదరింపు మని ప్రార్థింపను. నాజననియగు సాత్రాజితీదేవివలె మన్నింపుమని నిన్నర్థింపను. లీలామానుష విగ్రహుఁడవు, వశీకృతసర్వప్రకృతి స్వరూపుఁడవు. నీకధీనముకానిదిలేదు. నావాక్యములాలకించి నన్ను ధన్యురాలినిఁజేయుము. తండ్రీ!

గీ. భక్తురాలగు రాధకు ♦ బాలకృష్ణ
రూపమున దర్శనంబిచ్చి ♦ ప్రోఁచి తనుచు
విందు ననుఁ బ్రోఁతువేని గో♦విందయట్టి
విలసితమనోహరాకృతి ♦ వెలయు మిపుడు.

స్వామి—[నివ్వెఱపడును.]

తులసి—కృష్ణా! గోపాలకృష్ణా! నీ లేఁబ్రాయమెంత మనోజ్ఞమైన దయ్యా!

మ. వదనాంభోజముఁ గ్రమ్మ ముంగురులు, భా♦స్వల్లీల నెమ్మోమిపైఁ
గదురన్ వేణువు, వ్రేలఁగంఠమున ము♦క్తాదామముల్, కాంచి చె
న్నుదలిర్పన్ గటి,నందియల్ మొరయఁ, జిం♦దుల్ ద్రొక్కుచున్ బాడని
న్నెదలాలించుచు నిల్లుసేర్తు దయరా♦వే కృష్ణ! బాలాకృతిన్.

కృష్ణా ! గోపాలకృష్ణా ! నీ బాలకాకృతిని దర్శించి స్పృశించి మహానంద మనుభవించిన యాగోపకాంతను లెంతటి ధన్యురాండ్రో కదా!

చ. మలయజగంధముల్ వకుళ♦మాలలతావులు విస్తరిల్ల గ
జ్జెలరవళుల్ తమిం బిలువఁ♦జేరి లతాంగులు వాలుచూపులన్
వలపు రహింపఁగా మిసిమి♦వాసన లీను ముఖారవిందమున్
వలగొని ముద్దుగొన్న వ్రజ♦భామల నోమినరూపుఁ జూపవే.

దేవదేవా ! జగన్నాథా ! బాలకృష్ణ రూపమున సాక్షాత్క రింపుము. పూబంతివలె శిరమున లాలించెద. నాయకమణివోలె నెద ధరించెద. మామిడిపండువలెఁ గరమున నుపలాలించెద. బంగారు బొమ్మవలె నిన్నెత్తుకొని గృహము సేర్చెద. తండ్రీ! నిరత సేవకురాలగు మాయత్త రాధ నిన్ను మన్నించును. నిన్నుఁ బూజించును. నిన్ను నుతించును. కృష్ణా ! రారమ్మ.

ఉ. మల్లెలు మొల్ల లుల్లసిల ♦ మాల్యము లల్లనవేయు మాళి రం
జిల్లఁగఁ జంద్రికం బునుచుఁ ♦ జిక్కఁగ గందమలందు పీవనల్
మెల్లఁగవీచుఁ బాల్పెరుఁగు ♦ మీఁగడ వెన్నలు పాయసాన్నముల్
పెల్లుగఁబెట్టి కొల్చు ముర♦లీధర ! పోదము వేగరాఁగదే !

కృష్ణా! నారాయణతీర్థులు తరంగములలోఁ జూపిన సచ్చిదానంద మయమగు నీ దివ్యరూపమును నేను జూచుచున్నాను. నేనుధన్యను. నేను మాన్యను, కృష్ణా! రమ్మ. "బాల గోపాల! మాముద్ధర" [అని యానందమున కనులు మూసి తరంగమును బాడుచుఁ దాళము వేయుచుండును]

స్వామి—[నిర్విణ్ణతతో]ఆహా! ఈమె భక్తిప్రభావము నన్నవశునిఁజేయు చున్నదే? ఇంకేమిసేయుదును ? వేషమాత్ర సాదృశ్యమునఁగృష్ణుఁడ

నయితినిగాని ఆభగవానుని సామర్థ్య మిసుమంతయుఁజూపలేకపోతినే! ఇపుడేదిగతి? ఇట్టి భక్తురాలిని భంగపఱుప నాకుఁగాదు, బ్రహ్మాదులకుసాధ్యమా! నే నెటు లీమెబారినుండి తప్పించుకొందును? నాకేది తెరువు? ఎవ్వరైనవచ్చి నాదుశ్చేష్టలనుజూచిన నాతల గొరిగింపరా? నాయొడలు చెక్కఁపరా? ఏమైనం గానిమ్ము. ఇటనుండి యుక్తిచేఁ దప్పించుకొని పోయెద. [ప్రకా] అమ్మా! తులసీ! నీ భక్తి యపారము. నే నిప్పుడీ రూపమునఁ గొందఱ భక్తుల ననుగ్రహింపఁబోవుచు నీ ప్రార్థన విని నీ భక్తికిమెచ్చి యిటు వచ్చితిని. కొలఁదిదినములలో బాలకృష్ణరూపమున నేనై మీ యింటికి వచ్చెద, మీకు దర్శన మిచ్చెద. మహాసాధ్వియై యపరరాధ యనఁదగిన మీయత్తను రాధ ననుగ్రహించెద. ఇచ్చట నీవింక నాలసించిన నిత్యము మీయింట జరపు నాపూజ కాలస్యము కావించి యపరాధ మొనరించినదానవగుదువు. మీయత్త నీకై యెదురుచూచుచుండును. ఇదిగో! పూలబుట్ట తీసికొనిచనుము. [అనుచుఁ బువ్వులు పత్రి యిచ్చును]

**తులసి**—[విచారముతో] కృష్ణా! నిన్నెత్తుకొనిపోయి మాయత్తచేతుల నుంతుననుకొంటినే! చేతులార వెన్న దినిపింతు ననుకొంటినే! కడుపు నిండఁబాలుత్రావింతు ననుకొంటినే! మనసార ఫలములొసంగుదునను కొంటినే? అట్టి నాసంతోషమును భంగపఱచెదవా? మాయింటికి రావా? నన్ను మఱచిపోయెదవా?

స్వామి—తులసీదేవీ! నాకాతిథ్యమీయ లేదని విచారించుచుంటివా? నీమనస్సువలెఁ బరిపక్వములై యాచెట్టున వ్రేలాడు ఫలముల కోసి నాకొసంగి నీ మనోభీష్టము నెఱవేర్చుకొనుము.

**తులసి**— దేవా! భవద్దర్శనసంతోషవివశనై కర్తవ్యమును మఱచిన నన్నుద్ధరించిన నీకిదే నమస్కారము. [ఫలములు గ్రహించి] దేవదేవుండవై సకలభువనోదరుండ వైన నీకీ ఫలములర్పించి సకల జగత్సంతర్పణము గావించినదాననగుచుంటినే! ఏమి నాభాగ్యము, ఏమి నాపుణ్యము! [ఆనందవివశయై ఫలము లొలిచి యిచ్చును]

యశోదానందవర్ధనా! శ్రీకృష్ణా! కడుపారభుజింపుము. నన్నుద్ధరింపుము.

మిస్ట్రా— [మింగుచు] అమ్మా! సంతృప్తిఁ జెందితిని. అయ్యావినా కిచ్చి ఇంక నీ గృహమునకు నీవు పొమ్ము.

తులసి—[దైన్యముతోఁ బోఁబోయి వెనుకకుఁదిరిగి] కృష్ణా! నీయాజ్ఞయనుల్లంఘనీయ మని యెఱింగియు మహానందకరంబగు నీబృందావనమునుండి సకలజగత్సంసేవ్యంబగు నీ సన్నిధినుండి పోఁజాలకుంటినే! నేనేమి సేయుదును? తండ్రీ!

గీ. వీక్షణామృతవృష్టిఁ దా ♦ వెల్లివిరియ
దేహకాంతిసవంతులు ♦ దెసలఁబార
నిరుపమానందవారాశి ♦ నే మునుఁగ
నిన్ను విడి యెట్లు పోనేర్తు ♦ నీరజాక్ష!

[పాదములు పట్టుకొని పాదరజమును బూసికొనును]

స్వామి—తులసీదేవీ! ధ్యాననిమగ్నవై యొక్కక్షణ ముండుము.

తులసి—[ధ్యానమునటించును]

స్వామి—[ఆవలికేగును]

తులసి—[కనులు దెఱచి దిక్కులుచూచి] అయ్యో! నా దేవుఁడు శ్రీకృష్ణపరమాత్మ యంతర్హితుండయ్యెనే? ఇంకేమిచేయుదును? కానిమ్ము ఇంటికేగి కృష్ణాగమనమును నిరీక్షించుచుండెద. [నిష్క్రమించును.]

స్వామి—[ప్రవేశించి దిక్కులు చూచుచు] ఔరా! ఇప్పటికి నా స్థితి పాముNOటినుండి జారిన యెలుకచంద మైనది. ఆహా! ఈ భక్తిమతీస్వరూపమున శ్రీకృష్ణపరమాత్మ నా బుద్ధిహీనత నాకెట్లు చూపించినాఁడు! దేవదేవా! శ్రీకృష్ణా! నీ ప్రభావ మప్రమేయము.

ఉ. అన్నియు నీవయై నిఖిలమందున నీవు వెలుంగుచుంట నే
నెన్నఁగలేకయిట్టి భవ♦దీద్యమనోహరవేషమూని నే
నెన్నొ యకృత్యముల్ సలుపుచిట్యెడ నీసతిభక్తిభావనన్
గన్నులు విప్పి నీమహిమఁగాంచితిఁ ద్రెంచితి మోహవల్లికల్.

తండ్రీ! శ్రీకృష్ణా!

శా. నావేషంబుననిన్నుఁ గన్గొనుచు నానందించె నాకాంత, కాం
తావిభ్రాజితసంస్తుతి ప్రీతతులన్ ద్వద్రూపమేఁగంటి నెం
తోవిజ్ఞత్వముగాంటి దేవ! వరదా! యోకృష్ణ! నిన్గొల్తు స
ద్భావంబుల్ వెలయించి నీదు పదసేవాభాగ్యముల్ గూర్పవే.

ఇప్పు డీ తులసీదేవినిఁజూచిన నాకన్నివిధముల బుద్ధివచ్చినది. ఇంక నీలోకవంచకమగు కపటవేషము నిప్పుడే తీసివైచెద. [అని విగ్గు మొదలగునవి తీయుచు] తులసియు రాధాదేవియుఁ బ్రత్యహము భగవానునిఁ బూజించుచుందురు. అక్కడికేగి వారివలన నిష్కళంకమగు భక్తిమార్గము నవలంబించి ధన్యుఁడనయ్యెద. [ముందుఁ జూచి] నాకొఱకుఁగాఁబోలు కమలయు గిరిజయు వచ్చుచున్నారు. వారిని నాకథవినుటకు వచ్చిన యెల్లవారిని మాధవశర్మ గృహము నకు రమ్మని వారికిఁగూడ సన్మార్గమును జూపెద.

[నిష్క్రమించును.]

ఇది చతుర్థాంకము

---

# లలిత

## పంచమాంకము

సభాపతి—[కుంచెకోలఁబట్టుకొని విచారముతోఁ బ్రవేశించును] మహా సభలలో అందరికంటె ముందుగా అర్చింపబడేవాడు గుళ్ళకర్చకుడు, మందుసంచిస్థానములో కుంచెకోలానా ? కాలాన్ని యేమనాలె? మాధవశర్మపోతే ఇళ్ళు, వాకిళ్ళు పోయినట్టు వూరుకు వూరు దూరటమే; పైగా బోడినెత్తిన తాటిపండుపడ్డట్టు కొంప కాల్చిన కొరవి కాళికాంబతోపాటు, ఏమీయెరుగని నన్నుగూడాకలిపి ప్రతిచోటా పరిహాసించడమే? రవ్వ రద్ది యెరుగని రాధమ్మ కాబట్టి సరిపోయింది కానిమరోరయితే కచీర్లల్లోనే కాపరం చెయ్యాల్సొచ్చేది; ఏమో అనుకున్నా కాని కాళికాంబ మళ్లీ వూళ్లో కాలుపెట్టడం నాగొంతుమీద కత్తిపెట్టినట్టుగావుంది. అందుకనే 'చెఱపకురా చెడేవు' అన్నారు. మాధవశర్మ దేవుణ్ణికూడా వూడలాగించా. అప్పుడుచేసి యిప్పుడనుకొంటే యేంలాభం? వెనుకచింతించుట వెఱ్ఱితనము, ఇంక సమయమయింది పూజారితనానికిపోవాలి. [అనిపోఁబోవును]

కాళి—[ప్రవేశించి సంతసముతో] ఓహో బావగారా! నమస్కారం.

సభా—[ఉలికిపడి] నా యీ ప్రయాణానికితోడు నీవెదురుపడడంగాక పైగా నమస్కారం గూడానా ? ఎక్కడకండీ పోవటము? అనికూడా అడుగు; సరిపోతుంది.

కాళి—బావగారు! నేనువస్తే, పూర్తిగ అపశకునముకాదులెండి. అయినా మీకునేనెంతో నాకుమీరుఅంతే. శకునంలో మనమిద్దఱం సమానమే.

సభా—ఒక శకునములోనే కాదు, ఇప్పుడన్నింటిలోనూ సమానమే. సరే కాని అర్ధరాత్రివేళ మాధవశర్మగారి యిల్లు కాలిందే, ఏమా దురాగతం?

కాళి—మిట్టమధ్యాహ్నమప్పుడు, దేవతార్చనకూడా వదలి మాధవశర్మ మాయమయిపోయినాడే ఏమిటా అఘాయిత్యం? సభాపతిగారటు కాళికాంబగారిటు లేకపోతే ఇంకవాడు మనకందుతాడు? నీ పుణ్యమాంటూ, మాధవశర్మ దేశం తెగించిపోయినాడు. నాపుణ్యమాంటూ రాధమ్మకిల్లు లేకుండాపోయింది.

సభా—కాళికాంబా! రాధమ్మ చాలయోగ్యురాలు. ఎవరెన్ని చెప్పినా మనలను కచేరీపాలు చేయలేదు; అంతాపోయింది. పూస పుట్రి అమ్ముకొనైనా పదిరోజులు పొట్టపోసుకొంటారు, ఇంతటితో యిక వూరుకో.

కాళి—వూరుకోటమే, రాధికి ముష్టిచెంబిప్పించకుండా వూరుకోటమే?

సభా—నీవేంజేసినా అదంతా నాపైగ్గాడావస్తున్నది; అదంతా దుర్భరమైపోతూంది. అతి మొందుకూపనికిరాదన్నారు పెద్దలు, నామాట విని యింకేమి తలపెట్టపోకు. [అని బతిమాలును.]

కాళి—బావగారు! మీరేమన్నా అనండిగాని, ఆ అత్తాకోడళ్ల నగలు కూడా పోతేగాని, నాకునిద్రపట్టదు. ఆప్రియత్నంకూడా చేస్తున్నా, ఆపనికూడా చేసితీరుతా.

సభా—అయితే దొంగతనపు ప్రియత్నం కాదుకదా?

కాళి—అదేమిటి? యిదేమిటి? సమయంవస్తే కాళికాంబ అన్నిటికీతయారనుకోండి.

సభా—కాళికాంబా! నీకేం? అన్ని దేశాలు తిరిగి అన్నిట్లో ఆరితేరావు; నీ మూలకంగా నాకు వూళ్లో వుండరాముల్లేకుండా మాత్రం చెయ్యకు.

కాళి—బావగారు! మళ్ళీ మగవాణ్ణనుకుంటావే యిదేనా నీ మగతనం? ఇక్కడ వుండలేకపోతే నాతో వుండు, నిన్ను నేను సంరక్షిస్తా.

సభా—అంతమొందుగ్గాని, యింక నామీదికేం రాకుండా మెలాగో

యిక్కడే నన్ను బ్రతకనీ, నీకు నమస్కారం చేస్తా. [అని బతి మాలును.]

కాళి—[నవ్వుచు] పిచ్చిబావగారు! ఏమో అనుకున్నాగాని సాక్షాత్తు పిరికిబంటువని అనుకోలేదు. మరేం పర్వాలేదు. భయపడకండి, ఇంకమీామీద ఈగవాల్నియ్యాను, చూడండి. [అని మోదార్చుచు] కొంచెము పనివుండి పోతున్నా, మీరు ధైర్యంతో వుండండి. [అని నిష్క్రమించును]

సభా—[ఆశ్చర్యముతో] నేనే అనుకుంటే కాళికాంబ నాతల తన్నిం దైందే, ఏమి సాహసం చేస్తుందో ఎలాదీన్ని భరించటం? అందుకనే నీచుల్ని చేపట్టటం కుంపటి నెత్తిన పెట్టుకోటమే అన్నారు, పెద్దలు. కానీ యేమౌతుందో చూస్తా. [అని నిష్క్రమించును]

[గొడ్లపాకలోఁ గృష్ణుని సాన్నిధ్యమున రాధయుఁ దులసియు నుందురు.]

రాధ—[దైన్యముతో] ఇప్పుడెందులకు రాఁగూడదే అమ్మా? నీకుఁ గన్పడిన భగవానుఁడు నాకెందులకుఁ గనబడఁగూడదే? నేనేమి పాపము చేసితినే? [విచార మభినయించును.]

తులసి—కొలఁది దినములలో బాలకృష్ణరూపమున నాకైనే నేవచ్చెదనని చెప్పినాఁడండి అత్తయ్యా! ఆహా! ఏమికృష్ణుఁడండి, ఎంతచక్కని గానమండి, ఏమి అందమండి, ఎటువంటి సంగీతమండి ఆహా! తలఁచుకొనిన ఆదృశ్యములు, కంటికి కనఁబడుచున్నవి! [అని ఆనంద మభినయించును.]

రాధ—[నిట్టూర్చుచు తులసిచెయిఁబట్టుకొని] తులసీ! నీవెంత ధన్యు రాలవు!

మ. తులసీ! యెంతటిభాగ్యశాలినివి నీ◆తోఁగృష్ణుఁడన్నట్టి ప
ల్కులు నిక్కంబటె యిద్ది గేహమని యే ◆ గుర్తైననుం జూచెనే
తులసీమాలలు గూర్పఁగానగునె విం◆దుల్ సేయ మెప్పందునే?
ఫలముల్ పాలును వెన్నమీఁగడలు సం◆భావించునే చెప్పవే.

తులసి—అత్తయ్యా! మీాకింత భ్రాంతియేమండి? నిత్యము మీారుచెప్పు మాటలే మీారు మఱచుచున్నారు. అంతటనుండి యన్నిటినిఁజూచు

దేవునకు, మనయిల్లు తెలియదండి? పత్రమైనను, పుష్పమైనను, ఫలమైనను, జలమైనను ఇచ్చినఁ జాలునన్న శ్రీకృష్ణుఁడు మనము భక్తితో నిచ్చిన దేనిని గ్రహింపఁడు!

రాధ—[దిక్కులుచూచుచు] తులసీ! ఇంకను శ్రీకృష్ణుఁడు రాకున్న వాఁడే! నిఖిలజగదవనశీలుండగు భగవానుఁడెందున్నవాఁడో కదా?

సీ. కికురింప నవ్వీథి ♦ కే ప్రపులఁడాపఁగఁ
దదూప్రపములఁదాల్చి ♦ తనరెనేమొ?
కడఁగి యిందుప్రఁడు మంద ♦ జడివానఁగురిపింపఁ
గొండ గొడుగుపట్టి ♦ యుండెనేమొ?
విసమున దెసలెల్ల ♦ వేల్చెడుకాళియు
తలక్రొవ్వడంచుచుఁ ♦ దడసెనేమొ?
ఎలమిఁగ్రిడలొనర్ప ♦ నేర్చెడు వనవహ్ని
విసువక మెసవుచు ♦ మసలెనేమొ?

గీ. ఏలరాఁడు దయాంభోధి ♦ యేలకనఁడు
సత్యశీలుఁ డిఁకెన్ని వ♦త్సరము లిటుల
వేగ్రఁగవలయునొ శ్రీకృష్ణు ♦ వేఁడుకొనియొ
తలఁచియో కొల్చియో వేగఁ ♦ దులసి! తేవె?

[అని చేతులుపట్టి వేఁడుకొనును]

తుల—దేవుఁడసత్యమాడునా? అత్తయ్యా! వచ్చెదనన్నవాఁడు తప్పక రాఁగలఁడు. మనమీ దేవునిఁ బూజించిన ఆ దేవదేవుఁడు సంతసించును. అతిథిపూజకు వచ్చెడిలోపమడంచి మామగారి వార్త కూడ వినిపించును. మనల నుద్ధరించును.

రాధ—తులసీ! కోడలవన్న నీవు కోడలవు, సుగుణవతివగు కోడలవు, కులముద్ధరించు కోడలవు; తల్లీ! చక్కఁగా జ్ఞాపకము చేసితివి. సర్వాంతర్యామియగు దేవుఁ డెందులేఁడు? ఎందుఁ బూజించిన నా శ్రీహరికిఁ జెందదు? నీవు చెప్పినట్టు లా సర్వేశ్వరునిఁ బూజింత మాతఁడే మనల నన్నివిధముల నుద్ధరింపఁగలఁడు.

కపటబ్రాహ్మణులు—[తెరలోనుండి] అమ్మా! రాధమ్మగారు!
[అని పిలుతురు]

తులసి—ఎవరో వచ్చినారండి అత్తయ్యా!

బ్రాహ్మణులు—[ప్రవేశించి]

ప్రథమ—అమ్మా! రాధమ్మగా రెవరమ్మా?

తులసి—వీరేనండి, మా యత్తగారు.

ద్వితీ—[శ్రమ నభియించుచు] మీరేనా అమ్మా! మీ ప్రతిష్ఠ యేమండి! సాక్షాత్తు కాశీఅన్నపూర్ణ అంటారండి నిన్ను.

రాధ—నాయనలారా! ఆయాసముగ మాట్లాడుచున్నా రేమి?

ప్రథమ—ఆయాసమేమిటి తల్లీ! కళ్లు తిరుగుతున్నవి. ప్రాణాలుపోతు న్నవి. [శ్రమ నభినయించుచు] అబ్బబ్బ! [అని కూలఁబడును]

రాధ—[ఆతురతతో] ఎందుకు నాయనా! ఏల శ్రమపడితిరి?

ద్వితీ—[ఆయాసము నభినయించుచు] రెండురోజులైనది. అన్నపాన ములు లేవు. నిన్న పడవలందలేదు. నేఁడు మేమెక్కిన పుట్టి గాలికి కొట్టుకొనిపోయి యిప్పటికి గట్టుపట్టినది.

తులసి—రెండురోజులనుండి అన్నములేదా? అయ్యో! యెంత కష్ట మెంతకష్టము!

ప్రథ—అన్నమేమిటి? పడవలో నీళ్లు కాదుగదా, చివరకు ఆచమనం గూడా పనికిరాదుగా అమ్మా! మా అవస్థ దేవుడికి తెలియాలి. మీ చేతిమీదుగా యింత గంగయిస్తే ప్రాణాలు దక్కుతై. పైన మీ చిత్తం.

రాధ—[త్వరతో] నాయనలారా! స్నానముచేసి రండు. వంటచేసెద.

ద్వితీ—ఆహా! ఎంత పుణ్యాత్మురాలవు తల్లీ! ప్రాణాలుదక్కిస్తున్నావు.

ప్రథ—మే మిద్దరమే కాదమ్మా! చిన్నలు, పిల్లలు, పసిపిల్లలు, ఆడ, మగ అంతా పెళ్లికిపోతూ వచ్చాం. అంతా యేబదిమంది మున్నాం. నీయిల్లు కల్పవృక్షమన్నా రందరు. నీయాజ్ఞయితే ప్రాణాలుదక్కిం చుకుంటాం. లేకపోతే యే చెట్టుకిందనో కళ్లుమూసుకొని పడు కుంటాం. రేపటి కెందరముందుమో, యెందరము పోదుమో?

రాధ — పిల్లలకుఁగూడ అన్నములేదా ? పాపము! పెట్టని దినములు. తండ్రులారా! అందఱు దయచేయుఁడు.

ద్వితీ — [సంతసముతో] ఎందఱికో ప్రాణదానంజేశావు తల్లీ ! సాక్షాత్తు అన్నపూర్ణా దేవివే ! అందఱం వస్తాం.

ప్రథ — ఈ యిల్లుకాలిం దెవరిదమ్మా !

రాధ — [ స్తబ్ధురాలగును.]

తులసి — మాదేనండి. యీమధ్యనే కాలిపోయినదండి.

ప్రథ — పాపం! గోడలు అవ్వి చూస్తే పెద్దలోగిల్లాగుంది. ఏంజేస్తాం? "అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్" అన్నారు. ఏం తప్పుతుంది? అంతా అనుభవించాల్సిందే. [విచారమభినయించును]

ద్వితీ — ఇది చిన్నపాక. పదార్థం పాత్రసామగ్రి అదికూడా ఏం కన పట్టంలేదు. మాకు నిజంగా యిక్కడ వసతికలుగుతుందా? ఎక్కడి కయినా వెళ్లమంటారా?

రాధ — [నిట్టూర్చి] ఇక్కడనే వసతియగును.

ప్రథ — అయితే మేం ఇక్కడికేనా రావాల్సింది, మరోయిల్లుందా?

ద్వితీ — మాకు భోజనంపెట్టే శక్తియున్నదా? లేక వట్టిముఖప్రీతియేనా?

రాధ — ఈశ్వరుఁడే అన్నియునిచ్చును. మీరు దయచేయుఁడు.

ప్రథ — మొన్నయిల్లు కాల్చిన యీశ్వరుడిప్పుడే అన్నీయిస్తాడు? బలే మంచి యీశ్వరుణ్ణి నమ్మారు ! అరిచేతిలో వైకుంఠం కనపరస్తు న్నారు. మాకు సెలవిప్పించండి. వెడతాం.

ద్వితీ — నమ్మల్నందర్ని రమ్మనటం ఇక్కడేమి లేకపోవటంచూస్తే, వొళ్ళుకాలినవాళ్లకు కొఱవిచూపిస్తున్నట్టుంది. ఎందులకీ కాల హరణం? రావయ్యా ! రా ! పోదాంరా. [అని అతనిచేయిఁ బట్టు కొని పోఁబోవును.]

తులసి — అయ్యా ! త్వరపడకండి. కొంచెమాగండి.

ప్రథ — ఏమాగాలే? ఏంచెయ్యాలె?

రాధ — [నిర్విణ్ణయై] బజారులకు ఫరజాలుకట్టి యన్నదానము చేసిన మాయింటికి, నిరతాన్నదానగృహమని పేరు పొందిన మాయింటికి

అతిథులు అభ్యాగతులు వచ్చిచూచి యుస్సురని పోవుటయా? దైవమా! ఎంతతాంత్రికుఁడవు నీవు! [ఆకసమువంకఁ జూచును.]

తులసి—[విచార మభినయించును.]

ప్రథ—అమ్మా! విచారపడటంతప్ప మీరేం చెయ్యలేరు. ఆకలి మంటకు పేగులు మాడిపోతున్నయ్, ఇంక మేం భరించలేం.

ద్వితీ—అమాంతం ప్రాణాలు లేచిపోతున్నయ్, ఇంక మేమోర్చుకోలేం. వూళ్లో యేఅమ్మైనా యింతగంగయిస్తే పొద్యేపాణాలాగుతేయ్, లేకపోతే నుయ్యో! గొయ్యో! మాకందటికి యేంగావలసుందో? ఇంక మాకు సెలవిప్పించండి. [అని పోఁబోవుదురు.]

రాధ—[అడ్డగించి] నాయనలారా! మీరూరక పోవలదు. అందఱు దయచేయుఁడు.

తులసి—దయచేయుఁడు స్వామి! తప్పకుండ దయచేయుఁడు.

ప్రథ—అమ్మపెట్టనూ పెట్టదు, అడుక్కోనీ తిన్నియ్యదని, ఇంకోచోటయినా చూసుకోకుండా ఇన్ని దయచెయ్యటాలు ఎందుకండీ! ఈ వెచ్చవెచ్చని బూడిదె నోటకొట్టుకోటానికా? [అని పోఁబోవ]

రాధ—[వారించి] తండ్రీ! అట్లనకుము. ఈప్రదేశము ప్రసిద్ధిఁగాంచిన పవిత్రస్థలము. సాయంకాలాతిథులు పరమదైవములు. అట్టిమీకాతిథ్యమమరకపోదు. ఇది గోశాల దయచేయుఁడు. అందఱిచటికే దయచేయుఁడు.

ద్వితీ—అమ్మా! నీవు మిక్కిలి సాహసురాలవలె నున్నావమ్మా! మాటలు చక్కగానున్నయ్. ఇంటయేమీ కనబడదు. ఏంజేస్తావో మమ్మల్నెలా బదికిస్తావో తెలియదు.

రాధ—[ధైర్యముతో] సంశయమువలదు. విచారింపకుఁడు.[ముందునకు నడిచి] ఎవరోయీ అక్కడ? [అని పిలుచును]

వెంకన్న—[తెరలో] అమ్మా! నేను వెంకన్నను.

రాధ—వెంకన్నా! నీవుపోయి, సాహుకారు, సుబ్బయ్య గుప్తగారిని నేను రమ్మంటినని చెప్పి త్వరగఁ బిలుచుకొని రావలె. శీఘ్రముగఁ బొమ్ము.

వెంకన్న—[లోపలినుండి] అలాగేనండి. అమ్మా! మిమ్మల్ని చూడటాని కేమోనండి గుప్తగారే యిలావస్తున్నారండి.

రాధ—అలాగా? సరే మంచిది రానిమ్ము.

సుబ్బయ్య గుప్త—[ప్రవేశించి చూచుచు]పోయింది, అంతాపోయింది. పాపం! అగ్రహారం పొలాలు అలాగు, ఇల్లు ఇలాగు. కాలంతప్పితే యెవ్వరికైనా ఇంతే. అంతాభగమంతుడిమాయ! [రాధమ్మను జూచి] అమ్మా! రాధమ్మగారూ! నెలరోజుల్నించి వూళ్లోలేను; ఇవ్వాళేవచ్చా. మీసంగతి వింటేచాలా కష్టంగావుంది. యేంజేస్తాం? కొంతగాకపోతే కొంతయినా సామాను ధాన్యం అదీ తీయించారా? అంతా రామార్పణమే అయిందా?

రాధ—[నిట్టూర్చి] సర్వము ఈశ్వరుఁడు తీసికొనినాఁడు గుప్తగారు!

తులసి—అర్ధరాత్రి నిద్రాసమయము పొగలో మాదేవుఁడే మాకుఁగనఁబడలేదు. ఏలాగో వెదకి మాఅత్తగారు దేవునిపెట్టెతో బయటికి వచ్చినారు.

గుప్త—అందరు వూళ్ళోపొరుగూళ్ళో సభాపతి కాళికాంబా చేయించారని అంటూన్నారు. ఇద్దర్ని కలిపి ఒక్కఅర్జీయివ్వండి. నాతో చెప్పినవాళ్ళపేర్లన్నీ చెపుతా. వాళ్లందర్ని సాక్ష్యంవెయ్యండి. మరీ వారివ్యవహారంచూస్తే వొళ్లుతెలియకుండావుంది. బాగా రోగం కుదర్చండి. గోదావరినీళ్ళు తాగించండి. చెయ్యండి ఆపనితప్పకుండా చెయ్యండి.

రాధ—అదియే నిజమైన, దేవుఁడు వారికాబుద్ధి పుట్టించియుండును. వారినేమియు ననఁజాల. ఏమియుఁ జేయఁజాల.

గుప్త—అంతే? కొంపలికి కొంపలు తీస్తుంటే వూరుకోవాల్సిందే?

రాధ—ఏమేనిఁగానిండు. అదిపోనిండు. నాభర్తగారవసరము కలిగిన మీవద్ద డబ్బుతీసికొమ్మని చెప్పిరి. ప్రస్తుతము ఏఁబదిమందికి సామగ్రిపంపి ఖర్చునకు పదిరూపాయలుకూడ పంపించండి.

గుప్త—ఇప్పుడు యాభయిమందికి సామాగ్రి యెందుకండి?

రాధ—ఎవరో అతిథులువచ్చినారు. వారుపవసించిచాలడస్సియున్నారు. కావలయును. వారికొఱకుం గావలయును.

గుప్త—యజమానుఁడిగారి జాడకూడా తెలియకుండావుంటే, ఇల్లిట్లా పొలాలట్లా అయితే, ఇందులో సమారాధన్లు సంతర్పణలూనా? ఇదేకామాల్ను బ్రాహ్మల్నంతాఅంటూవుంటారు 'అప్పుచేసి పప్పు కూడు' అని. బాగుంది! వ్యవహారం. రాధమ్మగారు! మీరడిగిన పది రూపాయిలు అలాగే పంపుతాకాని, మీరు వెనకటి సంగతంతా మఱచిపోండి. రేపు వృాళ్లోనలుగుర్ని చూడండి, పాకోగీకోయేదో వకటివేసుకోండి. కాస్తోకూస్తో ఇప్పుడు అంతా సాయంచేస్తారు; చెయ్యండి ఆప్రియత్నం తప్పకుండా చెయ్యండి. [బ్రాహ్మణుల వంకఁజూచి] పొద్దుగూకి వాళ్నేమి వేధిస్తారండి? మాఇళ్లకురండి. తలామానెడు సోలెడు బియ్యం అది యిస్తాంపదండి. మా బజారుకు పదండి.

ప్రథమ—ఇక్కడ లేకపోతే అంతేనండి, ఏమన్నా మాకింకా కాస్తమీరే దిక్కండి.

రాధ—గుప్తగారు! నాకొఱకెవ్వరినిఁ జూడనేరను. ఏమియుఁజేయనేరను. నా భర్తగారింట లేరని మాయాస్తి పోయినదని మీడబ్బురాదని సంశయింపకుఁడు. ఇదిగో నామెడలోని ఈ బంగారుగొలుసు. దీనిని మీకడనుంచి సామగ్రి, పైకము పంపుఁడు. మిగిలిన సంగతులు రేపు విచారింతము. [అని గొలుసు తీసియిచ్చును.]

గుప్త—[నివ్వెఱపడును]

బ్రాహ్మణులు—[విభ్రాంతులగుదురు]

తులసి—అవునండి అత్తయ్యా! ఇళ్ళు వాకిళ్ళు పొలాలు సంసారము అంతయునింతే. మనకిల్లుకూడలేదు. నగలున్న దొంగలెత్తుకొనిపోవు దురు. ఇదికూడ ఈశ్వరార్పణము చేయుఁడు [అనిగొలుసు మొద లగునవి తీసియిచ్చును].

రాధ—గుప్తగారు! ఇవికూడ మీదగ్గరనేయుంచుఁడు.

గుప్త—[ఆశ్చర్యముతో] అమ్మగారు! మీకు పిచ్చాయేమండీ?

బంగారంవంటి యిల్లుపోతే, ఎవ్వర్ని చూడటంలేక, యే ప్రయత్నం లేక, ఉన్ననగలమ్మి సమారాధ న్లేమిటండి మీాకు? రాండయ్యా! రాండి మాబజారుకు రాండి [అని విప్రులఁబిలుచును.]

రాధ—[అడ్డగించి] గుప్తగారు! వారుపవసించిడస్సియున్నారు; సాయం సమయాగతులు; బ్రాహ్మణులు; స్త్రీ బాల వృద్ధులు. ఇట్టివారి నూరక పంపుటకంటె వేఱునరకముండదు. దయయుంచి వెంటనే సామగ్రిని పంపుఁడు. [తెరవంకకుఁదిరిగి] వెంకన్నా!

వెంకన్న—[తెరలో] అమ్మా!

రాధ—నీవు గుప్తగారితో వెళ్ళి సామగ్రి తెప్పింపుము.

వెంకన్న—[తెరలో] అలాగేనండి!

గుప్త—[ఆశ్చర్యముతో] రాధమ్మగారు! ఇవ్వాళ యివ్వమ్మిపెడితే రేపేం అమ్మిపెడతారండీ మీారు?

రాధ—గుప్తగారు! ఈశ్వరారాధనకింత యోజింపవలెనా?

ఉ. శ్రీధవుఁడయ్యు శౌరి సుర • శేఖరులం దనియింపఁ దొల్లి దై
త్యాధిపు వేఁడఁడే? శ్రితజ • నార్తి హరింపఁడె? దాన లోపమే?
మాధవునిన్ భజింపనవ • మానమొ మానమొ దోయిలొగ్గుటే
సాధన మా పరాత్పరుని • సన్నుతి సేయుటె రాధకృత్యమా.

భరతదేశమెప్పుడును పరమార్థశూన్యము కానేరదు. ఈశ్వరుని నమ్మినవారెన్నఁడును జెడిపోనేరరు. ఇంకనాకుఁ గృష్ణుఁడే శరణ్యము. నాభవితవ్యమును విచారింపక వెంటనే సామగ్రినిఁ బంపి పుణ్యము గట్టికొనుము.

గుప్త—మీారున్న ఈస్థితిలో మీా అత్తా కోడళ్ళీ బ్రాహ్మల్నాపటం నగలుకూడా లక్ష్యంలేకుండా పడెయ్యటంచూస్తే గుండె చెదిరిపోతుంది. ఇంక మీాకేంచెపుతా? డబ్బుకేంలెండి? యెలాగో యెప్పుడైనా చూసుకోవచ్చు. మీాకు ఇల్లూ అదికూడా లేదా, ఈనగలుమనఇంట్లో ఇనప్పెట్టెలో వుంచుతా. మీాయిష్టప్రకారం యాభైమందికీ చీటీవ్రాసి గుమాస్తాచేత అన్నిసరుకులు సప్లయి

చేయిస్తా. పాపం మళ్ళీ ఇంకోచోటికేం పోతారు? బిందెలు తప్పాలాలు గిన్నెలు అవ్వీకూడా పంపిస్తా. దేవుణ్ణి నమ్మారు. దేవుడే మిమ్మల్ని వుద్ధరిస్తాడు. ఇంక నాకు సెలవిప్పించండి.

రాధ—మంచిది. అన్నియుఁ ద్వరగఁ బంపుఁడు.

తులసి—అత్తయ్యా, మజ్జిగ కూరలు పంపింపుమని చెప్పండి.

గుప్త—అమ్మా! అన్నీ పంపిస్తా. [పోవుచు ముందుఁ జూచి] అదిగో మళ్లీ వొకమూట దిగుతున్న దే! ఇచ్చేవాడుంటే చచ్చేవాడుకూడా చెయిజాపుతాడంటారు ఇదేకామాల్సు! కానీలే, అంతావారే విచారించుకుంటారు. [నిష్క్రమించును]

విశ్వపతి—[ప్రవేశించి చూచి] ఆహా! సర్వశూన్యమైనదే! దైవ సంకల్ప మెంతవిచిత్రమైనది! అమ్మా! రాధాదేవిగారు! శిష్యుఁడు విశ్వపతి నమస్కరించుచున్నాఁడు.

రాధ—[సంభ్రమముతో] విశ్వపతీ! విశ్వపతీ! ఎప్పుడు వచ్చితివితండ్రీ! [సంతోషముతో] తులసీ! మన విశ్వపతివచ్చినాఁడు. శుభము విని పించు నిటురమ్మా.

తులసి—ఏఁడీ! [అని సమీపించును]

రాధ—నాయనా! గురువుగారెందున్నవారు? రాజకీయనిర్బంధాదులు లేక సేమముగనుండిరా? మమ్ము రమ్మనియాజ్ఞనిచ్చిరా? మా కృష్ణుని క్షేమమేమైనఁ దెలిసెనా? చెప్పుముతండ్రీ! చెప్పుము.

విశ్వ—అమ్మా! గురువుగారు ప్రజాదరణకుఁ బాత్రులై మిక్కిలి సుఖముగనున్నారు, కృష్ణానదీ తీరమున మహేంద్రపురమున గొప్ప ఆశ్రమ మొకటి స్థాపించినారు. కోడలిగారితోఁగూడ మిమ్మచటికి రమ్మని యాజ్ఞాపించినారు. కృష్ణశర్మగారు శాస్త్రములను బూర్తిఁ జేసితినని దర్భాంగమహారాజుకడ దుశ్శాలువలు స్వర్ణకంకణములు బహుమానమందితినని కాశీమహారాజును అచటి పండితులనుజూచి కొలఁదిదినములలో రాఁగలనని జాబువ్రాసినారు. వారును అక్కడికే వత్తురు. ఇంక మనముకూడ పోవుదము.

రాధ—[ఆనందముతో] విశ్వపతీ! నీ వమృతము గురిపించినావు. తులసీ! నేఁడు కడుంగడు సుదినము. కన్నులు మూసికొనిన ట్లున్నది. ఇంక నాహృదయేశ్వరుని మాచిట్టితండ్రిని గృష్ణయ్యను జూడఁగలను.

తులసి—నిజమండి. అలాగేయున్నది; తప్పక యుదయమే బయలు దేరుదము.

రాధ—విశ్వపతీ! భద్రముఖుఁడవై సీత కాంజనేయునివలె మాకెంతయు సంతసమును సమకూర్చితివి. ఉదయమే పోవుదము. [బ్రాహ్మణుల వంకకుఁ దిరిగి] నాయనలారా! మీయనుగ్రహమున మాకు శుభము తెలిసినది. మీరెల్లరు శీఘ్రముగ దయచేయుఁడు. విశ్వపతీ! లోనికిరమ్ము. తులసీ! పోవుదముపద. [ముప్పురు నిష్క్రమింతురు]

[ప్రథమ, ద్వితీయులు, మాధవశర్మయింటిముందుకు వత్తురు.]

ప్రథ—అరే బావా! ఆకాళికాంబమాటవిని నీవు, నీమాటవిని, నేను, ఇక్కడికొచ్చి అల్లరిచేతామనుకొంటే మనకు ముఖాలే చెల్లకుండా అయినవే, ఇంకా యాభయిమందిని తేవటం యెల్లాగూ అంట.

ద్వితీ—నేనుచెప్పలా! మంచివాళ్ళ తెరువుపోతే మానప్రాణాలు దక్క వని. ఆ కాళిముండ విన్నదా, నీవు విన్నావా? మాధవశర్మ ఎంత వున్నతస్థితికి వచ్చాడో తెలిసిందిగదా? అతన్ని వంచించబోయి సభాపతి యేం మాటగట్టుకున్నాఁడు? రాధమ్మను వంచించబోయి యేంమాటగట్టుకుంటాం? మనం నీచులతో సావాసంచేస్తే నీచస్థితి తప్ప మరేమీరాదు. నామర్యాదంతా మంటగలుపుతున్నది. ఇంక నైనా వెధవపాపిష్ఠి కాళిముండను వదలేశెయ్యాలె.

ప్రథ—సరేగాని మన అఘాయిత్యం మన కల్లబొల్లుమాటలూ నమ్మి రాధమ్మగారు వంట తయారుచేస్తుందే, ఇప్పుడు మనమేం జెయ్యాలె?

ప్రథ—ఏంజెయ్యాల్నా? చెరియొకపెద్దపీట వేసుకొని విఘ్నేశ్వరుడి లాగ యాభయిమందితిండి మన మిద్దరం తినాలి. చేసినతప్పు

దిద్దుకోవాలెగాని కార్యంచెడ్డదని కంగారుపడితే ఎలాగోయ్! మనం యేాభయిమంది అన్నాంగదా? మనమిద్దరం పురోహితుల మందాం. మనముందు దట్టంగాపట్టిద్దాం. వార్ని వీర్ని పిలుచుకోపోయి వారుకమ్మవారు గొప్పవారు, వారూ వీరూ అని చెప్పి, మనమే వడ్డనఅది సాగించి, ఇక మంచివాళ్ళ తెరువు పోవద్దని రెండు లెంపలు ఇలాగే వేసుకుందాం. [అని ద్వితీయుని చెంపలు వాయించును]

ద్వితీ—అలాకాదు ఇలా వేసుకోవాలి. [అని ప్రథముని చెంపలు వేయును]

ఇరువురు—[నిష్క్రమింతురు]

ఇది పంచమాంకము.

# లలిత

## షష్ఠాంకము

[మోహన్ రావు గృహప్రాంతమున యజ్ఞం ప్రవేశించును.]

యజ్ఞం—ప్రాణంలాంటి నాఫ్రెండు బారిష్టరు మోహన్ రావు ఇంగ్లండు నుంచి యింటికి వచ్చినవెంటనే నాకు బృహస్పతికూడా పదకొండో యింటికివచ్చాడు. ఒకబృహస్పతేమిటి! గ్రహమండలం అంతాకూడా యేకాదశస్థానంలో ఉన్నట్టేవుంది. మరీ మా మోహన్ రావు ప్రతి కార్యంలో ప్రతిఅసోసేషన్ లోనూ తానే. వైఫుకూడా ఎక్కడెక్కడి పాషన్సు నేర్పడమే. ఆమెను ఆటలకు పాటలకు ముందు నడపడమే. మొన్ననొకకంపెనీలో వైఫుచేత వేషం వేయిస్తానని చెప్పి, భార్యను వేధించటం మొదలుపెట్టాడు. ఎంతమంచి పెళ్లానికైనా, ఒడలు తెలియని పనుల్చేసే మగాళ్ళనుచూస్తే, కాస్త వొళ్లుమండుతుందంటే తప్పేమీ లేదు. కాని వాసంతీదేవిగారు చాలాగుణవంతురాలు గనుక కోపమంతా గొంతులోనే యిముడ్చుకుంటూ, ఇప్పటివఱకు భర్తకు కోపంరాకుండా తన మర్యాదకు భంగము లేకుండా నడుస్తోంది. మా మోహన్ కు దర్జాలమీద దర్జాలు ఖర్చులమీద ఖర్చులు. ఒకటేమిటి? అన్నిరకాలు ఉండాల్సిందే. పాపం రాముచైన్ల శక్తిసామర్థ్యాలన్ని వొడిసినయి. ఇప్పుడితనికి ఋణం కావాలి, ఎవడిస్తాడు? పైగా నే నడిగితే ఇచ్చేవాడుకూడా యియ్యడు. ఏంజెయ్యను. [యోజన నభినయించి] ఓ! గుడ్ ఐడియా! చాలబాగుంది. ఆ

కంపెనీ మానేజరు రమణ్ చాలాడబ్బుగలవాడు. పైగా బ్యాంకికి మానేజరు. నాటకాలసర్దావాడు. అక్కడ నాటకాల విషయం, వాసంతీదేవిగారి తెలివితేటలు, పాట - సందర్భం ఒక్కలెక్చరిచ్చి మామోహన్‌కు పయికం సప్లయి అయ్యే వుపాయంచేస్తా. నాబండి కూడా ఇంకా కొంతకాలం నడిపిస్తా. [అని నిష్క్రమించును]

[మోహనరావుగృహము- లలిత కూర్చుండియుండును.]

లలిత—సభలకు టీపార్టీలకు బంతులాటకు సరిగదా! ఇంక పైపెచ్చుపాత్ర ధారణ చేయవలెనఁట. అందును మృచ్ఛకటికము! దానిలో వసంత సేనపాత్రము. చారుదత్తపాత్రధారి యెవ్వరో? యేమో? అబ్బా! ఈనవనాగరకుల మనుకొనువారిలోఁ బెక్కండ్రు కన్నిటిలోను అభిని వేశమొక్కటి తమదికాదు. ఇట్టివారా మార్గదర్శకులు? [వినుట నభినయించి] నాథుఁడు వచ్చుచున్నట్లున్నది. ఇఁక రామాయణ మిటనుండరాదు. [లోనఁబెట్టి ఒకపుస్తకము తీసికొనిచూచి] ఇది నావెల్ సరే. [అనిచదువఁబోయి స్మృతినభినయించి] ఆ మరచా ఇది కాదు నేఁడుమృచ్ఛకటికము చదువవలె. అభినయమునకు సిద్ధము కావలె. ఏమిచెయ్యను. ఇదివఱకే పూటకొకవేషము. నేఁడు వేష ముపై ఇంకొకవేషము! పాత్రబద్ధ మెన్నివేషాలు వేయించునో ఎవరికెఱుక ? అనుభవించుట తప్ప, దానిని తప్పుకొనుదారియేముం డును; కానిమ్ము. [అనిమృచ్ఛకటికము తీసికొని చూచుచుండును.]

మోహన్—[తెరలోనుంచి] ఓ మయిడియర్ వాసంతి! O' my dear Vasanti! [అనుచు నుల్లాసముతోఁ బ్రవేశించును.]

లలిత—[సంతసమభినయించుచు హలో! హియర్, హియర్, కమాన్. (Hollow, here here come on) [అనుచు లేవఁబోవును]

మోహన్—ఓ, మై డియర్ లేడి, సిడౌన్ ప్లీజ్, సిడౌన్ ప్లీజ్. O! my dear lady, sit down, please sit down,

[అని భార్యను కూర్చుండఁబెట్టి తానును కూర్చుండును.]

లలిత—ఐ షల్ బ్రింగ్ కాఫి. [అని లేవఁబోవును.]

మోహన్—నో నో, నాన్సెన్సు (No, no, Nonsense

నీవు తేవట మేమిటి? సర్వేంటేమయినాడు? బాయ్! [అనిపిలుచును]

[తెరలోనుండి] సార్! [అనుచు నౌకరు ప్రవేశించును]

లలిత—అయ్యగారికి కాఫి తీసుకో రా?

సేవ—ఆలాగేనండి!

మోహన్—[సిగరెట్టు ముట్టించి] వెల్! వాటార్ యూ డూయింగ్?
(Well! what are you doing?)

లలిత—ఐ యామ్ బిజిలీ ఎంగేజ్డ్ ఇన్ స్టడీయింగ్, వసంతసేనాస్ పార్ట్ ఇన్ ది డ్రామా! (I am busily engaged in studying Vasanta-sena's part in the drama)

మోహన్—[లలితచెయిపుచ్చుకొని] వెరివెల్, వెరివెల్, దటీజ్ గుడ్.
(Very well, very well, that is good)

సేవ—[కాఫీ తెచ్చియుంచి] పోవును.

లలిత—[కాఫీ గిన్నెలో పోయుచు] హేవ్ యు ఎవర్ రెడ్ మృచ్ఛకటిక?
(Have you ever read Mruchakatika?)

మోహన్—నాన్సెన్సు వర్నాక్యులర్. (Nonsense Vernacular) తెను గెవడు చదువుతాడు? వాళ్ళంతా తెనుఁగు తెనుగంటే సరేసన్నా. ఇన్ మై ఒపీనియన్ ఇంగ్లీషు డ్రామాస్ ఆర్ బెటర్ టు రీడ్ అండ్ టు ఎనాక్ట్ దేన్ ది టెలుగు. (In my opinion, English dramas are better to read and enact than the Telugu)

లలిత—హేవ్ ది కాఫి! (Have the coffee) [అని కాఫి యిచ్చి] మీ కింగ్లీషుప్రియమయితే మొన్న 'నామాతృభాషనామాతృభాష' అని లెక్చరిచ్చారెందుకండి?

మోహన్—[కాఫి త్రాగుచు] ఓ - ఆల్ లేడీస్, ఆల్ జంట్లిమన్, ది హోల్ ఆడియన్సు ఆర్, టెలుగు పీపిల్స్. (All ladies, all gentlemen; the whole audience are Telugu people) అందుచేత నేను చెప్పా.

లలిత—మీకోటకు చెప్పలేదన్నమాట.

మోహ—డామిట్ నాకిదంతా కావాలే!

లలిత—అయితే మీరు?

మోహన్—వెల్, వాసంతీ సెవరల్ టైమ్సు ఐ టోల్డ్‌యు నాట్ టు యూజ్ ది ఆర్థడాక్సువర్డ్సు. డామిట్. (Well Vasanti. several times I told you not to use the orthodox words. Damn't) మీరండి కూర్చోండి! లేండి! వుయార్ హజ్‌బెండ్ అండ్ వైఫ్. (we are husband and wife) మొగుడు పెళ్లాం మన మధ్య మర్యాద లేమిటి? హెచ్చుతగ్గులేమిటి? నాన్సెన్సు (Nonsense). భార్యా భర్తలంటే నీళ్ళల్లో నీళ్ళులాగ, పాలల్లో పాలులాగ, స్నేహితుల్లో స్నేహితుల్లాగ, బ్రెడ్ అండ్ బట్టర్ (Bred and Butter) లాగ వుండాలి. పిలు, 'మోహన్' అని పిలు.

లలిత—సరేకాని మోహన్, లలితఅని జగదంబ పేరుంటే వాసంతీఅని నాపేరా! మురహరిఅని చక్కఁగా దేవుడి పేరుంటే,మార్చి మోహన్ అని మీపేరా! ఈమార్పుఎందులకు మోహన్ !

మోహ—ఇంతేనా? వెధవ విలేజీబ్రూట్సు, (Village Brutes) తెలివి తేటలు. మానాన్న శాస్త్రులంటావ్;నాకుశాంస్క్రిటు తెలుగు అవి వచ్చునంటావ్, ఇంతేనా వాసంతీ; ఎందుకన్నానో తెలుసునా? నాప్రేమరాజ్యంలో నిన్నులిల్లీ ఫ్లవర్,(Lily Flower) లాగ, చేతుల్లో కన్నుల్లో శిరమునవక్షమునధరిస్తానని చెప్పటానికి. తెలిసిందా?

లలిత—[పరిహాసముగ]ఆలాగా! అయితే మోహన్అంటే కామెంటి?

మోహ—[ఉల్లాసముగ] నాచక్కని క్రాపు, వెడల్పైన మొగము, విశాలములైన కండ్లు,ముద్దైన నా ఫ్రెంచి కటింగ్ మీసం, పండిన జామపండులాంటి నా వంటిరంగు చూచి నాఫ్రెండ్సందరు నన్ను మోహన్ అన్నారు. అంటేయేం? నిజంగా నన్నుచూడు, [భార్య ముఖమును దన ప్రక్కకుఁ ద్రిప్పుకొని] నేను మోహన్ ఔనో కాదో నీవు చెప్పు.

లలిత—[చూచి సంతస మభినయించుచు] నాకు హజ్బెండైనప్పుడు

మోహన్ నాకు తప్పక యెప్పుడు మోహనుఁడే! మోహనుఁ డేమిటి? నాప్రభువు నాదైవము కూడాను! ఒక్కటడగనా నిన్ను మోహన్!

మోహ—[మొగము చిట్లించుకొని] నాన్సెన్సు, దైవాలు గీవాలు ఏమిటోయ్? కాఫిలో పంచదారలాగ కలిసిపోయిన మనకు అడగటానికూడా సెలవు కావాలి డామిట్, ఆర్థడాక్సు అలవాట్లు (Damn't! Orthodox customs) నీకు పోవోయ్.

లలిత—కాదండి [అని నోరుమూసికొని] ఆఁ! ఆఁ! కాదు మోహన్.

మోహ—[సంతసముతో చేయి ముద్దిడుకొని] వెరివెల్, వెరివెల్, అట్లా అను. అది ఫాషన్, అదినాకు ప్రియము. మళ్ళీ అను.

లలిత—మోహన్!

మోహ—[సంతోషముతో భార్యముఖమును దనవంకకుఁ ద్రిప్పుకొని] ఆఁ! అలా అను. అది ప్రేమరాజ్యమునకు పతాక. అది ఆనంద రాజ్యమునకు సింహాసనము. పిలు; అలా పిలు. [అని ప్రేమను జూపి యానంద మభినయించుచుండును.]

లలిత—అయితే మోహన్! కాలం గడిచి మీ శిరోజముల నలుపు పోయి, మీ ఫ్రెంచికటింగ్ మీసం, క్రాఫింగు తెల్లఁబడి ముసలితనం వచ్చి ఒళ్ళంతా ముడతలుబడుతూవుంటే, చత్వారంవచ్చి చెయ్యి అడ్డు పెట్టుకొని చూస్తూవుంటే, అప్పుడు మిమ్మల్ని మోహన్ అని పిలుస్తే మీ రేమనుకొంటారండి? నాతల వొళ్ళు చక్కఁగావున్నయ్, నాకీపేరు తగిందే ననుకొంటావా? మోహన్.

మోహ—[చుట్టపొగను బైకివిడుచుచు] నాన్సెన్సు (Nonsense,) మీసాలు తల తెల్లపడటమేమి? రంగులేదు?

లలిత—రంగంటే జ్ఞాపకం వచ్చింది. మొన్న మీ ఫ్రెండు (Friend) వస్తే నన్నుకూడ షేక్ హాండు (Shake hand) ఇవ్వమన్నారు. ఆయన మీసాలు తలుచుకుంటే ఇప్పటికి నాకు నవ్వొవస్తుంది మోహన్. [అనుచు నవ్వును.]

మోహ—[మొగము ముడుచుకొని] ఎందుకోయ్? ఆ నవ్వు.

లలిత—[నవ్వాపుకొని] పైనసలుపు మధ్య ఎఱుపు మొదట తెలుపు. ఆహా! ఎంత బాగుందండి, మొక్కజొన్న పీచులాగ, ఆ రంగుపులిమిన మీసం. అదేరంగాలండి మీరు చెప్పేది? [హసించును]

మోహ—వాడా! వట్టి రాస్కెల్. వాడికి రంగు వేసుకోటం తెలియదు. అది చక్కగా వేస్తేనా, తుమ్మెదరెక్కలే వెంట్రుకలు, ఒళ్ళుముడత బడుతుందీ. ఆర్డనరీపీపిల్సు వెరిఫూల్సు, వాళ్ళకు తినటంగూడా తెలియదు. గోంగూర, తోటకూర, తింటే మూడోనాటికి ముసలి తనం సిద్ధం. మేం కోడిగుడ్లు, ఆమ్లెట్టు తినటం, విస్కీ తాగటం, ఎగ రటం, బంతులాడటం ఎందుకో తెల్సునా? శరీరం పుష్టిగా, దృఢంగా స్ట్రాంగుగా ఉండటానికే. ఒంటికి కొంచెం ముడతకనబడితేనా డేషన్ సిరప్ అండ్ మంకీటానిక్సు (Dushion Syrup and monkey tonics) వగయిరాల్లేవు? అవి సేవిస్తే ఏనుగుల్లాగుంటాం. గుఱ్ఱాల్లాగ పరుగెడతాం.

లలిత—అయితే మోహన్! గుఱ్ఱాల్లో, ఏనుగుల్లోకూడ ముసలివుండటం, జోరీగలు ముసరటం, తోకలతోగూడా విసురుకో లేక పోవటం అవి ఉండవ్వా?

మోహ—[కోపముతో నోరగాజూచి] డామిట్ (Damn't) నీకు బాగా ఇంగ్లీషుస్టడి (Study) లేదు. సిల్లి కొశ్చెన్సు వేస్తావ్, న్యూశాపన్సు న్యూభావాస్, తెలియనే తెలియవు. నా యూరపు లేడి యిలా అంటుందీ? ఆ లేడీని పిలిపిస్తా; లేదా ఏకాలేజీలోనో ఎంగ్ విడోను చూచి మారేజ్ చేసుకుంటా!. టేక్కేర్. [అని కోపముతో లేవఁ బోవును.]

లలిత—[భయమభినయించుచు భర్తచేయిఁబట్టుకొని] నో, నో, ఊరక అడిగా మోహన్! [భుజముమీద చేయివేసి] నీవు రమ్మన్న చోటికల్లా వస్తా నీతో టెన్నీసుకూడా ఆడటంలా మోహన్? ఇంగ్లీషు డ్రామాస్ బాగా స్టడీచేస్తా మోహన్, లేడీవద్దు మోహన్! [అని బ్రతిమాలును.]

మోహ—అయితే ఇంకా కాస్త కైమిచ్చిచూస్తా!

లలిత—ఆలైటిమిచ్చి, అప్టుడేట్ ఫాషన్నుకూడా చెప్తూవుండు మోహన్! బాగా స్టడీచేస్తా!

మోహ—నిజంగా చేస్తావా?

లలిత—ఓ తప్పకుండా.

మోహ—అయితే ఇదిగో సిగరెట్టు, ఒక్కమాటు కొంచెం - [నోటికెయ్యఁబోవును.]

లలిత—[ఉలికిపడి] అమ్మో! ఇదిమాత్రంవద్దు; ఈ యలవాట్లు చెయ్యకండి.

మోహ—ఒట్టిపిచ్చిపిల్లవు. నీకేం తెలియదు. ఈయలవాట్లేఫాషన్. అంతే. నీకు వేషభాషలున్నయ్. ఏంలాభం? ఒక్కపెగ్గుకైనా అధికారంలేదు. నాన్సెన్స్! నీవెందుకు పనికిరావోయ్.

లలిత—లేకపోతే లేకపోయిందికాని యీ యలవాట్లుమాత్రం నాకు చెయ్యకండి. మీ సిగర్సు వగయిరాలకు స్పెన్సరుకు నూటయాభై, రిఫ్రెష్మెంటురూముకు మూడువందలు అవుతున్నయ్. ఈబిల్లులే చెల్లించలేకుంటే మీతోబాటు నేనుకూడా సిగర్సు, విస్కీ ప్రారంభించానంటే మనకింక ఋణంకూడా పుట్టదు. ఎక్కడికయినా బల్లపంపి ప్రయాణంకట్టాల్సిందే! మరచా! రిఫ్రెష్మెంటురూమువాఁడు ఇవ్వాళ యిప్పటికి మూఁడుసార్లువచ్చాడు. ఆర్డరుతిప్పేశాడు. ఇవ్వాళ సీసాలుకాళీ. మీకడుపు పస్తు.

మోహ—[అసూయతో] నాన్సెన్స్, రిఫ్రెష్మెంటురూమువాఁడు వట్టి స్టుపిడ్. వాడికిబుద్ధిలేదు: [జేబుచూచి] పార్టీ వెయ్యిరూపాయీలు స్టాంపుకని యిచ్చాడు. రూమువాణ్ణి సిగర్సువాణ్ణి పిలిచి దమ్మిడి పైసలతోగూడ వాళ్ళరూపాయిలు వాళ్ళమొగాన కొడతా.

లలిత—అయితే రేపుస్టాంపులకు రూపాయిలక్కర్లా?

మోహ—రేపుకాకపోతే యింకోపదిరోజులకు స్టాంపులు కొంటాం. లేదా, మళ్ళీతెమ్మంటాంపార్టీని. వ్యాజ్యంపోతుందని వెధవయేడుస్తూ చచ్చినట్టు తెస్తాడు. అదీకాకపోతే మాఫ్రెండ్, రమణ్ నిన్న వెయ్యిరూపాయలిచ్చాడు. మళ్లీచీటీవ్రాసియెంతకావాలంటే అంత

తెప్పిస్తా. నాకు బారిష్టరు మోహనరావుకు, డబ్బుకు లోటుంటుందీ? తే, యిలా ఆ సీసా తే.

లలిత—అందులో కొంచెమే వుంది.

మోహ—చాల్లే యిప్పటికి; తీసుకోరా?

లలిత—అలాగే [అని సీసా తెచ్చి యిచ్చును]

మోహ—[తాగుచుండును]

లలిత—[ఏవ నభినయించును]

తెరలో—[బెల్ వినఁబడును]

మోహ—ఎవరది?

రమణ—[ప్రవేశించి] గుడ్ నైట్ ! గుడ్ నైట్ వాసంతీబాయ్ ! గుడ్ నైట్. మోహన్ !

రమణ—[లలితకు షేక్ హాండిచ్చును]

మోహ—రమణ ! టేక్ యువర్ సీట్. [అని కూర్చుండఁబెట్టి సిగరెట్టిచ్చును]

రమణ—[కూర్చుని] డ్రస్సుతోఁగూడ రిహార్సలు కమెన్సు చేయఁబోతున్నాం. ఇంక వాసంతీదేవిగారు రావాలె.

మోహ—ఈజ్ యువర్ కార్ హియర్ ? (Is Your Car here?)

రమణ—ఆఫ్‌కోర్సు క్వయిట్ రెడీ.

మోహ—వెల్డన్! వెయిట్ ఔట్ సైడ్, జస్టు ఫర్ ఫైవ్ మినెట్సు. [చెవిలో చెప్పును]

రమణ—గుడ్ నైట్, గుడ్ నైట్. [నిష్క్రమించును]

మోహ—[భార్యవంకకుఁదిరిగి] డియర్ వాసంతీ! నేఁడు తప్పక నీవు రిహార్సలుకు అటెండుకావాలి, నేను ప్రామిస్ చేసాను.

లలిత—నిజమే ?

మోహ—అదిగో మొదలెట్టావ్! మాటమాటకీ అడగాలీ? నేనెంతో నీవు అంతే.

లలిత—మీరు క్రొత్తనాగరకత అంతా చూపాలని అనుకుంటారు. ప్రతిది ఫేలే అవుతారు మోహన్! మొన్న మీ ఫ్రెండు విడో వైపు మీతో మాట్లాడుతుంటే ఆఫ్రెండు పావుగంటలో పదిసార్లు

కిటికీలోనుంచి చూట్టం మొదలెట్టాడు, మీరో? ఎవరికో నన్ను ఇంట్రడ్యూస్ చెయ్యడం, మాట్లాడమని ముందుకు నెట్టడం, అయిదు నిముషాల్లో ఆరుసార్లు చెయ్యిలాగడం, మీమనస్సున కింత అపనమ్మకం. వేషంలోఁ గనఁబడే రాజు అసలురాజు కానట్టు మీరెంత పాటుబడ్డా నిత్యోత్సవరాల్లో, క్లాఫింగుల్లో, డ్రెస్సింగుల్లో, రిఫ్రెష్మెంటు రూముల్లో తెల్లదొరల ననుకరిస్తారుకాని, వారిలాగ మీరాచరించ లేరండి. మీ భారతీయరక్తం, తెల్లరక్తం కాఁజాలదండి. మొన్ననో లేడి మీ రూములో మీతో మాట్లాడుతుంటే దొరగారు ఒక్కమారైనా చూచాడా? అర్ధగంటసేపూ కారులోనే ఉన్నాడు. నాటకాల్లో వేషాలు వెయ్యడంగూడ ఎవరో ఎక్కడో ఏమో చేశారని చెయ్యబోవడం, సమర్థించలేకపోవడం తప్ప మరేమి ఉండదు. మీకు సర్దాగాఉంటే! మనయిల్లే రంగస్థలంజేతాం. నేనులక్ష్మినని, మీరు నారాయణులు. నేను పార్వతిని మీరు పరమేశ్వరులు. లేక నేను సీతనుగా మీరు రాములుగా పాత్రలు ధరింతాం.

మోహ—నాన్సెన్స్, పంగనామాలు బవిరిగడ్డాలుపెట్టే వేషాలా?

లలిత—పోనియ్యండి, వైఫ్ అండ్ హజ్బండు; లవర్, అండ్ లేడీలవ్, అవుదాం.

మోహ—డామిట్! కూప కూర్మాల్లాగ ఇంట్లోయేమిటి? పబ్లికులోకి వెళ్ళాలి, అందటికి తెలియాలి.

మోహ—ఇతరదేశాల్లో స్త్రీలు స్త్రీపాత్రలు ధరించడం, నాటకరంగానికి వన్నె దేవడం ఈనాగరకత ప్రస్తుతం మన ఆంధ్ర దేశానికిఁ బ్రసాదిస్తే, మనం మార్గదర్శకుల మను పెద్దపేరు వస్తుంది? అది యెన్నింటికుపయోగమో తెలుసునా? తరువాత నీకు తెలుస్తుంది. ఇప్పుడెందుకు? పద.

లలిత—మీకుఁ దెలియందంతా మీకు కొత్తగా వుంటుంది. రామాయణ భారతాలైనా చదువని మీ యింగ్లీషు భాషాజ్ఞానం మట్టిగోడకు చేసిన సున్నపుగచ్చులాగ పట్టులేని పైమెరుగులో వుంటుంది. స్త్రీలు స్త్రీపాత్రలు ధరించడం ప్రాచీనమే, భరతా

దులు అంగీకరించిందే. ఇంకమనము పెట్టేభిక్షు మూలనున్నవాళ్ళను ముంగిళ్లకు దేవడం, అల్లరీని. మొన్న ఒకాయన తన విడోవై ఫుచేత వేషంవేయించి మర్నా డనుమానపడి ఆ తరువాత విడాకులుకూడా పుచ్చుకున్నాడట. మనదేశంలో ఒక్కొక్కజాతి ఒక్కొక్కపని నారంభించి యెంతో ఖ్యాతిగాంచింది. అలాగే నాటక ప్రదర్శనాలూను. ఇప్పటికీ కొన్ని సంఘాలవారు భార్యలుభర్తలు అన్నలు వదిన్లు అంతా బంధువులు మిత్రులు కలిసి బాగా ఆడుకుంటారు. లేదా? డాన్సింగుగరల్సు ఎంతో చక్కగా అందంగా ఆడేవాళ్ళు పాడేవాళ్ళు అభినయించేవాళ్ళు కులవృత్తిగాఁ బెట్టుకున్నవాళ్ళున్నారు. వాళ్ళకు ప్రోత్సాహం ఇవ్వండి. సంగీతం వచ్చీరాక అభినయమంటే యేమో తెలియక నలుగుర్లో కూర్చోటం మాట్లాట్టం చివరకు ఇల్లుదాటటంకూడా యెరగని అవధాన్లగారి కూతుళ్ళచేత, శాస్త్రుల్లగారి పిల్లలచేత, అయ్యంగార్ల బిడ్డలచేత, ఫామిలీగరల్సుచేత వేషాలువేయించి భారతీయగౌరవాన్ని భరతశాస్త్ర ప్రశస్త్యాన్ని పాడుచేయకండి.

మోహ—[కోపముతో] వాఁడెవఁడో వేషంవేయించి అలాచేస్తే అందఱు అలాచేస్తారు? రేపునీపేరు పేపర్లో పెద్దక్షరాల్లో సుప్రసిద్ధ నటీమణి అని, సినిమాస్టార్ అని, పడితే నాకెంత ఆనందం? ఎన్నెన్ని సభల్లోచెప్పుకుంటా? వెధవ పూర్వోత్తరపుభావాలు, నీవును. మళ్లీ వెట్టి వెట్టి ఉపన్యాసాలు మొదలుపెట్టావంటే నా యూరోపియన్ లేడీనిపిలిపిస్తా. నాటకాలన్నా వేషాలన్నా నాలేడి పొంగిపోతుంది. దానిచేతనే వేషంవేయిస్తా. ఇదిగో టెలిగ్రాంఇస్తా. ఇంక నీవువద్దు, నీవేషంవద్దు. పో, నీవు వెళ్లిపో [లేవఁబోవును]

లలిత—[ఆపి సంభ్రమముతో] నో నో, టెలిగ్రాం వద్దు, లేడీ వద్దు, మోహన్! ఊరికే అన్నాగాని నేనేవేషంవేస్తా. తెల్గునాటకాల్లో తెలుగువాళ్లే వెయ్యాలె. కాని నీవుమాత్రం రిహార్సలుకు రావద్దు మోహన్! [అని బతిమాలును]

మోహ—అబ్బే, నేనురాను. పార్టీరాజా వచ్చాడు, మాట్లాడాలి. రాను. నీవువెళ్లు.

లలిత—[భర్తచేతులు పట్టుకొని] మోహన్! నీవు రావుకాదూ?

మోహ—నిజంగా రాను.

లలిత—చేతిలో చెయివెయి.

మోహ—[నవ్వుచు] పల్లెటూరి బ్రూట్సు!

లలిత—[నిట్టూర్పు] డ్రెస్సు అక్కడవుంటుందా మోహన్!

మోహ—కావలసినంత.

లిత—[దీనముగ] వెళ్లవలసినదేనా?

మోహ—ముఖ్యంగా.

లలిత—నిట్టూర్చి [ఆవలికేగును]

మోహ—వెల్ వాసంతీ! కమ్ హియర్, కమ్ హియర్.

లలిత—[లోపలినుండి] వెయిట్ ఫర్ వన్‌మినిట్.

మోహ—[స్వ] ఓ అలాగే, యూరోపియన్‌లేడి అన్న, యంగ్‌విడోను పెండ్లిచేసుకుంటానన్నా హాడలు; ఆ రెండుమంత్రాలు వాసంతిచేత ఎంతపనైనా చేయిస్తాయి, కానిమ్మ.

వాసం—[కోటుగుండీలు పెట్టుకొనుచు హాండ్‌కర్‌చీఫ్ వాసనచూచు కొనుచు ప్రవేశించి] వెల్, వాడ్డుయు వాంట్?

మోహ—[సంతసముతో] ఎవ్విర్‌థింగ్ ఈజ్‌రైట్. కాని స్పెట్సును మఱచావోయ్.

వాసం—ఎబ్బే మరవలేదు తీసుకుంటూన్నా [అని బల్లమీదినుంచి తీసికొనును.]

మోహాన్—[హేటునుబెట్టి వాసంతిని జూచి] వెల్! వాసంతీ! నీబ్యూటీ ప్యారిస్‌బ్యూటీనిగూడ తిరస్కరిస్తున్నది, సింప్లియెక్సలెంటు [చెయి ముద్దిడుకొని] ఇంక రిహార్సలుకు పద. [అని బుజముమీద చెయివేసి పంపును.]

వాసం—[తలయూచి నిష్క్రమించును.]

మోహ—వాసంతికి నాడిప్రింకింగు నాస్మోకింగు అంటె కొంచెం అసహ్యాం గాని మిగతా రెస్పెక్ట్సులో ప్రాణంకూడా యివ్వటానికి సందేహం లేదు; రియల్లీఅడ్మైరబుల్.

సుబ్బయ్యగుప్త—[తెరలో] పంతులుగారూ!

మోహన్—ఎవరది?

సుబ్బయ్యగుప్త—[ప్రవేశించి] రేపుదాఖలుకాకపోతే వ్యవహారం చెడుతుందన్నారు; కాయితం దాఖలైందండి?

మోహ—[విసుగుతో] ఎవరుచెప్పారయ్యా! నీకు?

సుబ్బ—పెద్దగుమాస్తాగారు.

మోహ—అతనికి తెలియదు. ఇవ్వాళదాఖలైంది. రేపు ఫీజుతెస్తే నెంబరువేయిస్తా; లేకపోతే వెయ్యిరూపాయీల స్టాంపు పెద్దబండి సున్నే.

సుబ్బ—ఫీజుకేంలేండి!ఇక్కడి మా కొట్లో మీఖాతాఉందిగా. అబ్బాయి పద్దుచూశి అయిదువందలైందన్నాడు.

మోహ—ఫీజుకు ఖాతాకు సంబంధమేమిటి? ఆడబ్బు చెన్నుగారిస్తారు. రేపుఫీజు తీసుకోరాకపోతే, నీవ్యాజ్యం ఎగురుతుంది; ఇంక నీయిష్టం.

సుబ్బ—వద్దుబాబు, వద్దు. ఫీజిస్తా; వ్యవహారం చెణ్ణీకండి.

మోహ—రేపుతప్పక ఫీజు తీసుకొనిరా.

సుబ్బి—సెలవుబాబు! సెలవు. (స్వ) ఇంతే వీరివ్యవహారం. కంపమీది గుడ్డ. ఉపాయంగావాలి. [నిష్క్రమించును.]

మోహ—గుప్త స్టాంపుసంగతి జ్ఞాపకమేలేదు. కాసిమ్మ్యు. రేపేదో కాలడ్డంపెడతా; కాకపోతే రమణకు కబురంపుతా. [సీసాలుచూచి] బాయ్! [అనిపిలచి స్మృతినభినయించి] వీణ్ణి సిగర్సుకుపంపించా.సరే! [గడియారంచూచి]అయితే వాసంతి నన్ను రావద్దన్నది. ఎందులకో! రమణవట్టి డిబాచరస్ ఫెలో; డ్రైవరుకూడా ఉండడు. వాసంతిని హాలుకే తీసుకుపోతాడా? మొన్న కూడా రమణ వాసంతినింటికివంటరిగా తీసికొచ్చాడు. లేటుగాకూడా వచ్చాడు. ఇది కొంచెం సస్పిషస్సుగా ఉంది. రాజాగారు వచ్చేటైమయిపోయింది [గడియారం దిక్కు

చూచి] ఇంకరాడు. ఈపైకం రిఫ్రెష్మెంటురూములో పారేస్తా. వారంనాటికి సర్దలేకపోతాను? యజ్ఞానికొక్కడా కబురంపా. ముసలాడు మాచేన్లు అట్టెడబ్బింక యెక్కణ్ణో పుట్టిస్తున్నాడు. మళ్లీ చీటీవ్రాస్తా. సగమైన తేలేకపోడు. [చీటీవ్రాయుట నభినయించి] దీన్ని అగ్రహారానికి పంపిస్తా.

[డ్రెస్సు సర్దుకొని కత్తిఁదీసికొని చుట్ట ముట్టించి] వాసంతి రిహార్సెలు ప్రారంభిస్తుందేమో! రూముకుఁబోయి రిహార్సలు కట్టిండవుతా. నాటకాలంటే, రిహార్సులంటే వాటి తత్వం బాగా కనిపెట్టాలి. [నిష్క్రమించును]

[ఉద్యానవనప్రాంతమున విటుఁడు ప్రవేశించును]

విటుఁడు—[వసంతసేన నుద్దేశించి]

చ. *కమలము కేలలేని సిరి ♦ కామునిచేతి మృదుప్రహేతి శో
కము మగనాండ్ర కందఱకుఁ ♦ గంజశరాసన పుష్పమూర! చి
త్రముగ రతిప్రదేశమగు ♦ రంగమునన్ రతినాఁటి సిగ్గు పో
డిమిగల కూర్మితోఁ జనియె♦డిం బ్రియపాంథులు వెంబడింపఁగన్.

[ఉజ్జ్వలాభిసారికావేషముతోఁ బాఁడుకొనుచు, ఛత్రధారిణి యగు వసంతసేన చేటితోఁ బ్రవేశించును]

విటు—[సమీపించి] వసంతసేనా! ఇటుఁజూడుము.

మ. *ఉఱుమంజొచ్చెఁ బయోదమండలము సా♦రొప్పార వ్రేలాడుచున్
గిరిశృంగంబులపై విముక్త కమలా♦క్షీహృత్సమానంబులై
పురులన్విప్పిన నెమ్మిగుంపులును సొం♦పున్నింపుచున్ రత్నచా
మరముల్ గైకొని యో యనందనరు త♦న్మార్గంబునన్ వీచుచున్.

మోహ—[ప్రవేశించి యాశ్చర్యముతో] ఎవ్వరీ సుందరి? వాసంతియేనా? ఎంతబ్యూటిఫుల్‌గాఉంది! ఒక్కనాడుకూడా వాసంతి నాకిలా కనపళ్లా! అర్ధగంటలో జగన్మోహినియైందే?

వసంత—బావా! మిగుల మంచివర్ణనఁ జేసితివి.

మోహ—ఇదేమిటి? యీ రాస్కెల్ని వీణ్ణి బావా అంటుంది.

---

* శ్రీ తిరుపతి వేంకటకవులు - మృచ్ఛకటికము.

వసంత:—

ఉ. * ఉన్నతముల్ నిరంతరప♦యోధరముల్ గలనున్నఁగాక ని
న్నన్నన సేయునే బయిసి♦మాలినదాన! ప్రియుండఁటంచు గ
ర్జన్నవనీరదధ్వనిమి♦షంబున నన్ను నిశాపురంధ్రి నా
తెన్నఁ జికట్టుచున్ మిగులఁ ♦ దిట్టుచునుండె సపత్నిపోలికన్.

మోహ—ఓహో! వాసంతికంఠం ఎంత బాగుంది! అణుకు బెణుకు లేకుండా కూడా ఉందే.

విటు—వసంతసేనా! ఇటులనే నిశను దూలనాడుము.

మోహ—[అసూయతో] వీఁడెవ్వఁడు? మీఁదిమీఁదికిఁ బోతాడు?

వసం—బావా! స్త్రీస్వభావమగుటం జేసి తెలివిమాలినపని సేయుచున్న దీని నిందించిన నేమిఫలము? నే నొక్కమాట సిద్ధాంతీకరించెద.

గీ. * ఉఱుముఁగాక పయోదముల్♦గురియుఁగాక
పిడుగుఁ బడుఁగాక యగుఁగాక♦పుడమి కడలి
చలియు వేడియుఁ జూడరు♦లలన లకట
రమణసాన్నిధ్యమున కేగు♦సమయమందు.

విటు—అవును. సందేహమేమిటి?

మోహ—ఈ నీచుని బావా! బావా! అంటూ, చేతులు చేతులు కలుపుతుందేం వాసంతి. [తీవ్రముగాఁ జూచును]

వసం—ఓ మహేంద్రా!

కం. * ఉఱుములు పెల్లుఱిమించుము
కురిపించుము వానలు పిడు♦గులతోఁ గూడన్
మరలించుట నీతరమా!
తెఱవలు ప్రియులను గలియుమ♦తింబోవు నెడన్.

మోహ—వాసంతికి ప్రియుఁ డెవ్వఁడో ఉన్నాఁడు, లేకుంటే నన్నెందుకు రావద్దంటుంది. ఇక్కడ నన్ను చూడకుండా, ఒక్క షేక్‌హాండ్ైనా యివ్వకుండా, ఎందుకు వెళ్ళుతుంది?

---

* శ్రీ తిరుపతి వేంకట కవులు .. మృచ్ఛకటికము.

వసం—పాషాణహృదయుఁడగు నీమబ్బుమానిసి గర్జిల్లిన గర్జిల్లుఁగాక! ఓ సౌదామినీరమణీ! కామిని వయ్యును గాంతలహృదయతాప మెఱుంగకుండుట నీకుచితమైనదికాదు.

విటు—వసంతసేనా! ఏలనిందించెదవు? మెఱుఁగుచేడియ నీకు చాల మేలొనర్చినది. కాకున్న నీప్రియుఁ డుండుచోటెట్లు గురుతింపనగును?

వసం—ఔఁ. అవునదియే. నాప్రియుని గృహము. [సంతసమభినయించును]

మోహ—ఇక్కడనా? ప్రియుఁడు, ఎవఁడు వాఁడు. [దెసలు చూచి] రాస్కెల్, వాడెవఁడో వాణ్ణి చూడాలి.

విటు—వసంతసేనా! నీవు మిగుల కలావతివి. చెప్పదగినదిలేదు. అయిన నీయెడలఁ గలమైత్రిచే చెప్పుచున్నాను. ప్రియతముని గృహము ప్రవేశించుము. ప్రవేశించి యెవ్వరేమన్నను కోపపడకుము.

మోహ—స్కాండ్రిల్, వీడు వాసంతిపై చెయివేస్తాడు; నోట్లోనోరు పెడతాడు. రాస్కెల్, ఖీణ్ణంచెయ్యాలి. కానీ చూస్త. [అని తీవ్రముగాఁ జూచుచుండును]

విటు—[చారుదత్తుని గృహముకడకేగి] తలుపులు వేయఁబడియున్నవి. పిలిచెద. ఆర్యా! చారుదత్త మహాశయా!

మోహ—ఔఁ. ఏమీా? [విటునిఁ దీవ్రముగఁజూచును.]

విటు—ఉ. * నీపసుగంధియైన రజ♦నీముఖమందలి వాసలో స్మరో
త్తాపితచిత్తయై కురులు♦ ధారలచేఁ దడుపం దటిద్ధ్వని
ప్రాపితమైన భీతి గడు♦వంబడి దేవరదర్శనార్థమై
నూపురలగ్నపంకము వి♦నున్న మొనర్చుచు నిల్చెవాకిటన్.

చూడుడు. మీా ప్రియురాలిని చూడుఁడు.

చారుదత్తుఁడు—[లోపలనుండి యిదిగో వచ్చుచున్నాను.]

మోహ—వస్తున్నావుగా? నన్నుజూచిరా. జాగ్రత!

వసం—[చారుదత్తునిఁజూచి సంతసమభినయించుచు విటునితో] బావా! ఈ ఛత్రధారిణిని నీవద్దనుంచుకొనుము.

---

* శ్రీ తిరుపతి వేంకట కవులు - మృచ్ఛకటికము.

విటు—తెలిసినది నీ అభిప్రాయము. మమ్మిద్దఱిని వెళ్ళమన్నమాట చక్కఁగా తెలిసినది. అటులనే పోయెదము.

మోహ—దీనిచూపంతా అక్కడే. కానీ ఏమౌతుందో నేను చూస్తా.

విటు—వసంతసేనా! రోవెలందివయ్యును సౌజన్యమే ప్రతిఫలముగ నీ రసికాగ్రగణ్యుని గోరు నిన్నెవ్వరు బోలగలరు? కాని,

మోహ—ఏమియా ప్రోత్సాహము? ఏమి యాస్తుతిపాఠము? కానియ్ అంతాకానియ్.

విటు—గీ. *అలిగితివయేని లేదు సౌ♦ఖ్యంబు కోప
గింప కుండిన మదనుండు ♦ కీర్తి తేఁడు
అలుగు మలిగింపు మొకవేళ ♦ నతనిఁగూడఁ
గరుణఁజూపుము పడయు మా♦ఘనునికరుణ.

అదే నీమనోహరుఁడు వచ్చుచున్నాఁడు. ఇంక నీయభీష్టమును దీర్చుకొనుము. [అని బుజముతట్టి చేటివంకఁజూచి] ఓసీ! రమ్మ. [అని చేటిచేయిపుచ్చుకొని నిష్క్రమించును]

మోహ—[ఆశ్చర్యముతో] ఆ! ఏమి యా స్వాతంత్ర్యము! [విటుని వంకఁ దీవ్రముగాఁజూచును]

చారు—[సమీపించును]

వసం—[పూవులు విసరుచు] ప్రియతమా! కలాప్రవీణా! ప్రదోష కాలము సుఖకరముగ నున్నదా?

మోహ—[దైన్యముతో] వాసంతి నన్ను మఱచింది, వాణ్ణి వలచింది; పువ్వులపూజ గూడా చేస్తున్నది.

చారు—[సంతసముతో సమీపించి] ప్రియురాలా! నీకు స్వాగతమా?

మోహ—ఆ! ఏమీ? ఎంత నిర్భీతిగఁ బలుకుచున్నాఁడు. కానీ! [అని మీసము దువ్వుచు శిరఃకంపముచేయుచుండును.]

చారు—గీ. *సంజ జాగ్రదవస్థచేఁ ♦ జనుచునుండెఁ
దమియు మూర్పులచేత నే ♦ తరలుచుండె

నేఁడు నీరాకకతన నో ♦ నీరజాక్షి
కౌఁగలచు నాకు సంధ్య సు♦ఖప్రదంబు.

[వసంతసేనచేయిపుచ్చుకొని] ప్రియురాలా! ఇటుచూడుము.

మోహ—పాణిగ్రహణమే, ఇంక నేనూరుకొనరాదు. [ఉద్వేగముతోఁ జూచి] కానిమ్ము, ఇంకేమి జరుగునో చూచెద. [శిరఃకంపము చేయుచుండును]

చారు—

ఉ. *చీఁకటి పూలపిండినటెఁ ♦ జెల్వగుమబ్బుదివంబు గప్పఁ శై
త్యాకరమైనతావులు బ♦యల్వడ వీఁచుఁబ్రదోషమారుతం
బాకసముం బయోధర స♦మాగమ కాంక్షిణియైన మించు బ
ల్వీకఁ గవుంగలించుకొనుఁ ♦ బ్రేయసు నత్యనురక్తచాడ్పునన్.

వసం—నిజము నిజము. అంతేయు నట్లేయున్నది.

[పెద్ద ఉఱుము వినఁబడును]

వసం—[ఉలికిపా టభినయించి చారుదత్తుని కరస్పర్శచే స్మరణమభినయించి నిశ్చేష్టురాలగును]

చారు—[సంతోషముతో] మేఘుమా! నీవు మహోపకారివి. వర్షమా! కురియుము, కురియుము! నా కీవసంతసేనపొందు లభించినది. [అని కౌఁగిలించుకొనఁబోవును]

మోహ—[ఆవేగముతో] వసంతసేనపొందే, కాదు. మోహానునిచేతి విందుకూడ. [అని చారుదత్తుని గ్రుద్ది యిద్దఱిని విడఁదీసి] ఓసీ! బుద్ధిహీనురాలా! మాధవశర్మకూతురివే! యింతసాహసమా? పొమ్ము, ఆవలకుపొమ్ము. [అని నెట్టును.]

వసం—[భయకంపిత యగుచుండును]

చారు—[బాధ నభినయించును]

రమణ—ఆఁ ఆ. [అనుచుఁబ్రవేశించి] మోహాన్! నీకు మతిపోయిందా యేమిటి? ఇది మృచ్ఛకటికనాటకములోని నాయికానాయకుల సమావేశపు సీను. రిహార్సలు.

మోహ— [రమణునిఁ దీవ్రముగాఁ జూచి] మీరందరు స్వేచ్ఛగా వాఁడుకోటానికా? నావైపును దీసికొచ్చింది. నాటకము, రిహార్స లూనా? బుద్ధిలే?

[పండ్లుగీటుచు,] వాసంతీ! ఇందుకా నన్ను రావద్దన్నది. ఇంక నీవు నాయింటికి రావద్దు. నాగడపయెక్కవద్దు, పో. నీయిష్టమువచ్చిన చోటికిపో. [చారుదత్తునివంకఁజూచి] బ్రతికావు. నీ యదృష్టము మంచిది. పో, యింక పో. [అని కోపావేశమున నుండును]

చారు—పంతులుగారు! ఇది నాటకం. వసంతసేన ప్రియుణ్ణి చారు దత్తుణ్ణి, గాఢంగాచూడటం పూవులుచల్లడం ఇదంతా శృంగార రసానికి ప్రధానస్థానమైంది. అందఱు ప్రాచీనులు నవీనులు అంగీక రించిందే. నాటకశాస్త్రంలో ఆలింగనముఁ తప్పుకాదు.

మోహన్—[కోపముతో] రాస్కెల్, ఏమన్నావ్, తీసుకొనిరా నీ పెళ్లాన్ని. ఇలా యెవరైనాచేస్తే ఏమవుతుందో నీకు తెలుస్తుంది. నాన్సెన్సు, నాటకం దీనికో శాస్త్రం పరాయివాళ్ళపెళ్ళాల్ని పబ్లి కుగా కౌగలించుకోటం పైగా దీన్నందఱు అంగీకరించడమూనా! వేయించు, నీవాళ్ళందఱిచేత వేషాలు వేయించు.

రమణ—మోహన్! పెద్దబారిష్టరువే, ఇంత చాదస్తమేమిటోయ్ నీకు.

మోహన్—నాటకమంటె నాలుగుపాటలు, నాలుగు పద్యాలు, ఏవో పది డైలాగ్సు అవ్వీయివ్వీ ఏవో ఉంటయి సర్దాగా వుంటుందని అను కున్నాగాని యింతవచ్చిబూతా?

చారు—[బుగ్గ నలుపుకొనుచు] పెద్దవారు కొట్టితే కొట్టారుకాని అన్ని తెలిసినవారే యిలాఅంటే యింకా నాటకాలాడటంయెలా? నాట్య కళాభివృద్ధియెలా?

మోహన్—ఇంక నాటకాలు ఆడటమా? లవ్ డ్రామాసు ఆడకూడదని యింజక్షన్ చేయిస్తా. ఆడాళ్ళు మగాళ్ళు కలిసి వేషాలేయ గూడ దని బిల్ ప్యాస్ చేయిస్తా. ముందు నీమీాద కలక్టరుదగ్గర డిఫ మేషన్ (మానసష్టం) దావా దాఖలుచేసి, నీ ఆస్తిగీస్తి సర్వం త్వరం

[చేయిస్తా. మోహనరావంటే యెవ్వరో రేపుకనబరుస్తా. జాగ్రత! అని పోఁబోవును.]

వాసంతి—[దుఃఖముతో] నాథా! మోహనరాయా! మీయాజ్ఞ నతిక్రమింపఁజాలక, యిట్లు సంచరించిన నాయపరాధమును మన్నింపుము. [అని దోయిలిఁబట్టి భర్తను సమీపించును.]

మోహ—నేనువచ్చిన నీమాటలు సాగనీయనని, నన్ను మసిపూసి మారేడుకాయనుజేసి యిక్కడ తైతక్కలాడతావు! వీడెవడో తెలుసునా? మహామహా దొరలు జడ్జీల మనస్సులే కనిపెట్టే బారిష్టరు మోహనరావు. నీమనస్సు తెలుసుకోలేడనుకున్నావ్, ఇంక నీకు నాకు సంబంధంలేదు, నన్నుముట్టకూడదు; నాయింటికి రాగూడదు. రేపు డైవోర్సు పిటీషన్ కోర్టులో పడుతుంది. పో యింక కంపె నీలో కలిసిపో, నీయిష్టమువచ్చినచోటికి పో.

వాసం—నాథా! నాథా! అపరాధినిని. నా దీనోక్తు లాలింపుము. నాతప్పు మన్నింపుము. నన్ను కరుణింపుము. [అని చేతులు పట్టుకొనును.]

మోహ—నన్ను వదలకపోతే, చేతులు విరుగుతయ్. నోరెత్తుతే తల బ్రద్దలవుతుంది. నా గడప యెక్కితే కూనీ అవుతుంది. జాగ్రత టేక్కేర్. వదలు చెయివదలు. [అనుచుఁ బడనెట్టి నిష్క్రమించును.]

వాసం—[క్రిందఁబడును.]

రమణ—[గుడ్లురిమిచూచి] పోయినాడు, ప్రాణంతో పోయినాడు. రాస్కెల్.

చారు—చావు తప్పించుకుని బయటపడ్డాడు స్టుపెడ్.

రమణ—ఇంగ్లీషు చదివితేయేం? దేశాలు తిరుగుతే యేం? బుద్ధి లేక పోయింతర్వాత, నెత్తిన పెట్టుకోవలసిన పైఫును ఇంత అవమాన పరుస్తాడు! [అని వాసంతికడఁ గూర్చుండి జేబురుమాలతో విసరుచు] కుసుమకోమలి; విద్యావిశారద; పాపం! ఎంతకష్టం.

చారు—రంగాలంకారమే, నటీరత్నమే ఇంతపరాభవమా! వివేకంలేదు, ఏంలాభం? [అని యుపచరింపఁబోవును]

వాస—నాథా! నాథా! మోహనరాయా! [అనుచు దుఃఖముతో లేచి కనులు దెఱచి యుభయులను జూచి నిశ్చేష్ట యగును]

రమ—వాసంతీబాయ్! విచారపడకుము. వెధవ మోహనుఁడేమి చేస్తాడు రేపు వాణ్ణి నీయెదట తన్నిస్తా.

చారు—తన్నించడమేమిటి? స్త్రీ రత్నముల మర్యాదనెఱుగని మనుష్య పశువులచర్మం వలిపించాలె.

రమ—కుసుమకోమలివే. వాసంతీబాయ్! దెబ్బతగులలేదుకదా? [అనుచు నుపచరింపఁ బోవును]

చారు—ఆహా! గానసరస్వతి! మధురవాణి, పాపము! [అనుసయింపఁ బోవును]

వాసం—[ఉభయులను కోపముతోఁజూచి యావలికేగి స్తంభమును బట్టుకొని] నాథా! నాథా! ఎట్టి దుస్థితి కలిగించితివి? నట్టేట ముంచితివే. ఇంక నాకేదిగతి? [అనుచు దుఃఖపడును]

రమ—[లలితను సమీపించి] వాసంతీబాయి ! విచారంవద్దు. రాస్కెల్ వాడంగీకరించకపోతేయేం? నిన్ను కంపెని మెయింటన్ జేస్తుంది. నెలకు నూరు రూపాయీలజీతం. స్వేచ్ఛగా ఖులాసాగా ఆనందంగా ఉండండి. నీవుంటేనా, కంపెనీయేమిటి? నాటక కళయేమిటి? అంతా స్వర్గంలా అయిపోతుంది.

చారు—వాసంతీబాయిగారు! విచారపడకండి. తగినస్త్రీఫామిలీగరల్ స్త్రీ పాత్రధరించేవారుకనపడక, దొరక్క విచారపడుతున్నాం. మోహన్ రావ్ కోప్పడటం, ఇంటికిరావద్దనటం చాలమంచిది. నిజంగా దేముడు మిమ్మల్ని మమ్మల్ని నాటకకళని ఉద్ధరించాడు. వెధవ నిర్బంధం లేకుండ ఇక్కడే ఉండిపోండి. నేను నానౌకరికి సెలవు పెడతా. డామిట్, సెలవేమిటి అసలే వదిలేశేస్తా. మనమిద్దరం చక్కఁగా నాయికా నాయకులం. రమణ మానేజరు, నెక్స్టుమంతు మీకు హండ్రెడ్ఫిఫ్టి జీతం. ప్రతిఆరుమాసాలికి ప్రమోషన్.ఇంకామెడల్సు, బహుమానాలు, సినిమాలంభాలు అన్నిమీవి.

వాసం—[కోపమాపుకొని] మీమాటలు నాకు వినఁబడుటలేదు. మీ వస్తువులు మీరు తీసికొని నాకాజ్ఞ యిండు. [తనమీదనున్న అలంకారములను దీయుచుండును].

రమణ—వాసంతీబాయీ! మోహనుఁడుపిచ్చివాఁడు. ఇంటికి రానీయడు, ఇది వదలుకొనియేల చెడిపోయెదవు? ఇష్టమైన నిందుండుము. లేదా నాచిన్నమేడ ఖాళీ చేయించెద. నాకారు నాసేవకులు పరిచారికలు, నీయధీనము, మాణిక్యమునువలె నిన్నాదరించెద. ఇంతయేల? నాసర్వస్వము నీకర్పించి నాప్రేమరాజ్యమున కాధిపత్య మిప్పించెద. ఇంక స్వేచ్ఛగా సుఖముగా ఆనందముగా నుండుము. మోహను డేమిచేయఁగలడు, నామాటవిని యిక్కడనే యుండుము.

చారు—బాగుంది బాగుంది. మానేజరుగారులక్షాధికారి, పైగా బ్యాంకికి మానేజరు. ఇంక లోటేమిటి? ఇంకేసం దేహం లేకుండ వుండిపోండి.

వాసం—ఏమీ? [కోపముతో] ఏ మ ను చు న్నా వు? నీ మే డ నీసేవకులు నీ పరిచారికులు, నీ సర్వస్వముగూడ ఇచ్చెదవా, ఔరా! ఏకాంతమున నొక్కకాంత కనఁబడినంతనే యెంత తారుమారగుచున్నారు! ఎంతటి బుద్ధిహీనతను వెల్లడించుచున్నారు. ఋషుల నాటనుండి వచ్చుచూ లోకసన్నుతమై నీతిదాయకమై మహానంద సంధాయకమై పరమపవిత్రమై విరాజిల్లుచు జగత్తున కంతటికి సన్మార్గమునుజూపు నాటకకళాసేవ మంచిగంధపుచెక్కలను మోయు వృషభములకువలె మీకెందులకుఁబనికిరాక, పైపెచ్చు మిమ్ము స్వేచ్ఛాచారమునకు లోకవంచనమునకుఁ బరస్త్రీవశీకరణమునకుఁ బాల్పడఁజేయుచున్నదే! ఇంకేమనవలె? ఆహా! నీప్రేమ, ఆనందమునా నాకిచ్చునది. [ఒడలు కంపింప] ఓయీ నేను గణికనుగాను. యథేచ్ఛాచారురాలిని గాను. కులశీలవిభ్రష్టనుగాను, పరమపతివ్రతయగు రాధాదేవి గర్భమును. సకలధర్మవేదియగు మాధవశర్మ పుత్త్రికను. బ్రాహ్మణిని, భర్తృసేవాపరతంత్రను. పెక్కుమాటలాడకుము. ఇవి మీవస్తువులు, గ్రహింపుఁడు. [అని పాఱవేసి తీవ్రముగఁజూచి నిష్క్రమించును]

ఇద్దఱు—[ఆశ్చర్యముతోఁజూచి]

రమణ—నాటకం, రిహార్సలు లేకపోగా కథంతా యిలా అడ్డందిరిగిందేమోయ్.

చారు—రెండు గుద్ది బుద్దిచెప్పి, మీ పెళ్లాల్ని వాళ్ళని తీసుకో రమ్మని వాడన్నాడు. నాట్యకళాసేవ మీ కుపయోగము లేదని యీామె యన్నది. రమణగారు! కొన్నింటికి గాకపోతే కొన్నింటికయినా మార్గదర్శకులంగాక అన్ని అవినీతికార్యములకు మన నటులు లోబడితే ఇలాకాకిపోతే లోకం మనల్నెలా అంటుంది. కళాసేవకులం అని యెంత ఆదరిస్తుంది! కొంచెమయినా మన లోపాల్ని సంస్కరించుకుంటూ ఇలాగంటివాళ్ళజోలికిపోక సంగీతం, అభినయం అది కులవృత్తిగాబెట్టుకున్న వాళ్ళ నెవర్నయినా చూద్దాం.

రమణ—వాళ్ళలోఁగూడ మగవాడు గట్టిగా చూడకూడదు. ముట్టుకో కూడదు. చెయ్యి వోళ్లు తగలగూడదు. మొగుడు పెళ్లాం వేషం వేశినా అక్కడా యిదే బాధగా.

చారు—ఎవళ్లో వెఱ్ఱివాళ్ళలావున్నా చెప్పాలెగాని చెపితే వినేవాళ్లు ఏ అరమరలేకుండా చక్కగా చేసేవాళ్ళు చాలామంది వున్నారు ఆప్రియత్నం చేతాం రాండి.

[నిష్క్రమింతురు]

# లలిత

## సప్తమాంకము

[ఉద్వేగముతో రామచయనులు ప్రవేశించును]

రామ—అబ్బ! అమీనాగాడెంత కఠినుఁడు! పొద్దుకూకులు తిండి తీర్థం లేకుండా నన్ను వేధించాడే. మాట్లాడితే కోర్టుకు రమ్మనడం, చెయ్యి పట్టుకోటం లాగడం. అబ్బబ్బ! ఎంతజులుంచేశాడు. ఎలాగో కష్టార్జితం ఇరువైరూపాయీలతో ఆభూతాన్ని వదిలించుకున్నా. ఏం లాభం. నాపాపం. ఇలా బ్రద్దలైంది. మాధవశర్మ దేవుడు. నిజంగాఅతను చెప్పినదంతా జరిగింది. తరతరాల్నుంచి అగ్రహారీకులమని ధనికులమని దేశదేశాల అందఱు చెప్పుకునే మామర్యాదంతా మంటిపాలైంది. కొడుకుకదా! చదువుకుంటాడు, కీర్తి సంపాదిస్తాడని యిల్లు వళ్ళుగుల్లచేసుకొని డబ్బుపంపిస్తే వీడికాదేశంలో దొరసానులు లేడీలూనా? తిన్నముండ తినిఊరుకోక పైగా ఆదొరసానిముండ కంప్లెంటు పదివేలకు డిక్రీనా? యిల్లు వాకిలి గొడ్డు గోద సర్వము జప్తా? కొడుకుచదువుమూలకంగా నాకు తిన తిండీ పండ మంచము తాగ చెంబు లేని దుస్థితియా! ఇంతజరిగినను మోహనుఁడు మన సైనా, రెండురోజులు తనకడ నుండనీయడే. దగ్గర కూర్చో నీయఁడే. మోమెత్తి మాట్లాడనీయఁడే! వెట్టిబాగుల్ది కోడలెంత ఉండమంటేయేం ఎంతఆదరిస్తేయేం ఒక్కనాడుంటే, యేదోపనిపెట్టి అగ్రహారం తరిమేశాస్తాడుగా! పైగా స్పెన్సరష ఏమో తినేవష తాగేవష పీల్చేవష వీడితిండిపీఁడు మండిపోను. అందుకుగాను రెండు వేలు డిక్రీ? వీడి ఒక్కపొట్టకు ఒకసంవత్సరములో యింతఖర్చా? వేదాలు శాస్త్రాలు చదివితే కానీఖర్చు లేదే? ఒక్కభూమి అమ్మకో

నక్కరలేదే? మావాళ్ళు మాతఃమ్మడికొడుకులు వేదాలు శాస్త్రాలు చదువుకొని కాని ఋణంలేకుండా, చుట్టాలు, పక్కాలు, అతిథులు, అభ్యాగతులు, పూటకు పదిమంది భోజనంచేస్తూ యెంతో గౌరవంగావుంటే నాకీపాడుబుద్ధి యెందుకుపుట్టాలె? అయ్యో,కోడలు మిగుల గుణవతియే. వద్దన్నా దాని సంకసబెట్టుకొని తిరగటం దానిచేత వేషాలు వేయించడం యిల్లు వెళ్లగొట్టడం తిరిగి వెధవముండను పెళ్ళిచేసుకోడానికి ప్రయత్నించడమూనా! దేవుడు నాకిట్టి ప్రాయశ్చిత్తం జేశాడు. కోడలి కొకగద్దైనా లేకుండాపోయిందే. ఇప్పుడేం చెయ్యాలి? మానం ప్రాణం పోతుందని మూడురోజుల్నించి మనుష్యులమీద మనుష్యులు, ఉత్తరాలమీద ఉత్తరాలు, వెయ్యి రూపాయలు కావాలట. యెవ్వరిస్తారు? ఎలాగో ఊరంతా గాలించి రక్తంపిడిచి అయిదువందలు తెచ్చా. కానీ, కాస్తకుఱ్ఱాడికి బుద్ధిచెప్పి, కోడల్ని దగ్గిర ఉంచుకోమనిచెప్పి అవసరం జూచి వాడి మొగాన రూపాయిలు పారేస్తా. ఏంచెయ్యను? కడుపు పాపిష్ఠిది. ఏకపుత్రుడు. [నిష్క్రమించును.]

[మోహన్‌రావు గృహమున యజ్ఞంతో గలసి సురగ్రోలుచు విందారగించుచుండును]

యజ్ఞం—చాలావుంది ఆ భోగట్టా. అంతా యెందుకు, అయిదువందలకు నోటువ్రాసియిస్తే యిచ్చేది నాలుగువందలు. తిరిగి సంవత్సరములో యివ్వాలి; అర్ధరూపాయి వడ్డీ. ఇప్పటివ్యవహారం ఇది. కావాలంటే సెటిల్‌చేస్తా. చేస్తా యేమిటి, సెటిలే. నోటు వ్రాసి స్తేపయికం రేపు వస్తుంది.

మోహ—అయితే ఫౌజండు తెస్తావా?

యజ్ఞం—నిన్న ఫైవు చెప్పి యిప్పుడే యిలాఅంటే వాడు అనుమానం పడతాడు. కావాల్నంటే యజ్ఞం నీకు వెయ్యిఖాతాలు కుదురుస్తాడు.

మోహ—ఎప్పుడో కుదిరిస్తే, యిప్పుడు స్టాంపుపైకానికేం చెప్పను? మళ్ళీ అమీనా వస్తే వాణ్ణెలా సర్దను?

యజ్ఞం—మీనాన్న యింగువకట్టినగుడ్డ. నయానా, భయానా చూడు అక్కడే శాస్త్ర లాభిస్తుంది.

మోహ—నాల్గురోజులునుంచి యెన్నోకబుర్లు పంపి యెన్నిఉత్తరాలు వ్రాసినా జాడ, జవాబు లేదు. వస్తాను రాను అన్నమాటలేదు. ఇక ముసలాడేం సహాయం చెయ్యడు. ఇంక పెళ్ళాంతోపాటే యీయనకుగూడా సెలవుచీటి యిప్పించాలె. నాకష్టం కనిపెట్టకపోయిన తర్వాత నాకుతండ్రి అయితేయేం తల్లిఅయితే యేం, ఎవరైనాసరే వాళ్లని బహిష్కరించాల్సిందే.

యజ్ఞం — మోహన్! పాపం వాసంతీదేవిగారు—

మోహ—[కోపముతో] ఏమిటీ? ఇంక ఆమాట యిక్కడ వినపడగూడదని చెప్పలా? ఆదృశ్యం తలుచుకుంటే గుండె నీరైపోతూంది. నెక్స్టు మంతులో, నీవు చెప్పిన ఆ విడోగరల్ని మారేజి చేసుకుంటా.

యజ్ఞం—ఓహో! ఆవిడా? ఆదివ్యసుందరవిగ్రహం సాక్షాత్తు లక్ష్మీదేవియే.

రామ—[తెరలోనుండి] నాయనా! మోహన్! మోహన్! [అనుచుం బ్రవేశించి] ఇలారా నాయనా!

మోహన్—[కోపముతో] అప్పటికిప్పుడు వచ్చాడు [ప్రకా] రూపాయిలు తెచ్చావా!

రామ—రూపాయిలు తెస్తేనేనా రావటం లేకుంటే రాకూడదునాయనా?

మోహ—[తినుచుం దాగుచు] రూపాయీలు లేకపోతే యిక్కడ నీకు పనిలేదు.

రామ—[దైన్యముగ] కన్నకొడుకును నిన్ను విడిచి యెక్కడికి పోను నాయనా?

మోహ— [తీవ్రముగం జూచి] యెక్కడికయినా సరే. ఇక్కడమాత్రము వద్దు, నేనింక ఇక్కడవుండను.

రామ—మోహన్! ఎంతవాడవయితివిరా! నేంజేసిన పనంతా యింతవఱకు తెచ్చావుకదరా! మమ్మల్నందఱ్నీవదిలి యెక్కడికి పోతావురా?

మోహా—ఇక్కడ మాట్లాడకూడదు, వెళ్లు ముందవతలికి వెళ్ళు.

యజ్ఞం—[తినుచు] మామగారు! తరువాత దయచేయండి; యిప్పుడు వెళ్ళండి.

రామ—[తీవ్రముగాఁజూచి] ధర్మపిండం వెధవ! నీపొట్ట నీవు పోసికోక నన్ను పొమ్మంటావ్, ఈ సామానంతా నేదెచ్చానే, యిదంతా నా హక్కే, నీకు బుద్ధిలేదు?

మోహా—ఇక్కడ ఉండకూడదు. వెళ్ళు ముందవతలికి వెళ్లు. [పెద్దగా] బాయ్! [అని పిలుచును]

సేవకుడు—ఏం సార్! [అనుచుఁ బ్రవేశించును]

మోహా—ఈముసలాణ్ణి, అర్ధడాక్కు ఫూల్ని పంపించు ముందవతలికి పంపించు.

సేవ—అయ్యగారికి కోపం వస్తుంది. పదండి ముందుపదండి. [అని సమీపించి తాఁకఁబోవును]

రామ—[కోపముతో] ఏమిరా ఏమంటున్నావ్, జవానువెధవ్వి నీవు నన్ను మైలబడేస్తావ్, ముట్టుకోఁబోస్తావ్, ఈ మాటు నాదగ్గిరికిరా, నీసంగతిచెపుతా. ఏమనుకున్నావ్? పెద్దపెద్ద సభల్లో అందరికంటె ముందుగా పూజింపబడే చయన్లను ఒకడు నన్ను ముట్టుకోరావటమా? పో, అవతలికిపో. [అని బెదరించును]

మోహా—పొమ్మంటేపోక, అందరిపైన యెదురు తిరుగుతావ్, పో ముందుపో. పోవుగా? [అని గ్లాసులోని బ్రాందిని మొగముమీఁద చల్లును]

రామ—అయ్యో! అయ్యో! ఎంతపనిచేశావురా మురహరీ, పాడు వాసననీళ్ళు పోశావుకదరా, నా బ్రాహ్మణ్యమంతా భ్రష్టం చేశావుకదరా, ఎక్కడికి కాలుపెట్టకుండా చేశావుకదరా?

మోహా—పొమ్మంటే పోక పైగా అరిచి అల్లరిచేస్తావా, పోముందుపో [అని మెడఁబట్టి నెట్టి నిష్క్రమించును]

రామ—[క్రిందఁబడును]

యజ్ఞం—అయింది పాపం ముసలాడి పని బాగా అయింది. అయితే అయింది కాని, నా ఘూటైన బ్రాందీ పోయిందే! చదువుకుంటే యేం, పరీక్షలు ప్యాసయితే యేం, దురహంకారం పోదు. ముందు వెనుక పాపం పుణ్యాం వుండదు, కాని యింక నేనిక్కడ వుండగూడదు.

[నిష్క్రమించును.]

చయ—[లేచి శరీరము తుడుచుకొని దెబ్బ చూచుకొని రక్తము తుడుచుకొనుచు] ఆహా! మురహరీ! మురహరీ! ఎంతపని చేసితివి? [దుఃఖముతో] నా రక్తమును నా కనులకుఁ జూపించితివే? ముప్పదివేలు ఖర్చుపెట్టి నీచే నే నెట్టిగౌరవమును బొందితినిరా? ఆహా! చిరకాలమునుండి పుత్రునిచేఁ దండ్రి గంగాభిషేకము చేయించుకొను మర్యాద పోయి కాలవశమున నిప్పటికి సురాభిషేకము చేయించుకొననయ్యెనే! అయ్యో! నేనెంతపాపిని! యెంత నిర్భాగ్యహీనిని! యోగ్యబ్రాహ్మణులని యిచ్చిన సాధనమంతయు దురాచారవిషయుఁడై స్వమతవిముఖుఁడగు నిట్టియవివేకిపాలుచేసితినే. వేదవేదాంగవిదులగు మహాబ్రాహ్మణులు ఉపనిషద్వాహినులఁ బ్రవహింపఁ జేసిన పవిత్రస్థల మిట్లు మద్యశాలయయ్యెనే? యజ్ఞస్వరూపుఁడగుశ్రీమహావిష్ణువు నర్చించిన ప్రదేశమంతయు మాంసాపణ మయ్యెనే? వేలసంవత్సరములనుండి సర్వజనాదరముంబడసి యింద్రాదులనుకూడ భయపెట్టిన బ్రాహ్మణ్యము రైళ్ళదగ్గర గదులలో ఒక్క మాంసపుముక్కతో ఒక్క బ్రాందిగ్లాసుతో సర్వనాశనము కావలసివచ్చెనే! మాధవశర్మా! నీవు దేవుఁడవు, నీవు ధర్మమూర్తివి, న్యాయమూర్తివి. నీమాట లనుభవమునకు వచ్చినవి. నీ వెందున్నను నీపాదము లాశ్రయించి ధన్యుఁడనయ్యెద. ఇంక నీతుచ్ఛునికడ నుండరాదు. దీనమై విలపించునాకోడలి కీధనమిచ్చి తీర్థయాత్రలకరిగి మాధవశర్మను దర్శించి యాతనికడ తత్త్వోపదేశమును బొందెద. ఓరీ మురహరీ! స్వకులాచారదూరుఁడవు, నీకింక నిష్కృతిలేదు. స్వేచ్ఛాచారులారా! పదవులనమ్మి ప్రస్తుతస్థితిని జూచుకొని గర్వింపకుఁడు. ధర్మహానిఁజేసెడు మీకింక హైన్యము తప్పదు. [నిష్క్రమించును]

యజ్ఞం—[వీథిలోఁ బ్రవేశించి] ఇంకా కొన్నాళ్ళు వెలుగుతుం దను కుంటే మోహనరావుదీపం అప్పుడే మిటుకు మిటుకు మంటున్న దే! ఇంక యజ్ఞంజ్యోతి యెలా వెలగటం? [ముందుఁజూచి] ఓహో! వాసంతీదేవి, రామచయనులూనా! వీరి సందర్భమేమిటో కాస్త విందాం. [ముందుకు వెళ్ళి వినుట నభినయించి] మాధవశర్మకూతురవు, కష్టపడ లేవంటూ చేన్లు కోడలికేదో యిస్తున్నట్టుంది. అదేమైయుంటుందో? [యోజన నభినయించి] ఏదో కొంతడబ్బు కొడుకునకు తెచ్చివుంటాడు, వాడిచేత దెబ్బతిని అది కోడలికిచ్చి వుంటాడు. అయితే వాసంతీదేవి యిటేవస్తున్నది. యుక్తిచేత అదేమిటో తెలుసుకొని వీలయినంతవరకు 'కొత్తబెల్లం గుటకాయ స్వాహా' చెయ్యాలి. [అని వెనుకకుఁ బోవును.]

వాసం—[ప్రవేశించి] మామగారికి నాయందెంతో ఆదరం. ఏమయిన నేమి? మాయిద్దఱికి యిఁట్లో ఉండరాములు లేకపోయెనే, ఏమి చెయ్యను?

యజ్ఞం—[మెల్లగా సమీపించి] వాసంతీదేవిగారా! మోహన్‌రావు వట్టి వెఱ్ఱివాఁడై మీ విషయంలో చాలా లోపంజేశాడు.

వాసం—అయ్యా! మీరైన మామిత్రులకుఁ జెప్పలేకపోతిరా?

యజ్ఞం—నేనుచెప్పకుండా వుండేవాణ్ణేనా? మా మోహన్‌తో రాత్రంతా పోట్లాడిపోట్లాడి చివఱకు ఒక చెంపదెబ్బకూడా తిన్నా. మా ఫ్రెండ్‌షిప్పు చూచి ఊరుకున్నా కాని లేకపోతేగా, ఈపాటి కెంత గందరగోళమైనా కావాల్సిందే! కాని మా బారిష్టరు మన స్సేం బాగాలేదు. అతన్నిచూస్తే పిచ్చికూడా యెత్తుతుందా అనిపిస్తుంది.

వాసం—[ఆతురతతో] ఎందుచేత?

యజ్ఞం—ఎందుచేతేమిటి? మీరులేకపోవటంచేత, డబ్బులేకపోవటంచేత, దావాలు జప్తులు వారంట్లుకూడా సిద్ధమవటంచేత.

వాసం—వారంటులుగూడానా?

యజ్ఞం—ఇప్పుడే అమీనా నాలుగువందలకో వారంటు తెచ్చాడు. దాంతో తక్కిరిబిక్కిరై తలచూపలేకుండా ఉన్నాడు. కలక్టర్లను

జడ్జీల్ను కూడా లక్ష్యంచెయ్యని మా బారిష్టరు మోహన్‌రావ్ అమీనా వచ్చేటప్పటికి హడలిపోయి అప్పచ్చిలాగ గోడకతుక్కొని కూర్చున్నాడు.

వాసం—యజ్ఞంగారు! నాభర్తగారు నిజముగ నింతటి హీనస్థితిలో నుండిరా?

యజ్ఞం—నిజమేమిటి? అమీనా యిప్పటికి యిల్లువదిలేనా! గడప కదిలేనా? మోహన్ నన్ను డబ్బుతెమ్మంటాడు, తెస్తానుండమని అమీనాకు జెప్పి యిలావస్తున్నా. అక్కడికి మొన్న అతని ఇబ్బంది చూడలేక అయిదువందలిచ్చా. నా ఫ్రెండ్సు వూళ్లోలేరు. రమణతో దెబ్బలాడాడు. నాతల తాకట్టుపెట్టినా, ఇవ్వాళ నాకు పైకం పుట్టేటట్టులేదు. ఏంజెయ్యను. ఇంక అతనియిష్టం, అమీనా యిష్టం. ఒళ్ళుతెలియకుండా ఋణాలుచేసినందుకు, పోతే సివిల్ జయిలుకు పోతాడు. ఇంకాపోతే పట్టాపోతుంది. పోవాల్సిందే, దాంతోనైనా బుద్ధివస్తుంది. ఇంక నేనింటికిపోయి తలుపుబిగించు కుంటా. ఏంజెయ్యను? [అని పోబోవును.]

వాసం—[ఆతురతతో] యజ్ఞంగారు! నామామగారు నాకిప్పుడే అయిదు వందలిచ్చారు. అందులోవి నాలుగువందలు మీకిస్తా. అవి అమీనా కిచ్చి నాభర్తగారు జయిలుకుపోకుండా వుండేటట్టు చెయ్యండి. మీకు నమస్కారంచేస్తా, ఇదిగో పైకం తీసుకోండి. [అని నో ట్లిచ్చును.]

యజ్ఞం—[తీసికొని] ఆహా! వాసంతీదేవిగారు! ఎంతయోగ్యతండి మీది! అంత అవమానం పొందికూడా, భర్తకింత సాయంజేస్తున్నారే! మీరుందే ఈయుగంలో పుట్టవలసినవారు కారండి. ఇవ్వాళ మోహన రావు మానం ప్రాణం కాపాడారండి. ఈ రూపాయిలిచ్చి మీ యుపకారం మీ గుడ్నెస్ అంతా మోహన్‌తో చెప్పి మిమ్మల్ని వెంటనే పిలిపించేటట్టు చేస్తా. మీరు అక్కడా ఇక్కడా యేముం టారు. టాప్రివిలర్సు బంగళాలో ఉండండి. మర్యాదగా ఉంటుంది.

ఇంక నేను చివాట్లుపెట్టి తప్పకుండా అతన్ని అక్కడికి తీసుకొస్తా. మీ యిద్దఱికి అనుకూలంచేస్తా.

వాసం—ఏమిచేసినాసరే. భర్తగారి యిబ్బందిమాత్రంతప్పించండి.

యజ్ఞం—ఇంకా సందేహమా ?

వాసం—[నిష్క్రమించును]

యజ్ఞ—[ఆమెవంక(జూచి సంతసముతో] శహబాష్ ! యుక్తిఅంటే నాది యుక్తి. నిముషంలో నాలుగువందలు చేతులోపడ్డాయ్! వెధవ నాలుక నాలుగువందలన్నదికాని ఐదోవందకూడాఅనగూడదు? అన లేదు. అంతవఱకే అదృష్టం. కానీలే, ఈశ్రమకదిచాలు. ఇంక మోహనరావుదగ్గఱకువెళ్లి జప్తులు వారంట్లుఅని హడలుపుట్టించి యిక్కణ్ణుంచి పాఱిపొయ్యే ఉపాయం చెయ్యాలె. కావాలంటె సామాను పుస్తకాలు నేను పంపిస్తానని యింటితాళపుచేతులు కాజెయ్యాలె. ఆపైన అందినమట్టుకు జేబులో పడవెయ్యాలె. వెంటనే యీ పని చెయ్యాలె. [అని నిష్క్రమించును]

సప్తమాంకము

# లలిత

## అష్టమాంకము

**కాళి**—[ప్రవేశించి] నగలు కాజేయించి నాతోడికోడలుచేత ముష్టెత్తింతామంటే, పడేస్తే పట్టుపరుపుమీదఁ బడ్డట్టు, అంతా యిలావుందేం? వస్తూ వస్తూ తులసికి జ్వరంవచ్చి వీళ్ళు పదిరోజు లావూళ్లోవుంటే, మాధవశర్మగారి భార్య అసి కోడలని డాక్టరు దగ్గర్నుంచి అందరు ఆదరించటమే, దేవుడి దగ్గిర కూర్చోని మా రాధ గొంతెత్తిందంటే బెల్లాని కీగల్లాగ ఆడమగ అంతా సత్రంచుట్టూ మూగడమే! దీన్నో దేవతను పూజించినట్టు పూజించటమే. యాత్రకంటూవచ్చి సుబ్బయ్యగుప్త యీస్థితంతాచూచి అమ్మ తల్లి అంటూ వీళ్ళని నెత్తిన పెట్టుకోటమే! ఇదంతాచూస్తే చిరకాలంనుంచి మా మామగారు వారు పూజ్జేసిన విగ్రహాల మహిమేకాని, యింకోటి కాదు. ఎలాగో ఆవూరువదలి యిక్కడికి వచ్చారు. ఇప్పుడే పూజ్జేసుకొని సత్రంలో అంతాపడుకున్నారు. అమాంతం ఆ విగ్రహాల్ని కాస్తా కాజేసి కనబడకుండా యెక్కడో దూరంగా పారేశానంటే అంతటితో వాళ్ళరోగం కుదురుతుంది. ఇదే సమయం. ఇంక నాపని నేను చూస్త. [నడుముబిగించి నల్లబట్ట కప్పుకొని లోనికిబోయి అటునిటు జూచుచుఁ దులసి కాలు తొక్కును]

**తులసి**—[తత్తరపాటుతోలేచి] అబ్బా ! ఎవరోకాలుఁ దొక్కారండి అత్తయ్యా! [అని బాధనభినయించును]

**కాళి**— [నక్కును]

**రాధ**—[సంభ్రమముతోలేచి] ఎవరే అమ్మా ! ఎక్కడనే?

తులసి—— ఇక్కడనేనండి, గట్టిగాఁదొ్రిక్కి యిలాపోయినారండి [అని కాలుచూపును]

రాధ——ఏమిచేసెదవు తల్లీ! లేచినవేళ మంచిదికాదు. [అనియుపచరించుచుండును]

కాళి——[దేవునిపెట్టెను బట్టుకొని పరుగెత్తును]

రాధ, తులసి——అమ్మో దొంగ దొంగ [అని కేకలుపెట్టుదురు]

విశ్వపతి, వెంకన్న— [ఉలికిపడిలేచి] పట్టుకోండి పట్టుకోండి [అని యొకరినొకరు పట్టుకొందురు]

రాధ——అయ్యో! దేవుఁ డేమయ్యెనో కదా? [అని పోఁబోవును]

తులసి——ఏమగును. ఇంకా దొంగలెందరున్నారో మీరు వెళ్లకండి.

రాధ——విశ్వపతీ, వెంకన్నా!

విశ్వపతి, వెంకన్న——[ఒకరినొకరు చూచుకొని] అమ్మా! అమ్మా! [అని రాధను సమీపింతురు.]

రాధ——[చూచుచువిచారముతో] అయ్యో! దేవునిపెట్టె కనఁబడలేదే? ఏమిసేయుదును?

విశ్వ——అమ్మా! త్వరపడకండి. వెంకన్నా! చూడవోయ్. నీవుకూడ చూడు. [అని చూచుచుందురు]

రాధ——[వెదకుచు] దేవునిపెట్టెయేలేదే. యేమిచేయుదునే తులసీ!

తులసి——వెతకండి; అంతా వెతకండి అత్తయ్యా! [అని బాధనభినయించుచు వెదకును]

రాధ——[అంతయుఁజూచి నిర్విణ్ణయై] కృష్ణా! గోపాలకృష్ణా! దొంగ చేతఁ జిక్కితివా? తండ్రీ!

తులసి——ఓరిదొంగా! ఎంతపనిచేసివితిరా! ప్రాణాధికుఁడగు మాకృష్ణునే హరించితివే! ఇంకేమిచేయవలె.

విశ్వ——అమ్మా! వెఱ్ఱి వెధవలు దొంగలు, నగలున్నయనుకొని తీసికొ పోయి వుంటారు. పెట్టెయెక్కడో పడేస్తారు. విచారపడకండి.

వెంకన్న—అమ్మా! దేవుడు దొరుకుతాడు దిగులుపడకండి.

రాధ—నాయనలారా! కృష్ణునివిడిచి నేనుండఁజాలను. వెదకుదము రండు.

విశ్వ—అమ్మా! చంద్రోదయము కావచ్చినది. కొంచెమాగుడు, పోవుదము.

రాధ—నాపూర్ణచంద్రుని నాపెన్నిధానమును నాబాలకృష్ణుని విడిచి నేనుండఁజాలను. రండు, పోవుదము, కృష్ణా! కృష్ణా! [అని నిష్క్రమించును]

తులసి—అందఱ నధీనము చేసికొనుతండ్రివే, నీవు పరాధీనుఁడవు కావలయునా? కృష్ణా! కృష్ణా! [అనుచు నిష్క్రమించును]

వెంక—విశ్వపతిగారు! మునసబుగారు బండిపంపిస్తానన్నారు కదా! ఇప్పుడేమిటి చెయ్యటం.

విశ్వ—మూటముల్లె నెత్తిన వేసుకోడం, దార్నె వెతుక్కుంటూ పోవటం. కట్టు. అన్నిమూటకట్టు. [అని అన్నిసర్దుకొని నిష్క్రమింతురు]

కాళి—[వనప్రాంతమునఁ బ్రవేశించి] భేష్. కుదిరింది బాగా కుదిరింది రోగం. తలావొకదారి పట్టారు. ఈపెట్టెనీమెట్లో పారేశి యిక్కడ నున్న మొరికలాళ్ళ నుసికొలిపి యీ అడవిలో తన్నిస్తా, వీళ్ళనందరిని చచ్చేటట్టు తన్నిస్తా. పచ్చిరక్తం కళ్ళచూస్త. [నిష్క్రమించును.]

తులసి—కృష్ణా! గోపాలకృష్ణా! [అనుచువనములోఁ బ్రవేశించి] ఎందుఁ బోయితివో యెఱుఁగఁజాలకుంటినే? ఏమి సేయుదును?

ఉ. కంటకముల్ శిలల్ తరులు ♦ కాలిడనీక కలంచుకాన నెం
దుంటివొ యేడ కేగితివొ? ♦ యోగిరమె ట్లొనగూడునయ్య! నీ
కంటికిఁ గాటుక న్నెఱపి ♦ కస్తురిబొట్టెవరుంతురయ్య! నా
కంటికి నీటికాల్వలను ♦ గల్పనఁ జేసెదవయ్య! మాధవా!

[శ్రమ నభినయించుచు] "గోపాలా! నీదర్శనభాగ్యము లేక పోయెనే? ఏమిచేయుదును. చోరుఁడా! హృదయాధికుఁడగు మాబాల కృష్ణునే హరింపవలయునా? మానవనీత-చోరుని హరించిన, యో! చోర

శేఖరుఁడా, నిన్నడుగుకొందును, వేడుకొందును, నీయడుగులఁ బట్టుకొందును, మా యొడయఁడగు బాలకృష్ణు నొసంగుము, మమ్ము రక్షింపుము. [నమస్కరించును] . [దిక్కులుసూచి] తస్కరుఁడా, నీకు దయగలుగలేదా? అయ్యో! గోపాలా! అనన్య శరణ్యలమైన మాపై నింతకినుకఁబూనెదవా? భవదధీనమానసలమైన మాపై నింత నిర్దాక్షిణ్యమా? కృష్ణా! యీ దుర్గమారణ్యమున నింకఁ దిరుగఁజాల, నడువఁజాలఁ, జూడఁజాల, పిలువఁజాల తండ్రీ! రమ్ము, నీవే రమ్ము, [కనులుమూసి దోయిలొగ్గి, వినుట నభినయించి] ఎవ్వారిది? అందెవ్వరో శ్రీకృష్ణునిఁ బిలిచినట్లున్నది? [తూలుచు] కృష్ణా! కృష్ణా! [అని పిలుచుచుఁ బోఁబోయి, పదము లుత్తొట్రిల్లి, క్రిందఁబడి బాధనభినయించుచు] ఓ జగన్నాథా! ఆపద్బాంధవా! శ్రీకృష్ణా! ఎందుంటివోకదా? నీదాసియగు తులసి ప్రాణములు వదలుచున్నది. నీతుదిదర్శనంబిచ్చి, ధన్యురాలినిఁ జేయుము. సకలజగద్బంధుండవగు నో దేవదేవా! నా యీప్రార్థన మాలకింపుము.

సీ. పయనమిచ్చటికంచు ♦ బాలురు నిల్పఁ
ద్వారగవచ్చెదనంచుఁ ♦ బలికిరమ్ము
కుబ్జ గంధమలందఁ ♦ గూర్మిఁబిలిచెనే
మునివ్రేలఁ గలపంబు ♦ ముట్టిరమ్ము
తగవుఁదీర్పుమటంచుఁ ♦ దరుణులుచుట్టిరే
సారాంశములువిని ♦ సాగిరమ్ము
దేవాహితులఁద్రుంప ♦ దిక్పతుల్ కోరిరేఁ
జక్రాయుధమునంపి ♦ సరగరమ్ము

గీ. క్షోణిపతియెవ్వఁడేనియుఁ ♦ గోటిపసిఁడి
పూలపూజనొనర్పంగఁ ♦ బూనుకొన్న
శ్రద్ధతో నీయ దళమేనిఁ ♦ జాలుననుచుఁ
బలికి నే రమ్ము ప్రాణముల్ ♦ వెలయనిమ్ము.

అయ్యో! నాలుకయెండుచు నోటమాటరాకున్నది శ్రీకృష్ణ

నామస్మరణము చేయుచు. నన్ను దరిఁజేర్చువా రెవ్వారు నిందుఁ గాన
రాకుండిరే? తండ్రీ; శ్రీకృష్ణా!

చ. నరహరి; శ్రీహరీ; యనెడి ♦ నాలుకనాపితి వెల్లవేళలం
గరగు నురక్తి నిన్గనెడి♦కన్నులుమూసితి త్వత్పదద్వయిం
దొరలుశిరంబు నిల్పితివి♦దోయిలి యొగ్గడిచేయిగట్టితే
శరణిభజింతు నీవె ననుఁ ♦ గావఁగరావె దయాపయోనిధీ!

తండ్రీ; గోపాలా, దీనావనుండవు, ఆర్త శరణ్యుండవు, రమ్ము
నన్నుద్ధరింపుము. [కనులుమూయును]

రాధ—[ప్రవేశించి] కృష్ణా, శ్రీకృష్ణా, ఇంకను నీకు దయరాలేదా?
అనన్యగతికలమే, శరణార్థినులమే! ఇంతకాఠిన్యమా? నీవిచటఁ
గనఁబడకున్న, నిన్ను వదలుదాన ననుకొంటివా? నీ విచ్చటఁ గాదు;
ఎందున్నను వదలుదానను కాను.

సీ. అలయుగ స్త్యునిఁబిల్చి ♦ యప్పాలఁ ద్రావించి
యబ్ధినిన్ గందు నా♦రాయణుండ!
కులిశాయుధునిఁ జీరి ♦ కొండలఁ జీల్పించి
చెలఁగి నిన్గాంతు నృ♦సింహదేవ!
పన్నగేంద్రుని వేఁడి ♦ పాతాళనిలయంబు
చేరి నిం జూచెద ♦ శేషశయన!
గరుడుని భజియించి ♦ తిరిగి లోకములెల్ల
వీక్షించెదను నిన్ను ♦ విశ్వరూప!

గీ. గురుఁడు దైవంబునైన మ♦ద్గురునిఁ గొల్చి
చేతనాచేతనస్థితిఁ ♦ జెలఁగియుండి
తత్త్వమస్యాది వాక్యార్థ ♦ తత్త్వమైన
యాత్మనై నేనె నీవౌదు ♦ నాదిదేవ!

కావున భవబంధవిమోచకంబులై బ్రహ్మానంద సంధాయకంబు
లగు జీవితేశ్వరసద్గురుచరణంబుల నాశ్రయించెద. [పోఁబోయి,
కాలికిఁ దగులుట నభినయించి] ఎవరది? [పరికించి] అయ్యో, తులసీ!

క్షుత్పిపాసల కోర్చుకొనలేక పడిపోతివా? [శరీరము నిమురుచు] నీయీ కోమల చరణ పల్లవములెంతయుఁ గఠిన శిలాటంక సంఘట్టితంబులై నెత్తురుముద్దలయ్యేనే? నవనీత కోమలంబగు మృదులాంగంబంతయు గ్రీష్మవాతావధూతంబగు మాధవీలత వడువున నాడిపోయెనే? పొందామర వడువున నయనానంద కరంబగు నీముఖారవిందమెంతయుఁ గందువాఱెనే? భయంకర దుర్గమారణ్యమున పరిభ్రమించుచు, నిట్లుపడిపోయితివా? ఇంకేమి సేయుదును. తులసీ, తులసీ! [అనిపిలుచును.]

తులసి—[కన్నులు విప్పిచూచి] అత్తయ్యా; వచ్చితివా? శ్రీకృష్ణునిఁ దెచ్చితివా?

రాధ—లేదు; తల్లీ! లేదు; ఆభాగ్యమే లేదు.

తులసి—అత్తయ్యా; నా కాయాసమధికముగనున్నది. సర్వదా భగవానుని బూజించు మీపవిత్ర హస్తంబుల, నాశరీరము నిమురుచు, గోపాల నామస్మరణమున ధన్యమైన మీదివ్యవాణిచే గోవింద నామామృతమును వర్షింపుము.

రాధ—[తులసిశిరమును దొడపై నిడుకొని శరీరము నిమురుచు] అమ్మా; ఇదే, నది. యుదకముగొనివచ్చెద. కొంచెమీ యుదకముఁ ద్రావి సేదఁ దీర్చుకొనుము.

తులసి—నీనోట వెడలు కృష్ణధ్యాన సుధారసమునకంటె నదీజల మెక్కుడు తాపశాంతిఁజేయునా? అత్తయ్యా; భగవద్ధ్యానముచేసి నన్ను ధన్యను జేయుఁడు. [కనులుమూయును.]

రాధ—[దైన్యముతో] కృష్ణా! ఎంతకాఠిన్యమును వహించితివి!

ఉ. ఎంచక యన్నపానముల ♦ నెంచక పోయెడి ప్రాణమైన ని
న్నెంచెడి భక్తురాలిఁ గరు♦ణింపవు కన్నులు వేయిదాల్చియుఁ
గాంచవు వేయిపాదములఁ ♦ గ్రాలియుఁబ్రోవఁగ రావు నీవయో!
కంచెయె చేనుమేయు నిఁకఁ♦గల్గునె? వేఱొక దిక్కు మాధవా!

కృష్ణా ! రమ్ము, మాతులసి నుద్ధరింపుము. [కనులుమూసి ధ్యానమునటించి, దెసలుచూచి] భగవానుఁడిప్పటికిని రాకున్నవాఁడే! ఏమి చేయుదును. [యోజననభినయించి కోపముతో] కృష్ణా, ఎంత మోసగాఁడవు, నిన్నునమ్మి క్షుత్పిపాసలుకూడ వదలి మహాటవులం బడి తిరుగుచు నీకై పలవించు నబల యీ తులసి ప్రాణావశిష్టయైనను నీకుఁ గనికరమిసుమంతయైన లేకుండెనే? నీవు వట్టి నిర్గుణుఁడవు. నీకు దయాగుణము కలుగుటకల్ల. నీవు కేవలము నిరింద్రియుఁడవు. ఆశ్రితులఁ గటాక్షించుట అయథార్థము. నీవు సాక్షాదచలుఁడవు. భక్తులనుద్ధరింపవచ్చుట యసంభవము. మాయింటికి వచ్చెదనంటివే! మమ్ముఁ గృతార్థల గావింతునంటివే! నీమాటలునమ్మి నీకై వేచియున్న మమ్మింత మోసగింతువా? కృష్ణా! నీదుండగ మింక సహింప నేరను.

చ. పలికెద నీ వపాదుఁడవు ♦ భక్తులఁ బ్రోవఁగ రావఁటంచు, నేఁ
దెలిపెద నీ వపాణివని ♦ దేర్పఁగలేవు శ్రితాళినంచు, ది
క్కులవెలయింతు నీకుఁ గనుఁ♦గో జవసత్త్వము లేదఁటంచు నీ
తులసినిఁగావ నీవు కృప♦తోఁ జనుదేరకయున్న మాధవా!

[కోపముతో] కృష్ణా ! ఇంకను నీవురావా ! దర్శనభాగ్య మీయవా. [స్మరణ మభినయించి] కాదు కాదు. శ్రీకృష్ణుఁడిచ్చటికో పోవుట కాదు. ఇదియంతయు నా జీవితేశ్వరుఁ డుపదేశించినట్లు మాకు నిరంతరోపాస్యమగు సగుణమూర్తి పరిపూర్ణాఖండ చిన్మాత్రమగు నిజరూపమున సాక్షాత్కరింప నంతర్హితమగు ఫలకాలమై యుండును. కాకున్న మాకు మాదైవ మేల కనఁబడకుండును. [దెసలు పరికించి యోజన నభినయించి] నిజముగ నిది యట్టిదియే యైనచో నాకు జీవ భావ జగద్భావ తిరోధాన పూర్వకముగ సర్వాత్మక బ్రహ్మాత్మసాక్షాత్కారములచేఁ బరిపూర్ణానందస్థితి యేల ఘటింపకుండును. ఇంకను నా సుకృతము ఫలింపలేదు. మాయావరణము దాటిపోలేదు. నాస్థితియంతయుఁ జేతికొమ్మ యందకపోఁగాఁ గాలి

కొమ్మనుగూడ వదలినట్లయినది. ఇంక నాకు వశీకృతమాయుఁడగు దైవమే శరణ్యము. ఆపద్బాంధవా! శ్రీకృష్ణా! మా యపరాధముల మన్నించి, యనన్యగతికల మైన మమ్ముద్ధరింపుము.

శా రావే దీనశరణ్య! భక్తవరదా ♦ రావే జగద్రక్షకా,
రావే నీరదగాత్ర, పద్మనయనా, ♦ రావే శుభాకార, నీ
సేవల్ సేయని జన్మమేల యనుచుం ♦ జీవావశిష్టంబుగాఁ
బ్రోవై కూలెను బాల; యేలవె, కృపాం♦భోరాశి, కృష్ణా! హరీ!

[ధ్యాననిమగ్న యగును.]

విశ్వపతి, వెంకన్న—[ప్రవేశించి సంతసముతో] అమ్మా! రాధాదేవిగారు! తులసీదేవిగారు! మీభక్తికి మెచ్చి పరమేశ్వరుఁడు, శ్రీకృష్ణుఁడు, సాక్షాత్కరించినాఁడు.

రాధ,-తులసి—[ఆతురతతో] ఎక్కడ తండ్రీ?

విశ్వపతి—[నదికై చూచుచు] ఇక్కడే తల్లీ! అదుగో, భగవానుఁడు పేటికాప్లవంబుపై నదీవిహార మొనరించి యిట్లు వచ్చినాఁడు.

తులసీ:-రాధలు—[చూచి సంతసముతో] కృష్ణా, గోపాలకృష్ణా, రాధాకృష్ణా, ముద్దుల కృష్ణా, వచ్చితివా తండ్రీ, [అనుచు సంభ్రమముసఁ బెట్టెను దీసికొని వత్తురు.]

రాధ—[విగ్రహమునుదీసి] తండ్రీ! ఎక్కడకుఁబోయితివి తండ్రీ? నదీవిహారముఁ జేయఁబోయితివా? కృష్ణా! గోపాలకృష్ణా, [అనుచు పెట్టెలోని కృష్ణుని అక్కునఁ జేర్చుకొనుచు]

చ. జలములఁ దాఁటితో దొరలు ♦ సైకతపుందరులం దడంగితో?
బలితపు సుళ్ళఁ జిక్కితివొ ♦ వాహినులంబడి దూరమేగితో?
కలఁగితివో మొసళ్లు వడి ♦ గ్రమ్మఁగ వాని నదల్చినాఁడవో?
యలసితివో తరంగనిచ♦యంబులఁ దోఁగితొ దెల్పుమాధవా!

తులసి—నీళ్ళు తాఁకకుండ, ఒరగిపడకుండఁ బెట్టె గట్టిగా పట్టుకున్నాఁడ త్తయ్యా!

విశ్వపతి—అమ్మా! అదృష్టవశమున దేవుఁడు దొరకినాఁడు, ఇంక బయలు దేరుదము లెండు.

వెంకన్న—అమ్మా! ఇది చిన్న అడవి; పైన నెడారి; దూరముపోవలె; లెండు. శ్రీకృష్ణపరమాత్మకు జే! [అనుచు ముందునడచును.]

అందఱు— శ్రీకృష్ణపరమాత్మకు జే! [అనుచుబయలు దేరుదురు]

[లోపలినుండి రాళ్లుపడును]

వెంకన్న—[సంశయముతో] అమ్మా! కొంచెమాగండమ్మా.

రాధ—ఏమి వెంకన్నా?

వెంకన్న—ఏమియు లేదు. ఎక్కడిదో రాయిపడ్డది. దొంగలేమో యనుకుంటున్నా?

రాధ—ఆఁ ఏమి?

[మఱలరాళ్ళుపడును]

విశ్వపతి—అబ్బా! చచ్చితిని. [అని మాటవిడిచికూలఁబడును] అయ్యో! ఎంత దెబ్బండి! నిజంగా దొంగలే వచ్చారండి.

రాధ—ఏమి నాయనా? [అని సంభ్రమించును.]

తులసి—అయ్యో చచ్చితినండీ అత్తయ్యా! కాలు విరిగిపోయిందండీ. [అని బాధ నభినయించును.]

రాధ—తల్లీ! విచారపడకుము. నాయనలారా; వెఱవకుఁడు. పాపమున్నఁగాని భయముండ నేరదు. ద్రవ్యముకన్న పాపము మఱిలేదు. మీకడ ధనమేమైననున్న వదలివేయుఁడు. కృష్ణార్పణమని వదలి వేయుఁడు.

వెంకన్న—అమ్మా! మీ సేవయే నాకు ధనం.

విశ్వ—తల్లీ! నశ్యానికని ఉంచుకున్నా ఒక్కపావలా, కృష్ణార్పణం. [అని వదలును]

[మఱల రాళ్ళుపడును]

రాధ—అయ్యో! నాతండ్రికి దెబ్బతగులునేమో కదా?

తులసి—నేను స్వామికడ్డముండెద. [అని స్వామిపెట్టెను జాగ్రత్త చేయును.]

రాధ—నాయనలారా! ఓర్చుకొనుఁడు. దైవము పరీక్షించుచున్నాఁడు. చిత్త మన్యథాపోనీయక దేవునిధ్యానింపుఁడు. కష్టమం దీశ్వరధ్యానమే కర్తవ్యము.

[మరల రాళ్ళుపడును.]

రాధ—ఓర్చుకొనుఁడు. పరమేశ్వర ధ్యానము చేయుఁడు. తులసీ! దేవదేవుని స్మరింపుము.

అందఱు—[ధ్యానము చేయుదురు.]

రాధ—భక్తవత్సలా! శ్రీకృష్ణా! పన్నగములలో వాసుకివి, పక్షులలో గరుడుఁడవు. మృగములలో సింహమవు. వృక్షములలో అశ్వత్థమవు. తారకలలో చంద్రుఁడవు. ఇట్లు బహురూపుఁడవైన నీకు నీభక్తులు పడుపాట్లు కనఁబడలేదా! అయ్యో యింత కాఠిన్యమా? కృష్ణా! నీవు భక్తరక్షణ పరాయణుండవు. నీబిరుదముతీసివేసికొనఁగూడదు.

మ. మును దేవేంద్రుఁడు రాలవానగురియన్ ♦ బూర్ణశ్రిమోపేతులై
వనటంజెందిన గోపకామినుల గో♦పశ్రేణి గోవ్రాతమున్
గొనవేలన్ గిరినెత్తి ప్రోచితని నిన్ ♦ గొండాడు లోకంబహో!
ఘనభూభృద్ధర భక్తతాపహరణా ♦ కాపాడు గోపాలకా!

తులసి— కృష్ణా! సర్వభూతములు నీయందుద్భూతములై నీవలన వృద్ధిఁ బొందుటచే నీవు లోకజనకుఁడవు. లోకపోషకుఁడవు. ఇట్టి నీవు నీ కన్న సంతతి కష్టపడుచుండ నుపేక్షించుట భావ్యముకాదు. తండ్రీ! భావ్యము కాదు.

శా. కర్తన్ సృష్టి నొనర్ప నే ననుచు వా♦గ్వ్యాపారముల్ సల్పి నే
భర్తన్ లోకములేలు దేననుచు వి♦శ్వంబెల్లఁజాటించి నే
నార్తత్రాణపరాయణుండ నని వి♦ఖ్యాతిన్ విడంబించి మా
యార్తిం దీర్పఁగలేకయుండెదవె కృ♦ష్ణా! దేవచూడామణీ.

[అనిధ్యానమునటించును.]

రాధ—కృష్ణా! గోపాలకృష్ణా; ఏల కాలహరణ మొనర్చెదవు?

గీ. విశ్వమెల్లను మాయచే♦ వెలయుచుండు
మాయ నీచేతిలోపల ♦ మాఱుచుండు

నట్టిమాయాప్రపంచంబు ♦ నణఁగఁ జేసి
మమ్ముదరిఁ జేర్పు, బాధలు ♦ మాన్పు దేవ!

కృష్ణా ! సర్వము నీస్వరూపమై యుండఁ జోరులు వేఱు, మేము వేఱుందుమా? ఆతస్కరులు బాధించుటయు మేము బాధింపఁబడుటయునా? నాకంటికింతటను నిరంతర ముపాసింపఁబడుచున్న నీ దివ్య మంగళవిగ్రహం బొక్కటే కానంబడుచున్నది. కృష్ణా! నీవెంతసుందరుఁడవు! నీశరీర మెంతకోమలము! నీభూషణాంబరము లెంత మనోజ్ఞములు! ఏల యాలసించెదవు? నీశరీరములైన మా కీ శరీరము లేల?

సీ. కూలుకాయము లేల? ♦ నీలదేహా! మాకు
ఘనఘనాభములైన ♦ తనువు లిమ్ము
కటికుపుట్టము లేల? ♦ కనకచేలా! మాకుఁ
గాంచనాంబరములఁ ♦ గట్టనిమ్ము
వల్లురు లివియేల? ♦ వనమాలి! మాకింకఁ
దులసిమాలల పేరి ♦ తొడవు లిమ్ము
ఛిద్రపత్రము లేల ? ♦ శిఖిపింఛధర ! మాకు
బర్హిబర్హంబులఁ ♦ బడయనిమ్ము
గీ. వెడఁగుపూసలివేల మా ♦ మెడలకింకఁ
గౌస్తుభంబుల నెదలపైఁ ♦ గ్రాలనిమ్ము
కాచభూషలివేల మా ♦ కరములందు
శంఖచక్రంబు లుంచుము ♦ చక్రి! వేగ.

తులసీ! జగత్తు ఈశ్వరస్వరూపము. తన స్వరూపమునఁ దనకు భేదముండదు గాన నిఁక చోరులులేరు బాధయునులేదు. మనము నీలమేఘశ్యాములము. కాంచనాంబరధరులము. వనమాలాలంకృతులము. లేలెండు పయనముకండు.

["ఎవరని నుతియింతురా?" అని, కృతిఁబాడుచు నిష్క్రమింతురు.]

[చోరులు ప్రవేశించి వెదకుట నభినయింతురు]

ప్రథమ—అరే! అన్నా! ఏమిపారేయలేదేంరా!

ద్వితీ—అరే! దేవర్ని నమ్మి, నడ్సుకుంటా తీర్థాలకు పొయ్యే మడ్సులకా దేముంటదిరా?

ప్రథమ—ఎదవడబ్బు డబ్బుకేంగాని, ఆ అమ్మోర్లేందో సదువుతా దండాలు మెడతావుంటే బజన్లు సేత్తాఉంటే నాదేహమంతా పోంగిపోతా ఆళ్ళకూరికే మొక్క బుద్ధగుతుండదిరా.

ద్వితీయ—బలే బాగుండదిరా బజనయీాడ్నే కూకోని యింటాసూత్తాం దాంరా.

కాళి—ఒరే నాగడు, బిచ్చంగా; ఊగుకుంటా రేంరా, తన్నడా వాళ్ళను, బట్టుక తన్నండి.

బిచ్చం—[కాళికాంబవంకకుఁ దిరిగి యసూయతో] ఏండమ్మా; బాపన మ్మోరువుకాదంటమ్మా నీవు. దేవర్ని కొల్చేమడ్సుల్ని కొట్టారం టమ్మా? కావాలంటే నీపదిరూపాయీలు నీవుతీసుకోని కూకో, అరవక పాటలు బజన్లు సూత్తా యినుకుంటా కూకో. [అని రూపా యలు పాఱవైచును.

రాధ—[పాడుచుండును.]

అందఱు—[తాళములు వేయుచుఁ బ్రవేశింతురు.]

కాళి—[చాటునకుఁ బోవును.]

దొంగలు—[పాటవినుచు] ఆనందం ఆనందం! [అని ఆనందమనుభ వించుచు నిష్క్రమింతురు.]

కాళి—[ప్రవేశించి యాశ్చర్యముతోఁ జూచుచు] ఇదేమిటి వీళ్లకేం పొయ్యేకాలం, దొంగలుకూడా భజనచేస్తూ పోతున్నారు. [దొంగ లకు సంజ్ఞచేసి] అయ్యో! [అని కూలఁబడి] యింకేం జెయ్యను, వీళ్ళనెట్లాసాధించను? [విచారముతో శిరముపట్టుకొనియుండును.]

[తెరవాలును.]

ఇది అష్టమాంకము.

# లలిత

## నవమాంకము

[మోహనుఁడు సినీమాకంపెనీవద్ద నాసీనుఁడై యుండును.]

మోహ—[విచారముతో] డబ్బు లేకపోవడంకంటె మనుష్యులకు అదృష్టం వేరేలేదు. నెలకు వెయ్యిరూపాయీలుకూడ నాఖర్చులకుఁ జాలక ఋణపడి జప్తులకు వారంటులకు దట్టుకొనలేక నే నాపట్టణము వదలినపిమ్మటనే నిజముగ నాయదృష్టరేఖ కొంత బయల్పడినది. నాకంటి పొఱ లూడినవి. నామానవత్వం నాకొకింతబోధపడినది. ఏమూలనో సన్ననాడులనుబట్టుకొనియున్న నాబ్రాహ్మణ్యమే నాకుఁ గొన్నిదినము లన్నపానాదు లిడి ప్రాణమునిల్పినది. అప్పుడా సందిగ్ధ సమయము గడచుట నాకుఁజాల కష్టముగ నుండెను, కాని ఆకష్టసమయమే చాలవఱకు నాదురభ్యాసములను మఱపించి నిజముగ నాజీవితమునకు నూతన వికాసము నిచ్చినది. నేను జ్వరపీడితుఁడనై యాసత్రమునఁ జేరినపుడు, అందున్న శ్రీవిశ్వనాథ విబుధేంద్రుని వాత్సల్యము, వారి ధర్మపత్ని యాదరము, వారు నెలదినములు నాకొనరించిన యుపచారము "అతిథిదేవోభవ" అన్న వేదవాక్యము భారతీయులయెడలనే సార్థకమగునని నాకుఁ దోఁచినది. ఆసతీపతుల గోష్ఠివలన, ఆమహాపండితుని భగవద్గీతోపన్యాసశ్రవణమువలనఁ నాకుఁ గలిగిన విజ్ఞానధనమెన్నటికి నశించక నాకిహపరసాధకము కాకుండునా? ఆహా! జలమునంగల సహజమాధుర్యమును చవిటినేలవోలె, సహవాసబలము నన్నెంతవఱకుఁ దెచ్చినది! నాకెన్నివిషయములు మరుగుపఱచినది! నన్నెన్ని

దుష్కృత్యములకు లోఁబఱచినది? అక్కటా, నాయొనర్చిన చెడుచేతలకు మేఱయున్నదా? అవి నేను దలంచుకొనిన మాన వుండనని చెప్పుకొనందగి యుందునా? ఔరా! ఒక్కరూక పుట్టక నెలదినములు శ్రమపడితినే! అట్టి నాకొఱకు సర్వశ్రమలు పడి ముప్పదివేలు ఖర్చుపెట్టి నన్నే ప్రాణముగఁ జూచుకొన్న నా కన్నతండ్రినిఁ గాఱులాడితినే? పుత్త్రప్రీతిచే రైలుకడకు నాకెదురుగ వచ్చిన నా జనకుఁడు నా వద్ద కూరుచుండుట యవమానమని తలంచితినే! కారులో నాసామాను పెట్టించి మిగిలిన నా రకరకాలబూట్సులపెట్టెను, నాపితృదైవము తలపైనెత్తి రెండుమైళ్ళు నడిపించితినే? నాదుర్వ్యయమునకు డబ్బుతెచ్చుట కాలసించెనని సారాయిపోసి మాంసపుముక్కలు వేసి చేఁజేతఁ బ్రహరించితినే? తండ్రీ! రామచయనులు! నన్ను పెంచి పెద్దఁజేసి సర్వస్వము నన్నుఁగాఁ దలంచి నీవుచేసిన మేలునకు, నేనెంత కృతఘ్నుఁడ నైతిని? దైవవశమునఁ బోయిన తల్లితోఁబాటు తండ్రినిఁగూడ కఱవు చేసికొంటినే? ఈ మహాపాపమునకు నిష్కృతికలదా? జనకా! నిన్ను చూడలేక పోతినే? నీసేవఁ జేయలేక పోతినే? పొట్టఁబోసికొనుటకు దారిఁ గానలేక, స్వల్పవేతనమున నీసినిమాకంపెనీలోనొక మానేజరునై పడియుంటినే? నిన్నెప్పుడు చూతును తండ్రీ! నాతప్పులు మన్నింపుమని నీపాదములంబట్టి నిన్నెప్పుడు ప్రార్థింతును తండ్రీ! దాస్యమా! నీవు నా పాదములను బంధించితివా? హా! హతవిధీ హతవిధీ! తండ్రీ రామచయనులు! [అనుచు దుఃఖావేగమునఁ గుర్చీపై సోలును.]

[లోపలినుండి] మానేజరు సాబ్! [అనుచు సేవకుఁడు పిలుచును]

మోహ—[ఉలికిపడిలేచి కనులు తుడిచికొని] కోన్ హైం తూ ఇదరావ్.

జవాను—[ప్రవేశించి] సలామూ లేకుం సర్కార్! ప్రొప్రయిటర్ సాబ్ ఆప్కు లెటర్ దియే కర్కుబోలె?

మోహ—దేవ్

జవా—లేవ్ మహరాజ్! [చీటీనిచ్చి] ఆదాబ్ రాజా ఆదాబ్!

మోహ—ఆదాబ్ ఆదాబ్.

జవా—[నిష్క్రమించును]

మోహ—[నిట్టూర్చి చీటిఁజూచి తలపంకించి] ఈలలితాబాయి యెవరు చెప్పుమా? నిన్న నెవరో క్రొత్తయామె వేషమువేయుటకు వచ్చెనని వింటిని. బాగుగఁ బాడినదఁట. వాసంతి మొదటిపేరు లలితయె! ఆమెయే యైయుండునా? ఆమెను నేను విడనాడినప్పుడు నేఁ బెట్టిన పేరామె మాత్రము ఏల విడనాడకుండును? కాని వినోదమునకైన కుల స్త్రీలకు వేషధారణము వలదని వాదించెడు వాసంతి తనకై తా నీపనికిఁ బాల్పడునా? నావలెనే యామెకుఁగూడ జీవయాత్రకు మార్గాంతరము లేకపోయెనేమో? దుర్భరమగు దారిద్ర్యము, దుస్సహమగు ఆకలిబాధ ఎవరిచేత నేమి చేయింపవు? వాసంతీ! నీ సౌందర్యము నీ సౌశీల్యము నీమధురతర వాక్యములు నీప్రియతమభావములు, నేనెన్నటికైనను మఱువ నేర్తునా? ఆనాఁడు, వాసంతీ మోహనరాయ శబ్దములపై నీవు సల్పిన విమర్శన కంధుండనై నేనప్పుడు తెలియఁజాలకుంటిని గాని వానిలో నెంత విజ్ఞతను జూపితివి? వాసంతీ! నీవినయోక్తుల కన్నింటికి నిప్పుడుకదా నాకర్థము తెలియుచున్నది? ఎంతటి యజ్ఞుఁడను ఎంతటి మూఢుఁడను. గొప్పవాఁడ ననిపించుకొన నెవరేది చెప్పిన నది నిజమనుకొంటినిగాని విమర్శించుకొన లేకపోతినే? ఎవరేది యాచరించినన దినాదనుకొంటినిగాని కొంచెమైనను యోజించుకొనలేకపోతినే? నీవుచెప్పిన హితవును గ్రహింపనేరక వేషము కూడ వేయించితినే? ఏమిదోషము కనిపెట్టి నిన్ను విసర్జించితిని దేవీ! లలితాదేవీ! నీవెక్కడనుంటివో? ఎట్టి యిక్కట్టులపాలగుచుంటివో? నీదర్శనభాగ్య మీజన్మమున దొఱకునా? లేదు లేదు. నావంటి యభాగ్యునకు నీవంటి గేస్తురాలు లభింపనేరదు. కానిమ్ము యజమానుని యాజ్ఞ నెఱవేర్చెద.

[నిష్క్రమించును.]

లలిత—[చిన్నగదిలో నుండి విచారముతో]

దైవము నానొసట నెట్టి చెడువ్రాత వ్రాసెనోకదా? నాయొంటరితనము ఎంతచెప్పినను గులమునుగూడ నమ్మనీయుటలేదే? బాలురకు వృద్ధులకుఁగూడఁ బరిహాసాస్పదనైతినే! ఎవ్వరుచూచినను ఎవ్వరు

పలుకరించినను, ఎవ్వారాదరించినను నాశరీరము నాశించియే. తుచ్ఛ లోకమని లోకమును దూషింతునా? దుష్టదైవమని దైవమును నిందింతునా? వారినేల, యనవలె? నేనుస్త్రీనై పుట్టుటయే నింద్యము. ఒంటిగ స్త్రీలు తిరుగుట, అందును దరుణులు తిరుగుట దేశాచార విరుద్ధము. శాస్త్రవిరుద్ధము. అట్టి నియమవిరుద్ధముగఁ దిరిగెడు నాదుష్కర్మఫలము నే ననుభవింపవలె. ఎంతకష్ట మనుభవించు చున్నను ఎంత ప్రయత్నించినను నాథుని పొలకువకూడ కానరాకుండెనే! ఏమిచేయుదును. ఎచ్చటను గాలుంచుటకు వలనుపడక చిత్త స్వాస్థ్యములేక జీవనోపాధిగానక దైవప్రేరణచేఁ బులులున్నచోటికి మేఁకవలెఇచటికివచ్చితినే? ఈ సినిమావారును స్వేచ్ఛాచారులు. గద్దలకు మాంసముపైననే దృష్టియున్నట్లు, వీరందఱు నాశరీరమునే యాశించుచున్నారు. ఇంక నా గతి యెట్లు కానున్నదో? [విచారపడును.]

మోహ—[ప్రవేశించి] లలితాబాయి యెక్కడ?

లలిత—[శిరమువంచుకొని] అయ్యా! లలితను నేనే.

మోహ—నీవంగీకరించిన వేషధారణమున కేలరాలేదు?

లలిత— అది యిదివఱకే తెలుపుకొంటినిగదా?

మోహ—మీా అర్జీ అంగీకరింపఁ బడలేదు. తప్పక రావలె. వేషము వేయవలె.

లలిత—అయ్యా! ఇచ్చటిపరిస్థితులు అనుకూలములుగ లేవు.

మోహ—[కోపముతో] ఏమైననఁ గానిమ్ము, పత్రికలలో నీపేరు ప్రచురణమైనది; వచ్చితీరవలె.

లలిత—రాఁజాలను; నేనిందుండఁజాలను.

మోహ—అటులైన నీవలన మాకగు నష్టమయిదువందలు తెమ్ము.

లలిత—అయ్యా! నిర్ధనను అసహాయను, ఇయ్యఁజాలను, క్షమింపుఁడు.

మోహ—యౌవనవతివై యొంటిగఁ దిరుగుచు, వేషజీవనము చేయు నీకడ ఆభరణములులేవా? వస్త్రములులేవా? తే తెమ్ము. ఇష్టము మీాద ఇయ్యకున్న సామాను పరీక్షింపవలసి వచ్చును.

లలిత—[దైన్యముతో] అయ్యా! నాకడనున్న వస్తుసముదాయ మంతయు నిదియే, చూడుఁడు [అని సంచిలోని యొకచెంబు, చీర, తుండు గుడ్డ చూపును] ఇంక శరీరముతప్ప నాకడ నేమియులేదు.

మోహ—నిక్కమా, ఇది ?

లలిత—నాచేతఁ జివఱకొక్క రూకయున్నను నేనీ వేషధారణమున కంగీకరింపను. నిజముగ నాకు నేఁటికి రెండుపవాస దినములు.

మోహ—అటులనా ? అయిన నీవిప్పుడే యిక్కడనుంచి వెళ్లుము త్వరగ వెళ్ళుము.

లలిత—[దీనముగ] అయ్యా! అర్ధరాత్రము. అసహాయను. అబలను; ఈరాత్రి యిట నుండననుజ్ఞ వేఁడెద.

మోహ—మాయజమానుఁడు సహించువాఁడుకాఁడు. ఇంక మాటు వల్కిన నేనుగాదు చెపరాసులు పంపివై చెదరు. వెళ్లుము, త్వరగ వెళ్ళుము.

లలిత—[భయకంపములతో] అయ్యా! మీ రెవ్వరో దయయుంచి చెప్పెదరా ?

మోహ—[స్తబ్ధుఁడై నిట్టూర్చి, శిరఃకంపముచేయుచు] నేనిచటి సినిమా మా నేజరును.

లలిత—నా యడుగునది అధికారముకాదు, కులము, పేరు.

మోహ—[ఆకసమువంకఁ జూచుచు] వానితో నీ కవసరమేమి ?

లలిత—కలదు. దయయుంచి చెప్పఁగోరుచున్నాను.

మోహ—చెప్ప వలనుపడదు. వెళ్లుము, త్వరగ వెళ్లుము.

లలిత—స్వామీ ! దీననై యడుగుచున్నాను. చెప్పుఁడు మీపవిత్ర నామ మొక్కమాటు చెప్పుఁడు.

మోహ—ఇప్పుడేల? వెళ్లుము చెపరాసులు వత్తురు వెళ్ళుము.

లలిత—[ఓరగాఁ జూచుచు సంశయభావముతో విచారముతో నిష్క్రమించును.]

ఘోష—[నిట్టూర్చి] తప్పక వాసంతియే. సందియములేదు. వాసంతీ! వాసంతీ! నీకెంత దుస్థితి కలిగినది! అయ్యో! నిశీథమే? యేకాకినియే! ఏమగునోకదా! తీసికొనివచ్చి నాకడనుంతునా? [పోఁబోయి యోజన నభినయించి] కాదు కాదు; ఇట్టి కష్టకాలమునఁ దన నెట్లు కాపాడుకొనునో, యీరాత్రియంతయు నీమెకుఁ దెలియకుండ వెన్నంటియుండెద. యజమానునికడ సెలవుఁదీసికొని పోయెద. [నిష్క్రమించును]

లలిత—[గ్రామమునఁ బ్రవేశించి] ఆ పురుషుని కంఠస్వరమువిన్నను ఆతనిపోలకువ కన్నను, నాకెంతయు నాశజనించుచున్నది. ఆయూరి సత్రమున నున్న విశ్వనాథవిబుధేంద్రుఁడు నాభర్త తనకడఁ గొన్ని దినము లుండెనని; యీ గ్రామమువెళ్లెదనని చెప్పినాఁడని, నాకు శుభదినములు రాఁగలవని చెప్పినాఁడు. ఉదరపోషణమునకై నాపతి యిందే యుండియుండునా? కులనామములడుగ సంశయించెను. నన్నేమైన గుర్తించియుండునా? గుర్తించిన నా యవస్థఁ దిలకించియు, నన్నీ యర్ధరాత్రమున వెడలనడచునా? లేక యింకను దయగలుగకుండెనా? దైవమా! పతికోర్కెఁదీర్పుట పడఁతులవిధియని తలంచి, నాథుని యభీష్టముదీర్ప సంచరించిన నన్నెట్టి యిక్కట్టులఁ బెట్టుచుంటివి? [ముంపుఁజూచి] పట్టణమంతయు మాటుమణఁగినది. [నిట్టూర్పుఁబుచ్చి] అసహాయను, నన్నెవ్వరాదరింతురు. దైవమా! భర్తకుఁగానిదానినిఁజేసి మామగారియండవదలించి తలిదండ్రుల జాడయేనిఁదెలియనీయక యొంటరిదానినిఁజేసి కష్టపరంపరలతో నన్నిట్లింతకాలము బ్రదికింపఁజేసెదవు? [కన్నీరుఁదుడుచుకొని ముందుఁజూచి] ధర్మశాల కాఁబోలు ఇందెవ్వరో చాలమంది శయనించి యున్నారు. ఆహా! యీ పురుషు లెంతటి ధన్యులు. ఎంతనిర్భయముగ శయనించినారు? కానిమ్మొక ప్రక్కనఁ బరుండెద. రాఘవా! నన్ను కాపాడుము. కృష్ణా! గోపాలకృష్ణా! నీవే నాకు శరణ్యము [ధ్యానము నభినయించి కొంగుకప్పుకొని శయనించును.]

[ఇద్దఱు యువకులు ప్రవేశింతురు]

ప్రథముఁడు—అరే యిక్కడేరా పడుకుంది.

ద్వితీయుఁడు—అరే నేనిందాక మాట్లాడిస్తే మొగంచిట్లించుకొని తలు వేసుకుంది. యిప్పుడేం చేస్తుందో? యివతలగానే ఉంది. యిద్దరం ఉన్నాం పరవాలేదులేరా. [నిష్క్రమింతురు]

కూహా—[ప్రవేశించి]ఈయువకు లెవరో వెంటనంటినారు. వీరియుద్యమ మేమగునో చూచెదఁగాక. [ఆవలికేగును]

యువ—[లలితనుబట్టి తెచ్చుచుందురు]

లలిత—అయ్యో అయ్యో! [అని కేకలువేయుచుండును]

[తెరలో ఈలవినఁబడును. యువకు లాగి చూచుచుందురు]

దివాను—అరే కోన్హై రే [అనుచుఁ బ్రవేశించును]

యువ—[లలితను వదలి పాఱిపోవుదురు]

దివాను—[లలితను సమీపించి] హోడమడ్సీ లాగుండావ్ ఎవరుహమ్మా నీవు?

లలిత—[బాధనభినయించుచు] అయ్యా! నేనసహాయను. సత్రముకడఁ బరుండియుండ, నెవరో దుర్మార్గులు నన్నుపట్టితెచ్చిరి. నీమాట విని వారెందో పాఱిపోయినారు. ఆదుర్మార్గుల బాఱినుండి తొలఁగించి యిప్పటికినీవు రక్షించితివి, తండ్రీ!

దివాను—నీఖాడ నగలువుండాయ్?

లలిత—లేవునాయనా!

దివాను—హాయితే, ఆళ్ళకె నీవు హోషక్ ఉండావ్? హంటే నీకీ అళ్లు ఉంచుకున్నార్?

లలిత—అయ్యో! నేనుకులస్త్రీని. బ్రాహ్మణిని. నన్ను అన్యథాతలం పకుము.

దివాను—[లైటుతోఁజూచి] నీవు అబద్ధం సెప్తుండావ్. నీవు మంచి అవరత్ వైతే యింతమంది మగాళ్ళఖాడ పండుకుంటావ్. ధూర్తిరి

హాంతా ఝూటా శెప్తుండవ్; ఇక్డా స్టేషన్ ఖాడీ౯రా. నీకీ యిచా రణా శయ్యావాలె రా.

లలిత—[దైన్యముతో] దైవమా! ఎన్నివిషమపరీక్షలు చేయుచుంటివి? కానిమ్ము [ప్రకా] అయ్యా; వచ్చెదను. [ఇరువురు నిష్క్రమింతురు]

[స్టేషన్ కనబడును]

జవాను—హాడ పడ్కో. యిక్కడికి ఎవ్వర్ని రానియ్యాను. ఇద్దో నాదీ గొంగ్డి, దుప్పటి! హాంతాలీస్కో [అనియియ్యఁబోయి దులిపివేసి] ఇక్డ పండుకో.

లలిత—[దూరముగఁ జని] అయ్యా! నాకేమియు వలదు. ఈరాత్రినన్ను రక్షించిన చాలును.

జవాను—రాత్రి హేమ్మివోయ్. నాఖాడవాలుండిపో! నీకీ శీరల్ కోకల్ అన్నియిస్తాం. నీకీ సేవసేస్తం.

లలిత—[విచారముతో] అక్కటా! దాగఁబోయినచోట దయ్యములా? [ప్రకా] సాహెబుగారు! నన్నుమీరు మీకూతురినిగ భావింపుఁడు.

జవా—[సంతసముతో] హేమ్మి నీకి పెళ్ళికూతురు సెయ్యామంటవ్. అచ్చాఅచ్చా అయితే నీపేరూ హేమీబీయ్ [సమీపించును]

లలిత—[కోపముతో] సాహెబ్! దూరముగనుండుము. ఏమనుకొంటివి? [తీవ్రముగఁ జూచును]

సాహె—[నవ్వుచు] హెంతహెంత కోపంశేస్తే మామీఁద మీకీ హంతహంత యెక్వా దయహున్నదీ హన్నమాట. నాదీ మాటా యింటే నీకీసుఖం సంతోషం ఆనంధం అంతాహుంధి. లేకాపోతే నీకీ కష్టాల్ చూస్కో! నాదీ మహమ్మద్సాబ్ పేరు. సచ్చేదాకా గుర్తుహుండాలి. కోపం హెంద్కువోయ్. మాఖాడ ఖొంచెం కూఖోని మాకీ సంథోషం ఆనంధం తినిపించూవోయ్ [అనుచుఁ జెయిఁ బట్టఁబోవును]

లలిత—[కోపముతో] మూర్ఖా! దూరముగనుండుము. ఏమనుకొంటివి? నీ యజమానునితో చెప్పెదను.

సాహె—ఏమీహంటవ్ నాకీ యజమానుడ్కి సెప్తావ్? నీకీ ఇష్టు చెయ్యిపట్టుకుంటం చెప్పువోయ్. హెవడ్కి శెప్తవ్ సెప్పువోయ్ [అనుచు మీాదికిఁబోవును]

ఇనస్పెక్టరు—[లోపలినుండి] మహమ్మద్ సాబ్. [అనుచుఁ బ్రవేశించును]

సాహె—[ఉలికిపడి] హాజర్ హై ఆదాప్ సర్కార్ ఆదాబ్.

ఇన—ఇంట్లో ఆడవాళ్ళు రైలుకు వెళ్లుతారు రమ్మంటే, రాలేదేం.

సాహె—ఎవడో హాడవాడ్కి దొంగల్ పట్కొనివస్తే హాళ్ళకీ హెల్ల గొట్టి హాడమడ్శికి తీస్కొవస్తున్నా సర్కార్.

ఇన—సరే నేనుచూస్తా; టయిమయింది నీవువెళ్లు.

సాహె—ఆదాబ్ రాజా! [విచారముతో లలితనుజూచుచు వెడలును]

ఇన—సాహెబ్! [ఏదియోచెప్పఁ బనియున్నట్లభినయించి నిష్క్రమించును]

లలిత—దైవమెటులనో యీ యుప్పెనఁ దప్పఁజేసినాడు. ఈశ్వరేచ్ఛ యింకెమికానున్నదో?

ఇన—[మరలఁబ్రవేశించి వ్రాయుటనభినయించి గడియారముదిక్కు చూచి త్రాగుచు] ఎవరు నీవు?

లలిత—అయ్యా! నా పేరు లలిత. నేను బ్రాహ్మణిని.

ఇన—అర్ధరాత్రి యీ గడబిడేమిటి? ఎవడన్నా తీసికొచ్చాడాయేం? నగలుంచాడా? ఏదీ యిటురా [లైటుద్రిప్పును]

లలిత—[శిరము వంచుకొని నిలుచుండును]

ఇన—మా యుద్యోగానికి ముట్లు అంట్లు ఉండవ్ రా ఇటురా చూడాలి.

లలిత—[భయకంపములతో నిట్టూర్చుచు స్వగతము] దైవము మఱల కఠినమైన పరీక్షాపత్రము నిచ్చుచున్నాఁడు. ఇది దుస్సాధము కానిమ్ము దైవమే శరణ్యము. [సమీపించును]

ఇన—[హాండు లైటుతోఁజూచి] ముసుగ్గూడా తీసి కాస్త ముఖం గూడా చూపించు. ఒంటరిగా దిరిగే మనిషివి కాస్త గుర్తుంచుకోకర్లా?

లలిత—[వణఁకుచుఁ గొంచెము ముసుఁగుదీయును]

ఇన—పూర్తిగా ముసుఁగుదీసి కాస్త ముఖం యెత్తు. పోనీ నేనెత్తనా? [లేచి సమీపించును]

లలిత—[వణఁకుచు వెనుకకుఁ జనును]

ఇన—[లైటుఁద్రిప్పి చూచుచు] ఫార్సబుల్ ఎంగ్ గరల్సు. నీకేం ఈమాత్రముంటేనా ? ఓ! యెవఁడైనా ఆశిస్తాడు ? సరే కాని అయితే నీవు, ఆంగ్లో యిండియన్ లేడీ వన్నమాట ? ఎంత కొంచెం బ్లాకు (నలుపు) కాకపోతేనా ? అక్కడి అసలురకం పారీసులేడీవి అనుకోవాల్సిందే ?

లలత—[దైన్యముతో] అయ్యా! మీ రధికారులు. అందఱిని బిడ్డల వలెఁజూడవలసినవారు; ఇష్టమువచ్చినట్లు మాట్లాడుట న్యాయము కాదు. నేను బ్రాహ్మణిని కులాంగనను అన్యథాతలంపకుఁడు.

ఇన—[సిగరెట్లు త్రాగుచు సవిలాసముగఁ జూచుచు] ఐతే నేను కూడ బ్రాహ్మణ్ణే. నీ కులం వాణ్ణి. మా వాళ్ళిప్పుడే పురిటి కెళ్ళారు. ఇల్లు ఖాళీ; నాకు నెలరోజులు సెలవు. మనం సుఖంగా, హాయిగా యథేచ్ఛగా ఉందాం. చెయ్యికాల్చుకోకుండా హోటల్నుంచి జవానుచేత అన్నం తెప్పిస్తా. ఇదే యిల్లు, వెళ్దాం రా. [ముట్టుకొనఁబోవును]

లలిత—[వెనుకకుఁబోయి బ్రాహ్మణుఁడవు. అధికారివి. పరస్త్రీ నిటు లాడఁగూడదు. ముట్టఁగూడదు. నీయింటికి వచ్చుదానను కాను. నీ యిష్టానుసారము ఉండుదానను కాను.

ఇన—[వికటముగా నవ్వుచు] ఏమీ? ఉండుదానవు కావుగా? అంతా నీయిష్టమే? నేనెవరినో తెలుసునా? [సరాళించుచు] అధికారిని. ఇనస్పెక్టరును. రాకపోతే బేడీలువేసి తీసుకొనివెళ్తా. [సగర్వముగ మీసము దువ్వుచుండును]

లలిత—[బొమలు ముడిచి శిరఃకంపముచేయుచు] అర్ధరాత్రిమున అనద లైన స్త్రీలను జెఱఁబట్టుటయా ? నీ యుద్యోగము. ఉత్తమాంగన

ప్రాణహానికైన నోర్చునుగాని మానహాని కోర్వదు. ఇంక మితి మీరక పొమ్ము. అవలకుఁ బొమ్ము. [తీవ్రముగఁ జూచును.]

ఇన—నా ఉద్యోగాన్ని కూడ తిరస్కరిస్తున్నావుగా! కానిమ్ము నీ కిప్పు డెవ్వరడ్డమో చూచెద! [చేయిఁబట్టుకొనును]

లలిత—ఆఁ! ఆఁ! అని [చెయ్యి విదల్చికొని కోపముతో] ఓరీ! తుచ్ఛా! నీచా! అధమాధమా! పొమ్మావలకుఁ బొమ్ము.

ఇన—[కోపముతో] ఏమీ నీగర్వము [పండ్లుగీటుచు] అదేపనిగ నీవంటి పొగరుబోతు ఆడవాళ్ళ ననేకుల వంచించిన యీ వీరభద్రరావు నకు నీవొక లెక్కా? చూడుమిప్పుడే తెచ్చి బేడీలువేసెద. నీ కెవ్వ రడ్డుపడెదరో చూచెద [కోపముతోఁ జూచుచు బేడీలకై వెళ్లును.]

లలిత—[దుఃఖముతో] అయ్యో! ఇంకేదిగతి! ఓభరతమాతా! తండో పతండములుగ మహాపతివ్రతా కల్పలతలతో విరాజిల్లిన నీవిప్పు డిట్టి దురాత్ముల మూలమున నీ యౌన్నత్యమును గోల్పోయెదవా? తండ్రీ! మాధవశర్మా! సకలధర్మాచరణపరాయణుండవగు నీప్రియ పుత్రిక లలిత పరాభవింపఁ బడుచుండ నూరక చూచుచుండెదవా? జనకా! ఎట్టికష్టము వచ్చినను శరీరము వదలవలదని యాజ్ఞాపిం చితివే? యీ దుర్మార్గుఁడవమానింప సిద్ధపడుచుండెనే! యింక నేనెట్లు బ్రతుక నేర్తును? తల్లీ! రాధాదేవీ! పరమపతివ్రతవు. మహాభక్తు రాలవు. అట్టి నీగర్భపేటికఁ దొమ్మిది మాసములు నివసించి, నీ పవిత్రహస్తములచేఁ బెంపఁబడిన నీముద్దుపట్టి యధోగతికిఁ బోవు చుండ నీ వుపేక్షించెదవా! నాథా! ప్రాణనాథా! మురహరిశర్మా! నిన్నుతప్ప నితరులఁగన్నారఁ జూచియెఱుఁగనే! మనంబునఁ దలచిఁ యెఱుఁగనే! అట్టి నీయర్ధాంగి యర్ధరాత్రమున ననదయై, దీనయై యసహాయయై, యొక్కయధమాధమునిచేఁ బరాభవింపఁబడుచుండ నీవు రక్షింపరావా? నాయందు దయలేకున్న నాతుది నమస్కార ములుగైకొని నీసేవాఫలమును నాకు సాయముగనిమ్ము. [నమస్క రించి] రామచంద్రా! రఘురామ! ఆర్తార్తిహరుఁడవు. నీవెక్కడ

నుంటివో త్వరగరమ్ము. నీభక్తురాలిని రక్షించుము. నీపాదరాజీవము లనే నమ్మితిని. నన్నీదురాత్ముని బారినుండి రక్షించి నాగౌరవ మునుగాపాడుభారమంతయునీదే! నీదే! [కనులుమూసి ధ్యానము నటించును.]

ఇన—[ఉద్వేగముగ బేడీలతో వచ్చి] ఇష్టమువచ్చినట్టు కాఱులాడె దవా? పట్టుము చెయ్యిబట్టుము. [మీఁదికిఁబోవును]

లలిత—[భయకంపితయై] రామచంద్రా! దయానిధీ! కృష్ణా! శ్రీకృష్ణా! [అనుచు దిక్కులు చూచును.]

ఇన—[కోపముతో] పట్టుము. చెయిపట్టుము. [అనుచుఁజేయిలాగఁ బోవును.]

లలిత—[తప్పించుకొని] రామా రామా! రమ్ము శీఘ్రముగ రమ్ము! [భయకంపితయై దిక్కులు చూచుచుండును.]

ఇన—[వెన్నంటి] ఎక్కడికి పోగలవు? నీకడ్డుపడువారెవ్వరులేరు. పట్టుము. చెయిఁబట్టుము[ అని మీఁదికిఁ బోవును]

లలిత—[చెయిఁ దప్పించుకుని కురులువీడ నొడలుపెంచి కటములదరఁ బండ్లుగీటుచు] ఓరీ దుశ్శీలుఁడా! ఏమిసేయ నుంకించుచుంటివిరా? నా పాతివ్రత్యము నన్నుద్ధరింపకపోవు ననుకొంటివా? నా లలితా నామము సార్థకము కాదనుకొంటివా? పెద్దలకడ లలితను. తలి దండ్రులకడ లలితను. భర్తకడ లలితను. ఇంక నీ యట్టి వనితా వంచకులకడ, లోకద్రోహులకడ ఈలలిత సాక్షాల్లలిత, కాళి, మహాకాళి, మారి, మహామారి, భైరవి, ప్రచండభైరవి, మహిషా సురమర్దని, సకల జగద్విలయస్వరూపిణి, [ఒడలుకంపింప బీభత్సముగా] దురాత్మా! రమ్ము [పిడికిలిపట్టి] ఈ పిడికిటఁ బొడిచెద, ఈ నఖముల వ్రీల్చెద, ఈకాలఁదన్నెద, [అనుచు బీభత్సముగా నిలుచును] రమ్ము, దురాత్మా! రమ్ము.

ఇన—[నిశ్చేష్టుఁడై] ఏమిా! ఏమి రూప మిది? [వణఁకుచు బేడీలు వదలును.]

మోహ—[ప్రవేశించి] వీరభద్రుఁడా! ఇంక నీ ప్రతాపమును గట్టి పెట్టుము. త్రాఁగుబోతుతనముతోఁ బాటు, పరస్త్రీలభంగపఱచుట గూడ నభ్యసించితివా? నేను మోహనుఁడను. ఈమె నా భార్య లలితా దేవి.

ఇన—[నిర్విణ్ణుఁడై] ఏమీ, మానేజరు మోహనరావుగారా? గుడ్ నైట్, గుడ్ నైట్. రాత్రిపూట జవానుతీసుకొస్తే కాస్త విచారిస్తున్నా, పంతులుగారు! ఎక్స్క్యూజ్ చెయ్యాలి, కాని యీమె చాల యోగ్యురాలు.

మోహ—మీ సర్టిఫికెట్టక్కరలేదు. వెళ్లు, ముందవతలికి వెళ్లు.

ఇన—పంతులుగారు! క్షమించాలి. ఎవరో అనుకొని స్వభావం చూతామని కాస్త ప్రయత్నించా. కాని, మీవిషయం యేదో వున్నట్టుంది, నిన్న పేపరు చూచారాండి?

మోహ—పేపరు గీపరు! వెళ్ళండి. మీపని మీరు చూచుకోండి.

ఇన—సరేలేండి. నయము, భయము, అన్ని మాకుండాలె. యేం అనుకోకండి. [నిష్క్రమించును.]

మోహన—[లలితను సమీపించి]లలితా దేవీ! దుష్టసంసర్గమునకు లోనై కులాచారముల మఱచి స్వేచ్ఛాచారినై నీ యీ కష్టములకెల్లఁగారణభూతుఁడనైన పరమ చండాలుఁడను. మోహనుఁడను. నన్ను సంహరించి భూభార మపనయింపుము [అని పాదములపైఁ బడును]

లలిత—[కోపమడఁచుకొని భర్తను లేవఁదీసి యాశ్చర్యముతో] ఎవరది? [అనిచూచి దుఃఖముతో] నాథా! నాథా! నన్నీ దురాత్ముని బాఱినుండి రక్షింపుము. నన్నుఁ గరుణింపుము. [భర్తపాదములఁ బట్టుకొనును]

మోహ—[భార్యను లేవఁదీసి, శిరము నిమురుచు] దేవీ! ఊరడిల్లుము,

లలిత—నాథా! నాథా! నరచండాలుఁడు. మానభంగము. రక్షింపుము. నన్ను రక్షింపుము. [అని కౌఁగిలించుకొనును]

మోహ—[లలిత వెన్నుతట్టుచు] దేవీ! నీ సౌశీల్యమే నీకు వజ్రకవచమై దివ్యాయుధమై విరాజిల్లినది. సీత, సావిత్రి మున్నగు పతివ్రతామ

తల్లులతోఁ జేర్పఁదగిన నీవు, నా ప్రాణకాంతవగుటకంటె నాకు వేఱు భాగ్యమున్నదా? తలిదండ్రులు పెట్టిన నీ లలితానామమును సార్థక మొనరించుకొనిన ధన్యచరితవు. నామూలమున నీవెన్ని యిక్కట్లను భవించితివో. నాయపరాధముల మన్నించుము. [ప్రణమిల్లును]

లలిత—[చేతులుపట్టి] హృదయేశ్వరా! మీరిట్లు సేయఁదగదు. నా యదృష్ట వశమున శ్రీరాముని వాత్సల్యాతిశయమున శ్రీ కృష్ణుని యనుగ్రహ విశేషమున మీదర్శన భాగ్యము లభించినది. నాయప రాధమున్న మన్నించి మీ చరణసేవకురాలినిఁగాఁ గైకొనఁ బ్రార్థించెద.

మోహ—ఆహా! ఏమి యీ సుకృతపరిణామము!

ఉ. ఆటల బాటలం గలిపి ♦ యాకృతినంతయు మార్చివేసి యా
నాటకశాలలోపలను ♦ నర్తకిఁగా దిగనాడి వచ్చితీ
పాటికి భ్రష్టశీలవయి ♦ వమ్మయిపోతి వఁటంచునెంచ నీ
నాఁటికిఁ బుణ్యమూర్తివయి ♦ నాతి! కనంబడి తెంతభాగ్యమో?

[భార్యచేతులు తనకంఠమున వేసికొని] ఆహా! నా భాగ్యనిధి, నా యదృష్టదేవత, నా కల్పలత నన్ను చేరినది. నేను ధన్యుఁడను. నేను మాన్యుఁడను. [ఆనంద మభినయించుచు నొడలు దువ్వుచు] ప్రియసీ! ఇంతకాల మిట్టిబాధలతో నీవెట్లు జీవింపఁగలిగితివి? ఎట్లు రాఁగలిగితివి?

లలిత—ఆర్యపుత్ర! మామగారు మీకొఱకుఁ దెచ్చిన ఐదువందలరూప్య ములు దయచే నాకొసంగిరి తమకు వారంటువచ్చినదని యజ్ఞం గారివలన విని నాలుగువందలు తమకంపితిని.

మోహ—[ఆశ్చర్యముతో] ఎవరిచేతఁ బంపితివి?

లలిత—ఆ యజ్ఞంగారిచేతనే.

మోహ—దేవీ! యజ్ఞానికిచ్చితివా?

లలిత—అవును!

మోహ—ఓరీ! మిత్రద్రోహీ! ద్రవ్యమును హరించుటయేగాక, మమ్మెడబాపుటకుఁగూడ నీవే కారణమైతివే? ఎంతద్రోహివి! ఎంత

దుష్టుడవు! నిన్ననసేల? నా యవివేకమే యిన్నికష్టములకుఁ గార ణము, కానిమ్ము, తరువాత?

లలిత—మీదర్శనమునకై బంగాళాలో మూఁడుదినములు నిరీక్షించి అందెవ్వరో టిక్కట్లమ్ముచుండ శ్రీరాముని నమ్మి మీపేర రెండు లాటరీ టిక్కెట్లువేసి గ్రామైకరాత్రముగ మీజాడలరయుచు విశ్వ నాథశాస్త్రిగారి వలన మీక్షేమము తెలిసికొని ఇప్పటికిట్లు మిమ్ము చూడఁగంటిని.

మోహ—ప్రేయసీ! నీసౌశీల్య మసమానము. నేను జేయించిన వివిధ భాషాసేవయే నీకింతటి విజ్ఞానమొదవించిన దని తలంచెద.

లలిత—నాథా! పట్టభద్రులం జేసి, పదవుల నిచ్చు మీభాషాసేవ మీబోంట్లకే భారతీయ విజ్ఞానమును గలిగింపకున్న, మధుకరాన్న మువలె నేదియు సంపూర్తిగాక కొంచెము కొంచెముగు నీబహు భాషాపఠనము నాకు విజ్ఞానమును గలిగించునా? పతనశీలములగు రక్తవాహినుల మరలించి నా హృదయధ్వజమును బంధించి, మఱల మీదయకుఁ బాత్రురాలను గావించి నన్నుద్ధరించినది శ్రీరా మాయణ మహాకావ్యపఠనము, సాధుశీలు లగు మా జననీజనకుల సేవ యని నిశ్చయింపుఁడు.

మోహ—నిజము. నిజము. నే నవివేకినయి తిరుగుటయే గాక నిన్నుఁ గూడ నేనెన్నియో దుష్కార్యములఁ బ్రవర్తింపఁజేసితిని. అట్టి నా యపరాధములను మన్నింపుము. [అని బతిమాలును.]

లలిత—[చేతులు పట్టి] ఆర్యపుత్రా! అట్లనకుఁడు. అది యంతయు దుష్కర్మఫలము. ఆ చెడుకాలము పోయినది. ఇపుడు నా సుకృత ములు ఫలించినవి. కాని మామగా రెందయినఁ గనుపించిరా?

మోహ—లేదుఁ లేదు అట్టి యదృష్టమే కలుగలేదు. ఇప్పుడు నాకల్లఁ గ్రమ్మిన దుర్వ్యామోహపుఁ బొరలన్నియు వీడినవి. ఎందుండెనో విచారించి మునుముందు మా తండ్రిగారిని దర్శించెద.

లలిత—పిమ్మట కర్తవ్యము?

మోహ—ఇప్పుడేమియు దోఁచుటలేదు. తరువాత విచారించెద,

లలిత—ఆర్యపుత్రా! ధర్మమునువదలి, జాతిమత దూరగులమై ఐహిక వాంఛాప్రవాహములఁ గొట్టుకొనిపోవుట మానవధర్మముగాదు.

మోహ—ఐన నేమిచేయుమందువు?

లలిత—కేవలము పొట్టనింపుకొనుపని మనకే కాదు. సర్వజంతు సామాన్యము. మానవులమై సత్కుల ప్రసూతులమై, విద్యావంతులమై నమీరు చేయఁదగినపని ఆత్మోద్ధరణము, దేశోద్ధరణము.

మోహ—అదియెట్లు చేయనగును?

లలిత—ఆంగ్లవిద్యాపారంగతులమై జీవనోపాధి నెఱుగక మిగుల వెతలఁ బడు దేశీయసోదరుల నుద్ధరించు మార్గమును యోజింపుఁడు.

మోహ—లలితా! నన్నుద్ధరించుకొను మార్గమునే నేనెఱుఁగకుంటినే, ఇది యెట్లు సాధ్యమగును?.

లలిత—ఆర్యపుత్రా! మీరు లోకోద్ధరణ దీక్షితులుకండు, న్యాయ మార్గ ప్రవర్తకుఁడగు శ్రీరామచంద్రునకుఁ జంచల స్వభావము లగు వానరములు సైతము తోడ్పడెనే. ధర్మతత్వగులగు మీకు మానవులు తోడ్పడకుందురా? దేశీయప్రభువులకడ కొంతభూమిని సేకరించి యందొక యాశ్రమము స్థాపించి జాతీయవృత్తుల నభివృద్ధి నొందించి ప్రజల దాస్యజీవనవిముఖుల నొనరించి ధర్మమార్గ ప్రవర్తకులఁ గావింపఁ బ్రయత్నింపుఁడు. మనకు భక్తవత్సలుండగు రామచంద్రుఁడు తోడ్పడఁ గలఁడు. చేయుఁడు, ఆప్రయత్నము చేయుఁడు.

మోహ—లలితా! నీవు నన్నజ్ఞాన కూపమునుండి బయటికి తీసితివి? విజ్ఞానమేరునగ మధిరోహించుటకు మార్గమును చూపితివి. నాకును నీ రామచంద్రుఁడే తోడ్పడఁగలఁడు. మునుముందు బ్రాహ్మణ్యమును శుద్ధిఁజేసికొని, నీ యుపదేశ మంత్రము ననుష్ఠించి కర్మయోగ సిద్ధుఁడనై, ధన్యుఁడ నయ్యెద. పరభాషా వేష వ్యామోహ పీడితులై, పరధర్మాభిరతులైన, ఓ భారతీయ సోదరులారా! నా యీ వాక్యములు శ్రద్ధ తో నాలకింపుఁడు.

మ. కులగోత్రంబులు వీడి బ్రాహ్మ్యమును గాకుంజేసి యిల్లాలి నిం
దలపాల్సేసి యనుంగుతండ్రితల రక్తంబోడ్చి చీ యంచు లో

కులు నవ్వం జరియించు నన్ గనిన మీ•కుం జెప్పఁగానేల శ్రీ
కలితంబైన స్వధర్మ రక్షణము నా•కాంక్షింపరే సోదరుల్.

లలిత — ఆర్యపుత్రా! ఇట్టి కర్మదీక్షా బద్ధకంకణులగు మీకుఁబర మేశ్వ
రుఁడు తోడ్పడఁగలఁడు, ఇంక సంపూర్ణోత్సాహమున సహధర్మచారి
ణీత్వమును సార్థక మొనరించుకొనియెద. మాతలిదండ్రుల జాడకూడ
తెలియకున్నది. కార్యతత్పరులమై పుణ్యక్షేత్రములఁ జూచుచు
పోవుదము. దాస్యమేల? ఇంక మీయుద్యోగమునకు స్వస్తిచెప్పుఁడు.

మోహ — మంచిది. అటులనే గావించెద రమ్ము పోదము. [అని
పోఁబోవుదురు.]

ఇన — [ఆశ్చర్యముతో వినుట నభినయించుచు సవినయముగ సమీ
పించి] పుణ్యదంపతులారా! మానవసేవకై ప్రయత్నించు మీ
యుద్యమము మిగుల ప్రశంసనీయము. మీసౌజన్యమునకు మీధర్మ
దీక్షకు ఇదే నమస్కరించుచున్నాను. మీకు దైవము తోడ్పడినాఁడు.
మురహరిఅను మోహనరావుగారికి లాటరీలో ఇరువదివేల రూప్య
ములువచ్చినవి, ఇదుగో చూడుడు, పత్రికచూడుఁడు, [అని మోహ
నునకిచ్చును].

మోహ — [చూచి ఆశ్చర్యముతో] లలితా! ఇదియంతయు నీవు వేసిన
లాటరీ చీట్లకు ఫలితము. నీయోగ్యత నెంతయని కొనియాడుదును?

లలిత — ఇదియంతయు ఆ రామచంద్రుని యనుగ్రహవిశేషమే! రాఘ
వుఁడు సత్కార్యాచరణమునకు ప్రోత్సాహ మొసంగినాఁడు. ఇంక
దైవమే మనల నుద్ధరింపఁగలఁడు రండు పోదము. [అని నిష్క్ర
మింతురు.]

ఇది నవమాంకము

# లలిత

## దశమాంకము

[మాధవాశ్రమప్రాంతమునఁ గాళికాంబ ప్రవేశించును]

కాళి—ఎలాగో ప్రాణాలతో తులసీ రాధ లిక్కడికి చేరారు. చీకు పోయి చేవబట్టినట్టు అగ్రహారంకంటే మాధవశర్మకీ ఆశ్రమమే బాగుందే! ఎట్లా వీడిపాతమార్చటం. వీడు చచ్చాడో, రామప్ప రాగ్రహారంలో రాజ్యమేలానన్నమాటే! అందర్ని దాసానదాసుల్ని చేశానన్నమాటే? దుర్యోధనుఁడు లక్కయిల్లు కాల్చినట్లు వీళ్లతో పాటు ఆశ్రమానికాశ్రమం అమాంతంగా కాల్చేశ్తామనుకుంటే, చదువుకునేవాళ్ళు సంధ్యవార్చేవాళ్ళు వచ్చేవాళ్ళు పొయ్యేవాళ్ళు; రాత్రీపగలూ తెరపివుంటేనా? [తలయూచుచు] కానీ! దీనికదేమందు. [ముందుఁజూచి] ఓహో! భాష్యాలేడ్చి కామాల్సు బయటికి వస్తున్నాడు. ఇవ్వాళ మృత్యుముఖంలోకే రావటం. ఇంక ముష్టికి పోతాడు. అదేదారి. కోనేటిదగ్గర చెట్లగుంపులోకూర్చోని బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తా. దాంతో మాధవయ్యమరణం కళ్ళచూస్త. [అటునిటుఁజూచి] అడుగో చెప్పినట్లు పాములవాడు వస్తూనేయున్నాడు. వాడిదగ్గర కొత్తపామునుకొని కోరిక నెరవేరుస్తా. మంచివాళ్ళను మంచిచేతనే సాధించాలి. [నిష్క్రమించును]

[ఆశ్రమప్రాంతమున మాధవశర్మ జోలెపళ్ళెములతో
ప్రవేశించును]

మాధ—ఈశ్వరుఁ డెంత కరుణామయుఁడు! నమ్మి సేవించినవారి నెన్నఁడును వ్యర్థులఁ జేయఁడు. నిరాశ్రయుఁడనైన నాకెట్టి యాశ్రయము కల్పించినాఁడు. దేవ దేవా, శ్రీ కృష్ణా! నీప్రభావ మమేయము.

సీ. పాపౌఘములఁ బటా♦పంచలుగావించు
కృష్ణాతటినిఁ జెంత ♦ గెరలుచుండ
విధ్యుక్తకర్మల ♦ వెరవెఱింగియొనర్చు
సజ్జను లేప్రొద్దు ♦ సరసనుండ
అంబా! యటంచన్న ♦ నార్తిదీర్చెడు
తల్లి చాముండ సదయయై ♦ సాఁకుచుండఁ
గేలుమోడ్చినయంతఁ ♦ బాలించుతండ్రియ
య్యమరేశ్వరుఁడు ప్రేమ♦నరయుచుండఁ
తే. గీ. త్యాగమూర్తులు పౌరులీ♦యాశ్రమాభి
వృద్ధిఁ దలఁదాల్చి పెంపుగా♦వించుచుండఁ
బ్రీతిఁ బుణ్యాంగనలు భిక్ష♦వెట్టుచుండఁ
గడచుఁగాలంబు హరికృపఁ♦దడవవశమె?

ఆహా! అనతికాలములో నరువదివేలరూప్యము లయాచితముగ నొడఁగూడుటయు, నరువదిమంది విద్యార్థులకు, నార్వురు పండితులకు నిరంతరావాసము, నిరతభోజనము, నిచ్చోటలభించుటయా? దేశమాతా! నీవు ధన్యవు. నీపుత్త్రులు దానవీరులు. ధర్మవీరులు. అట్టిదేశీయ సోదరులెల్లరు భారవాహకులై యుండ, వివేకధనులగు వివేకానందాదులు భారతీయ విజ్ఞానమున విదేశీయులఁగూడ వివశులఁ గావించి యుండ, స్వదేశమున స్వమతవ్యాపనమున స్వధర్మ రక్షణముఁ గావింపనేరకుందుమా? కొలఁదిదినములలో మా కృష్ణుఁడు రావచ్చును. వానిపై నాశ్రమ భారముంచి దేశ ప్రసిద్ధములగు ప్రదేశముల ధర్మసంఘముల నెలకొల్పెద. [యోజన నభినయించి నిట్టూర్చి] భగవానుఁడా! సత్కార్యాసక్తునిఁ జేయుచున్నందుల

కెంతయు సంతసించుచున్నాను. కాని యిట్టి ప్రపంచ వాసనలను గూడఁ బోఁద్రోలి నన్ను సర్వబంధ విముక్తునిఁ జేయుము. దేవ దేవా! నీవు నా హృదయాధివాసివై యుండ నన్నెయ్యది యేమి చేయఁగలవు.

గీ. మొదలునుం గొమ్మ లాకులు♦పూలు పండ్లు
భిన్న భిన్నంబులుగ నున్న♦బీజ మొకఁడె
యఖిల కారణమై బ్రహ్మ♦మలరుచుండ
బహువిధంబైన జగమేమి♦బాధకంబు ?

కంటికిఁజూపు, నాలుకకు రుచి, శరీరమునకు స్పర్శము, చెవికి శబ్ద గ్రహణము, మనస్సునకు స్ఫురణ మెద్దాని వలనఁ గలుగు చుండునో యట్టి యాత్మస్వరూప మొక్కటియే సకలజగత్కల్పనాధిష్ఠానమై ప్రకాశించుచుండ ముక్తి యనన్యాపేక్షమనుటకు సంశయ ముండునా? లేదెన్నఁటికినిలేదు. కావున శరీరేంద్రియ ధర్మములకు వశ్యుఁడనుగాక సాక్షిమాత్రుఁడనై సంచరించుచుండెద. [నిష్క్రమించును.]

కాళి—[మార్గమునఁబ్రవేశించి పెట్టెనుచూచుచు] కుదిరింది చక్కగా దేవుడిపెట్టెలాగ కుదిరింది. దీనికి పూలదండకూడా చుట్టి సరీగా దారిలో వుంచుతా. పైన పాలు లోపల విషముగల కుండవలె నిది మాధవశర్మకు భ్రమకల్పించి మడియింపకమానదు. అదుగో వస్తు న్నాఁడు [అని దారిలోఁ బెట్టెనుంచి చాటునకుఁ బోవును.]

మాధవ—[వచ్చుచుండఁ బెట్టె కాలికిఁ దగులును] ఏమిది? [అని చూచి యాశ్చర్యముతో] పుష్పమాలాలంకృతమై దేవునిపెట్టెవలెనున్నదే! ఇది యిచ్చటికెట్లువచ్చినది? ఎవ్వరయిన నిందుంచియుందురా? లేక యెవరిచేతినుండియైన జాఱియుండునా? కానిమ్మిం దేస్వామి వెలుఁగొందుచుండెనో చూంచి నమస్కరించెద. [అని పెట్టెను దెఱువఁ బాముకాటువేసి పరువిడును. [మాధవశర్మ చూచుచు సంభ్రమించి నిర్విణ్ణుఁడై] ఔరా! ఎంత మోసము. భక్తివ్యాజచేఁ బాముపెట్టెను గొఱికిన యెలుకవడువున, దైవభ్రాంతి నన్నీస్థితికిఁ దెచ్చినదే.

[గుడ్డపేలికఁజుట్టి] ఆశ్రమమునకుఁ బోదునా? అందును విషవైద్యు లెవ్వరునులేరు. ఏమగునో? గ్రామమునకే పోయెద? దీనికి వితర్క మేల? దేహ మెప్పు డయినను బోవలసినదే. ఈశ్వరధ్యానమునఁ గాలినిఁగడుచు సర్వమునుజూడని పరీక్షిత్తువడువున నేనును దేహ భ్రాంతివిరహితుఁడనై యుండెద.

*శ్లో॥ "నాహం దేహో నేంద్రియాణ్యంతరఙ్గం
నాహంకారః ప్రాణవర్గో న బుద్ధిః
దారాపత్య క్షేత్రవిత్తాతిదూరః
సాక్షీ నిత్యః ప్రత్యగాత్మా శివోహమ్"

[అనుచు నిష్క్రమించును]

కాళి—[మెల్లగఁజూచుచు] భలే! నా ప్రయత్నము నేటికి నెరవేరింది. ఇంకవీడు విషము తలకెక్కి చావకపోడు. కానిమ్ము. ఏమిజరుగునో చూచెద. [ముందుకునడచి, పరికించి] ఎవరువీరు? లలితా మురహారులు, రామచయనులువలె నున్నారే? వీరి నీట్లుగోట్లు అన్నిపోయి మూసివాయినం ముత్తైదువలాగ లలిత, తద్దినాలు పెట్టించే బ్రాహ్మ ల్లాగ వీరూ తయారయినారేం? రానీ పాపం ·మాధవయ్యశవా న్నయినా కళ్లచూస్తారు· [నిష్క్రమించును]

[పురప్రాంతమున లలితా మురహారులు, వెనుక రామచయనులు వచ్చుచుందురు]

మురహారి—లలితా! కృష్ణాతీరము, అమరేశ్వరాలయము, ఈ పురమెంతయు మనోజ్ఞముగ నున్నది. పూర్వము ప్రభువు లెంద ఱెందఱో యుండుండెడివారని ప్రసిద్ధి.

లలిత—కనుకనే యీ పురప్రాంతమున మాతండ్రిగారు ఆశ్రమస్థాపన మొనరించి యుందురు.

మురహారి— అదియే కారణమై యుండును. [వెనుకఁజూచుచు] నాన్న గారు! [అని పిలుచును]

---

* శ్రీ శంకర భగవత్పాదులు.

రామచ—వస్తూన్నానయ్యా, వస్తూన్నాను. [అనుచు వచ్చుచుండును.]

ముర—[ముందుఁజూచి బాలునితో] ఎవరువీరు? గుంపులు గుంపులుగ వచ్చుచున్నారు?

బాలుఁడు—బారిష్టరు పరీక్షకై పోవు మిత్రుని పంపివచ్చు స్కూలు స్నేహితులు.

ముర—అటులనా? పడమరగాలి పట్టణములనే గాక పల్లెలను మూల మూలలనుగూడ కలఁచివైచు చున్నదే? విద్యార్థి సోదరులారా! రండు, రండు, ఇటురండు.

విద్యార్థినీ విద్యార్థులు—[ప్రవేశించి] ఎందులకు?

ముర—ఆంగ్లకళాశాలల కేకాక బారిష్టరుపదవికనిపర దేశముల కేగుటయు అట్టివారిని మీరు ప్రోత్సహించుటయునా?

1 విద్యార్థి—ఏంజెయ్యాలె? మరి బ్రతకటమెల్లా?

ముర—ఆంగ్ల విద్యోపాసకుల స్థితి గతులు చూచియు మీ రింకను ఆ విద్యకై యల్లాడుచు, అదిలేకున్న బ్రతుకు లేదనుచుంటిరే? ఏమి చెప్పవలె?

2 విద్యార్థి—మీరు చెప్పింది నిజంగానే వుంది కానీ యేం జెయ్యాలో తోచకుండా వుంది.

[తెరలో]—అయ్యో! హత్య! హత్య! నరహత్య! యోగిగారు! రండి దయచేయండి మా స్నేహితుణ్ణి బ్రదికించండి. [అని యాతురతతో నొకఁడు ప్రవేశించును]

అందఱు—[సంభ్రమింతురు]

ముర—[విద్యార్థిని సమీపించి] అయ్యా! మీ మిత్రునకేమయినది?

విద్యార్థి—కృష్ణయోగిగారు! శీఘ్రంగా దయచేసి విషబాధఁ దొలగించి మా ఫ్రెండును బ్రతికించాల్నండీ, రండి దయచేయండి [అని చేయి పట్టుకొనును]

ముర—మీ మిత్రునిఁ బాము కఱచెనా?

విద్యార్థి—పాముకాదు. మావాడు విషంతిన్నాడండి; చాలా బాధపడు తున్నాడండి; త్వరగావచ్చి రక్షించాల్నండి; దయచేయండి!

లలిత—విషము తినిరియెనా! అయ్యో! అదిఎంతయుఁ బ్రమాదమె!

మురా—అయ్యా! నేను కృష్ణయోగినిగాను, కాకున్నను వచ్చి యాత్రనికి వైద్య సాహాయ్యము చేయింతును రండు పోదము [అని పోఁబోవును]

మఱియొకఁడు—[ప్రక్కకుఁజూచుచు] అయ్యా! అక్కడ యెవరో యోగిగారు వచ్చి యేదో చేశారు, కళ్లు తెరచి లేచాడు ఫరవా లేదు అతన్ని ఇలాగే తీసుకొస్తున్నారు. ఉండండి.

[అంతట విషగ్రాహి నిర్వురు పట్టుకొని వత్తురు]

అందఱు—[సమీపింతురు]

విషగ్రాహి—దాహము [అని సంజ్ఞచేయును]

మురా—[సంచిలోనుంచి పాత్రనుదీసి] త్వరగ జలము కొనిరమ్మా [అని భార్యకు జలపాత్ర నిచ్చును]

లలిత—[నిష్క్రమించును]

మురా—అయ్యా! జలము వచ్చును విశ్రమింపుఁడు. [అని తన దగ్గరకుఁ దీసికొని యుపచరించును]

లలిత—[జలము దెచ్చును]

మురా—[జలపాత్రగ్రహించి కన్నులు ముఖము తుడిచి] నాయనా! ఇదిగో జలము త్రాగుము [అని యుదకమునిచ్చును]

విషగ్రాహి—[జలముగ్రోలి] అబ్బ! బ్రదికానా బాబు!

మురా—[అనునయించుచు] బాధతగ్గినదా బాబు?

విషగ్రాహి—బాధేమిటి? విషబాధ. ఎంత దుర్భరమైందండి! నిము షంలో యెగురవలసినవాణ్ణే! నాతోపాటు వీళ్లిద్దఱుకూడా.

లలిత—[ఆతురతతో] ఎందులకు?

విషగ్రాహి—ఎందులకా! వుద్యోగంలేక ప్రతిచోటికి ప్రతి ఆఫీసుకు తిరిగి మాతోపాటు జదివినవారు మాకంటె తక్కువజదివినవారు వందలువేలు జీతాలుతింటు దగ్గరకైనా రానీయక గేటుజవానుపని నైనా చూపించక, మమ్మల్ని తరిమేస్తుంటే ఆ అవమానం భరించ లేక చివరకు చావుకు తెగించాం.

మురళి—నాయనలారా! మీరాంగ్లవిద్యార్థులా?

విద్యార్థి—విద్యార్థులేమిటి? బియ్యేలు, ఎమ్మేలు, ఎల్టీలు ఇంకాయింకా కూడాను.

మురళి—ఇంతటి దుస్థితికిఁ గారణము?

విమగ్రాహి—[కోపదృష్టితో] చెప్పలా? ఉన్న భూములుపోయి ఆస్తిపోయి, యెక్కడా నౌకరీలులేక యిండ్లకుబోలేక భార్యల్నిచూడలేక, కడుపుమంట భరింపలేకపోవడమే.

లలిత—మీరు భారతీయులుకదా? ఇంతటి సాహసమునకుఁ బాల్పడి యెదరా?

విమగ్రాహి—మాటలుచెప్పటం, ఓదార్చటంకాదు. చదువుల మూలకంగా సర్వనాశనమై, కడుపుమండిపోతూండేవాళ్లకు దెలుస్తుంది. అన్నీ చూచేది దేవుడంటూవుంటే ఆదేవుడికి తెలుస్తుంది మాకష్టం. చెప్పలేం ఇంక మమ్మల్నేం అడక్కండి [అని విసుగుతో లేచును].

మురళి—తండ్రీ! త్వరపడకుము! [అని చేయిపట్టుకొని] నేనొకప్పుడింతవఱకు యోజించినవాఁడనే. బారిష్టరును, నా మానవత్వమును సార్థకమొనరించుకొన నటులనో దైవకృపఁ బ్రతుకఁగలిగితిని.

అందఱు—మీరు బారిష్టరుగారా! ఏమిటీ [అని ఆశ్చర్యమభినయింతురు]

విమగ్రాహి—మీకుఁగూడా, యింతటి స్థితి వచ్చిందా బాబు?

మురళి—ఆ వచ్చినది. తరువాతనే నాయదృష్టరేఖ బయల్పడినది.

లలిత—నాయనలారా! మీరెల్లరు విద్యావంతులే. మీదేశప్రాశస్త్యమును మీరెఱుంగకుంటిరా? మీదేశీయచరిత్రలనైన మీరు పఠింపకుంటిరా! ఆహా మహాశూరులై మనుష్యమాంసమును దిను రాక్షసులెల్ల యెడల నిండియుండిన రామాయణకాలమున సైతము స్వచ్ఛందజీవనులై విజ్ఞానసంపన్నులైన మునిజనులెందఱు వనవాసమునఁ బేరుగాంచిరో మీరు వినియుండలేదా? సేనాసమేతులై శివాజీ మున్నగు వీరశిఖామణులెందఱు కొండలలోనుండి శౌర్యాలంకారులనఁ బ్రసిద్ధివహించిరో తెలియఁ జాలకుంటిరా? ఇరువది

వేల సేనతో నిరువదిరెండేండ్లు వనములఁ గొండల వసించి ప్రతిభటులుకూడ ప్రస్తుతిసేయు ధర్మరక్షణకై స్వాతంత్ర్యస్థాపన మొనరించిన మహారాణా శ్రీప్రతాపసింహుని చరిత్ర మెవ్వరైన మఱువనేర్తురా? ఇంతయేల! గుహామందిరములు సకలఫలభరితము లగు వనములు, నిర్మలజలపూరితములగు నదీనదములు, సస్యశ్యామల కోమలములగు క్షేత్రరాజములుగలిగి మన భరతఖండ మన్య ఖండములకు సైతము కల్పవాటికయై యలరారుచుండ, వేదశాస్త్ర సంపన్నమగు మన యార్యవిజ్ఞాన మన్యుల కందని ఫలమై విరాజిల్లు చుండ, ఆంగ్లమునకన్నఁ జదువులేదని దాస్యమునకన్న జీవనోపా యములేదని తలంచి ప్రాణములుసైతము వదలఁజూచుట యుక్త మగునా? ఇయ్యది మానవత్వమునకు ఫలముకాఁజాలదు. యోజిం పుఁడు తండ్రులారా! యోజింపుఁడు!

విద్యార్థి—అయితే యేంజెయ్యమంటారు? వేలకువేలు ఖర్చుపెట్టి యింతచదువుచదివి అడవుల్లోకి పొమ్మంటారా? యేమండీ!

విద్యార్థిని—మగాళ్ళు మమ్మల్నెందుకు కొఱగానివాళ్ళని చేసి క్రిందికి తొక్కేస్తుంటే ఆడవాళ్ళం మేం కాస్తకళ్ళు తెఱచి నలుగురితోపాటు నాలుగడుగులు ముందుకు వేతామనుకుంటూ స్కూళ్ళకుబోతూ స్వాతంత్ర్యంకోసం సర్వయత్నాలు చేస్తున్నామే, ఇంక మాస్థితి యేమంటారు? మాకుకూడా వుద్యోగాలు దొరకవంటారా యేమిటి?

ముర—సోదరీమణులారా! అర్ధనారీశ్వరునివలె స్త్రీ పురుషు లేకశరీ రులు, పరవ్యామోహమను పక్షవాత మంతట వ్యాపించి పురుష భాగము నాక్రమించి యెంతయు నిస్సత్త్వముగావించినది. ఈశ్వ రుఁ డశక్తుఁడైనప్పుడు దానవోద్రేకము నడంచి పతినుద్ధరించి లోకముల కుపకృతి గావించిన మాహేశ్వరి చందమున ఆత్మధర్మ బల విరహితమై పడిపోయిన పురుషభాగమునకు స్వధర్మబలమున బలము నొసంగి, నిండుదేహమున దేశమునకు మేలు చేఁకూర్పక, చూచిచూచి పతనశీలమగు నిప్పటి పురుషౌన్నత్యమునుగోరి, అన్య విద్యలకు దాస్యమునకు స్వేచ్ఛకుఁ బొల్పడి యున్నతి సాధనము

లగు నీదేహముల నిలువున నీఱు సేయఁదలంచుట యుక్తముకాదు. అయ్యది దేశమునకుఁగూడ మహానర్థము కాకపోదు. భారతీయాంగనలు విజ్ఞానవిభవసంస్తుత్యలు. పాతివ్రత్యకవచాలంకృతలు. అభిమాన ఖడ్గవిరాజితలు. వీరపత్నులు. వీరమాతలు. అట్టి మీరు మీపురుషులఁ బరమపురుషార్థ తత్పరులఁ గావించిన మీ కైహికాముష్మికములు కరతలామలకములు కాఁగలవు. దానిచే మీకొక పురుషౌన్నత్యమేకాదు. సర్వౌన్నత్యములును సమకూరును. తల్లులారా! ప్రపంచమున మీరలే గృహాపదవాచ్యలు. అట్టి మీరెట్టిమాలిన్యమును బొందక యానందభరితలై మీగృహముల స్వర్గసీమలఁ గావింపుఁడు. మీపతుల నిజధర్మ రక్షణాభిరతుల నొనర్పుఁడు. మీ కొమరుల శివాజీవంటి వీరులను శంకరునివంటి పండితులను లోకమాన్యునివంటి స్వార్థత్యాగులను జేయుఁడు. మీ కొమరితల సీతానసూయలవంటి యుదార చరితల నొనరింపుఁడు. భరతదేశగౌరవమును గాపాడుఁడు. ఇదే శిరమువంచి వేఁడుకొనుచున్నాను. చేయుఁడు! దేశౌన్నత్యసాధనము చేయుఁడు. సోదరులారా! ఆంగ్లవిద్యకు ఫలమగు నుద్యోగము లభింపనప్పుడు, ఇంక మనము వృత్తులనే చూచుకొనవలె. అందఱు నన్నివృత్తులను జేయవచ్చునను మనవారి మాటల విశ్వసించిన, అయ్యది యాముష్మిక విరోధమన్నమాట యటులుంచి యొకరి కొకరు ప్రతివిషయమున నెదురు వచ్చి యైహిక లాభమును గూడ చెడఁగొట్టుకొనినవారమగుదుము. అందుకనియే స్వధర్మత్యాగము, పరధర్మసేవ యిహపరసుఖ నిరోధకములని భగవానుఁడు శ్రీకృష్ణుఁడు చెప్పియున్నాఁడు. కావున ఆయాజాతుల కనువగు వృత్తికల్పనమే మనకవసరము అట్టిజాతీయ వృత్తు లభివృద్ధి నొందించుటకు నాకు విజ్ఞాన దాయినియైన నాభార్య పేర లలితాశ్రమమును స్థాపించితిని. మీరందఱచటికి వచ్చిన అచ్చటి విశేషములఁగనుఁగొని తగురీతి జీవనోపాధి నేర్పఱచుకొనవచ్చును. కొంతకాలము వఱకు మిమ్ముపోషించుభారము మాపైనునిచి బయలుదేరుఁడు. నాయనలారా! మీరెల్లరు విద్యాధికులు. అట్టి మీ సాహాయ్యమెంతయు

నా కవసరమైయున్నది. సర్వోత్కృష్టమై కోటిదుష్ప్రాప్యములకన్న మిన్నయగు మన మానవశరీరలాభమును బశ్వాదులవలెఁ గేవల ముదర పోషణాదులకు వినియోగించుట యుక్తముకాదు. మన జననము పరాధీనతకుఁగాదు. స్వాతంత్ర్యముకొఱకు వివేకము కొఱకు విజ్ఞానముకొఱకు విపత్పరంపరావిలమగు సంసృతివిచ్ఛేదముకొఱకు విబుధారాధ్యమగు బ్రహ్మానందముకొఱకు. ఈ విషయములను మఱువక మనమిపుడు కర్మవీరులముగావలె. మనవలె నాంగ్లవిద్య నభ్యసించిన దేశీయసోదరులను వృత్తివిరహితులై యల్లాడు నిరుపేదలను మన ముద్ధరింపవలె. నిర్వీర్యులముకాక మనము దేశహిత మాచరింపవలె. సంశయింపకుఁడు. చాణక్యుని వంటి ధీవిశారదుల మగుదము. యుగంధరునివంటి కార్యసాధకుల మగుదము. అన్యానుకరణ వ్యామోహమేఘపటల మడంపఁ బ్రకంపనుల మగుదము. జాతివిహిత వృత్తిధర్మ రక్షకులమగుదము. భరత దేశౌన్నత్య పరిపాలకుల మగుదము. సోదరులారా! వదలుఁడధైర్యమును వదలుఁడు. దాస్యబుద్ధి వదలుఁడు. శ్రీరాముఁడు తోడ్పడఁగలఁడు. రండు నాతోఁ జనుదెండు! [అని యందఱ నాదరించును]

లలిత—నాయనలారా! ఆశాపీడితుఁడుగాని భారతీయునకు ఆశ్రమవాసముకన్నను గ్రామజీవనముకన్నను సుఖసాధనములేదు. మా యాశ్రమ కల్పక మన్నివసతుల సమకూర్చును. రండు సుఖజీవనులు కండు.

రామ—ఇంగ్లీషు చదు వనే మెఱపు అందఱికళ్ళు మూయించింది. నా అగ్రహారం నా సర్వస్వం వూరు పేరు లేకుండా చేయించింది. ఇలాగే యెన్నో యిందుకింద హరిస్వామై పోయినయ్. ఏంజేస్తాం? ఇప్పుడైనా కాస్త కళ్లు తెరవండి. వున్న దేమయినావుంటే సున్న చేసుకోకండి. గుణవతియైన మా కోడలు మూలకంగా మా వా డేదో కాస్తమనిషై నలుగురికి వుపకారం చేస్తున్నాడు. నాలుగుబావులు తీయించి చెరువుకూడా పోయిస్తున్నాఁడు. నేత అచ్చుపని అవి ఇవి

అన్ని యేర్పాటు చేస్తున్నాడు. అనేక విధాల సుఖజీవనం చెయ్యో చ్చు. ఇంక ఉద్యోగాలాశల్లేవు. అదే చెయ్యాలనుకోక ప్రాణాలకు తెగించక, రండి. మీరందఱు మా ఆశ్రమానికి రండి. [అని యనునయించును]

విద్యార్థి—ఈ అమ్మగారిని మిమ్మూ చూస్తే మహానుభావుల్లాగున్నారు కాని సామాన్యులుమాత్రం కారు. చీకట్లో వెలుగులాగ కనపడి మాకు దారిచూపారు. ఆశ్రమానికి వచ్చి యింక ధన్యుల మవుతాం.

విషగ్రాహి— ఇంతవరకంతా మాటలుచెప్పేవారేకాని మార్గంచూపిన వారెవ్వరు కనబడలా. మా పాలిటికి దైవాల్లాగ వచ్చారు. ఇంతమాత్రం ఆధారముంటే గోరంతలు కొండంతలు చేస్తాం. వందలు వేలు జీతాలు పుచ్చుకునే మునిసిఫీలు జడ్జీలు అన్ని అధి కారాలు చెయ్యలేం! అలాగే మన మన్నీ చేస్తాం. తిరిగింది తల తిరి గింది. లోకమువంకకు బుద్ధిపోయింది. మీవంటి సత్పురుషుల సహ వాసంతో సర్వము సాధిస్తాం పదండి. ముందుపదండి.

విద్యార్థిని—మీ ఆశ్రమంలో ఆడవాళ్ళకూ్కడా వీలుంటుందండి.

మురళ—దంపతులుగా వచ్చిన నెల్లరకు వీలుగనే యుండును.

విద్యార్థిని—బ్రహ్మచారిణులుగా నుండగూడదా?

లలిత—యువతులొంటిగా నుండుటకు మా యాశ్రమ నియమము లంగీకరింపవు.

విద్యార్థిని—ఏల?

లలిత—నే నొంటరినై పడినపాట్లు నా కెఱుక దైవమున కెఱుక.

విద్యార్థిని—అటులనా?

లలిత—ఔను.

మురళ—సోదరులారా! ఇచట మా మామగారు మాధవశర్మగారు వేదశాస్త్రోద్ధరణమున కాశ్రమస్థాపన మొనరించిరట. ఆ పుణ్యా శ్రమమును గాంచి యా పవిత్రచరిత్రుని దర్శించి పునీతులమై పోవుదము.

విద్యార్థులు—చిత్త మటులనే కానిండు. [నిష్క్రమింతురు.]

—[సర్పదష్టుఁడైన మాధవశర్మ వీథిలోఁ బడియుండును.]

పౌరుఁడు—[ఉపచరించుచు నాతురతతో] అయ్యో, ఈ మహానుభావునకు విషబాధ తొలఁగించువా రెవ్వరును గానరాకుండిరే? ఆ బాల యోగిగారును రాకయుండిరే? ఏమిచేయవలె? [అనుచు దిక్కులు చూచి] స్వామిదర్శనము చేసికొంబోలును; రాధాదేవిగారు తులసీదేవిగారు నిటే వచ్చుచున్నారు. కష్టమైనను బిలిచి చెప్పెద. అమ్మా! అమ్మా! ఇటురండి ఇటురండి [అని పిలుచును.]

[రాధాదేవి మొదలగువారు ప్రవేశింతురు.]

పౌరు—[సమీపించి] అమ్మా! మీ భర్తగారు మాధవశర్మగారు పాముగఱచి పడిపోయినారుతల్లీ!

రాధ—[ఆతురతతో] ఆఁ ఆఁ ఏమది?

పౌరు—మీ భర్తగారు మాధవశర్మగారు!

రాధ—[భర్తనుజూచి సంభ్రమముతో] నాథా! నాథా! [అని భర్తను సమీపించును.]

తులసి—[పూజాపాత్రినువదలి] అయ్యో! మామగారి కెంత కష్టము వచ్చినది? [అనుచు విచారముతో నుపచరించును.]

రాధ—ఆర్యపుత్రా! ఆర్యపుత్ర [అని పిలిచి] అయ్యో నే నెంత నిర్భాగ్యురాలను. దైవమా నా కెట్టి దుస్థితి గలిగించితివి? నా మణికిరీటమును మఱగుపఱచితివే! నాయానందవాహిని నాపివైచితివే! నా యమృతనిధి కడ్డుపడితివే. కృష్ణా! శ్రీకృష్ణా! నీకు నిరత సేవకురాలనే, నాయం దిసుమంతయైనఁ గనికరము లేకపోవలయునా? నాథా నాథా! [అని విచారపడును.]

తులసి—అయ్యా! మీ కెవ్వరికైన మంత్రమువచ్చిన మా మామగారిని బ్రతికింపుఁడు. [అని బతిమాలును.]

పౌరు—అమ్మా! ఎవరో యోగిగారు, వచ్చారంటే కబురంపా. వస్తారు తల్లీ! వస్తారు.

రాధ—ఆర్యపుత్రా! ఒక్కమాఱు మాఱుపల్కుము, నన్నుఁ బ్రియమారఁ గనుఁగొనుము. నా మొఱ వినుము. [అని విచారపడును.]

**తులసి**—అయ్యో! మామగారిని బ్రతికించువా రెవ్వరును గానరా కుండిరే ? యేమిచేయుదుము! కృష్ణా! కృష్ణా! నీవే మాకు శరణ్యము. మా మామగారిని బ్రతికింపుము మమ్ముద్ధరింపుము.

**తెరలో**—తొలఁగండి. తొలఁగండి. యోగిగారు వస్తున్నారు·తొలఁగండి. [అనుచు విద్యార్థి దారిచూపును.]

**కృష్ణుఁడు**—[ప్రవేశించును.]

**రాధ**—యోగిపుంగవా! పతిభిక్ష పెట్టి నన్నుద్ధరింపుము. [నమస్కరించును.]

**తులసి**—మహానుభావా! మా మామగారు, మహాపండితులు వారిని రక్షించి మమ్ముఁ గాపాడుఁడు [అని నమస్కరించును.]

**కృష్ణు**—[చూచి యాశ్చర్యముతో] ఈమె నాపినతల్లి రాధాదేవియా యేమి? ఈమెయు నాయర్ధాంగినలెనే దోఁచుచున్నది. [సమీపించి] అమ్మా! నేనన్యుఁడనుగాను నీ కొమరుఁడను కృష్ణుఁడను, నన్నాశీర్వదింపుము [అనిదగ్గఱకుఁ బోవును.]

**రాధ**—[చూచి సంభ్రమాశ్చర్యములతో] కుమారా! కృష్ణయ్యా! ఎప్పుడువచ్చితివి తండ్రీ! సర్పదష్టులైన మీ పినతండ్రిని బ్రదికించి నన్నుద్ధరింపుము తండ్రీ! [అని బతిమాలును.]

**తులసి**—[సంతోషాశ్చర్యములతోఁ జూచుచు] బ్రతికించండి మామగారిని బ్రతికించండి.

**కృష్ణు**—సర్పదష్టులైనది పినతండ్రిగారా! విచారపడకుఁడు. క్షణములో లేవఁగలరు. [అనుచు ధ్యానము నటించి మాధవశర్మశరీరము తుడిచి పాదసేవఁ జేయుచుండును.]

**మాధవ**—[పొరలును]

**అందఱు**—[ఆశ్చర్య మభినయింతురు.]

**మాధ**—"సాక్షీనిత్యః ప్రత్యగాత్మా శివోహమ్, ప్రత్యగాత్మా శివోఽహమ్" [అనుచు లేచి కనులు ముఖము తుడుచుకొనుచు నావలించును.]

**అందఱు**—[సంతస మభినయింతురు.]

రాధ—ఆర్యపుత్ర! విషబాధ యెటులున్నది?
మాధ—శివోహమ్ శివోహమ్ [అనుచు] ఏమియుఁ గనఁబడుటలేదు.
కృష్ణ—బాబుగారు! కుమారుఁడు కృష్ణుఁడు నమస్కరించుచున్నాఁడు.
[అని నమస్కరించును]
అందఱు—అయ్యా! నమస్కారములు, దణ్ణములు. [అని నమస్కరింతురు.]
మాధ—[ఆశ్చర్యముతో నందఱనుజూచి] ఏమి యీ పరిణామము! [భార్యనుజూచి] ఇందు నన్ను బ్రతికించిన సుకృతి యెవ్వరు?
బాటసారి—వీరేనండి! వీరు మాగురువుగారు బాలకృష్ణ యోగిగారండి.
రాధ—నాథా! ఈ బాలయోగి యన్యుఁడుగాఁడు, మన వంశమణి కృష్ణయ్య.
మాధ—[బాగుగఁజూచి] కృష్ణయ్యా! విద్యాపారంగతుఁడవై వచ్చితివా తండ్రీ? [అని కౌఁగిలించుకొని యాదరించును]
కృష్ణ—బాబుగారూ! మీ యాశీర్వచన ప్రభావ మూరక పోవునా? అన్నిటఁ గృతకృత్యుఁడనైతిని.
రాధ—కుమారుని ప్రజ్ఞ వేఱుగ నడుగవలయునా? ఈ ముప్పు తప్పుట గొప్ప నిదర్శనముగాదా?
బాట—వీరిమహిమ లత్యద్భుతములు. వేదంలో శాస్త్రాల్లో యోగంలో పండితుల నెందఱినో మెప్పించి దర్భాంగ మహారాజుగారివద్ద, కాశీ రాజుగారివద్ద దుశ్శాలువలు, తోడాలు, బహుమానము పొందారు.
మాధవ—[ఆనంద మభినయించుచు] ఈ వాక్యము లమృతోపమానములు.
రాధ—కృష్ణయ్యా! నీమూలమున మే మందఱము ధన్యులము. చిరంజీవివై మా వంశము నుద్ధరింపుము. [అని యాదరించును]
తులసి—[తనలో సంతస మభినయించును]
కృష్ణ—అమ్మా! లలిత క్షేమముగ నున్నదా?
రాధ—[విచారముతో]లలిత యు త్తింటి కరిగిన పిమ్మట మఱలఁజూచు భాగ్యమే కలుగలేదు. ఎక్కడ నున్నది కూడ తెలియులేదు.

లలిత—[తెరలో] అమ్మా! ఇక్కడనే యున్నాను. నేనేలలితను, వచ్చు చున్నాను. [అని ప్రవేశించును]

రాధ—ఏదీ నా లలిత? ఏదీ నా ప్రాణము? [అని లలితనుజూచి సంభ్రమాశ్చర్యములతో] నాపెన్నిధానమా! లలితా కుమారీ, ఎన్నాళ్ళకు నాకనులకఅవుఁదీర్చితివి తల్లీ! [అని పుత్త్రికను కౌఁగిలించుకొనును]

మాధ—లలితా! నా యానందరాశీ! నీ మధురాకృతి నెన్నినాళ్ళకుఁ జూడఁ గలిగితినమ్మా! [అని లాలనఁజేయుచుండును]

తులసి—[ఆదరముతో]లలితా! నా జీవకుసుమమా, ఎంతకాలమునకు నా కనుల పండువ చేసితివి? [అని కౌఁగిలించుకొనును]

కృష్ణ—సోదరీ! లలితా! రామాయణ సారవేదినివి, నా నయన చకోర చంద్రికవు, నేఁటికిఁ గనఁబడితివా? ఎంత సుదినము! [అని యాదరించును]

అందఱు—[ఆశ్చర్య మభినయింతురు]

మురా—[సంభ్రమముతో] అత్తమామలారా! నమస్కారములు [నమస్కరించును]

రామ—బావగారు! మీ దర్శనమున మేమెల్లరము ధన్యులము. మాయపరాధముల నన్నిఁటినిక్షమింపవలె. [పాదములపైఁబడును] తల్లీ! రాధాదేవీ! నా తప్పుల నన్నిటిని మన్నింపుము [నమస్కరించును.]

రాధ—అన్నగారు! పెద్దలు మీ రట్లు చేయఁ దగదు.

మాధ—బావగారు! లెండు, పెద్దలు! లెండు [అని లేవఁదీయును.]

లలిత—తల్లితండ్రులారా! నమస్కారము. అన్నయ్యా! వదినే! నమస్కారము [అని నమస్కరించును]

అందఱు—దీర్ఘసుమంగలీ భవ, సుపుత్రావాప్తి రస్తు [అని యాదరింతురు]

రామ—బావగారు! అగతానాగతవేదివి, ధర్మమూర్తివి, నీ మాట వినక సకలకష్టము లనుభవించితిని. ఇంక నన్నుద్ధరించుభారము నీది, రాధాదేవీ! పరమ పతివ్రతవు భక్తాగ్రిణివి దయతోఁ గాపాడు భారము నీది.

మాధ—చయనులుగారు ! మీరంద ఱీరీతి నిచటి కేలవచ్చితిరి?

రామ—మా యదృష్టవిశేషమున; మీకొమరిత యోగ్యతమూలమునను.

ముర—మామగారు ! విదేశవాసనా వశమున దుష్క్రియాసక్తుఁడనై పదవీ పరిభ్రష్టుఁడనై నానాశ్రమలుపడి వివేకవతియగు మీపుత్రిక మూలమున నా మానవత్వము నేను బరిగణింపఁ గలిగితిని. పిమ్మట దేశీయప్రభువులకడఁ గొంత భూమిని సేకరించి పరోపకార పారీణులగు భారతీయసోదరుల సాహాయ్యమున మీప్రియపుత్రిక పేర నొక యాశ్రమమును, దాన నొక కర్మాగారమును, స్థాపించితిని. విదేశమునకుఁ బోఁదలంచినపుడు మీరు నాకుపదేశించిన యాజ్ఞామంత్రమిప్పు డారాధించుచున్న మీశిష్య పరమాణువుపై ననుగ్రహముంచి యాశ్రమాభివృద్ధి యగునట్లు నన్నాశీర్వదింపుఁడు [అని నమస్కరించును.]

మాధ—మురహరిశర్మా ! నీ ప్రయత్న మెంతయుఁ బ్రశంసనీయము. మీ లలితాశ్రమము బహుజనోపకారకమై చిరతరప్రవర్ధమానమై వర్ధిల్లుఁ గాక.

కృష్ణ—[మురహరి చెయిపట్టుకొని] బావా! నీవు దేశోపకారివగు కర్మవీరుఁడవై తివి. మిక్కిలి సుకృతివి.

మాధ—చయనులుగారు! మురహరిశర్మా!ఎంత వారికేఁగాలప్రవాహము నెదుట దుస్సాధము. మీ పశ్చాత్తాపము మీ సత్కార్మాచరణ పరాయణత్వము మిమ్ముదరిఁజేర్పఁగలవు. లలితా! కష్టసముద్రము నీదివై చితివి. నీ పతి సేవ, లోకసేవ నిన్నుద్ధరింపఁగలవు.

లలిత—తండ్రిగారి యాశీర్వచనమున ధన్య నయ్యెదను.

సుబ్బయగుప్త—[పెట్టెపట్టుకొని ఆశ్చర్యముతోఁ జూచుచు]మాధవశర్మగారంటే యేమో అనుకున్నా. మాధవాశ్రమంచూస్తే గుండె చెఱువై పోయింది. ఇంత గొప్పవారని నాకూ తెలియదు. అందఱు అందఱే! మణులు వజ్రాలు. [సమీపించి] మాధవశర్మగారూ! నమస్కారాలు [అని నమస్కరించును]

మాధ—శుభం భవతు. [అనుచు నాదరముతో] సుబ్బయ్యగుప్తా! ఎప్పుడువచ్చితివి? అందఱకు క్షేమమా ?

సుబ్బ—తీర్థయాత్రలకని బయలుదేరి మీరిక్కడున్నారని విని మిమ్మ ల్ని చూడాలని వచ్చా! మీ దయవల్ల అందఱం బాగానే వు న్నాం. కానీ శర్మగారు! మిమ్మల్ని మీ కుటుంబాన్ని చూస్తే నాకంతా చిత్రంగావుంది. తులసమ్మగారికి జబ్బుచేసివుంటే దార్లో పదిరోజులు రాధమ్మగారున్నచోటున్నాం. ఆహాహా! రాధమ్మ గారు, తులసమ్మగారు దేవుణ్ణి పూజ్జేసి కోకిలల్లాగ తరంగాలు కీర్త నలు పాడి భజనచేస్తూవుంటే శ్లోకాలు పద్యాలు చదువుతూవుంటే మేలుకొలుపులు పాడుతూవుంటే మాకు వొళ్ళు తెలిసేది కాదు. కైలాసంలోనో వైకుంఠంలోనో వున్నట్టుండేవాళ్ళం. మీ పేరు విని ఆతల్లుల్ని చూచి ఆపాటలు విని ఊరూర వారిని మన్నించేవారు సేవించేవారే! ఆహా! ఏంతల్లు లేంతల్లులండీ! మఱచా. మంత్రి గారు మహారాజుగారూ యాత్రలకు వస్తూ ఆసత్రంలో వీరినిఁజూచి ఆశ్చర్యపడిపోయినారు! వడ్డీబాబతు నష్టంపోగా నాదగ్గిర పదిలక్ష లున్నయ్. ఏంలాభం? అమ్మగారడుగుతే అప్పియ్యటానికి మనసొప్ప లా. నగలుకూడా యీశ్వరార్పణంచేసిన తల్లుల కేంతక్కువైంది? వస్తూవస్తూ లలితాశ్రమంకూడా చూచా. బారిష్టరుగార్ని యీస్థితికి దెచ్చిన అమ్మాయిగారి నెంతైనా కొనియాడాలి. కానియ్యండి నా జన్మంతా డబ్బు సంపాదించటమే అయింది. పుణ్యం పాపం తెలుసు కోకపోతే యెందుకిది? మీ వంటివారు మావూళ్ళోవున్నా చాలు. రెండులక్షలకు బ్యాంకికి చీటీయిస్తున్నా. మీయిష్టానుసారం ధర్మం చెయ్యండి. నా పాపాలన్నీ పోగొట్టి నాకు మంచిచెడ్డలు చెప్పి నన్నుద్ధరించండి. మీయందఱకు కర్చు నాదే. రండి! మనవూరు పోదాంరండి. [అని ప్రణమిల్లును]

అందఱు—[ఆశ్చర్య మభినయింతురు]

మాధ—సుబ్బయ్యగుప్తా! నీవు కడు ధన్యుఁడవు, నీవంటి వైశ్యరత్న ముల వలననే కొన్ని ధర్మసంస్థలు, నడచుచున్న వనుటకు నీవే తార్కాణము. నీపేరట శాశ్వతధర్మ సంస్థలు నెలకొల్పెద.

సుబ్బ—ఏమైనా చెయ్యండి రెండులక్షలకు బ్యాంకికి అర్డరిస్తున్నా. [అనివ్రాసి చీటి నిచ్చును]

మాధ—గుప్తా! త్యాగమునకన్న సుకృతము లేదు. నీవు మహాత్యాగి వైతివి. ధన్యుఁడవు మిగుల ధన్యుఁడవు. [అని చేయి పట్టుకొని యాదరించును]

మురహరిశర్మా! దేశీయసోదరులకు నీకర్మాగారము నీయాశ్రమము మిగుల నుపకారమగునని తలంచి దానియభివృద్ధికిఁగాను గుప్తగారి ధనమున లక్షరూప్యములను నీకిచ్చుచున్నాను. పరోపకారపారీణుఁడవై లోకారాధనవ్రతమున మెలంగవలయును.

ముర—మీయాజ్ఞకు బద్ధుఁడను. గుప్తగారు! స్వార్థపరుఁడవుగాక భోగములకు, ద్యూతములకుఁ, బానములకుఁ, బదవులకుఁగాక మానవసేవకై యుపయోగించు నీధనమున నీవెంతయు ధన్యుఁడవైతివి.

మాధ—గుప్తగారు! భారతీయపరమార్థము విజ్ఞానము. దానికొఱకు మనగ్రామమున నీపేరట వేదశాస్త్రపాఠశాలను, మిగిలిన లక్షరూప్యములతో స్థాపించెద.

సుబ్బయగుప్త—అంతా మీయిష్టమే. కానీ, రాధమ్మగారు భజన చేస్తూంటే బాలకృష్ణమూర్తి ఆడుతున్నట్టు పాడుతున్నట్టు నాకంటికి కనపడేవాఁడు. శ్రీకృష్ణమందిరంకూడా ఒకటుండాలి. దానికొఱకు యాభైవేలిస్తున్నా కట్టించఁడి. [అని చీటివ్రాసి యిచ్చును] ఇవే మీ నగలు. తీసికొని ధరించండి. [అని పెట్టెనిచ్చును]

అందఱు—[ఆశ్చర్యమభినయింతురు]

మాధ—అన్నిటను నీవు ధన్యుఁడవైతివి

రాధ—గుప్తగారు! నీసుకృతము మేఱమీఱినది.

[తెరలో] అయ్యా! తొలఁగండి [అని విశ్వపతి దారిఁజూప గోపాలరావు ప్రవేశించును]

గోపా—ధర్మస్వరూపా! మాధవశర్మ! గోపాలరాయఁడిదే నమస్కరించుచున్నాఁడు. నా యపరాధములు మన్నింపవలె [అని ప్రణమిల్లును]

మాధ—[ఆశ్చర్యముతోఁజూచి] శుభమగుఁగాక, మంత్రివర్యా! ఎప్పుడు వచ్చితిరి. లేవఁదీసి, ఎల్లరకు కుశలమా? మహారాజులుంగారు సేమముగ నున్నారా?

గోపా—మీ యాశీర్వచనమున ఎల్లరకు సేమము. ఆర్యా! తమ నిస్పృహతను ధర్మదీక్షను గ్రహించి తమ యాజ్ఞననుసరించి. మహారాజులుంగారు నన్నుఁ దోడుగాఁగొని స్వయముగ దేశస్థితులు గమనించిరి. వారిలోపములను, మాలోపములను, అధికారుల లోపములను దెలిసికొని భారతీయౌన్నత్యమును బరికింపఁజాలిరి. మధ్యేమార్గమున తులసీ రాధా దేవుల సందర్శించి వారి యపారమగు దైవభక్తికి సంతసించిరి. ఇపుడే యిచ్చటికి వచ్చినారు.

మాధ—[సంతోషాశ్చర్యములతో] సుదర్శన ప్రభువర్యులు విచ్చేసిరా!

గోపా—అవును.

మాధ—మంచిది, ఎందున్న వారు?

గోపా—ఎందుందురు? మాధవాశ్రమ మతిమనోజ్ఞమై విజ్ఞాననిలయమై సర్వజనాభినంద్యముగఁ బురప్రాంతమున బ్రహ్మానంద మొదవించుచుండ నెందుండఁగలరు? ఆశ్రమములోని వేదపఠనములు శాస్త్ర చర్చలు మొదలగునవి ప్రభువుల నడ్డివైచినవి. ఆశ్రమస్థితులు పరిశీలించుచు విద్యాగోష్ఠిలో మునిఁగి తేలుచుఁ దమ యాశ్రమమందే యుండి దేవరదర్శనభాగ్యము నపేక్షించుచున్నారు.

మాధ—[సంతసముతో] మహామంత్రులు తాము‌ను, రాజన్య వరేణ్యులు సుదర్శన ప్రభువులు నిచటికి వచ్చుట యెంతయుఁ బ్రశంసనీయము. మంత్రివర్యా! ఔన్నత్యమడంచుకొని యుద్యోగము నాపుకొని శ్రమల కోర్చుకొని ప్రభువులం గలసి ప్రజల స్థితిగతుల నరసివచ్చితి రనుటకు మిక్కిలి సంతసించుచున్నాను. మీ గోపాల నామమును సార్థక మొనర్చుకొని సుదర్శనుని సుదర్శనునిఁ జేసిన మీ నేర్పెంతయుఁ గొనియాడఁ దగియున్నది. ఆలసింపక ప్రభుదర్శనము చేసెద [ప్రక్కకుఁ దిరిగి] విశ్వపతీ!

విశ్వ—అయ్యా!

మాధ—వీరినెల్లర నాశ్రమముకడకుఁ గొనిపొమ్ము.

విశ్వ—చిత్తము.

మాధ—కృష్ణా! మురహారీ! బావగారు! మీరెల్లరు ఆశ్రమముకడకుఁ జనుఁడు. లలితా! అందఱు వెళ్లుఁడు. మంత్రివర్యా!

తామును దయచేయుఁడు. నేనిదే నిత్యవ్రతము నెఱవేర్చుకొని వచ్చెద.

గోపా—ఆర్యా! మహారాజు తమ్ము మన్నింప వచ్చియుండ ఇంకను భిక్షాపాత్రియా?

మాధ—[ఎలనగవుతో] శ్రీవారి యనుగ్రహము కుక్షిసాధనము [జోలెం జూపి] దీని యనుగ్రహము మోక్షసాధనము. నియమవ్రతము మానరాదు. మూడుచోట్లకు మాత్రమే వెళ్ళివచ్చెదదయచేయుఁడు అందఱు దయచేయుఁడు! భవతి భిక్షాం దేహి! భవతి భిక్షాం దేహి! [అనుచు నిష్క్రమించును]

అందఱు—[ఆశ్చర్యముతోఁ జూచి నిష్క్రమింతురు]

[కాళికాంబ ప్రవేశించును]

కాళి—[తలయూచుచు] మా కృష్ణుఁడు వచ్చి మాధవయ్యమరణం తప్పించాడు కాని లేకుంటేనా ఈ పాటికి పీడిబూడిదె బుంగల కెత్తు తూండాల్సింది. ఇంతకు వాడికింకా భూమిమీద గింజలున్నయ్. ఏం జెయ్యను? పిచ్చిలోకం, వేదాలు శాస్త్రాలు అంటే ఇంకా వేలివ్వటం పోలే. గోపాలరావేమో గొప్పవాడూ అనుకుంటే గుభేలుమని గోతిలోకి దూకాడు. ఆ మాధవయ్య కాళ్ళ మన్నంతా మంచి గంధంలాగ వంటికి పూసుకున్నాడు. సుదర్శన ప్రభువుకూడా పద దాసుఁడవుతాడు. ఇంకనన్ను చూచారూ అంటే; వీళ్ళూ వాళ్ళూ ఊళ్ళోళ్ళవాళ్ళూ కళ్ళల్లో కారం జల్లుకుంటారు ఇంక నేనెదో పెద్ద బస్తీకి చేరి పదిమంది పడుచువాళ్ళను జేర్చి పాంథవసతిగృహం అంటూ సాగిస్తా. [యోజన నభినయించి] ఆఁ కాదు మరచా. బాల వితంతువుల కేనా భర్తల అవసరం? ప్రౌఢా వితంతువులకు మాత్రం పతులు పరిణయాలూ అక్కర్లా? సంఘంవాళ్ళు చంపేస్తారని నావంటివాళ్లు నలిగిపోవటంలా? ప్రౌఢా వితంతు శరణాలయ మొకటి కొత్తగా స్థాపిస్తా. అధికారికీ సంభావన ద్విగుణమే, ఆకతాయకూ సంభావన ద్విగుణమే. తక్కువేం ఉంది? చెంతచేరి చేతులు నలుపుతూ నవ్వుతూ నాలుగుమాటలు చెప్పానంటే ఆడదీ అంటూ ఆదరిసూ

కొత్తసంఘాలంటే కోట్లిచ్చేవాళ్ళున్నారు. నాకేంతక్కువవుతుంది? [ముందుఁజూచి] అదుగో అంతా ఆశ్రమందగ్గరచేరారు. నేను పోయి నాపన్లు చూస్త! [నిష్క్రమించును.]

[అలంకృతమగు మాధవాశ్రమమున రాజు మంత్రి మాధవశర్మ మురహరి కృష్ణుఁడు చయనులు గుప్త విద్యార్థులు లలిత తులసీ రాధలు మున్నగువా రుందురు.]

సుద—[వినతుఁడై] మాధవశర్మగారు! మీదర్శనమున మిగుల ధన్యుఁ డనైతిని, మీయాశ్రమము మిక్కిలి యానందము కలిగించినది. మీప్రబోధము ప్రాంతీయులనెల్ల ధర్మతత్పరులనొనర్చి మిగులఁ బవిత్రులఁ గావించుచున్నదనుట యతిశయోక్తి కాకున్నది. మీధర్మదీక్ష లోకోద్ధరణప్రయత్నము మిగులఁ బ్రశంసనీయములు. సాంగవేదాధ్యయనాద్యాశ్రమవిధులు ఆర్య ధర్మాలంకారముల మెఱుఁగువెట్టుటగా నెంచవలసియున్నది. ఆశ్రమవాసుల స్వధర్మాచరణము, దేవతారాధనము గోపూజ మున్నగునవి కనుల పండువుసేయుచు ఆశ్రమమునకెంతయు వన్నెఁదెచ్చుచున్నవి. కత్తి వట్టి కడలనేలు పుడమిఱేండ్లకంటె జోలెవట్టు స్వార్థత్యాగి మేలన్న మాట మీమూలమున నాకు బోధపడినది. దేశమున నొక తపస్వి, యొక పీఠాధిపతి, యొక జ్ఞాని, యొక కవి, యొక పండితుఁడు, ఒక యగ్రహారము చేసినపని యేప్రభువులు ఏశ్రీమంతులు ఏవిశ్వవిద్యాలయములు చేయలేదేమోయని యోజింపవలసియున్నది. జనులెంత నియమరహితులై యెంతనీతిదూరగులగుచున్నను అన్నివర్ణముల యందును సకలధర్మములు గనులలో మణులవలె నందందు విరాజిల్లుచుండెననుటకు సందియము లేకున్నది. మాయనుకరణమంతయు నేలకలు పండించు దేశమున యావనాళములు పండింపఁజూచు విధమని నిశ్చయించితిని. రాజును గట్టింపలేని చదరంగపుటెత్తులవలెఁ బ్రభువశీకరణములేని ప్రభుత్వవశీకరణమెంతమాత్రమును రాణింప నేరదు. ఇంతయేల? నాస్వేచ్ఛా విహారములను నాయవ్యయములను నావారివ్యయములను దగ్గించి పైచెద. ప్రజాపీడనమునఁ బెఱిగిన

నాకోశమునఁ అర్థభాగమప్పుడే నా దేశక్షేమమునకై వినియోగించెద. నారాష్ట్రమున సర్వమును సంస్కరించెద. మహాత్మా! మా మంత్రివర్యుని నియంత్రణమును ఆలయములకడ యోగిగానుండి వినిన మీ మాటలే నన్నిట్టిస్థితికిఁ దెచ్చినవి. ఇట్టి సుసమయమున మా యాస్థానమున గురుపదవి నలంకరించి నన్ను ధర్మప్రవర్తకునిఁ జేయఁ గలందులకు, మిమ్మెంతయుఁ బ్రార్థించుచున్నాను. అమ్మా! రాధాదేవీ! మీరును నన్ననుగ్రహింపుఁడు దయచేయుఁడు దయతో నా యాస్థానమునకు దయచేయుఁడు.

మాధ—[ఆనందమభినయించుచు] మహారాజా! దేశక్షేమమునకై మీ యౌన్నత్యమును దగ్గించుకొనుటకంటెఁ బ్రజాదరణమింకేమియుండును? అంతకంటె రాజులకుఁ గాఁదగిన దేముండును? గోపాలరాయునివంటి మంత్రిసత్తములును సుదర్శనప్రభువులవంటి ధర్మప్రభువులును బ్రభుప్రధానులకెల్లరకాదర్శప్రాయులై సుచరిత్రులలోఁ బ్రసిద్ధచరిత్రులై ఆచంద్రార్కము కీర్తిచంద్రికలచే వెలుఁగొందారనుటకేమియు సందియములేదు. కాని పదిలపఱచిన పాకను గూరుచుండెడికుశాసనమును గూడఁ దగులఁబెట్టి తరలవలసిన బ్రాహ్మణునకుఁ బదవులు ప్రభుసాన్నిధ్యములు, బాధాకరములు కాకుండునా?

గీ. మేన సామేనుగా నుండు ♦ మొలఁతఁ బాసి
తానయై వెల్గుచుండెడి ♦ తనయు వీడి
వదలి సర్వంబు పర మెచ్చ ♦ బ్రాహ్మణునకుఁ
బదవి యాస్థానమును విప♦త్ప్రదముగాదె?

సుద—మహాత్మా! మీరింతటి నిస్పృహులు గనుకనే మీప్రభావమనన్యసామాన్యమైనది. పెరుఁగునుండి వచ్చినవెన్న మఱలఁ బెరుఁగులోఁ గలియనేరదు. బ్రహ్మవేత్తలు ప్రభుత్వపదవియందున్నను బరమునకు హానిచేసికొన నేరరు. సర్వవిధముల నాదర్శప్రాయమగు మీకుటుంబమిప్పట్లు మాసాన్నిధ్యమున నుండకున్న మా యాస్థానము మణులూడిన కిరీటము కాకపోదు. ఏదేనిఁ

గృతిరత్నము నాకొసంగి నన్నుధన్యునిఁ జేయుఁడు. ఈ మాధవాశ్రి మాభివృద్ధి కొరకు లక్షరూప్యము లిచ్చుచున్నాను. అన్ని విధముల మిమ్ముఁబోలిన తులసీ కృష్ణుల నిందుంచి మీరు పయనముకండు. లలితా దేవీ! రాధా మాధవుల యపరమూర్తివి. నీవు నీభర్తనే గాక లోకమునుగూడ నుద్ధరింపఁజాలిన సాక్షాల్లలితవు. నీపేరట ఆశ్రమము నెలకొల్పి మురహరిశర్మ తన బుద్ధివైశద్యమును గృతజ్ఞతను జూపఁజాలి నందుల కెంతయు సంతసించుచున్నాను. మురహరిశర్మా! మిక్కిలి లోకోపకారమగు మీ యాశ్రిమాభివృద్ధికి లక్షరూప్యము లిచ్చుచున్నాను. మీ దంపతు లిందుండి చయనుల వారి నాదరించుచు సర్వజనాదరము వడయుచుండుఁడు.

లలిత
ముర — } ప్రిభువుల యాజ్ఞలకు బద్ధుల మయ్యెదము.

మాధ—మహారాజా! ధర్మమూర్తులై విలసిల్లు ప్రిభువుల యాజ్ఞ మా కనుల్లంఘనీయము. తమకడ కొంత కాలముండి పిమ్మట అందందు ధర్మ సంస్థలు నెలకొల్పఁ బోవుట కనుజ్ఞ నీయవలెను.

సుద—ధర్మవీరులు, ప్రిభువులకుఁ బ్రిభువులు. ఇంక మీరే నన్నాజ్ఞా పించునది. తమ యభీష్టమున కంతరాయ ముండ నేరదు. ప్రియా ణమున కనుమతింపఁ గోరుచున్నాను.

మాధ—సకలపరివారముతోఁ బ్రిభుప్రిధానులు నేఁ డిందుండవలె. రేపు ప్రాతఃకాలమునఁ బ్రియాణము చేయుదము.

సుద—అట్లే గానిండు.

మాధ—కృష్ణయ్యా! నీకు విశ్వపతి తోడుగనుండును, పండితులయం దాదరమును విద్యార్థులపైని సౌదర్యమునుగలిగి ప్రవర్తింపుచుండుము. లోకసేవయే మన కవశ్య కర్తవ్యము. కాన కొంతకాల మిటనుండి మీరును ధర్మప్రిబోధనమునకై బయలుదేరవలె. లోకమును మేల్కొల్పవలె. మీరేకాదు, జాతిమత ధర్మములపై నాసక్తిగల

ప్రతి భారతీయుఁడును నిదురింపఁదగినసమయముకాదు. ఇంక మీవిధిని మీరు నెరవేర్పుఁడు. విశ్వపతీ! జాగ్రత్త, పండిత మహాశయులారా! విద్యార్థులారా! నా కాజ్ఞయిండు.

అందఱు—[నమస్కారాలింగనాదులు చేయుదురు]

మాధ—పౌరవర్యులారా! మీ సాహాయ్య సంపత్తులచే స్థాపింపఁబడిన యీ యాశ్రమము మీయదికాని నాయది కానేరదు. దీని ఫలము దీని యభివృద్ధి యంతయు మీదియే. అనేక ధర్మసంస్థలు పోషించు మీ కీ యాశ్రమ రక్షణ మశక్యముకాదు. మాకు మాఱుగ మా తులసీ కృష్ణు లిందుందురు. వారిని ఇతర పండితులను విద్యార్థులను ఇంతవేల యాశ్రమ మంతయును రక్షించు భారము మీది. జగ దుద్ధరణ హేతువులగు మీ వేదశాస్త్రాదరము మీధర్మతత్పరత్వము మిమ్ముద్ధరింపఁగలవు. చాముండయు నమ రేశ్వరుఁడును మిమ్మెల్ల వేళల రక్షించుచుందురుగాక. ఇంక మాకనుజ్ఞ యిండు.

పౌరులు —ధర్మమూర్తులును, బుణ్యమూర్తులునగు మీయాజ్ఞ నతిక్రమింపనేరము. దేవరయాదేశానుసారము ప్రవర్తించెదము. ధర్మ పరిజ్ఞాతలును న్యాయమూర్తులును ప్రజారక్షణశీలులగు ప్రభు ప్రధానులకును మీకు నిదే నమస్కరించుచున్నాము. [అని నమస్క రింతురు.]

మాధ—ప్రభుప్రధానులారా! పౌరులారా! పండితమహాశయులారా! ఈశ్వరానుగ్రహమున మనము సంపూర్ణ మనోరథుల మైతిమి.

మురహరి—అయిన నిట్లగుఁగాక!

సీ. చింతామణులువోలె ♦ క్షితిపాలరత్నముల్
శ్రీసుదర్శను లల♦రింతుగాత!
సదసద్వివేకులై ♦ సచివవరేణ్యులు
గోపాలు రెలమిఁజే♦కూర్తుగాత!

వేదశాస్త్రాభిస్తుత్య ♦ విభవాభినుతములై
మాధవాశ్రమములు ♦ మలయుఁగాత!
వృత్తివిద్యాశ్రీల ♦ నెసఁగఁ జేయుచునుండు
లలితాశ్రమంబులు ♦ వెలయుఁగాత!

గీ. సముదితాన్యానుకరణసం♦తమస మడఁచి
యార్య విజ్ఞాన భాస్కరుం ♦ డడరుఁగాత!
భరత దేశంబు శుభముల ♦ వఱలుఁగాత!
సకలజనులను శ్రీహరి ♦ సాఁకుఁ గాత!

అందఱు—తథాస్తు ! తథాస్తు ! !

[అందురు]

ఇయ్యది
శ్రీరాముల సచ్చిదానందశాస్త్రి విరచితంబగు
లలితా నాటకము సర్వము సంపూర్ణము.

మంగళం మహత్.

# సావిత్రీ గ్రంథమండలి

## మహారాజ పోషకులు.

1. మ॥రా॥శ్రీ శ్రీ మోతే నారాయణరావుగారు. జమీందారు, ఏలూరు.
2. ,, మహారాణి ఆదిలక్ష్మీదేవిగారు, గద్వాల సంస్థానము.
3. ,, మహారాణి సరళాదేవిగారు. వనపర్తి సంస్థానము.
4. ,, బెజవాడ రామచంద్రారెడ్డిగారు, జమీందారు, బుచ్చిరెడ్డిపాలెము.
5. ,, రేబాల పట్టాభిరామరెడ్డిగారు, జమీందారు, నెల్లూరు.
6. ,, బెజవాడ చంద్రశేఖరరెడ్డిగారు, జమీందారు, బుచ్చిరెడ్డిపాలెము.
7. ,, తూములూరు వెంకట శివరామయ్య పంతులుగారు, అడ్వకేటు, నెల్లూరు.
8. ,, రాజా సురభి మురళికృష్ణారావుగారు, జమీందారు, బి. ఏ. బి. ఎల్. చెన్నపురి.
9. ,, యమ్. రామప్పగారు, వర్తకులు, ఆదవాని.
10. ,, యర్రమిల్లి నారాయణమూర్తిగారు, బి.ఏ. బి. ఎల్ అడ్వకేటు, నరసాపురము.
11. ,, చావలి వెంకట నరసింహశాస్త్రిగారు, మిల్లుమానేజరు, గుల్బర్గ.

---

## రాజపోషకులు.

1. మ॥ రా॥ శ్రీ స్థానం నరసింహారావుగారు, తెనాలి.
2. ,, సి. యస్. ఆర్ ఆంజనేయులుగారు, పొన్నూరు.
3. ,, పారుపల్లి సుబ్బారావుగారు, బెజవాడ.
4. ,, డాక్టరు, కె. యన్ కేసరిగారు, ఎగ్మూరు, చెన్నపురి.
5. ,, వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రిగారు, చెన్నపురి.
6. ,, రావుసాహెబు, బి. తిమ్మారెడ్డిగారు అండుసన్సు, బదినహాల్, ఆదవాని పోష్టు.
7. ,, గరిణె సత్యనారాణగారు, జగ్గయ్యపేట.
8. ,, ఈశ్వరప్రగడ జగన్నాథరావుగారు, జగ్గయ్యపేట.

9. ,, కొలిపాక వెంకటప్పారావు పంతులుగారు, ఓవర్సీయర్, జగ్గయ్యపేట.
10. ,, దోశేపల్లి లక్ష్మీపతిగారు, జగ్గయ్యపేట.
11. ,, డాక్టర్, జి.వి. సుబ్బారావుగారు, యల్.యమ్. అండ్ యస్. తెనాలి.
12. ,, న్యాయవేదాంతపారీణ బులుసు అప్పన్నశాస్త్రిగారు, భట్నవిల్లి.
సనాతన మతప్రచారిణీపత్రికాధిపతులు.
13. ,, అయ్యంకి వెంకటరమణయ్య పంతులుగారు.
ఆంధ్రదేశ గ్రంథాలయకార్యదర్శి, బెజవాడ.
14. ,, కడియాల వీరయ్యచౌదరిగారు, అంగలకుదురు, తెనాలితాలూకా.

---

## పోషకులు.

1. మ॥ రా॥ శ్రీ వేమన వీరయ్యనాయుడుగారు. కరటపాడు, నెల్లూరుజిల్లా.
2. ,, పా. వే. రాజమన్నారుగారు, బి.ఎ. బి. ఎల్. అడ్వకేటు, మద్రాసు.
3. ,, అల్లంపాటి బ్రహ్మారెడ్డిగారు, మంగుపల్లి, గొరవరంపోష్టు.
4. ,, సోమశిల చెంచుసుబ్బయ్యగారు, అగ్రహారికుడు, సోమశిల, నెల్లూరుజిల్లా.
5. ,, జే. శ్రీనివాసశాస్త్రిగారు బి. ఎ. హోలహర్వి, బళ్లారిజిల్లా.
6. ,, నెమకల్లు కేశవరెడ్డిగారు, నెమకల్లు, ఆలూరుపోష్టు.
7. ,, తమ్మిరెడ్డిగారి హనుమంతరెడ్డిగారు, అర్ధగిరి, నెల్లూరుజిల్లా.
8. ,, క. దాసిరెడ్డిగారు, అర్ధగిరి, కర్నూలుజిల్లా.
9. ,, రెడ్డి వెంకటరెడ్డిగారు, కరివేముల, కర్నూలుజిల్లా.
10. ,, విఠల శేషప్పశ్రేష్ఠిగారు, బ్యాంకరు, వ్యాపారులు, బళ్లారి.
11. ,, దివాన్ బహదూర్ బండి వెంకటశ్రీహరిరావు నాయుడు గారు. చెన్నపురి.
12. ,, సి. వెంకటరమణయ్యగారు సి.ఐ.డి. ఇన్స్పెక్టరు, చెన్నపురి.

# తప్పొప్పుల పట్టిక

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 21 | 18 | కవిరాజు | కలిరాజు |
| 31 | 13 | కష్టముగాఁగ | కష్టము గాఁక |
| 33 | 19 | విప్రులడర | విప్రులడల |
| 45 | 23 | దనమర్జించితి | ధనమర్పించితి |
| 48 | 15 | నేమియుండిట | నేమియుండును |
| 48 | 20 | పొడమదె | పొడమజె |
| 50 | 11 | జ్యోతిరూపముగ | జ్యోతీరూపముగ |
| 54 | 4 | మీకు | మీరు |
| 64 | 16 | వచించుట | వంచించుట |
| 74 | 2 | రాజశాసన ప్రయోగ నెపమున | రాజశాసన ప్రయోగమను నెపమున |
| 87 | 3 | అనుచు పింతురు | అనుచు సమీపింతురు |
| 106 | 18 | చివఱ | చివర |
| 120 | 27 | బ్రతిమాలును | బతిమాలును |
| 158 | 2 | మేఱ | మేర |
| 163 | 16 | బాఱి | బారి |